డా॥ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
సెంటర్ ఫర్ సోషల్ ఎంపవర్‌మెంట్

# మేము సైతం...

## సార్వత్రిక విద్యార్థుల విజయగాథలు




ఘంటా చక్రపాణి

# మేము సైతం...

సార్వత్రిక విద్యార్థుల విజయగాధలు

సెంటర్ ఫర్ సోషల్ ఎంపవర్‌మెంట్
డా॥ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాద్
**2009**



జూబ్లీహిల్స్‌లోని నూతన భవన సముదాయాన్ని ప్రారంభించిన సందర్భంగా
అప్పటి ప్రధాని శ్రీ పి.వి. నరసింహారావుతో వైస్‌ఛాన్స్‌లర్ ఆచార్య యస్. బషీరుద్దీన్ *(1994)*



## సెంటర్ ఫర్ సోషల్ ఎంపవర్‌మెంట్

# చదువు ద్వారా సాధికారత

**స**మసమాజ స్థాపనకు విద్యే సరైన ఆయుధమన్న బాబాసాహెబ్ తాత్విక సూత్రాన్ని స్ఫూర్తిగా చేసుకుని డా. బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం సమాజంలోని అన్ని వర్గాలకూ మెరుగైన విద్య, శిక్షణ అందించాలనే లక్ష్యంతో కొనసాగుతోంది. ఈ దిశలో విశ్వవిద్యాలయం ఇప్పటికే 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. అణగారిన వర్గాల వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, విజ్ఞానాన్ని విద్యద్వారా అందుబాటులోకి తేవాలన్న ప్రయత్నంలో లక్షలాది మంది జీవితాల్లో కొత్త వెలుగు ప్రసాదించిన డా. బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక నిశ్శబ్ద విప్లవానికి వేదికగా నిలిచిపోయింది.

**డా।। అంబేద్కర్ విశ్వవిద్యాలయం** రజతోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని విద్యావకాశాలను మరింత సరళతరం చేస్తూ విశ్వవిద్యాలయాన్ని సామాన్య ప్రజానీకానికి మరింత చేరువగా తీసుకు వెళ్ళాలన్న లక్ష్యంతో 'సెంటర్ ఫర్ సోషల్ ఎంపవర్‌మెంట్' (సిఎస్ఇ) ప్రారంభమైంది. దూరవిద్యా మండలి (డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కౌన్సిల్) ఆర్థిక సహకారం, ప్రోత్సాహంతో ప్రారంభమైన సి.ఎస్.ఇ లక్ష్యం సామాజిక సాధికారత, సంపూర్ణ వికాసం సమాజంలో అన్ని వర్గాలకూ సమానమైన అవకాశాలు దక్కాలన్నది మా స్వప్నం. మరీ ముఖ్యంగా అణగారిన వర్గాలు, చారిత్రకంగా అణచివేత మూలంగా విద్యకూ, విజ్ఞాన వికాసాలకూ దూరమైన వారికి దూరవిద్య ద్వారా చేరువై వారిలో నిబిడీకృతమైన శక్తులను వెలికితీసి వారిలోని నైపుణ్యాలకు సానపెట్టాలన్న ప్రయత్నం మాది.

సాధికారిత అనేది ఒక విస్తృత భావన. ఒక మనిషిలో లేదా సముదాయంలో అంతర్గతంగా ఇమిడి ఉన్న శక్తియుక్తులను వెలికితీసి వారిని సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, అధ్యాత్మికంగా బలోపేతం చేసే సాధనం. తమ జీవితాలను తామే సృజనాత్మకంగా మలుచుకునే ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే ఆయుధం. వ్యక్తుల్లో, సామాజిక వర్గాల్లో విద్యపట్ల, అభివృద్ధి పట్ల, హక్కులపట్ల, మానవీయ విలువల పట్ల, ప్రపంచం పట్ల, ఆ ప్రపంచ గమనం పట్ల అవగాహన కలిగించడం ఈ సెంటర్ ఉద్దేశాల్లో ప్రధానమైనవి.

**సెంటర్ ఫర్ ఎంపవర్‌మెంట్‌**తో పలువురు ప్రముఖ విద్యావేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు, పరిశోధకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలిసి పనిచేస్తున్నారు. విద్యా వికాసానికి దోహదపడాలని, వికాసం సమానత్వానికి తోడ్పడాలని సెంటర్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆశిస్తోంది. చదువుకుని సాధికారత సాధించిన మా విద్యార్థులను మీ అందరికీ పరిచయం చేయాలన్న లక్ష్యంతో ఈ పుస్తకాన్ని ప్రచురిస్తున్నాం. ఇది విశ్వవిద్యాలయం గడచిన 25 సంవత్సరాల కృషికి అద్దం పడుతుందని ఆశిస్తున్నాం.

**డా।। ఘంటా చక్రపాణి** సమాజశాస్త్ర శాఖ అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. అలాగే ఈ విశ్వవిద్యాలయం రజతోత్సవాల సందర్భంగా దూరవిద్యా మండలి సహకారంతో 'సెంటర్ ఫర్ సోషల్ ఎంపవర్‌మెంట్' (సిఎస్ఇ)ను ఏర్పాటుచేసి ఆ ప్రాజెక్టు డైరెక్టరుగా కూడా ఉన్నారు. అధ్యాపకుడిగానే కాక రచయితగా, పాత్రికేయుడిగా, సామాజిక, రాజకీయ విశ్లేషకుడిగా మానవ హక్కుల ఉద్యమ కార్యకర్తగా చక్రపాణి సుపరిచితులు.

# మేము సైతం...

సార్వత్రిక విద్యార్థుల విజయగాథలు

ఘంటా చక్రపాణి

సెంటర్ ఫర్ సోషల్ ఎంపవర్‌మెంట్
డా॥ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాద్
2009

***Memu Saitam***

*Success Stories of Dr. B.R.Ambedkar Open University Learners*

**by**
**Ghanta Chakrapani**

**Copyright©Author**

All rights reserved. No part of this book may be reproduced or utilised in any form or by any means, electronic or mechanical, including photo copying, recording or by any information storage or retrieval system, without permission in writing from the Author.

This book is the outcome of a Research Project conducted by the Center for Social Empowerment (CSE), Dr. B.R.Ambedkar Open University, Hyderabad, sponsored by Distance Education Council (New Delhi). This was taken up with a broad objective to understand the "Role of Distance Education in Social Empowerment." CSE acknowledges the services and contributions of the research team in successfully completing the work.

Research Team: Dr. Chakrapani Ghanta (Project Director), Anandavardhan, Bhavani Shankar, Chalapathi Sarikonda, Nagaraju, Nagasundari, Narayana Allam, Ramireddy, Saroja Govada, Subrahmanyam, Suneetha Rani and Yelleshwar Rao.

**For further details:**
Project Director, Center for Social Empowerment, Dr. B.R.Ambedkar Open University, Jubilee Hills, Hyderabad, India.
Tele Fax. +91-40-23608797 Visit: www.braou.ac.in E-mail: cse.braou@gmail.com

ISBN 978-81-908563-0-0
*Photography:* Lavanya
*First published:* March, 2009
*Type setting:* Raghu Ramaiah
*Cover Design:* Akbar
*Copies:* 1000
*Printed at :* Sai Likhitha Printers, Khairatabad, Hyderabad.

*Contributory Price : Rs. **200/-***



"మనం నాగరికత సమకూర్చిన వస్తుగత
ప్రయోజనాలైనా వదులుకోవచ్చునేమో గానీ,
సర్వోత్కృష్టమైన విద్య అందించే ఫలాలను
సంపూర్ణంగా అనుభవించే అవకాశాలను,
హక్కును మాత్రం కోల్పోకూడదు."

**– డా॥ బి.ఆర్.అంబేద్కర్**



విశ్వవిద్యాలయ ప్రారంభ సందర్భంగా అప్పటి రాష్ట్రపతి శ్రీ జ్ఞానీ జైల్‌సింగ్,
ముఖ్యమంత్రి భవనం వెంకట్రామ్, విద్యాశాఖామంత్రి పి. కేశవరావు *(1982)*



**ఆచార్య ఓ.ఆర్.రెడ్డి**
వైస్ ఛాన్స్‌లర్

# అభినందన

**అం**దరికీ ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకు రావాలనే సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో చట్టం చేయడం ద్వారా 1982లో డా॥ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పడమైంది. ఈ విశ్వవిద్యాలయాన్ని స్థాపించి 25 సంవత్స రాలు పూర్తయిన సందర్భంలో 2006లో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకలలో భాగంగా 'మేము సైతం' పేరుతో డా॥ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో చదివి, ఉన్నత శిఖరాలను అధిరోహించిన కొంతమంది విద్యార్థుల విజయగాథలను, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ సహకారంతో ఈ విశ్వవిద్యాలయంలో నెలకొల్పిన, సెంటర్ ఫర్ సోషల్ ఎంపవర్‌మెంట్ ప్రచురించడం చాలా సంతోషం. రెండు సంవత్సరాల పాటు సెంటర్ ఫర్ సోషల్ ఎంపవర్‌మెంట్ అనేక మంది విద్యార్థుల విజయ గాథలను వెలుగులోకి తీసుకొచ్చింది. వాటిలో విలక్షణమైన కొన్నింటిని ఈ పుస్తకంలో పొందుపరచడమైంది.

ఈ విశ్వవిద్యాలయాన్ని స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భాన్ని పురస్కరించుకుని 25 మంది విద్యార్థుల జీవిత గమనాన్ని, జీవితంలో వారు విద్య ద్వారా సాధించిన విజయాలను ఈ పుస్తకంలో విశదీకరించడమైంది. ఈ విజయ గాథల ప్రచురణ ఉద్దేశం డా॥ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ కీర్తిని చాటుకోవడంగాదు. ప్రపంచ ప్రజలకు ఈ విశ్వవిద్యాలయంలో చదివిన విద్యార్థుల ప్రతిభా పాటవాలను గురించి తెలియజేయడమే మా ప్రధాన ఉద్దేశం.

విద్యార్థులు తాము అధిరోహించిన విజయ సోపానాలను సరళమైన భాష, సమగ్రమైన భావన స్ఫురించే రీతిలో రూపొందించిన ఈ సంకలనం, చదువు పట్ల ఆసక్తిని ఏ కొంత మందిలోనైనా పెంచగలిగితే సెంటర్ ఫర్ సోషల్ ఎంపవర్‌మెంట్ ఆశయం, లక్ష్యం నెరవేరినట్లే. ఈ విశ్వవిద్యాలయంలో చదువుకున్న అశేష జనానికి, వివిధ రంగాలలో ఈ విశ్వవిద్యాలయ సహకారంతో ఉన్నత స్థానాలకు ఎదిగిన విద్యార్థులందరికీ నా శుభాకాంక్షలు. ఈ పుస్తకాన్ని ప్రచురించడంలో చొరవ చూపిన సెంటర్ ఫర్ సోషల్ ఎంపవర్ మెంట్‌లో భాగస్వాములైన ప్రతీ ఒక్కరికి అభినందనలు.

**(ఓ.ఆర్.రెడ్డి)**

# నేపథ్యం

మనిషి జీవితంలో విద్యకున్న ప్రాముఖ్యత ఏమిటో విడమరిచి చెప్పేందుకే ఈ విజేతల విశిష్ట గాథల్ని మీ ముందుంచుతున్నాం. ఇందులో పొందుపరిచిన జీవితాల్లో ఏ ఒక్కరిదీ వడ్డించిన విస్తరి కాదు. ఎవరికి వాళ్ళు తమలో తామే కలలు గని తమ తలరాతల్ని మార్చుకున్న వాళ్ళే! ఎవరికి వాళ్ళు తమ కాళ్ళమీద తాము నిలబడాలని తపించి తడబడుతూ, పడిపోతూ నిలదొక్కుకున్న వాళ్ళే! ఎవరంతట వాళ్ళు తమ మనుగడకోసం బతుకుపోరులో అలిసి గెలిచిన వాళ్ళే!! వాళ్ళ కథలు, కలలూ వేరు వేరు అయినా ఈ అందర్నీ మన ముందు ఇలా నిలబెట్టింది మాత్రం. డా॥ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం. అందుకే అందరూ తమ చదువుల తల్లికి కృతజ్ఞతలు చెప్పుకుంటున్నారు.

డా॥ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయంగా 1982లో మొదలైంది. దేశంలోనే తొలిప్రయత్నంగా దూరవిద్యా విధానాన్ని ప్రవేశపెట్టి చదువుకోవడానికి అప్పటిదాకా ఉన్న అర్హతా ప్రమాణాలను, అవాంతరాలన్నిటినీ తొలగించి ఎవరైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా ఉన్నత విద్యను అభ్యసించవచ్చని చాటి చెప్పింది. ఈ పద్ధతి పట్ల కొందరు పెదవి విరిచారు, చాలామందే సందేహించారు. అయినా అన్ని అనుమానాలనూ పటాపంచలు చేస్తూ అనతికాలంలోనే దేశంలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. విద్యను సాంప్రదాయ బంధనాల నుంచి విముక్తం చేసి ప్రజాస్వామ్యీకరించే ప్రయత్నం చేసింది.

మన దేశంలో చదువుకోవడం అంత సులభం కాదు. అందులో ఉన్నత విద్య అందరికీ సాధ్యపడేది కాదు. చారిత్రకంగా మన దేశంలో ఉన్నత విద్య అతికొద్ది మందికే పరిమితమై అసంఖ్యాక ప్రజాబాహుళ్యానికి అందుబాటులో లేకుండా పోయింది. పెద్ద చదువులు చదవాలంటే పెట్టిపుట్టాలి. ఎన్నో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక కట్టుబాట్లను ఛేదించాలి, ఎందరినో ఎదిరించాలి. ఎన్నో కష్టనష్టాలను భరించాలి. అయినా ఇప్పటికీ నూటికి పది మంది కూడా విశ్వవిద్యాలయాలను చూసే అవకాశం లేదంటే ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. అది వాస్తవం. ఉన్నత విద్యావకాశాలు, విశ్వవిద్యాలయాలు అందుబాటులో లేక, ఉన్నా చదువుకొనగలిగే స్థోమత లేక ఎంతో మంది ప్రతిభావంతులు చదువుకునే సాహసం చేయలేకపోతున్నారు.

పల్లెలు వదిలి పంటపొలాలు వదిలి, ఇంటి పనులు, వంట గదులూ వదిలి పట్టణాలకు రాలేకపోతున్నారు. అంతకంటే కష్టమైన, కఠినమైన కట్టుబాట్లను కాదనలేకపోతున్నారు. ఈ పరిస్థితుల్లో 'ముంగిట్లోకి ఉన్నత విద్య'ను తీసుకువచ్చిన ఈ విశ్వవిద్యాలయం సహజంగానే లక్షలాది మందికి ఆలంబన అయ్యింది. కొత్త ఆశలకు ఊపిరిపోసింది. కొత్త అవకాశాలకు తలుపులు తెరిచింది. కొత్త జీవితాలను ఆవిష్కరించింది. ఈ ప్రపంచానికి ఒక కొత్తతరం విద్యావంతుల్ని పరిచయం చేసింది. అందులో గడిచిపోయిన పాతిక సంవత్సరాలు ప్రయత్నానికి ప్రతీకలుగా ఇరవై ఐదు మందిని మీకు పరిచయం చేస్తున్నాం. విభిన్న ప్రాంతాలు, ఆర్థిక సామాజిక నేపథ్యాలు, జీవన పరిస్థితుల్లోంచి వినమ్రంగా నడిచి వచ్చి, చదువులు నేర్చి విశ్వవ్యాప్తంగా ఈ విశ్వవిద్యాలయ విశిష్టతను చాటిచెప్పిన మా విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాలకు జేజేలు పలుకుతున్నాం. ఈ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసిస్తోన్న లక్షలాది మందికి, ఆ అవకాశాల కోసం నిరీక్షిస్తోన్న కోట్లాది మందికి ఈ విజయ గాథలు స్ఫూర్తినివ్వగలవన్న ఉద్దేశంతో ఈ విజయ గాథల్ని సంకలనపరిచాం.

ఈ ప్రయత్నానికి ప్రేరణ కూడా మా 'అజ్ఞాత' విద్యార్థి నుంచే వచ్చింది. అజ్ఞాత అని ఎందుకంటున్నానంటే ఆ విద్యార్థిని మేం కలుసుకోలేకపోయాం. 2006లో విశ్వవిద్యాలయం రజతోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు, సమాజానికి విశ్వవిద్యాలయానికీ వారధిగా ఒక కేంద్రాన్ని ఏర్పాటుచేస్తే బాగుంటుందన్న ఆలోచన వచ్చింది. 'సెంటర్ ఫర్ సోషల్ ఎంపవర్‌మెంట్' పేరుతో ఒక ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదనను అప్పటి వైస్ ఛాన్సలర్ ఆచార్య

డి.రాంచంద్రం గారి ముందుంచాను. గడిచిన 25 సంవత్సరాలుగా లక్షలాది మందిని ఈ విశ్వవిద్యాలయంలో చేర్చుకుంటున్నాం. వేలాది మందికి డిగ్రీలు ఇచ్చాం. నిజంగానే ఈ చదువులు పనికొస్తున్నాయా. మన విద్యార్థులు సమాజానికి ఎలా ఉపయోగపడుతున్నారు. ఈ విశ్వవిద్యాలయం ద్వారా మనం సమాజానికి ఇంకా ఏ రకంగా ఉపయోగపడగలం అన్నది అధ్యయనం చేయడంతో పాటు సామాజిక సాధికారతకు కొత్త కార్యక్రమాలు రూపొందించి అమలుచేయడం ఈ సెంటర్ లక్ష్యాలుగా పెట్టుకున్నాం. ఆయన వెన్నుతట్టి ప్రోత్సహించారు. ఆ ప్రతిపాదనను ఢిల్లీలోని దూరవిద్యామండలికి పంపించారు.

మా ప్రయత్నం వినూత్నమైన ప్రాజెక్టుగా పేర్కొంటూ దూరవిద్యా మండలి ఆర్థిక సహకారం అందించడానికి ముందుకు వచ్చింది. సరిగ్గా అదే సమయంలో ఢిల్లీలో ఒక మిత్రుడు 2005 సంవత్సరానికి సివిల్ సర్వీసెస్‌లో ఎంపికైన అభ్యర్థుల విశ్వవిద్యాలయాల జాబితా నాకు పంపించాడు. అందులో దేశంలోని 112 విశ్వవిద్యాలయాల నుంచి 457 మంది అభ్యర్థులు ఈ దేశంలో అత్యున్నతమైన పరిపాలనాపరమైన ఉద్యోగాలకు (ఐఏఎస్, ఐపిఎస్, ఐఆర్ఎస్) ఎంపికయ్యారు. ఆ జాబితాలో డా॥ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం పేరు చోటుచేసుకోవడం ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించింది. ఈ విశ్వవిద్యాలయంలో చదివి ఆ ఏడాది సివిల్ సర్వీసెస్ పరీక్షకు హాజరయ్యింది ఒకే ఒక్క అభ్యర్థి 'సాధు నర్సింహారెడ్డి. ఆ అభ్యర్థి విజయం సాధించడం అద్భుతంగా అనిపించింది. మిగతా విశ్వవిద్యాలయల నుంచి వందల సంఖ్యలో విద్యార్థులు మెయిన్స్‌కు హాజరై ఒకరో ఇద్దరో ఎంపికైతే మన విశ్వవిద్యాలయం నుంచి హాజరైన ఒకే ఒక్క వ్యక్తి ఎంపికవడం అద్భుతం కాక ఇంకేమవుతుంది. ఇలాంటి వాళ్ళ వివరాలు సేకరించాలన్న ఆలోచన వచ్చింది.

సెంటర్ ఫర్ సోషల్ ఎంపవర్‌మెంట్ తొలి ప్రాజెక్టుగా ఈ ప్రయత్నాన్ని మొదలుపెట్టాం. అందుబాటులో ఉన్న సమాచారాన్ని బట్టి మా విద్యార్థుల అన్వేషణ ప్రారంభించాం. వేలాది మంది వివిధ స్థాయిల్లో, హోదాల్లో, ఉద్యోగాల్లో ఉన్న వాళ్ళు, తమ జీవితాలను అనూహ్యంగా మలుపు తిప్పుకోగలిగిన వాళ్ళు మాకు తారసపడ్డారు. దాదాపు ఒక ఏడాది కాలం పాటు అనేక మందితో మాట్లాడి, వివరాలు సేకరించి, ఇంటర్వ్యూలు చేసి వాటన్నిటినీ మథింపుచేసి ప్రచురించాలని నిర్ణయించాం. అయితే అన్నీ ప్రచురించే వీలుకాలేదు. అందులో కొన్ని మాత్రమే ఎంచుకున్నాం.

ప్రచురణకు ఎంపిక చేసిన విజయ గాథల్లో కేవలం అత్యున్నత హోదా పొందిన వాళ్ళేకాదు అత్యంత దుర్భరమైన జీవితాలను అనుభవించిన వాళ్ళు, అత్యంత కఠోరమైన ప్రయత్నాలు చేసిన వాళ్ళు, ఆత్మ విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనంగా నిలబడ్డ వాళ్ళూ చదువువల్ల సంపదనే కాక అమూల్యమైన ఆనందాన్ని పొందిన వాళ్ళూ ఉన్నారు.

ఈ పుస్తకం అన్ని రంగాల, అన్ని రకాల జీవితాల సమ్మిళితంగా అన్ని సామాజిక, ప్రాంతీయ, సాంస్కృతిక పార్శ్వాల సమ్మేళంగా రూపొందించే ప్రయత్నంలో భాగంగా ఇలాంటి చాలామందికి సంబంధించిన విజయ గాథల్ని ప్రచురణకు స్వీకరించలేకపోయాం. రజతోత్సవ చారిత్రక సందర్భాన్ని, వనరుల్ని దృష్టిలో ఉంచుకుని ఈ పుస్తకాన్ని 25 మందికి కుదించవలసి వచ్చింది. అందుకు బాధగానే ఉన్నా ఇందులోని విజయగాథలు అందరినీ ప్రతిబింబించే విధంగా ఉన్నందున మా ప్రయత్నం ఫలించిందనే భావిస్తున్నాం.

నిజానికి ఈ సంకలనం చాలా ఆలస్యంగా వెలుగు చూస్తోంది. ఎప్పుడో రెండేళ్ళ క్రితమే పూర్తయినప్పటికీ కొన్ని సంస్థాగతమైన కారణాల వల్ల ప్రచురణలో జాప్యం జరిగింది. ఈ మధ్య కాలంతో ఇందులో ప్రస్తావించిన వ్యక్తుల జీవితాలు, విధులు, ఉద్యోగాలు, హోదాల్లో ఎన్నో మార్పులు జరిగి ఉండవచ్చు. మాకు మరో ముద్రణకు అవకాశం దొరికితే అవన్నీ సవరించడంతో పాటు మరిన్ని విజయగాథల్ని చేర్చి సమగ్రంగా అందించే ప్రయత్నం చేస్తాం.

ఆలస్యంగానైనా ఈ పుస్తకం వెలువడుతున్నందుకు సంతోషంగా ఉంది. అందుకు ఎంతోమంది చేయూత, భాగస్వామ్యం, ప్రోత్సాహం ఉన్నాయి. ముఖ్యంగా మా ప్రతిపాదనను ఆమోదించి సెంటర్ ఫర్ సోషల్ ఎంపవర్‌మెంట్‌కు వెన్నుదన్నుగా నిలిచిన దూరవిద్యా మండలి (న్యూఢిల్లీ) వారికి ముఖ్యంగా మా ప్రయత్నాన్ని మనస్ఫూర్తిగా అభినందించిన మండలి డైరెక్టర్ స్వరాజ్ బసుకు తొలిదశలో దిశానిర్దేశం చేసిన అప్పటి వైస్‌ఛాన్సలర్ ఆచార్య రాంచంద్రం

గారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. వారి ప్రోత్సాహం మరువలేనిది. అలాగే సెంటర్ ఫర్ సోషల్ ఎంపవర్‌మెంట్ గవర్నింగ్ బోర్డు సభ్యులు, ముఖ్యంగా ప్రొఫెసర్ జి.హరగోపాల్, ప్రొఫెసర్ ఉమామోహన్, ప్రొఫెసర్ వి.ఎస్.ప్రసాద్‌ల శశికుమార్ వంటి పెద్దల ప్రోత్సాహం లేకుంటే మా ప్రయత్నం నెరవేరేదే కాదు. ఈ విశ్వవిద్యాలయం తొలితరం అధ్యాపకులుగా ఆచార్య వి.ఎస్.ప్రసాద్, ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి వంటి పెద్దలు ఇటువంటి పరిశోధన, ప్రచురణ ఎంతో అవసరమని పదేపదే గుర్తుచేసి ప్రోత్సహించడమే కాకుండా అందుకు అనుగుణంగా ఈ పుస్తకానికి ముందుమాట కూడా రాశారు. వారికి కృతజ్ఞుణ్ణి. ఒక దశలో ఆగిపోతుందనుకున్న ఈ ప్రచురణ వెలుగులోకి రావడానికి ప్రధాన కారణం ప్రస్తుత వైస్‌ఛాన్సలర్ ఆచార్య ఓ.ఆర్.రెడ్డిగారు. అన్ని రకాల అవరోధాలు తొలగించి ఈ ప్రచురణకు వారు ఎంతో సహకరించారు. అంతేకాకుండా విశ్వవిద్యాలయం తద్వారా ఉన్నత విద్య మారుమూల గ్రామాలకు కూడా విస్తరించాలని, అందుకు ఈ ప్రచురణ తోడ్పడుతుందన్న నమ్మకాన్ని వారు వ్యక్తం చేశారు. వారికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు. అలాగే పుస్తకంలో పొందుపరిచిన సమాచార సేకరణ, రచన, సంకలనం, ముద్రణలో భాగస్వాములైన మిత్రులందరికీ ముఖ్యంగా రచనలో సహకారాన్ని అందించిన మిత్రులు సరికొండ చలపతికి ప్రత్యేకంగా ధన్యవాదాలు.

ఈ పరిశోధన, రచన సంకలనంలో అనేక మంది మిత్రులు, సహోధ్యాపకులు, సిబ్బంది, అధికారులు తోడ్పడ్డారు. వారందరికీ కృతజ్ఞతలు.

ఈ సంకలనం కేవలం డా. బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో చదివిన వ్యక్తులు సాధించిన ఘనతను మాత్రమే చెప్పడం లేదు. వ్యక్తులు వారి సామాజిక నేపథ్యాలు ఎలా ఉన్నా చదువుంటే ఏదైనా సాధించవచ్చన్న విషయాన్ని వివరించదలిచాం. అలాగే చదువును మించిన సాధనం లేదని, సాధన చేసినప్పుడే స్వప్నం ఎలాంటిదైనా సాకారం అవుతుందనీ చెప్పదలిచాం. చదువు పరమావధి ఏమిటీ అన్న విషయం పైన ఇప్పటికే అవసరానికి మించిన సైద్ధాంతిక చర్చ జరిగి ఉంది. చదువుకున్న తాత్వికులు, పండితులు, మేధావులు వారివారి స్థల, కాల అవసరాన్ననుసరించి, సామాజిక సందర్భాన్ని బట్టి తలో రీతిలో సెలవిచ్చారు. చదువు విలువల్ని, వివేకాన్ని, విజ్ఞానాన్ని అందించే సాధనమని కొందరంటే చదువు వికాసాన్ని, స్వేచ్ఛని, సమానత్వాన్నీ, సుస్థిర అభి వృద్ధిని సాధించే ఆయుధమని కొందరంటున్నారు. ఎవరెలా చెప్పినా చదువనేది జీవితమని, ప్రతి జీవితానికి ఒక మహోన్నత సామాజిక సార్థకత ఉంటుందని మా విద్యార్థులు నిరూపించారు. నిరూపిస్తున్నారు. నిరూపిస్తూనే ఉంటారు.

ఉన్నత విద్యలో ఉన్న శక్తిని గుర్తించి చదువుకోవడం కోసం అనేక అవమానాలు ఎదుర్కొని నిలదొక్కుకుని, ఎన్నో ఉన్నత శిఖరాలు అధిష్టించిన ఆదర్శ మూర్తి డా॥ బి.ఆర్.అంబేద్కర్ ఉల్లేఖించినట్టు మనిషి జీవితంలో విద్య సర్వోత్కృష్టమైనది. అంబేద్కర్ మాటల్లోనే చెప్పాలంటే మనం ఈ ప్రపంచంలో నాగరికత అందుబాటులోకి తెచ్చిన ఎంతటి ప్రయోజనాలనైనా వదులుకోవచ్చునేమో గానీ, సర్వోత్కృష్టమైన విద్యను, తద్వారా అందివచ్చే ఫలాలను సంపూర్ణంగా అనుభవించే అవకాశాలను, హక్కును ఎంతమాత్రం కోల్పోకూడదు.

ఈ పుస్తకం మిమ్మల్ని ఆలోచింపచేస్తుందన్న తలంపుతో...

అది అందరికీ అర్థం చేయాలన్నదే మా తపన. ఈ పుస్తకం చదివాక చదువుకోవాలన్న ఆశ, చదువుకోవాలనుకుంటున్న వారిని ప్రోత్సహించాలన్న ఆలోచన, చదువు మనిషికి ఒక ప్రాథమిక హక్కు అన్న అవగాహన కలిగితే మా ప్రయత్నం నెరవేరినట్టే.

మీ

**ఘంటా చక్రపాణి**

ముందుమాట

# విద్యార్థులే స్ఫూర్తిదాతలు

సార్వత్రిక విశ్వవిద్యాలయాల స్థాపన ఉన్నత విద్యారంగంలో ఒక వినూత్న ప్రయోగం. ఈ ప్రయోగం భారతదేశంలో 1982లో 'ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం' (నేడు డా॥ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయంగా పిలువబడుతుంది) ఆరంభం కావడం అందరూ హర్షించదగ్గ విషయం. ఆచార్య జి.రాంరెడ్డిగారి విద్యాదార్శనికత, పరిమిత వనరులతో ఎక్కువ మంది విద్యార్థులకు ఉన్నత విద్య కల్పించాల్సిన సామాజిక ఆవశ్యకత, వాటి రాజకీయ వ్యవస్థ సంపూర్ణ మద్దతు ఆంధ్రప్రదేశ్‌లో ఈ నూతన ప్రక్రియను 'ఓపెన్ యూనివర్సిటీ' పేరుతో ప్రారంభించడానికి ప్రధానంగా తోడ్పడ్డాయి. విద్యారంగంలో నూతన వ్యవస్థల స్థాపనలో ఎదురయ్యే ఇబ్బందుల నన్నింటినీ ఈ సంస్థ నిర్మాణంలో కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. విద్యారంగంలో దూరవిద్యా పద్ధతి ఉపయోగంపై తీవ్రమైన అభ్యంతరా లుండేవి. ఈ పద్ధతి ద్వారా నాణ్యమైన విద్యను అందించలేమనే సందేహాలూ ఉండేవి. మొట్టమొదటి సార్వత్రిక విశ్వవిద్యాలయంగా ఈ పరిమితులన్నింటినీ అధిగమించాల్సిన అవసరం అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి రావడం ఒక చారిత్రక అవకాశం. ఈ చారిత్రక అవసరాన్ని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ చాలా సమర్థవంతంగా నిర్వహించిందని చెప్పడానికి సందేహం లేదు. ఆచార్య జి.రాంరెడ్డి గారి కృషి, పట్టుదల, నాయకత్వం, ఈ భావానికున్న సామాజిక ప్రాధాన్యత, అనేక ఒడిదుడుకులను తట్టుకుని (ఒక దశలో మూసి వేయాలనే తలంపులతో సహా) నిలబడిన ఒక గొప్ప సామాజిక ప్రయోజనం గల విద్యారంగ ప్రయోగంగా చెప్పుకోవచ్చు.

గత 25 సంవత్సరాలకు పైగా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అనేక లక్షల మందికి విద్యావకాశాలు కల్పించడంతో పాటు, దూరవిద్యా పద్ధతికి దేశంలో ప్రామాణికతను కల్పించడంలో కూడా ప్రధానమైన పాత్రను నిర్వహించింది. వ్యక్తిగతంగా నాకు ఇది ఎంతో సంతోషాన్ని కలిగించే విషయం. ఆచార్య జి.రాంరెడ్డి గారి శిష్యుడిగా నాకు ఈ విశ్వవిద్యాలయంలో పనిచేసే అవకాశం లభించింది. దాదాపు 20 సంవత్సరాలుగా అనేక పదవులలో పనిచేసే అవకాశం కూడా కలిగింది. ఇది గొప్ప అనుభవం, అనుభూతి, నూతన ప్రయోగంలో అన్ని స్థాయిల్లో పాల్గొన్నాననే తృప్తి. ఇంకా ఎంతో చేయాల్సి ఉన్నప్పటికీ, చేసింది తక్కువేమీ కాదనే అభిప్రాయం నాకు ఉంది. ఈ సంపుటిలోని విద్యార్థుల వ్యక్తిగత జీవితంపై ఈ విశ్వవిద్యాలయ ప్రభావాన్ని చదివినప్పుడు ఈ విశ్వవిద్యాలయ కృషికి ఎంతో ఆనందిస్తున్నాను.

సామాన్యంగా విశ్వవిద్యాలయాల గొప్పతనాన్ని అంచనా వేసేటప్పుడు ఆ విశ్వవిద్యాలయంలో చదివిన వారికి ఎన్ని ఉన్నత పదవులు లభించాయి. ఎంత మంది విదేశీ సంస్థల్లో పనిచేస్తున్నారు, ఎంత వేతనాలు పొందుతున్నారన్న విషయాలను చెబుతూ ఉంటారు, అలాకాకుండా ఎంత మంది బీదవారు ఉన్నత విద్యను పొందారనో, ఎంతమంది కూలి వృత్తిని చేసుకుంటున్నవారు, జైళ్ళలో మగ్గేవారు, హోటళ్ళలో పనిచేసేవారు, గృహాలకు అంకితమైన వారు ఉన్నత విద్య ద్వారా తమ జీవితాలను మార్చుకున్నారనే విషయాలను ప్రమాణంగా తీసుకున్నట్లయితే అంబేద్కర్ విశ్వవిద్యాలయం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉండే విశ్వవిద్యాలయంగా పరిగణించవచ్చని

ఈ సంపుటిలోని విద్యార్థుల జీవితానుభవం నుంచి అంచనా వేయడం తప్పు కాదేమో. ఇది అంచనా వేసే వారి విలువలకు సంబంధించిన విషయం కూడా.

ఈ సంపుటిలోని విద్యార్థుల జీవితాలు, సార్వత్రిక విశ్వవిద్యాలయ విద్యకే స్ఫూర్తిదాయకాలని భావిస్తున్నాను. సాంప్రదాయక విద్యా వ్యవస్థలో సాధారణంగా అధ్యాపకులు స్ఫూర్తిదాయకులుగా ఉంటారు (అందరూ కాదనుకోండి), అయితే సార్వత్రిక విద్యలో ఆ అవకాశాలు తక్కువ. అధ్యాపకులతో విద్యార్థులకు ప్రత్యక్ష సంబంధాలు పరిమితం. విద్యార్థి ఆధారితమైన దూరవిద్యలో విద్యార్థులే స్ఫూర్తిదాయకులుగా ఉంటారు. భిన్న నేపథ్యం నుంచి వచ్చిన విద్యార్థులకు, సార్వత్రిక విశ్వవిద్యాలయాలు అందించిన విద్య ద్వారా వారి జీవితంలో వచ్చిన మార్పులే దూరవిద్యా సంస్థలకు, విద్యార్థులకు మార్గదర్శకాలు. ఈ సంపుటిలో వివరించిన, ఆగిపోయిన చదువులకు వచ్చిన అవకాశాలు, ఆ చదువులతో మారిన వారి జీవితాలు మట్టిలో మాణిక్యాలుంటాయనడానికి నిదర్శనాలు. పుట్టుకతోనే ఎవరూ గొప్ప వారు కాదనడానికి, నేటి సామాజిక పటంలో 'ఫెయిల్యూర్స్'గా భావించబడే వారు కూడా, అవకాశాలు వస్తే ఏ విధంగా రాణిస్తారనేది వాస్తవ జీవితాల నుంచి గుర్తించడానికి ఈ వ్యక్తిగత జీవితాలు, చిత్రణ ఉపయోగపడుతుంది. ఉదాహరణకు జైలు గోడల మధ్య ఉన్నవారికి, కూలిపని చేసుకునే వారికి, వివాహంతో విద్య ఆగిపోయిన వారికి ఈ విశ్వవిద్యాలయం కల్పించిన అవకాశాలు, వాటిని ఉపయోగించుకుని వారు సాధించిన విజయాలు ఈ విశ్వవిద్యాలయ స్థాపనను సార్థకం చేశాయని అనుకుంటున్నాను.

ఈ విద్యార్థుల జీవిత పాఠాలను అందరికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇవన్నీ విశ్వవిద్యాలయ కృషిని సరైన అంచనా వేయడానికి, ఎక్కువ మంది సరైన అవగాహనతో దూరవిద్యను అభ్యసించడానికి తోడ్పడతాయని భావిస్తున్నాను. అందుకే ఈ కృషిని సామాజిక బాధ్యతగా భావించి చేసిన సామాజిక శాస్త్రవేత్త అయిన డా. ఘంటా చక్రపాణిని, అదేవిధంగా విశ్వవిద్యాలయాన్ని అభినందిస్తున్నాను. ఎక్కువ మందికి జాతీయంగా, అంతర్జాతీయంగా సార్వత్రిక విద్యారంగంలోని వారందరికీ ఈ విషయాలను తెలియజేయడం ఎంతో ఉపయోగకరం. ఇవన్నీ సార్వత్రిక విద్యారంగం మొత్తం గర్వించదగ్గ విషయాలు. అందుకే దీనిని ఇంగ్లీషు, హిందీ భాషలలో కూడా ప్రచురిస్తే బాగుంటుందని భావిస్తున్నాను.

ఈ విశ్వవిద్యాలయం ఇంకా చేయాల్సింది, చేయగల్గింది ఎంతో ఉన్నప్పటికీ, మంచి పనిని మొదలుపెట్టినందుకు, చేస్తున్నందుకు ఈ కార్యక్రమంతో సంబంధం ఉన్న అందరినీ అభినందిస్తున్నాను. ఈ విశ్వవిద్యాలయంతో దీర్ఘకాలం అనుబంధం గల వ్యక్తిగా, అలాగే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సెంటర్ ఫర్ సోషల్ ఎంపవర్‌మెంట్ పాలక మండలి సభ్యుడిగానూ ఈ ప్రచురణకు ముందుమాట రాయడానికి అవకాశం కలగడం ఎంతో ఆనందంగా ఉంది. విశ్వవిద్యాలయాలు విద్యావకాశాలను మాత్రమే కలిగిస్తాయి. వాటిని ఉపయోగించుకోవడం మన పైననే ఆధారపడి ఉంటుందనే సందేశాన్ని ఈ పుస్తకం నుంచి విద్యార్థులు పొందగలిగితే ఈ ప్రచురణ లక్ష్యం నెరవేరినట్టుగా భావిస్తాను.

15-1-2009

**వి.యస్.ప్రసాద్**

# అక్షర భువన భవనపు బావుటాలు

'మేము సైతం...' పై చదువుల ప్రభుత్వ గణాంకాల పట్టిక కాదు. కుబ్జ రాజకీయవాదుల ప్రచారార్భటి కాదు. పచ్చ కామెర్ల కథనాల రాశి సైతం కాదు. సామాజిక విశ్లేషకులను తట్టి లేపే పుస్తకం ఇది. అతి సామాన్యుల వాస్తవ విజయగాథలు ఎట్లా ఉంటాయో గాఢంగా ఆలోచింపచేసే సంకలనం ఇది. కష్టనిష్ఠూరాల కోర్చి, సామాజిక సాధికారికతను సాధించిన కొంతమంది స్త్రీ పురుషుల గుండెల కదలికల సమాహారం ఇది. మంచి భవిష్యత్తుకోసం కలలు కంటూ, ఆ కలలను గుండె దిటవుతో సాకారం చేసుకున్న అక్షర యోధుల హృదయ చాలనం ఇది. ఉన్నత విద్యావకాశాల కోసం, మేలైన వృత్తులకోసం, మంచి బతుకుకోసం, మరింత మంచి సమాజం కోసం తపించే లక్షలాది బాధాసర్పద్రష్టులందరూ తాము సైతం 'మేము సైతం...'గా మారడానికి ప్రేరణ ఇచ్చే పుస్తకం ఇది. అనుభవాలు పొదిగిన అక్షరాల్లో – పుస్తక జ్ఞానం, అనుభవజ్ఞానం నిండిన అక్షరాల్లో – వెన్నుతట్టే చోదకశక్తి ఈ పుస్తకం.

డా॥ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలోని సామాజిక సాధికారికత లక్ష్యంగా ఏర్పడిన అధ్యయన, పరిశోధనా కేంద్రం శ్రమకోర్చి కూర్చిన మార్గదర్శక గ్రంథం ఈ 'మేము సైతం ...' దీనిద్వారా పూర్వవిద్యార్థుల అంతర్గత సృజనాశక్తులూ, శ్రమ, పరిశ్రమ గాథలూ కొన్ని పరిచయమవుతాయి. ఈ పుస్తకంలో 25 మంది తమ గుండె గొంతుకలను విప్పి చెప్పారు. తమ చైతన్య విస్తృతికీ, ఆర్థికాభివృద్ధికీ, వృత్తిపరమైన ఎదుగుదలకూ కారణమైన ముంగిట్లోని చదువును గురించి తెలిపారు.

ఈ సంకలనంలోని 25 మందీ అలనాటి సుదర్శన మహారాజు కొడుకులూ కాదు; కూతుళ్లూ కాదు. వీళ్లకెవ్వరికీ రాజనీతులను బోధించి రాచరిక వారసులను తయారుచేసే నీతిశాస్త్ర బోధకుడైన విష్ణుశర్మ గురువు కాదు. వీళ్లెవరూ జంతుగాథల ద్వారా మాత్రమే సమాజ జ్ఞానాన్నీ, వివిధ మానవీయ, సామాజిక విజ్ఞాన శాస్త్రాల జ్ఞానాన్నీ పొందిన వాళ్లు కాదు.

వీళ్లలో ఒకరికి చారెడు చెక్క భూమిలేదు. ఆరేళ్ల వయసులో మేకలు, గొర్రెలు కావలి కాసే చాకిరి. గొంగడితో కాళ్లకు చెప్పులు లేకుండా, పొలాలు, కంచెల వెంబడి ఆ నోరులేని జీవాల మేపే వెట్టి చాకిరి. 12 ఏండ్లు సాగిన కట్టుబానిసతనం. పాలేరు బతుకు, చేయని తప్పుకు కూడా దెబ్బలు తిన్న వెట్టితనం. కటిక పేదరికం. మరొకరు బొగ్గుగని కార్మికుడి కొడుకు. పాన్‌వాలా. మరొకరు సోడాలమ్మి, పాలమ్మి, పెరుగమ్మి, ఇడ్లీలమ్మి బతుకీడ్చిన వ్యక్తి. ఇంకొకరు ఇటుకల బట్టీ కూలీల బిడ్డ. స్వయంగా కూలీ, ఆటోవాలా, ఇంకొకరు దర్జీ. మరొకరిది ఉప్పరి పని. ఇంకొకరిది చేనేత వృత్తి. స్వయంగా స్పిన్నింగ్ మిల్లు కార్మిక జీవితం. మరొకరిది అండదండలేని తండా బతుకు. ఇద్దరు ముగ్గురిది దండగ మారిన వ్యవసాయం. మరో ఇద్దరిది దళిత వ్యథా నేపథ్యం. ఇద్దరు మృత్యుముఖం నుండి బయటపడి జైలు చదువులు చదివిన వాళ్లు. వీళ్లందరివీ భిన్న ప్రాంతాలు. విభిన్న సామాజిక వర్గాలు. వృత్తులు, వృత్తికులాలు, పైగా పలువురు అధిక సంతాన కుటుంబ భార బాధితులు.

అందరూ భూమి పుత్రులే, పుత్రికలే. శ్రమ జీవులే. అడ్డంగా నిలువుగా చీలిన సమాజంలో, మతం, కులం, ఇతరేతర సంప్రదాయాలు చిందరవందరగా చింపిన సమాజంలో బాధలు పడ్డవాళ్లే, మహిళల్లో ఎక్కువమంది 18 ఏళ్లలోపు పెళ్లిళ్లు చేసుకోక తప్పని వాళ్లే. అవమానాలు భరించిన వాళ్లే. చదువుకోవాలని నిరంతరం ఆరాటపడ్డ వాళ్లే. సంప్రదాయ విద్య మధ్యలో ఆగిపోయినా, దూరవిద్య ద్వారా తమ చదువుల కలలను సార్థకం చేసుకున్నవాళ్లే. మానవీయ, సామాజిక, విజ్ఞాన శాస్త్రాల్లో తమకిష్టమైన వాటిని వీళ్లు చదువుకున్నారు.

తర్వాత తర్వాత దశల్లో ముద్రణ మాధ్యం, సలహా సంసర్గ తరగతులు, రేడియో, వీడియో పాఠాల ద్వారా ఎందరెందరో మంచి గురువుల ద్వారా చదువుకున్నారు. తమ కంటే వయసులో పెద్దవాళ్లయిన విద్యార్థుల ద్వారా కూడా పాఠాలు, జీవిత పాఠాలు నేర్చుకున్నారు. అధ్యాపకులైనా, మీడియా పనిమంతులైనా, ఉద్యోగాల్లో

ఉన్నా, న్యాయవాదులైనా, విదేశాల్లో పేరు ప్రతిష్ఠలు గడించినా తమ విద్యాదాహాన్ని తీర్చిన, తమ జ్ఞాన విస్తృతిని పెంచిన డా॥ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయ విభిన్న పాఠ్యాంశాలనూ, బోధనా పద్ధతులనూ వాటి ప్రమాణాలనూ గుర్తుంచుకోవడం భారతీయ దూరవిద్య విజయాలకు సంకేతం. పూర్వవిద్యార్థుల సంస్కారానికి చిహ్నం.

అక్షరాస్యత సాధనలో, పాఠశాలలు, కళాశాల వ్యాప్తిలో ఆంధ్రప్రదేశ్ ప్రగతిని సాధించిన మాట కాదనలేము. కానీ అక్షరాస్యత, పాఠశాల చదువులు, ఉన్నత విద్య విషయంలో బాలబాలికల మధ్య అంతరాలు తొలగిపోలేదు. ఆర్థిక సామాజిక సాంస్కృతిక కారణాలవల్ల మధ్యలో ఆగిపోయే చదువులకూ ముగింపు లేదు. గ్రామీణ ప్రాంతాల్లో వయోజన నిరక్షరాస్యుల శాతమూ పూర్తిగా తగ్గలేదు. ఆదివాసీ ప్రాంతాల్లో మైదాన గ్రామ ప్రాంతాల్లో, షెడ్యూల్డు కులాలూ, తెగల్లో ఈ శాతం మరింత కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. ఆహార హక్కు, విద్యాహక్కు సాధ్యాసాధ్యాల మాట ఎట్లున్నా, ఒకింత ఊరట సార్వత్రిక విద్యా కార్యక్రమాల అమలు, సార్వత్రిక విశ్వవిద్యాలయ స్థాపన.

1991లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అందరికీ విద్య రాష్ట్ర ప్రచార వేదిక యూనిసెఫ్ సౌజన్యంతో 'చదువు' కథా సంకలనాన్ని వెలువరించింది. ఆ సంకలనంలో తెలుగు కథా రచయితలు రాసిన కథలు ఇరవై ఉన్నాయి. చదువుకు అడ్డంకిగా నిలిచిన దారిద్ర్యాన్నీ, స్త్రీ పురుష వివక్షనూ, పాఠశాలల్లోని కట్టడులనూ ఆ కథలు ప్రతిఫలించాయి. ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల్లో సేవ్ ది చిల్డ్రన్ దక్షిణ మండలం నిధుల సహాయంతో ఆరు స్వచ్ఛంద సంస్థలు చదువుల కథనాలు సేకరించాయి. అందరికీ ప్రాథమిక విద్య సాధించడానికి ఏఏ చర్యలు తీసుకోవాలో ఆ కథనాల ద్వారా తెలుస్తుంది. ఈ పరిచయ కర్త స్వయంగా ఒరిస్సా రాష్ట్రంలోని రాయగఢ్, కొరాపుట్ జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, అనంతపురం జిల్లాల్లో పాఠశాల విద్యాసమస్య కథనాలను సేవ్ ది చిల్డ్రన్ కోసం సేకరించాడు.

'మేము సైతం ..' లోని ప్రత్యక్ష కథనాలు కథారచయితల కల్పనా సృష్టికాదు. స్వచ్ఛంద సంస్థల సూచనలూ కాదు. ఇది సామాజిక సాధికారికతను సాధించిన 13 మంది పురుషుల, 12 మంది మహిళల ప్రత్యక్ష కథనాలు. జీవన పోరాట గాథలు. ఈ పుస్తకంలోనే డా॥ బి.ఆర్.అంబేద్కర్ ఉల్లేఖనం ఒకటి ఉంది. "... మన భవిష్యత్తును మనకోసం, మనకు మనమే రూపొందించుకోడాలి."

గుణాత్మకమైన దూరవిద్యా సంస్థ ద్వారా తమ భవిష్యత్తును తమకోసం, తమకు తాము రూపొందించుకున్న విజేతలెందరో. వారిలో కొందరు వీరు, స్ఫూర్తి దాయకులు.

ఈ పుస్తకం తెలుగులో మాత్రమేకాదు, అన్ని ముఖ్యమైన, అవసరమైన ప్రపంచ భాషల్లో మరీ ముఖ్యంగా ఆఫ్రో ఆసియా దేశ భాషల్లో, లాటిన్ అమెరికా భాషల్లో – రావలసిన అవసరం ఉంది. యూనిసెఫ్, సి.ఒ.ఎల్ సాయాన్ని కోరవచ్చు. కనీసం ముందుగా, ఇంగ్లీషులోనూ, హిందీలోనూ తెచ్చే ప్రయత్నం డా॥ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం చేస్తే దూరవిద్యావ్యాప్తికి మంచిచి.

సంపాదకుడు, సంకలనకర్త డా॥ ఘంటా చక్రపాణి పూర్వ పత్రికా రచయిత. మీడియా నిపుణుడు, ప్రస్తుత విశ్వవిద్యాలయ సామాజిక శాస్త్ర విభాగ అధ్యాపకుడు సామాజిక సాధికారికతా కేంద్రం ద్వారా సోదరుడు చక్రపాణి ఈ అపూర్వమైన కృషి చేసినందుకు మనసారా అభినందిస్తున్నాను. అందరికీ అందుబాటులో మం చదువులను ఆశించే పౌరుడిగా, సామాజిక సాధికారికతను కోరే అధ్యాపకుడిగా అభినందిస్తున్నాను.


ఈ పుస్తకం చదవండి. ఇతరులతో చదివిస్తూ పోండి.

*Pass it on the torch light.*

**– కేతు విశ్వనాథరెడ్డి**

# విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | పాలేరు బతుకులో పన్నీటి వాన | జంగయ్య | 2 |
| 2. | పోటెత్తే అలల మధ్య నిజమైన కలలు | చింతల రాంబాయ్ | 8 |
| 3. | అంబేద్కర్ బడి నుంచి మీడియా ఒడిలోకి.. | మధు | 12 |
| 4. | కష్టాల సుడిలోంచి ఖండాంతర ఖ్యాతి | అనిల్‌జ్యోతి | 18 |
| 5. | జైలు గోడల మధ్య జీవిత పాఠాలు | చలపతిరావు | 26 |
| 6. | డిప్యూటీ కలెక్టరయిన 'మట్టి' మనిషి... | కట్టా హైమావతి | 32 |
| 7. | పాన్ షాపు నుంచి వోల్వో మేనేజర్‌గా ... | వెంకటేశ్వరరావు | 38 |
| 8. | చదువుతో వచ్చిన సదవకాశం... | కొండ్రు పుష్పలీల | 42 |
| 9. | ఆత్మవిశ్వాసమే ఆయన ఆయుధం | రాజేంద్రప్రసాద్ | 48 |
| 10. | చీకటి తాండాలోంచి వెండి వెన్నెల్లోకి... | సూర్యధనుంజయ్ నాయక్ | 52 |
| 11. | విధినే ఎదిరించిన ధీరత్వం | నరేందర్ | 58 |
| 12. | తలెత్తుకుని నిల్చిన పిడికెడు చైతన్యం | జాజుల గౌరి | 62 |
| 13. | శ్రుతి చేసిన అక్షర నాదం | ఎల్లా వేంకటేశ్వరరావు | 68 |
| 14. | చదువు రాసిన సువర్ణ చరిత | సుజాత | 72 |
| 15. | ఆటో వాలా అధ్యాపకుడయ్యిందిలా... | కిష్టయ్య | 78 |
| 16. | ఆగిపోయిన చదువు నుంచి ఐబిఎం దాకా... | పద్మప్రియ | 84 |
| 17. | దర్జీ కుటుంబంలో చదువుల దర్జా | ఈశ్వర్ | 88 |
| 18. | మగ్గం పేదరికంలో నిగ్గు తేలిన అక్షరం | త్రివేణి నర్సింహ | 92 |
| 19. | గురి తప్పని గుండె ధైర్యం... | కృష్ణప్రసాద్ | 96 |
| 20. | ఇనుమడించిన ఆత్మగౌరవం | నీరజ | 100 |
| 21. | అడవి బాట నుంచి అక్షర మార్గంలోకి... | దత్తాత్రేయ | 106 |
| 22. | మనోవ్యాధికి విద్యే వైద్యం... | శ్రీలక్ష్మి | 110 |
| 23. | జైలు జీవితంలో ఓనమాలు... | రాజన్న | 114 |
| 24. | రచ్చ గెలిచిన దూరవిద్య | శిష్టా సవిత | 118 |
| 25. | బతుకు మార్చిన బీజాక్షరాలు | మహ్మద్ యాసిన్ | 122 |



జంగయ్య

# పాలేరు బతుకులో
# పన్నీటి వాన

# జంగయ్య

పాలబుగ్గల జీతగాడా ...

పసుల గాసె మొనగాడా

పాలు మరసీ ఎన్నాళ్ళయ్యిందో

కొలువు కుదిరీ ఎన్నేళ్ళయ్యిందో ..

– ఇదీ జంగయ్య జీవితపు నేపథ్య గీతం. పాలుగారే ఆరేళ్ళ పసితనంలోనే 'పసుల మంద'లో పడిన జంగయ్యకు ... జీతం, అప్పు జమా ఖర్చుల్లో మిగిలింది పన్నెండేళ్ళ వెట్టిచాకిరీకి తాకట్టుపడ్డ జీవితం. వెట్టి కట్టుబాట్లను ఒక్కొక్కటిగా తెంపేసుకుంటూ చదువు సాయంతో జీవితపు ఒక్కో మెట్టూ ఎక్కి ఎదిగిన జంగయ్య ఇవాళ ఒక విశ్వవిద్యాలయ ఉద్యోగి. రంగారెడ్డి జిల్లాకు చెందిన జంగయ్యను కదిపితే చెమర్చే ఆయన కళ్ళల్లో పశువుల మందలో కరిగిపోయిన బాల్యం కనిపిస్తుంది. ప్రతి మాటలో అచంచల ఆత్మవిశ్వాసంతో ఆయన వేసిన అడుగుల సవ్వడి వినిపిస్తుంటుంది. జీవితంలో పద్దెనిమిదేళ్ళ దాకా పాలేరుగా ఉన్న ఆయన ఇవాళ ఎంఏ పట్టాదారు. బాల్యమంతా చేతిలో ముల్లుగర్రే తప్ప పలకా బలపం పట్టి ఎరుగని జంగయ్య డా. బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో బిఏ, ఎంఏ పూర్తిచేసి ఒక సామాజిక శాస్త్రవేత్తగానో, సంఘ సేవకుడిగానో మారి తన ఊరిలో తనలాంటి వారి బతుకు రాత మార్చాలని కలలు కంటున్నాడు. అడుగడుగునా అవమానాల పాలై తిట్లు, ఛీత్కారాలు, కర్ర దెబ్బలకు కమిలిపోయిన బాల్యాన్నీ, బాధల్నీ తడుముకుంటూనే చదువు నేర్పిన సాహసంతో తన కలల్ని సాకారం చేసుకుంటున్నాడు. ఎండల్లో ఎండిపోయి, వానల్లో తడిసిపోయి పల్లెదాటి, పల్లేర్లు దాటి, తుమ్మచెట్ల ముళ్ళబాటలు దాటి, అక్షరం ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో ఆ ఊరికి ఒక కొత్త దారి చూపిన జంగయ్య ప్రస్థానాన్ని ఆయన మాటల్లోనే విందాం.

**మా** అమ్మా నాన్న లక్ష్మి, బీరయ్యలు. మాది రంగారెడ్డి జిల్లా కీసర మండలం, చీర్యాల గ్రామం. మా అమ్మా నాన్నలకు ఎనిమిది మందిమి పుట్టాం. ఇద్దరు దుర్భర పేదరికానికి బలయ్యారు. ఆరుగురం మిగిలాం. నేను నాలుగో వాడిని. పేరుకు రాజధాని పక్కనే కానీ, అక్షరానికి నోచుకోని ఊరు మాది. ఇక నా చిన్నప్పుడు చదువనేదే ఎరుగం. ఎందుకంటే బతకడానికి 'జీతం' చేయడమే సరిపోయేది. జీతమంటే నెలనెలా డబ్బులొచ్చే ఉద్యోగం కాదు. వెట్టి! మేకలు, గొర్రెల దగ్గర కావలి. మా నాయన అదే చేసేవాడు, మా అన్న అదే చేసేవాడు ... నాదీ అదే పని. ఆరేళ్ళకే గొంగడి వేసుకుని, కాళ్ళకు చెప్పులు లేకుండా పొలాలు, కంచెల వెంబడి పశువులను మేపే పనికి కుదిరాను. సంవత్సరానికి యాభై రూపాయల జీతం ... పటేల్ దగ్గర. ఇంతా చేసి జీతం మిగిలిందేమీ లేదు. ఇల్లు గడవడానికి అప్పులు, అప్పులు తీర్చడానికి చాకిరీ .. వెట్టిచాకిరి. ఇదంతా బతుకు గడవడానికే. మా అయ్య వెనుకనే అన్న ... ఆయన వెనుక నేనూ, నా తమ్ముడూ అంతా జీతగాళ్ళమే. చారెడు చెక్క భూమిలేదు. వ్యవసాయం లేదు. అయితే జీతం ... లేకుంటే కూలి. ఆరేళ్ళ వయస్సులో జీతానికి కుదిరిన నేను 18 ఏళ్ళదాకా... అంటే పన్నెండేళ్ళు పటేళ్ళ దగ్గర జీతానికే పనిచేశాను. దుర్భరమైన పని ... కాళ్ళకు చెప్పులు, నెత్తిన గొంగడి

... పనికి పెట్టుకున్న పటేళ్ళే ఇవ్వాలి ... అవి అడిగే ధైర్యం మాకు లేదు ... ఇచ్చే కనికరం వాళ్ళకు లేదు. ఎండైనా, వానైనా ఉత్తకాళ్ళతోనే. ఒంటిపై సరిగ్గా బట్టలు ఉండేవేకావు. బాల్యం సగం చిరుగులే. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే పుట్టెడు దారిద్ర్యం, సగం ఎండిన డొక్క, సగం నిండిన కడుపు చదువుకు ఎలా దూరం చేశాయో చెప్ప డానికే. బతకడానికే చాకిరీ చేసే జీవితాల్లో చదువు గురించి ఆలోచన రావడమే ఒక సాహసం.

## ఆ దెబ్బలు మరచిపోలేను ...

నాకప్పుడు తొమ్మిదేళ్ళు ఉంటాయేమో. ఓ పటేల్ దగ్గర పని చేసేవాడిని. పటేల్ తమ్ముడి పొలం కూడా పక్కనే ఉండేది. వారి మధ్య గొడవలుండేవి. అన్న దగ్గర జీతం ఉన్న నేను పశువులను మేపే వాడిని. ఓసారి నా మందలో దుడ్డె పటేల్ తమ్ముడి చేనులో పడింది. నిజానికి అది చేనులో మేయలేదు. చేనులోంచి వెళ్ళిందంతే. అప్పుడు పటేల్ తమ్ముడు కొట్టాడూ ... ఇప్పటికీ మరచిపోను ఆ దెబ్బలూ, వాతలూ ... మా ఊరిలో కూడా చాలా మందికి ఇంకా గుర్తు. ఇది అన్యాయం అన్నవాడు ఒక్కడూ లేడు. ఇప్పుడు మా ఊరికి వెళ్తే ఆ పటేల్ తమ్ముడిని పలకరిస్తా... 'బాగున్నావా... తాతా' అని తలదించుకుంటాడాయన. పశువుల్ని మేపడం చాలా కష్టమైన పని. చిన్న చిన్న పిల్లలే చేస్తుంటారా పని. వర్షం పడుతుంటే, ముళ్ళ కంచెల్లో పశువులు పరుగెడుతుంటే ... కన్నుమూసి తెరిచే లోగా చేలలోపడి మేస్తుంటే ... నానా యాతన. పశువులకేం తెలుసు ఎటు వెళ్ళాలో. ఒక్క రోజు జ్వరం వచ్చి పడుకున్నా పటేల్ ఊరుకునేవాడు కాదు. బూతులు ... దెబ్బలు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి ఏడు గంటల దాకా పనే! ఎండొచ్చినా, వానొచ్చినా!!

## చదువు నా స్వప్నం ...

ఎందుకో నాకు చిన్నప్పటి నుంచీ చదువంటే మహా ఇష్టం. నేను పనిచేసే పటేళ్ళ పిల్లలు చదువుకునేవారు. నాకూ అలా చదువుకోవాలనిపించేది. రాత్రి బడికి పోవడానికి ప్రయత్నం చేసేవాడిని. పశువుల్ని మేపుకు వచ్చి, వాటిని కట్టేసి, పేడతీసి, పాలు పిండి ... అప్పటికే రాత్రయ్యేది. ఒళ్ళు పులిసిపోయి ఉండేది. అయినా రాత్రి బడికి పోయేవాణ్ణి. 'అనియత విద్య' నడుస్తుండేది మా ఊర్లో. కొద్ది రోజులు అక్కడ చదువు. అది పద్నాలుగేళ్ళ లోపు ఉన్నవారికే. నా వయస్సు మించిపోవడంతో అక్కడికి రానివ్వలేదు. వచ్చిన నాలుగు అక్షరాలకు మళ్ళీ ఆటంకం. ఆ తరువాత కొన్నాళ్ళకు 'వయోజన విద్య' మొదలయింది మా ఊర్లో. మళ్ళీ చదువు మొదలుపెట్టాను. అందరూ నవ్వే వాళ్ళు ... ఎద్దులా ఉన్నావు, ఏం చదువు అని. రాత్రి రహస్యంగా వెళ్ళేవాడిని చదువుకోవడానికి.

> **"ఎందుకో నాకు చిన్నప్పటి నుంచీ చదువంటే మహా ఇష్టం. పనిచేసే పటేళ్ళ పిల్లలు చదువుకునేవారు. నాకూ అలా చదువుకోవాలనిపించేది. రాత్రి బడికి పోవడానికి ప్రయత్నం చేసేవాడిని. పశువుల్ని మేపుకు వచ్చి, వాటిని కట్టేసి, పేడతీసి, పాలు పిండి ... అప్పటికే రాత్రయ్యేది. ఒళ్ళు పులిసిపోయి ఉండేది. అయినా రాత్రి బడికి పోయేవాణ్ణి."**

దరిద్రంలో ఉండేవాడికి కావల్సినన్ని అవరోధాలు. 1984లో మా నాన్నను ఎవరో చంపేశారు. జీవితాంతం పశువుల మధ్యే గడిపిన ఆయన పశువుల మందకాడే చనిపోయాడు. ఊర్లో ఏవో తగాదాలు. అదే మా కుటుంబానికి షాక్. దానిపై మరో షాక్. ఆ కేసులో మా అన్నను పోలీసులు అరెస్టుచేసి తీసుకు వెళ్ళడం ... రెండేళ్ళు జైలులో ఉన్నాడు. ఆ తర్వాత వదిలేశారు. అమ్మ బెదిరి పోయింది. ఈ క్రమంలో పేదరికం మరింత పెరిగింది. కుటుంబ భారం అంతా నాపైనే... ఇలా జీవితంలో ప్రతి సంఘటనా నన్ను చదువుకు దూరం చేస్తూనే ఉంది.

## మలుపు తిరిగిన జీవితం ...

మెగసెసె అవార్డు గ్రహీత శాంతా సిన్హా 1987లో మా ఊరికి వచ్చారు. నా జీవితాన్ని మలుపుతిప్పిన సంఘటన అది. మా గ్రామంలో వెట్టిచాకిరిలో మగ్గుతున్న వారికి విముక్తి కల్పించేందుకు ఆమె ఎంతో శ్రమించారు. ఎన్నో కష్టాలకు ఓర్చారు. అక్కడ పటేళ్ళు అనేక ఇబ్బందులను సృష్టించేవారు. రోజూ వాదోపవాదాలు జరిగేవి. అవమానించేవారు. అన్నీ భరించి నాలాంటి బాల కార్మికులకు విముక్తి కల్పించి హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీకి తీసుకు వచ్చారు. అక్కడ 'నర్సరీ'లో శిక్షణనిచ్చారు. మొక్కలు పెంచడం ... అందరం కలిసి యూనివర్సిటీలోనే ఉండేవాళ్ళం. షెడ్డు వేయించారు ... బియ్యం,

కూరగాయలు అన్నీ ఇప్పించేవారు. వండుకుని తిని, పని నేర్చుకునేవాళ్ళం. శాంతాసిన్హా అక్కడితో ఆగలేదు. తన దగ్గరి విద్యార్థులను మా వద్దకు పంపించేవారు చదువు చెప్పడానికి. శ్రీనివాస్, ఆంజనేయులు, రవీంద్రబాబు ... వారందరూ మా దగ్గరకు వచ్చి చదువు చెప్పేవారు. మళ్ళీ అక్షరాలతో సహచర్యం. ఇంతలోనే శిక్షణ పూర్తయింది. పనైతే నేర్చుకున్నాం. కానీ బతకడం ఎలా ... మళ్ళీ ఇంటికి వెళ్ళాం. పూట గడవడం కష్టమే అయింది.

మళ్ళీ శాంతాసిన్హా చల్లని చేతులే ఆశ్రయమిచ్చాయి. మా అందరినీ హైదరాబాద్ పిలిపించి సెంట్రల్ యూనివర్సిటీ లోనే పని ఇప్పించారు. రోజుకు 18 రూపాయలు... దినసరి కూలి. 15 మందిమి చేరాం. తర్వాత పెళ్ళిళ్ళు. కుటుంబ సమస్యలు. అందరూ మానేశారు. ముగ్గురమే మిగిలాం. మా అదృష్టవశాత్తూ ఐదో పే కమిషన్ వచ్చింది. మేం దినసరి వేతనంలోంచి స్కేలులోకి మారాం. 18 రూపాయల దినసరి కూలిలోంచి 1800 రూపాయల నెలజీతం. జీవితం ఒక కొత్త దారిలో పడింది. ఆ తర్వాత పర్మనెంట్ అయింది. కృష్ణమూర్తిగారు వైస్ చాన్సలర్ అయ్యాక మళ్ళీ మాకు చదువు అబ్బింది. యూనివర్సిటీలో ఎవ్వరూ వేలిముద్రగాళ్ళు ఉండకూడదనే నిర్ణయంతో భోజన విరామ సమయంలో మాకు చదువు చెప్పించారు. అలా అప్పుడప్పుడూ మాకు సరస్వతి కటాక్షం దొరుకుతూ వచ్చింది.

### స్వీపర్‌గా ఉండి...

యూనివర్సిటీలో శానిటేషన్‌లో స్వీపర్‌గా పనిచేసేటప్పుడు విద్యార్థులు పరిచయం అయ్యేవారు. వారితో మాట్లాడడం ... చదువు గురించి మాట్లాడడం ... చదువుపై ఆసక్తి పెరిగింది. మధ్యాహ్నపు చదువులో మాకు 'సర్టిఫికెట్' ఇచ్చారు. దానితో టెన్త్ పరీక్ష రాయాలన్న ఆలోచన వచ్చింది. 1991లో మొదటిసారి పరీక్ష రాశా ... ఫెయిల్ అయ్యా. అలా ఎన్నో సార్లు పరీక్ష రాశా. ఒక్కసారే అన్నీ పాస్ కావాలని అన్నీ ఫ్రెష్‌గా రాసేవాణ్ణి. అలా 1993లో టెన్త్ గట్టెక్కాను.

టెన్త్ పాసవడం కొంత ఉత్సాహాన్ని ఇచ్చింది. ఆ వెంటనే 1994లో అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో డిగ్రీ ఎంట్రన్స్ రాశాను. ఫస్ట్ క్లాస్ వచ్చింది. డిగ్రీలో చేరాను. ఆ తర్వాత పెళ్ళయింది. నా సిస్టర్స్, బ్రదర్ మ్యారేజీ బాధ్యత నాదే. నేనే వారి పెళ్ళిళ్ళు చేశాను. అలా కొంతకాలం చదువు అటకెక్కింది. చెప్పాగా... బతుకు పోరులో చదువు సజావుగా సాగడం ఎంతో కష్టమని. మొత్తానికి ఎలాగైతేనేం 2000 సంవత్సరం నాటికి డిగ్రీ పూర్తి చేయగలిగాను. సమాజం గురించీ, మనుషుల గురించీ, మా బతుకుల గురించీ, నా బాల్యం గురించీ బాగా ఆలోచనలు ఉండేవి. వీటన్నింటిపై అధ్యయనం చేయాలంటే సోషియాలజీ చదవాలని యూనివర్సిటీ స్టూడెంట్స్ అంటుండేవారు. ఎలాగైనా సోషియాలజీ చదవాలనుకున్నా. 2003లో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఎంఏ సోషియాలజీ మొదలుపెట్టారు. ఫస్ట్ బ్యాచ్‌లో చేరాను. ఇక్కడో విషయం చెప్పాలి. అంబేద్కర్ యూనివర్సిటీ నిర్వహించే కాంటాక్ట్ క్లాసులు బాగా ఉంటాయి. ఎంతో అర్థమయ్యేలా చెబుతారక్కడ. డిగ్రీలో దురదృష్ట వశాత్తు నాకు ఆ క్లాసులకు వెళ్ళే అవకాశం లేకుండేది. నేను డిగ్రీ చదివేటప్పుడు యూనివర్సిటీ హాస్టల్‌లో పనిచేసేవాడిని. ఆదివారం విద్యార్థులకు స్పెషల్స్ చేసిపెట్టాలి. ఆ రోజు బాగా బిజీగా ఉంటుంది. సెలవు పెట్టడం అసలు కుదరదు. నాకు పని ముఖ్యం, దాని తర్వాతే ఏదైనా. అదేకదా మనకు తిండిపెడుతోంది.

ఎవరో దేవుడో
లేక మానవాతీతుడో
వచ్చి కాపాడాలని
చూడకు. నీ
బానిసత్వానికి నువ్వే
చరమగీతం పాడాలి.
మన భవిష్యత్తును
మనకోసం మనకు
మనమే
రూపొందించుకోవాలి.
**- డా॥ బి.ఆర్.అంబేద్కర్**

చదువుకునే అవకాశం కల్పిస్తోంది. అలా కాంటాక్టు క్లాసులకు వెళ్ళడం కుదిరేది కాదు. నేనే సొంతంగా చదువుకునే వాడిని. అర్థం కాకపోతే మా యూనివర్సిటీ విద్యార్థులు సాయం చేసేవారు. ఈ విషయంలో వారికి నేనెంతో రుణపడి ఉన్నాను.

### అక్షరానికి అభినందన ...

మా మేడమ్ శాంతాసిన్హాకు మెగసెసె అవార్డు వచ్చింది. ఆ సందర్భంగా సెంట్రల్ యూనివర్సిటీలో సన్మానం ఏర్పాటుచేశారు. మా జీవితాలను మార్చేసిన ఆమె గురించి నాలుగు మాటలు మాట్లాడాలని చాలా అనిపించింది. దానికోసం బాగా ప్రయత్నించా. పెద్ద సభ. పెద్ద వాళ్ళంతా వస్తారు. అవకాశం దొరుకుతుందా అనిపించింది. చివరికి పుష్పగుచ్ఛం అయినా ఇవ్వాలని తాపత్రయపడ్డా. మొత్తానికి శాంతాసిన్హానే కలిసి నా కోరిక చెప్పా. ఆమె వైస్‌చాన్సలర్‌తో మాట్లాడి రెండు నిమిషాలు సమయం ఇప్పించారు. సభ అయిపోవచ్చింది. చివర రెండు నిమిషాలు నేను మాట్లాడాను. దాదాపు 500 మంది ఉన్నారు. అంతా పెద్దవాళ్ళు ... మాజీ వైస్‌చాన్సలర్లు, మేధావులు... హాలంతా నిండిపోయి ఉంది. భయం, భయంగానే నా కథంతా చెప్పా. శాంతాసిన్హా ఎలా సాయం చేశారో ... మా జీవితాలు ఎలా మార్చారో చెప్పాను. ఉద్వేగం ఆపుకోలేక అక్కడే ఏడ్చేశా. అందరూ శ్రద్ధగా విన్నారు. నా మాటలు వింటారని నేను ఊహించలేదు. మాట్లాడి కిందకు దిగుతుంటే చప్పట్లు... కొందరు చేతులు కలిపి అభినందించారు. కొందరు తమ గుండెలకు హత్తుకుని ఆశీర్వదించారు. నా జీవితంలో ఎప్పటికీ మరచిపో లేని అపూర్వమైన సంఘటన అది. చదువు ఇంత ఆనందాన్ని తెచ్చిపెడుతుందా అనిపించింది. అందరూ నన్ను గుర్తించారు. అభినందించారు. ఆశీర్వదించారు. చదువును సమాజం గుర్తిస్తుం దని నాకు తెలియజెప్పిన మొదటి సంఘటన అది.

### నా బాటలో నా భార్య కూడా ...

ఆనాటి నుంచి నాకు చదువు రుచి తెలిసింది. ఆ ఉత్సాహంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా కష్టపడి చదివా. ఎంఏ సోషియాలజీ ఫస్ట్ ఇయర్‌లో డిస్టింక్షన్ వచ్చింది. రెండో సంవత్సరంలో 65 శాతం మార్కులతో పాసయ్యాను. ఇక చదువును వదిలిపెట్టదలచుకోలేదు. ఎంఫిల్, పీహెచ్‌డీ చేయాలన్న కోరిక ఉంది. దానికి కాస్త ఇంగ్లీష్ వచ్చి ఉండాలి. కానీ నాకదే కష్టం. తెలుగైతే ఎలాగోలా కష్టపడి అర్థం చేసుకున్నా కానీ, ఇంగ్లీష్ నేర్చుకోవడం కష్టమవు తోంది. ఇప్పుడిప్పుడే ఇంగ్లీష్‌పై శ్రద్ధ పెట్టాను. ఇప్పుడు పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో తెలుగు సాహిత్యంలో ఎంఏ చేస్తు న్నాను. జీవితాంతం చదువుతూనే ఉండాలన్నదే నా కోరిక. చిన్నప్పుడు అవకాశం లేదు ... ఇప్పుడు నేర్చుకోవాలన్న తపన. శ్రామిక విద్యాపీఠం నుంచి కంప్యూటర్ కోర్సు చేశా. 93 శాతం మార్కులతో పాసయ్యాను. ఎప్పటికైనా పీహెచ్‌డీ చేయాలన్నదే నా లక్ష్యం. సెంట్రల్ యూనివర్సి టీలో శానిటేషన్, గెస్ట్‌హౌస్, హాస్టల్‌లో పనిచేసిన నేను ఇప్పుడు ఎకనామిక్స్ విభాగంలో అటెండర్‌గా పని చేస్తున్నాను. డిపార్ట్‌మెంట్ పరీక్షలు రాసి ఇంకా పైకి ఎదగాలని ప్రయత్నం. ఒకసారి సంసారంలో పడ్డాక చదువుకోవడం చాలా కష్టం. నాకు ఒక పాప, బాబు. ఇప్పుడు ముగ్గురం కలిసి చదువుకుంటున్నాం. ఇంగ్లీష్‌లో నాకు తెలియనివి పాప చెబుతూ ఉంటుంది. అప్పుడు నాకు గర్వంగా, ఆనందంగా ఉంటుంది. నా కథ వారికి చెప్పి బాగా చదువుకోవాలని ప్రోత్సహిస్తుంటాను. వాళ్ళేకాదు. నా సహోద్యోగులు చాలామందిని అంబేద్కర్ యూనివర్సిటీలో చేర్పించాను. బాల్యంలో బడికి వెళ్ళలేని మా జీవితాల్లో అంబేద్కర్ యూనివర్సిటీ గొప్ప మార్పును తెస్తోంది. చదువునే మా దగ్గరికి తెస్తోంది. ఇంకేం కావాలి. ఇలాంటి అవకాశాలు ఉపయోగించుకోవాలని అందరికీ చెబుతుంటాను. మా ఆవిడను కూడా చేర్పించా. ఆమె ఇప్పుడు డిగ్రీ చేస్తోంది.

> ***"సమాజం గురించీ, మనుషుల గురించీ మా బతుకుల గురించీ, నా బాల్యం గురించీ బాగా ఆలోచనలు ఉండేవి. వీటన్నింటిపై అధ్యయనం చేయాలంటే సోషియాలజీ చదవాలని యూనివర్సిటీ స్టూడెంట్స్ అంటుండేవారు. ఎలాగైనా సోషియాలజీ చదవాలనుకున్నా."***

### చదువిచ్చిన గౌరవం ...

నా బాల్యం, ఊరు, ఆ తిప్పలు గుర్తుకు వస్తే బాధగా ఉంటుంది. నా లాంటి వాళ్ళు ఎంతోమంది ఉన్నారు. అప్పుడు శాంతాసిన్హాలాగా ఎవరైనా

సాయం చేస్తేనే బయటపడతారు. నేను బాగా సెటిలైతే వారికి ఏమైనా చెయ్యాలని అనిపిస్తుంది. ఏదైనా ఎన్జీవో ఏర్పాటు చేయాలనుంటుంది. నేను స్థిరపడ్డాక తప్పకుండా ఏదైనా సాయం చేస్తా. ఇప్పుడు ఊరికి వెళితే నన్ను ఎంతో గౌరవిస్తారు. రాజధానికి దగ్గరగా ఉందనే కానీ మా ఊర్లో టెన్త్ పాసైతే గొప్ప. చదువులో అంతగా వెనుకబడి ఉంటుంది. నన్ను అప్పుడు 'జీతా'నికి పెట్టుకున్నవారే ఇప్పుడు గుర్తిస్తారు, గౌరవిస్తారు. ఎంఏ పాసయ్యాడని, ఉద్యోగం చేస్తున్నాడని మర్యాద చేస్తారు, నలుగురికి స్ఫూర్తిగా నన్ను చూపుతారు. ఇదంతా నాకు ఆనందంగా ఉంటుంది. చదువు నాకిచ్చిన గౌరవం ఇది.

## మా నాన్న ఉంటే బాగుండేది ...

ఇప్పుడు మా ఊరి నుంచి నాకు ఫోన్లు వస్తుంటాయి. 'మా పిల్లవాడు టెన్త్ పాసయ్యాడు, తర్వాత ఏం చేయిస్తే బావుంటుంది' అని నన్ను సలహాలు అడుగుతుంటారు. పద్దెనిమిదేళ్ళు అక్షరజ్ఞానం లేకుండా పెరిగిన నేను ఇప్పుడు చదువు గురించి సలహాలు ఇస్తున్నాను. ఇది తలచుకుంటే నాకు గమ్మత్తుగా, గర్వంగా ఉంటుంది. మా నాయన బతికి ఉంటే ఎంతో ఆనందపడేవాడు. చిన్నప్పుడు ఆయన మమ్మల్ని ఎంత బాగా చూసేవాడో. ఆయన తినే పిడికెడంత తిండిలో మాకు కడుపులు నింపడానికి మిగిల్చేవాడు. చాలాసార్లు మేం తిన్నాకే తినేవాడు. అంత ఇబ్బందుల్లో కూడా ఎంతో ప్రేమ. అప్పులు చేసి అవి తీర్చడానికి నానా యాతనపడేవాడే కానీ, మా కడుపులు మాడనిచ్చేవాడు కాదు. నిజానికి అప్పుడు తినడానికేముండేది .. జొన్న గటక, రొట్టె... కలిసి తిని బతికాం. ఇప్పటి నా జీవితాన్ని చూస్తే ఆయన ఎంతో ఆనందపడేవాడు.

## అదెంతో ఉపయోగం...

అంబేద్కర్ యూనివర్సిటీ మెటీరియల్ ఈజీగా ఉన్నా ఎంతో స్టాండర్డ్‌గా ఉంటుంది. అది చదివిన వారు ఎంతో మంది సివిల్స్ రాశారు. నేను కూడా రాశా. గ్రూప్-I, గ్రూప్-IIలు కూడా ప్రయత్నం చేశా. అలాంటివి ప్రిపేర్ కావాలంటే చాలా సమయం కావాలి. నా ఉద్యోగ సమయం అయిపోయాక నాలుగు గంటల సమయం మిగులుతుంది. కుటుంబ సమస్యలు ఎప్పుడూ ఉంటాయి. వాటిలోనే సమయం మిగుల్చుకుని చదువుతుంటాను. రోజుకు కనీసం రెండు గంటలైనా చదవాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. పిల్లలతో పాటు చదువుకోవడం అదో తృప్తి. చదువు రుచి దొరికింది. ఒకసారి రుచి దొరికాక చదువు వదిలేయడం కష్టం. కాస్త సమయం దొరికినా లైబ్రరీలో గడుపుతాను. సెంట్రల్ యూనివర్సిటీలో అమూల్యమైన పుస్తకాలున్నాయి. నిజానికి రెండేళ్ళ సెలవుపెట్టి బాగా చదవాలన్నది కోరిక. ఇంకా అధికారుల దృష్టికి తీసుకెళ్ళలేదు. ఆర్థిక విషయాలు కూడా చూసుకోవాలి కదా! ఎంత కష్టమైనా సరే చదవడం మాత్రం ఆపను. ఇక్కడితో ఆగను!

* * *

ప్రయత్నంలోనే ఆనందం ఉంది. మన గమ్యస్థానానికి చేరే మార్గంలో అనేక మనోహరమైన దృశ్యాలను సందర్శించగలం.

**-మహాత్మాగాంధీ**



చింతల రాంబాయ్

# పోటెత్తే అలల మధ్య నిజమైన కలలు

# చింతల రాంబాయ్

ఇది నలభై ఐదేళ్ళ రాంబాయ్ కథ. చదువుకోవాల్సిన సమయంలో ఒక మహిళ సమాజ వ్యతిరేకతను ఎలా ఎదుర్కోవాల్సి వచ్చిందో, అత్యంత విషాదాన్ని పంటి బిగువున భరించి, చదువుకుని, కుటుంబాన్ని మోసి తానెలా నిలిచిందో చెప్పే కథ. అక్షరాలను నిచ్చెనమెట్లుగా చేసుకుని, ఒంటిచేత్తో పిల్లల భారాన్ని మోస్తూ, భర్త కన్న కలలను ఎలా నిజం చేసిందో చెప్పే గాథ ... ప్రతి మనిషికీ స్ఫూర్తిదాయకమైన కథ రాంబాయ్ జీవితం. ఆమె జీవన గమనంలోని విషాదాలూ, విజయాలూ ...

**చిం**తల రాంబాయ్ ... హైదరాబాద్‌లో దిగువ మధ్యతరగతి కుటుంబంలో జన్మించింది. తండ్రి ముతమల్ల పెద్దయ్య. 7వ తరగతి చదువుకున్న ఈయన ఏపీ ట్రాన్స్‌కోలో అటెండర్‌గా పనిచేసి రిటైరయ్యారు. అమ్మ చదువుకోలేదు. తమ్ముళ్ళు, చెల్లెళ్ళు టెన్త్‌దాకా చదివారు.

రాంబాయ్ ఇంటికి పెద్ద కూతురు. ఇంట్లో ఎంతో గారాబం చేసేవారు. హైదరాబాద్‌లోని హోలీ మేరీ హైస్కూల్ (ఖైరతాబాద్)లో ఫోర్త్ క్లాస్ దాకా చదివింది. తర్వాత తండ్రికి ఖమ్మం జిల్లా పాల్వంచకు బదిలీ కావడంతో చదువు కూడా పాల్వంచ చేరింది. సెవెన్త్ పాసయింది. చదువుకు కష్టాలు మొదలయ్యాయి. పెదనాన్న రంగప్రవేశం చేశాడు. 'ఆడపిల్లకు పెద్ద చదువులేంటి? మొగుడికి ఉత్తరం ముక్క రాయడం వస్తేచాలు ... ఇక ఆపేయండి' అంటూ 'మను' చట్టంలోని ఆర్డర్ జారీ చేశాడు. రామాయణంలో లక్ష్మణుడి లాంటి రాంబాయ్ తండ్రి సరేనన్నాడు. రాంబాయికి దుఃఖమొక్కటే తక్కువ. ఎంతో ఆసక్తి ఉన్నా చదువు మానేసి ఇంట్లో కూర్చోవడమా? కానీ తండ్రే వద్దన్నాక తన తరఫున ఎవరుంటారు. ఇక ఇంతే అనుకుంది. కానీ అదృష్టం తలుపుతట్టింది. నిరక్షరాస్యురాలైన తల్లి అండగా నిల్చింది. 'రాంబాయ్ చదవాల్సిందే'నన్నది. భర్తతో పోరాడింది. గాడి తప్పిన రాంబాయ్ చదువు మళ్ళీ పట్టాలెక్కింది. - **రాంబాయ్ జీవితంలో ఇది మొదటి విజయం.**

టెన్త్‌దాకా రాంబాయ్‌ని ఎవ్వరూ డిస్టర్బ్ చేయలేదు. టెన్త్ చదువుతుండగానే చింతల గోపాలరావుతో ఎంగేజ్‌మెంట్. టెన్త్ పరీక్షలు కాగానే మ్యారేజ్. అలా పెళ్ళయిన రాంబాయ్ ఖైరతాబాద్‌లోని అత్తగారింట్లో అడుగుపెట్టింది. పెళ్ళయినా చదువుకోవాలనుకుంది. కానీ అత్తగారింటి నుంచి పర్మిషన్ లేదు. భర్తను ఒప్పించగలిగింది కానీ దగ్గర్లో కాలేజీలు లేవు. చదువుకు బ్రేక్ పడింది.

కొత్త కాపురం ... అలల్లేని పడవ ప్రయాణంలా హాయిగా సాగుతున్నది. ఆర్థిక సమస్యలున్నా ఇద్దరి మధ్యా అవగాహన సమస్యను చిన్నదిగా చేసింది. అత్తగారింట్లో అంతా భర్త సంపాదనపైనే ఆధారం. సర్దుబాటు చేసుకుని గుట్టుగా కాపురం నెగ్గుకు వచ్చింది. భర్తది చిన్న జీతమే, అయితేనేం పెద్ద మనసు. అనేక ఆర్థిక, ఆరోగ్య సమస్యలు, పిల్లల చదువులు, ఫీజుల సమస్యలకు తోడు కుటుంబ భారం ... ఏమైతేనేం కష్టం సుఖం కలిసి పంచుకున్న సంసార నావ కులాసాగా సాగుతోంది.

భర్త గోపాలరావుకు తాను టెన్త్‌ఫెయిలైనా చదువంటే చాలా ఇష్టం, గౌరవం. పిల్లలు చదువులతో బాగా స్థిరపడాలని కలలు కనేవాడు. వారికి మంచి చదువు చెప్పించడానికి తాపత్రయ పడేవాడు. పిల్లలు కూడా దానికి తగ్గట్టే ముత్యాల్లా మెరిశారు. కూతురు ఇంజనీరింగ్ ఫస్టియర్‌లో, కొడుకు ఇంటర్‌లో చేరారు. పిల్లల చదువు చూసి రాంబాయ్, గోపాలరావులు మురిసిపోని రోజులేదు.

కాలం ఎప్పుడూ ఒక్కలాగా ఉండదు. పొదరిల్లు లాంటి కాపురంలో కలకలం ... గోపాలరావు గుండె జబ్బుతో హాస్పిటల్‌లో చేరాడు. రాంబాయ్ గుండె చెదిరింది. కలల కాపురం చెదిరింది. గుండె ఆపరేషన్ ఖర్చు భారంతో అమ్మాయి చదువు చెదిరింది. రెండో సంవత్సరం ఇంజనీరింగ్ ఆపేయాల్సి వచ్చింది.

రాంబాయ్ జీవితానికి పెద్ద షాక్ ఇది. విషాదం అలలు ఇంతెత్తున లేస్తాయని రాంబాయ్ ఊహించలేదు.

గోపాలరావు మెడికల్ లీవ్‌తీసుకుని, పైఅధికారుల పర్మిషన్‌తో రాంబాయ్‌ని తనకు బదులుగా అటెండర్ ఉద్యోగానికి పంపించాడు. ఒక భుజం నుంచి మరో భుజం పైకి బాధ్యతలు. మరో మార్గం లేదు. రాంబాయ్ భర్తను కంటికి రెప్పలా చూసుకుంటూ, దుఃఖాన్ని దిగమింగుకుంటూ ఉద్యోగానికి హాజరవుతోంది. కాలం గడుస్తోంది.

పై అధికారులు గోపాలరావును పరామర్శించడానికి వచ్చినప్పుడు అతనికి అంబేద్కర్ యూనివర్సిటీ గురించి చెప్పారు. టెన్త్‌దాకా చదివిన రాంబాయ్‌ని డిగ్రీ చదివిస్తే ఏపీ ట్రాన్స్‌కోలో మరింత మంచి ఉద్యోగానికి ప్రమోషన్ వస్తుందని సూచించారు. అసలే చదువుపై ఆసక్తీ, ఆపై భార్యను మంచి పొజిషన్‌లో చూడవచ్చన్న ఆశా ... గోపాలరావు సరేనన్నాడు. రాంబాయ్‌ని ప్రోత్సహించాడు. తాను వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాక భార్య మంచి ఉద్యోగంలో స్థిరపడాలని, దానికి తగిన క్వాలిఫికేషన్ పెంచుకోవాలని రాంబాయ్‌ను ఎంకరేజ్ చేశాడు. రాంబాయ్ సరేనన్నది. భర్త అనారోగ్యాన్ని, చెదురుతున్న కాపురాన్ని, మనసునిండా ఉన్న విషాదాన్ని పక్కకు పెట్టి అంబేద్కర్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ ఎగ్జామ్‌కు ప్రిపేర్ అయింది. పాసవుతానా లేదా అన్న అనుమానంతోనే పరీక్ష రాసింది. కష్టం ఫలించింది. అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీకి దారి ఏర్పడింది. ఈ ఆనందాన్ని భర్తతో, పిల్లలతో పంచుకున్నది. అందరూ అభినందించారు.

***"ధైర్యాన్ని కూడదీసుకుంటున్న రాంబాయ్ జీవితంలో అత్యంత విషాదకరమైన సంఘటన ... గోపాలరావు ఇక లేరు. మిన్ను విరిగి మీదపడిన భావన. తోడు వీడిపోయింది. కలల కాపురం కరిగిపోయింది. కొడుకు, కూతురు బాధ్యతలు ఇక ఒంటిచేత్తో మోయాలి. దానికి కావల్సిన ధైర్యాన్నీ, పట్టుదలనూ ఇచ్చింది భర్త ఆఖరిమాట 'నేటి ఓటమి ... రేపటి గెలుపు....'"***

ఇక డిగ్రీ చదువు మొదలయ్యింది. ఉద్యోగం, పిల్లల బాధ్యతలు, భర్త ఆలనాపాలనా, భర్త అనారోగ్యంపై బెంగ... వీటిమధ్య డిగ్రీ ఫస్టియర్‌కు ప్రిపరేషన్, ఆదివారం క్లాసులకు అటెండ్ కావడం, రాత్రిళ్ళు చదవడం – చదువుపై శ్రద్ధ కుదిరేది కాదు. ఎన్నో బాధ్యతలు, బాధలు. భర్త ఆరోగ్యం మరింత క్షీణిస్తోంది. ఈ ఘర్షణల మధ్య ఎగ్జామ్స్ సరిగా రాయలేక పోయింది. ఫస్టియర్‌లో ఒక్క సబ్జెక్ట్ మాత్రమే పాసయ్యింది. ఇక తన చదువింతేనని రాంబాయ్ నిరాశ పడిపోయింది. ఇది గమనించిన గోపాలరావు 'నేటి ఓటమి ... రేపటి గెలుపు' అని ధైర్యాన్ని ఇచ్చాడు. ధైర్యాన్ని కూడదీసుకుంటున్న రాంబాయ్ జీవితంలో అత్యంత విషాదకరమైన సంఘటన ... గోపాలరావు ఇక లేరు. మిన్ను విరిగి మీదపడిన భావన. తోడు వీడిపోయింది. కలల కాపురం కరిగిపోయింది. కొడుకు, కూతురు బాధ్యతలు ఇక ఒంటిచేత్తో మోయాలి. దానికి కావల్సిన ధైర్యాన్నీ, పట్టుదలనూ ఇచ్చింది భర్త ఆఖరిమాట **'నేటి ఓటమి ... రేపటి గెలుపు....'**

రాంబాయ్ నడుం బిగించింది. భర్త కలలను నిజం చేయాలనుకుంది. తాను మంచి పొజిషన్‌లోకి రావాలి. భర్త ఊహించినట్టు పిల్లలు బాగా స్థిరపడేట్టు చేయాలి. ఆమె సంకల్పానికి పిల్లలు, సహోద్యోగులు, పై అధికారులు, అంబేద్కర్ యూనివర్సిటీ కౌన్సెలర్లు, లెక్చరర్లు అంతా సహకరించారు. రాంబాయ్ సొంతంగా నోట్స్ తయారుచేసుకుని మరీ చదివింది. కష్టం, భర్త ఆశీస్సులు ఫలించాయి. రాంబాయ్ చేతికి డిగ్రీ పట్టా వచ్చింది – **రాంబాయ్ జీవితంలో రెండో విజయం ఇది.**

డిగ్రీ పట్టా చూసిన ఆమెకు భర్త గుర్తుకు వచ్చి దుఃఖం కట్టలు తెంచుకుంది. ఆయన బతికి ఉంటే ఎంత ఆనందించేవారో... డిగ్రీ సంపాదించిన ఆనందాన్ని ఆఫీసులో పంచుకుంది. పై అధికారులు డిపార్ట్‌మెంట్ పరీక్ష రాస్తే ప్రమోషన్ వస్తుందని చెప్పారు. ఆ ఘడియ రానే వచ్చింది. డిపార్ట్‌మెంట్ పరీక్షలొచ్చాయి. పై అధికారుల సూచనలతో ఆ పరీక్షలు రాసింది. అంబేద్కర్ యూనివర్సిటీ ఇచ్చిన విద్య ఎంతో ఉపయోగపడింది. ఇంకేం – ఫలితం ఆమె పక్షాన వచ్చింది. తనను తానే నమ్మలేకపోయింది. అయినా అది నిజం. రాంబాయ్‌కి లోయర్ డివిజన్ క్లర్క్ (ఎల్‌డీసీ)గా ప్రమోషన్ వచ్చింది.

**రాంబాయ్ జీవితంలో మరో విజయం**

రాంబాయ్ ఈ తీపి వార్తతో అంబేద్కర్ స్టడీ సెంటర్‌కు వెళ్ళి అక్కడి లెక్చరర్లతో ఆనందాన్ని పంచుకుంది. స్వీట్లు పంచి కృతజ్ఞతలు చెప్పుకుంది. వారి అభినందనలు అందుకుంది. అందరి అభినందనలు, ఆదరాభిమానాల మధ్య ఎల్‌డీసీగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తోంది. మళ్ళీ డిపార్ట్‌మెంట్ పరీక్షలొచ్చాయి. ఈసారి ఆత్మవిశ్వాసంతో రాసింది. విజయం సాధించింది. మళ్ళీ ప్రమోషన్, మరోసారి అభినందనల వెల్లువ.

రాంబాయ్, బీఏ ఇప్పుడు అప్పర్ డివిజన్ క్లర్క్ (యూడీసీ) ... **ఇది ఆమె ఖాతాలో మరో విజయం.**

భర్త కోరుకున్నట్టే మంచి పొజిషన్‌కు చేరుకుంది. ఆనందం పంచుకొనడానికి ఆయన లేరు, అదొక్కటే మనసును కోసే ఆలోచన.

కూతురుకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌తో పెళ్ళి జరిపించింది. ఇప్పుడు వారిద్దరూ దక్షిణాఫ్రికాలో స్థిరపడ్డారు.

రాంబాయ్ తన విజయం వెనుక అంబేద్కర్ యూనివర్సిటీ సాయం ఉందని కృతజ్ఞతగా చెబుతోంది. ఇప్పుడామె పీజీ చేసే ప్రయత్నంలో ఉంది. 'నేటి ఓటమే... రేపటి గెలుపు' అన్న భర్తమాట గుర్తుకు రాగానే చెమర్చే కళ్ళతో ఇలా చెబుతోంది.

'సమాజానికి విద్యకావాలి. ముఖ్యంగా స్త్రీకి. చదువు సాయంతో మహిళ ఎన్ని లక్ష్యాలనైనా జయిస్తుంది. ఎన్ని సమస్యలనైనా అధిగమిస్తుంది. అందుకే స్త్రీకి చదువు కావాలి.'

* * *

*'సమాజానికి విద్యకావాలి. ముఖ్యంగా స్త్రీకి. చదువు సాయంతో మహిళ ఎన్ని లక్ష్యాలనైనా జయిస్తుంది. ఎన్ని సమస్యలనైనా అధిగమిస్తుంది. అందుకే స్త్రీకి చదువు కావాలి.'*

మనిషిలో ఎన్నైనా
సుగుణాలు ఉండవచ్చు,
కాని విజ్ఞత, వివేకాలు
ఉపయోగపడినంతగా
మరేవీ ఉపయోగపడవు.

**- ఎడిసన్**



మధు

## అంబేద్కర్ బడి నుంచి మీడియా ఒడిలోకి..

# మధు

ఇంగ్లీషు మీడియం చదువు మధుకు అవమానాన్ని మిగిల్చింది. శాస్త్రాలు, పురాణాలు పుక్కిట పట్టిన అష్టావధాని, తెలుగు లెక్చరర్ కొడుకు ఇంటర్ ఫెయిలయ్యాడు. 'పండిత పుత్రుడు...' అనిపించుకున్నాడన్న ఎగతాళి అతన్ని దహించి వేసింది. తోటి వారు కెరీర్‌లో చకచకా ఎదుగుతున్న తీరు, తనతో పనిచేస్తున్న వారి విద్యార్హతలు, తనలో చదువులేమి అతనికి న్యూనతను పెంచింది. చదువు మార్గం వదిలేసి ఎంచుకున్న ముద్రణా రంగం నష్టాలు తెచ్చిపెట్టింది. ఆత్మహత్యా ప్రయత్నానికి పురిగొల్పింది. ఇన్ని చేదు అనుభవాల్లోంచి, అవమానాల్లోంచి బయటపడిన ఆయన ఇప్పుడు లబ్దప్రతిష్టుడైన జర్నలిస్ట్. అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ డిగ్రీ సాయంతో మళ్ళీ చదువుల ఒడికి చేరారు. బీసీజే, ఎంసీజే, పీజీ ... గోల్డ్ మెడల్ – తాను ఏమి సాధించినా అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో వేసిన మొదటి అడుగే కారణం అంటారాయన. 'ఈనాడు' కంట్రిబ్యూటర్ నుంచి ధాత్రి కమ్యూనికేషన్ సీఈఓ దాకా ఎదిగిన ఆయన ప్రతి అడుగులోనూ విద్యార్హత అవసరం ఏమిటో తెలిసిందంటారు. అంబేద్కర్ యూనివర్సిటీ తనకు విద్యార్హతలే కాదు, అనేక జీవితానుభవాల్ని దగ్గర చేసిందంటున్న మధుసూదన్ అక్షర యానం ఇదీ ...

### 'తెలుగు' సంస్కృతిలో ...

**మా**ది అనంతపురం జిల్లాలోని లేపాక్షి అనే గ్రామం. చిన్న ఊరేకానీ కృష్ణదేవరాయల సామ్రాజ్యపు స్మృతులు సజీవంగానే ఉన్నాయక్కడ. ఇక నాన్న తెలుగు లెక్చరర్, అష్టావధాని, పౌరోహిత్యం చేసేవారు. తెలుగుభాష, సంస్కృతి సంప్రదాయాలు, చారిత్రక చిహ్నాలమధ్య పెరిగాను. అట్లా పెరిగిన నాకు ... ఇంగ్లీషు మాధ్యమం నా జీవితాన్ని ఎలా మార్చేసిందో, ఫెయిల్యూర్స్‌కూ, సక్సెస్‌కూ దారితీసిందో చెబుతాను. ఎలిమెంటరీ స్కూలు, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కూడా చదువు బాగానే సాగింది. టాప్ ఫైవ్‌లో ఉండేవాడిని. కనుక చదువు ఇబ్బంది అని గానీ, వెనుకబడి ఉన్నాం అని గానీ ఎప్పుడూ అనిపించ లేదు. లెక్చరర్ కొడుకుగా గుర్తింపు. బాగా చదువుతాడని, సిన్సియర్‌గా ఉంటాడని పేరు. నాన్న తెలుగు లెక్చరర్ కనుక సహజంగానే నాకు తెలుగుపై అమితమైన ఆసక్తి. ప్రాణం అనవచ్చు. హిందీ, ఇంగ్లీషుకున్న వాల్యూ ఇంకా అప్పటికి తెల్సిరాలేదు. నాన్న కూడా వాటిని ఎంకరేజ్ చేయలేదు. తెలుగు, సంస్కృతం, పురాణాలు. అవధానాలు... అంతవరకే.

### 'ఇంగ్లీషు' మాధ్యమంలోకి...

లేపాక్షిలో టెన్త్ అయిపోయాక హిందూపూర్‌లో ఇంటర్ చదివాను. ఇంటర్‌లో చేరేటప్పుడు మా బంధువుల మధ్య చర్చ ... ఏం చదివితే బావుంటుందీ అని. టెన్త్ ఫస్ట్ క్లాస్. ఇంటర్‌లో ఏం గ్రూపు తీసుకోవాలి అన్న చర్చ వస్తే ... బైపీసీ తీసుకుని మెడిసిన్ చదవాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఇంటర్‌లో ఇంగ్లీషు మీడియం తీసుకున్నాను. అది ఇబ్బంది అవుతుందనే ఆలోచన నాకు గానీ, నాన్న గారికి గానీ లేదు. స్నేహితులు ఇంగ్లీషు మీడియం కష్టం అని హెచ్చరించారు కానీ, దాన్ని అంతగా పట్టించుకోలేదు. క్లాసులు ప్రారంభమయ్యాక వారం రోజుల్లోనే తెల్సింది. పాఠాలేమీ తలకు ఎక్కడంలేదు. అప్పటిదాకా తెలివైనవాణ్ణి అనిపించుకుని ... టాప్‌ఫైవ్‌లో ఉంటూ వచ్చిన, నాకు ఆ పరిస్థితి మింగుడు పడలేదు. పాఠాలేవీ అర్థం కావడంలేదు. ఇంగ్లీషు మీడియం అడ్డుపడుతోంది. నెల రోజుల్లో అలవాటవుతుంది అనుకున్నాను. కానీ సాధ్యం కాలేదు. అలా ఫస్టియర్ అయిపోయింది. కెమిస్ట్రీ ఫెయిల్. సప్లిమెంటరీ పరీక్ష రాశాను. మళ్ళీ ఫెయిల్. నా జీవితంలో మొదటి వైఫల్యం. చదువులో ఫెయిలవుతానని నేను కానీ, నా చుట్టూ ఉండేవారు కానీ ఊహించలేదు.

సెకండియర్‌లో రెండు పేపర్లు ఫెయిల్. ఫస్టియర్ సబ్జెక్ట్ ఇంకా పూర్తి కానేలేదు. ఫస్టియర్‌లో ఫెయిలైనప్పుడే ఇక చదువుకు దూరం అయ్యాను అనిపించింది. ఈ చదువు నాది కాదనే భావన కలిగింది. ఇంట్లో కూడా అదే అభిప్రాయానికి వచ్చారు. ఇంగ్లీషు మీడియంవల్ల సమస్య వచ్చిందని అమ్మా నాన్న గమనించలేదు. మీడియం మారాలన్న ఆలోచన నాకు రాలేదు. ఏదైతేనేం చదువుకు దూరం అయ్యాను. అట్లా ఇంగ్లీషు మీడియం నా ఫెయిల్యూర్‌కు కారణం అయింది. లెక్చరర్ కొడుకు ఫెయిల్ కావడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. నన్ను శూన్యంలోకి నెట్టివేసింది.

## ప్రింటింగ్ టెక్నాలజీ...

నా ఇబ్బందిని గమనించి నాన్న, చిన్నాన్న చదువు విషయంలో నాపై ఒత్తిడి చేయగూడదని, మరో దారి ఆలోచించాలన్న నిర్ణయానికి వచ్చారు. నాన్నకు పుస్తకాలు రాయడం, అచ్చువేయించడం అలవాటు. దాంతో ఇంటర్ ఫెయిలయ్యాక విజయవాడకు పంపించి ప్రింటింగ్ టెక్నాలజీ డిప్లొమా చేయించారు. అప్పటికే నేను ఇంటర్‌తో నాకు సంబంధం లేదనుకున్నాను. ప్రింటింగ్ రంగంలో వ్యాపారం చేయాలన్న ఆలోచన వచ్చింది. డిప్లొమా అయిపోగానే హిందూపురంలో శ్రీవాణి ప్రింటర్స్ పేరిట ప్రెస్ ప్రారంభించాను. దాదాపు మూడేళ్ళు నడిపాను. అప్పటికే ఆఫ్‌సెట్ ప్రింటింగ్ వస్తోంది. నేను ప్రారంభించింది లెటర్ ప్రెస్. వ్యాపారం సరిగా నడవలేదు. అది మూసేయడానికి నాన్న ఒప్పుకునే వారు కాదు. దాదాపు లక్ష రూపాయలు పెట్టి ప్రెస్ ప్రారంభించాం. ప్రతినెలా నష్టాలు వచ్చేవి. ఒకసారి ప్రెస్ వర్కర్లకు జీతాలు ఇవ్వడానికి డబ్బులు తక్కువైతే వాచీకూడా తాకట్టు పెట్టాను. ఇక వ్యాపారం అదుపు తప్పుతున్నదని అర్థం అయింది. అప్పుడు కాలువ శ్రీనివాస్... ఈనాడు రిపోర్టర్‌గా పనిచేసేవారు. తర్వాత ఎమ్మెల్యే అయ్యారు. ఆయన నా ప్రెస్‌కు వచ్చి అచ్చు పనులు చేయించుకునేవారు. మా ఇద్దరి మధ్య పరిచయం బాగా పెరిగింది. ఆయన ధైర్యాన్నిచ్చేవారు. అప్పుడప్పుడు ఆర్థిక సాయం కూడా చేశారు. మొత్తం మీద రిపోర్టర్లకు నా ప్రెస్ కేరాఫ్ అడ్రస్ అయింది. అన్ని పేపర్ల రిపోర్టర్లు వచ్చేవారు ... నేను కూడా లేపాక్షి కంట్రిబ్యూటర్‌గా ఈనాడులో చేరాను. ఆ తర్వాత నష్టాలతో ప్రెస్ నడపడం సాధ్యం కాలేదు. ప్రెస్ అమ్మేశాను. అది రెండో ఫెయిల్యూర్.

## ఆత్మహత్యాయత్నం

ఆర్థిక స్థితి టూ వీలర్ నుంచి సైకిల్ దాకా వచ్చింది. మా సర్కిల్ నుంచి దూరం కావడం, సమాజం నుంచి వెలేసినట్టు కావడం... చదువు రాదు, దేనికీ పనికిరాడు, తెగిన గాలిపటం, ఎటుపోతాడో తెలియదు – ఇలాంటి పరిస్థితి. మిగతా వారికి, నాకు తేడా స్పష్టంగా తెలుస్తోంది. ఇవన్నీ నన్ను ఆత్మ హత్యా యత్నానికి పురికొల్పాయి.

ప్రింటింగ్ ప్రెస్‌ను అమ్మేయాలని అనుకున్నప్పుడు... ప్రెస్ అమ్మితే వచ్చే నష్టాన్ని మదనపల్లెలో వర్కర్‌గా చేరి పూరించాలనుకున్నా. మదనపల్లిలోని ప్రింటింగ్ ప్రెస్‌లో మాట్లాడుకున్నా. ఇంట్లో చెప్పకుండా వెళ్దామనుకున్నా. మళ్ళీ ఇంట్లోవాళ్ళు పట్టేసుకుంటారేమోనని మానేశా. చదువు లేదు. చదువు రావట్లేదు. చేస్తున్న ప్రింటింగ్ వ్యాపారం సరిగ్గా నడపలేకపోతున్నా. బంధువుల్లో నా తోటి వారందరూ బాగా చదువుకుంటున్నారు. డిగ్రీలు, పీజీలు... ఒక వరుసక్రమంలో కెరీర్ ఒక క్రమంలో నడుస్తోంది. నేను ఇంటర్‌లోనే ఆగిపోయాను. ఈ న్యూనత మనసును కమ్మేస్తోంది. ప్రింటింగ్ వ్యాపారం కొనసాగించే శక్తి, అవకాశం లేకుండా పోతోంది. చాలా దుర్భరమైన పరిస్థితి. ప్రెస్ అమ్ముతామంటే నాన్న ఒప్పుకోవడం లేదు. మా ఇద్దరి మధ్య గ్యాప్ వస్తోంది. ఆత్మహత్య పైకి మనసు మరలింది. అమ్మకు లెటర్ రాసి పెట్టి ... గార్డినల్ మాత్రలు జేబులో వేసుకున్నాను. ఆ రాత్రి ప్రెస్ మూసేసి వస్తోంటే ఫ్యామిలీ ఫ్రెండ్ సంపత్ కనిపించాడు. అతనికి నా పరిస్థితి అంతా తెల్సు. చదువు సమస్య, ప్రింటింగ్

> **“ఆ రాత్రి ప్రెస్ మూసేసి వస్తోంటే ఫ్యామిలీ ఫ్రెండ్ సంపత్ కనిపించాడు. అతనికి నా పరిస్థితి అంతా తెల్సు. చదువు సమస్య, ప్రింటింగ్ నష్టాలు అన్నీ గమనిస్తూనే ఉన్నాడు. ఇద్దరం వచ్చి 'ఎదురీత' సినిమాకు పోయాం. ఆ సినిమాలో హీరో పేరు కూడా 'మధు'యే. “ఎదురీతకు అంతం లేదా ..” అన్న పాట వస్తోంది. ఇక దుఃఖం ఆగలేదు. ఒక్కసారిగా ఏడుపు ఎగదన్నుకు వచ్చింది. ఇది చూసి సంపత్... ఎందుకేడుస్తావ్, నష్టాలు ఎవరికైనా వస్తాయి అంటూ ఓదార్చాడు.”**

నష్టాలు అన్నీ గమనిస్తూనే ఉన్నాడు. ఇద్దరం వచ్చి 'ఎదురీత' సినిమాకు పోయాం. ఆ సినిమాలో హీరో పేరు కూడా 'మధు'యే. "ఎదురీతకు అంతం లేదా .." అన్న పాట వస్తోంది. ఇక దుఃఖం ఆగలేదు. ఒక్కసారిగా ఏడుపు ఎగదన్నుకు వచ్చింది. ఇది చూసి సంపత్... ఎందుకేడుస్తావ్, నష్టాలు ఎవరికైనా వస్తాయి అంటూ ఓదార్చాడు. ఆ తర్వాత మాటల్లో నేను ఆత్మహత్యా ప్రయత్నం చేయబోతున్నానని గమనించాడు. జేబులో మాత్రలు లాగేసుకున్నాడు. ఇంటికి వెళ్ళి లెటర్ తెచ్చేయమన్నాడు. అట్లా ఆత్మహత్య ప్రయత్నం నుంచి బయటపడ్డాను.

## అంబేద్కర్ వర్సిటీ ప్రకటన

ప్రెస్ మూతపడినా లేపాక్షి మండలం ఈనాడు విలేఖరిగా నెలకు ఎంతో కొంత డబ్బులు చేతిలో పడేవి. పైగా వార్తలు సేకరించడం, రాజకీయ పార్టీల సమావేశాలకు వెళ్ళడం, కవరేజ్, కొత్తరంగం, కాసింత ఉత్సాహం. తర్వాత హిందూపూర్‌కు ప్రమోట్ చేశారు. అక్కడికొచ్చాక తేడా తెల్సింది. రెండు పీజీలు చేసినాయన ఉదయం రిపోర్టర్. ఒక పీజీ చేసి హిందీ, ఇంగ్లీషు, కన్నడ మాట్లాడుతున్నాయన ఆంధ్రప్రభ రిపోర్టర్. ఆంధ్రజ్యోతి రిపోర్టర్ డిగ్రీ చేశారు. చదువుకున్న వాళ్ళుగా వీరికి పేరుండేది. నాకు చెంచు సుబ్బయ్యశర్మ కొడుకుగానే గుర్తింపు తప్ప ... ఇంకేం లేదు. చదువుకు సంబంధించి వారికీ నాకూ బాగా తేడా ఫీలయ్యాను. నేను ఇంటర్ ఫెయిల్... ఎలాగైనా డిగ్రీ చేయాలన్న కోరిక తారస్థాయికి చేరింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ యూనివర్సిటీ (అంబేద్కర్ యూనివర్సిటీ అప్పటి పేరు) డిగ్రీ ప్రవేశ పరీక్ష ప్రకటన పత్రికలో చూశాను. వెతకబోయిన తీగ కాలికి తగిలినట్టు, ఆ ప్రకటన నా కోసమే వేసినట్టు అనిపించింది. ప్రవేశ పరీక్ష రాశాను. రాసిన రోజే అనుకున్నాను ... పాసవుతానని. ఎందుకంటే ఇంటర్లో నన్ను అడ్డుకున్న ఇంగ్లీషు లాంటి సబ్జెక్టులేమీ లేవు. అన్ని నాకు తెల్సినవే... తెలుగు, జనరల్ నాలెడ్జ్. అలా డిగ్రీలోకి ఎంటరయ్యాను. పరీక్ష ఫలితాలు పేపర్లో చూసుకున్నప్పుడు కలిగిన ఆనందం ఇప్పటికీ గుర్తుంది. ప్రతి ఆదివారం కౌన్సెలింగ్ క్లాసులకు వెళ్ళడం, పోస్టులో పుస్తకాలు అందుకోవడం, సీరియస్‌గా నోట్సు రాసుకోవడం... మళ్ళీ చదువుల ఒడిలోకి చేరినట్టు అనిపించింది. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు లిటరేచర్... ఏదీ కష్టంగా తోచలేదు. చదువు కదలడం మొదలయ్యింది. డిగ్రీ పూర్తయ్యింది. తెలుగు నాకెంత బాగా వచ్చునంటే... ఒక్కోసారి కౌన్సెలర్ రాకపోతే నేనే తెలుగు క్లాసులు తీసుకునే వాణ్ణి.

## పీజీ లక్ష్యం ...

ఈనాడు జర్నలిజం స్కూలు ప్రవేశ పరీక్ష రాసి సెలక్టయ్యాను. అప్పటికి నేను డిగ్రీ పూర్తి చేయలేదు. సెలక్టయిన వారిలో ఇద్దరికే డిగ్రీ లేదు. అందులో నేను ఒకణ్ణి. మా బ్యాచ్‌లో పీజీలు, డాక్టరేట్లు చేసినవారు, క్యాంపస్‌లో జర్నలిజం కోర్సులు చేస్తున్నవారు ఉన్నారు. వారితో పోలిస్తే అదే చదువుల తేడా. అగాధంలా కనిపిస్తోంది. వారందరినీ చూస్తే అప్పటిదాకా 'డిగ్రీ' ఉంటే చాలు అనుకున్న నాకు పీజీ కూడా ఉండాలని అనిపించింది. అంటే లక్ష్యం మారింది. అప్పటిదాకా విలేఖరిగా హిందూపురంలో పని చేసినప్పుడు చాలా మంచి ఆర్టికల్స్, వార్తలు రాసేవాణ్ణి. నాకు 'విద్యార్హత'

మనలో అపారమైన శక్తి,
క్రియాశీలత ఉంటే మనం
పురోగమించడమే కాక
ఇతరులను కూడా
ముందుకు
నడిపించగలుగుతాం.
- జవహర్‌లాల్ నెహ్రూ

లేకపోవడం వల్ల అవి నేను రాసినవిగా ఒప్పుకునేవారు కాదు. డెస్క్‌లో ఎవరో తిరగరాసి ఉంటారని భావించేవారు. ఇలాంటి సంఘటనలన్నీ బాగా చదవాలన్న కోరికను మరింత పెంచాయి. అప్పుడు నా ముందు ఉన్న లక్ష్యం పీజీ, తెలుగులో పిహెచ్‌డీ చేయాలనీ. అదే పట్టుదలతో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో తెలుగులో ఎంఏ, ఉస్మానియాలో బీసీజే, తెలుగు యూనివర్సిటీలో ఎంసీజే, సంస్కృతం, హిందీ సర్టిఫికెట్ కోర్సులు, చదువు ప్రయాణం కొన సాగింది. దానికి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీయే మూలకారణం. ఎంతగా చదువులో పడిపోయానంటే ఇకదాన్ని వదలలేదు. ఇంకా చెప్పాలంటే భవిష్యత్తులో కూడా వదిలే ప్రసక్తే లేదు. మళ్ళీ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి సైన్స్ డిగ్రీ చేయాలి. మెడల్ తీసుకోవాలి. ఇదే నా జీవిత లక్ష్యం. ఒక స్థాయిదాకా చదువు, విద్యార్హత ఎంత అవసరమో నాకు అనుభవం ద్వారా తెల్సింది. అంబేద్కర్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్ష ప్రకటన నా అవసరాన్ని తీర్చింది.

**అదుపు తప్పి నా నుంచి దూరమైన చదువును మళ్ళీ నా నియంత్రణలోకి తెచ్చుకున్నాను... అదీ అంబేద్కర్ యూనివర్సిటీ సాయంతో. ఒకసారి అదుపులోకి వచ్చాక తిరుగులేకుండా పోయింది. ఇప్పుడెవ్వరూ అనలేరు, అంబేద్కర్ వర్సిటీ డిగ్రీ వాల్యూ లేనిదీ అని.**

## చదువుల బడిలోకి...

నిజానికి మా సర్కిల్‌లో కూడా అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ డిగ్రీ అంటే గౌరవం ఉండేదికాదు. దానికప్పుడు చివరి స్థానమే. రెగ్యులర్ డిగ్రీకీ దానికీ తేడా ఉంటుందనే అభిప్రాయం ఉండేది. నేను ఉద్యోగం... అదీ నైట్ షిఫ్టులలో పని చేస్తూ చదివేవాణ్ణి. దానికి విలువ లేదంటారేం అన్న బాధ ఉండేది. ఆ సర్టి ఫికెట్‌లో ఉద్యోగం సంపాదించాలన్న ఉద్దేశం ఏమీలేదు కానీ, నా జీవితంలో వెలితిని, నా సర్కిల్‌లో వస్తున్న ఎగతాళిని తట్టుకోవడానికి డిగ్రీ చేశాను. అది వేసిన పునాది ఏమిటో తెలుగులో పీజీ ఫలితాలు నిరూపించాయి. అందరికంటే ఎక్కువ మార్కులు వచ్చాయి. అలాగే ఉస్మానియా బీసీజే ప్రవేశ పరీక్షలో టాప్‌టెన్‌లో నేను ఒకణ్ణి. అలాగే తెలుగు యూనివర్సిటీ ఎంసీజే ప్రవేశ పరీక్షలో ఫస్ట్ ర్యాంక్ నాదే. అదుపు తప్పి నా నుంచి దూరమైన చదువును మళ్ళీ నా నియంత్రణలోకి తెచ్చుకున్నాను... అదీ అంబేద్కర్ యూనివర్సిటీ సాయంతో. ఒకసారి అదుపులోకి వచ్చాక తిరుగులేకుండా పోయింది. ఇప్పుడెవ్వరూ అనలేరు, అంబేద్కర్ వర్సిటీ డిగ్రీ వాల్యూ లేనిదీ అని. నేను డిగ్రీ కూడా రెగ్యులర్ స్టూడెంట్ ఎలా చదువుతాడో... అలాగే కష్టపడి సిన్సియర్‌గా చదివి పాసయ్యా.

## ఫెయిల్యూర్, సక్సెస్...

ఉద్యోగం చేస్తూనే... రెగ్యులర్‌గా చదివే వాళ్ళు ఎలా మార్కులు తెచ్చు కున్నారో అలాగే మార్కులు తెచ్చుకున్నా. చదువుతో పాటు వారందరికీ లేని ఉద్యోగానుభవం నాకు మిగిలింది. డిగ్రీలు, పీజీలు పాసయ్యాక తెలుస్తోంది. చదువు విషయాల్లో గానీ, సమర్థత విషయంలో గానీ నేనేం తక్కువగా లేనని. నన్ను ఇంటర్‌లో ఆపింది, రెగ్యులర్ స్టూడెంట్‌గా చదవకుండా చేసింది... ఇంగ్లీషు మాధ్యమమే. తెలుగులో ఇంటర్‌చేసి ఉంటే సంప్రదాయక చదువులతో తెలుగు లెక్చరర్‌గా స్థిరపడి వుండే వాణ్ణేమో. ఇంగ్లీషు మీడియం తీసుకుని ఇంటర్ ఫెయిలవడం వద్దే నా సక్సెస్ స్టార్టింగ్ పాయింట్ ఉందనిపిస్తోంది. నా కెరీర్‌లో మార్పునకు, అభివృద్ధికి, సర్కిల్ పెరగడానికి, సమాజంలో జర్నలిస్ట్‌గా గుర్తింపు పొందడానికి, ఇంట్లో అందరూ నన్ను గౌరవించడానికి, నా స్నేహితులు, చదువుల విషయంలో నన్ను సలహాలడిగే స్థాయికి చేరడానికి, అప్పటి ఇంటర్ ఫెయిల్‌తో పాటు అంబేద్కర్ యూనివర్సిటీలో కాలుమోపడం కూడా కారణమే. అందుకే నేను తెలుగులో పీజీ చేసినా, బీసీజే, ఎంసీజేలు చేసినా, గోల్డ్‌మెడల్ సంపాదించినా... వీటన్నింటికీ అవకాశం ఇచ్చింది అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీయే. ఈనాడు, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, తేజ టీవీ, ల్యాంకో కంపెనీ, తేజ న్యూస్‌లలో వివిధ హోదాల్లో పనిచేయగలిగినా, ఇప్పుడు ధాత్రి కమ్యూనికేషన్స్‌కు సీఈవోగా మీడియా కమ్యూనికేషన్స్ వ్యాపారం లోకి ప్రవేశించినా ... ఆ క్రెడిట్ అంతా అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీకే దక్కుతుంది.

## అనుభవాల సారం...

రెగ్యులర్ స్టూడెంట్‌గా చదవడం కంటే అంబేద్కర్ యూనివర్సిటీ నుంచి

డిగ్రీ చేయడంవల్ల నాకు ఒక కొత్త ప్రపంచం పరిచయం అయింది. వివిధ వయస్సులు, భిన్నమైన జీవితానుభవాలు గల వాళ్ళు నాకు స్నేహితులయ్యారు. వారి నుంచి నేనెంతో నేర్చుకోగలిగాను. డిగ్రీలో 70 ఏళ్ళ వయస్సున్న అశ్వత్థయ్య నా క్లాస్‌మేట్. రెగ్యులర్ డిగ్రీలో ఇది ఊహించలేం. క్లాసుల మధ్య విరామం వచ్చినప్పుడు ఆయన జీవితానుభవాలు, కష్టాలు నాతో పంచుకునేవారు. ఆయన ఎలా కష్టాలు పడిందీ ... తిరిగి కోలుకున్నదీ నాతో చెప్పేవారు. ఆయన సమస్యలతో పోలిస్తే నావి అల్పంగా తోచేవి. నా జీవన పోరాటంలో ఈ పరిచయాలు ఎంతో ఉపయోగపడ్డాయి. ప్రతి మజిలీ మళ్ళీ నన్ను నేను రీచార్జ్ చేసుకోవడానికి సాయపడ్డాయి. సమస్యల్లో ఉన్నామన్న 'సెల్ఫ్ పిటీ' దగ్గరికి రానీయకుండా చేశాయి. ఆయన కష్టాల ముందు నా సమస్యలు సముద్రంలో ఆవగింజంత అనిపించేవి. మెట్లెక్కడానికి కష్టపడే వయస్సులో ఆయన మా పక్కన కూర్చొని చదవడానికి వచ్చాడు. మనలో ఒక పాజిటివ్ దృక్పథాన్ని నింపడానికి అశ్వత్థయ్య లాంటి వ్యక్తుల పరిచయం కంటే ఇంకేం కావాలి. ఇలాంటివి రెగ్యులర్ కాలేజ్‌లో దొరకవు. అందుకే నాకు మళ్ళీ అంబేద్కర్ యూనివర్సిటీ నించే డిగ్రీ చేయాలనుంటుంది.

ఇప్పుడు పని జరిగిన దానిని బట్టి 4-5 లక్షల టాక్స్ కడుతున్నాను. అప్పుడు ఇరవై ముప్పై వేల రూపాయలకు, నానా యాతన పడేవాళ్ళం. ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి. ఇప్పుడది ఆలోచిస్తే సిల్లీగా అనిపిస్తుంది కానీ, అప్పుడదే భారం. ఆ పరిస్థితి నుంచి బయటపడి నాకు నేనుగా నిరూపించుకున్నాక నాన్న ఎంతో ఆనందపడ్డారు. ఇప్పుడు నాన్నకు, ఫ్యామిలీ సర్కిల్‌లో నేనంటే ఎంతో గురి. వారికేదైనా సమస్య వస్తే నన్నే సంప్రదిస్తారు. నేను చెప్పిన దాన్ని అనుసరిస్తారు. వీటన్నిటితోపాటు నా జీవితంలో అడ్డుపడిన ఇంగ్లీషును జయించగలిగాను. ఇంగ్లీషు వార్తలు తెలుగులోకి అలవోకగా రాయగలిగాను. ఇప్పుడు నా కమ్యూనికేషన్ అంతా ఇంగ్లీషులోనే.

> తెలివిగలవారు ఎప్పుడూ కూడా ఇతరుల వైఫల్యం చెందిన చోట నుంచి విజయాన్ని సాధించడం ప్రారంభిస్తారు.
>
> **– ఎల్‌స్టోన్**

* * *

***నన్ను ఇంటర్‌లో ఆపింది, రెగ్యులర్ స్టూడెంట్‌గా చదవకుండా చేసింది... ఇంగ్లీషు మాధ్యమమే. తెలుగులో ఇంటర్‌చేసి ఉంటే సంప్రదాయక చదువులతో తెలుగు లెక్చరర్‌గా స్థిరపడి వుండే వాణ్ణేమో. ఇంగ్లీషు మీడియం తీసుకుని ఇంటర్ ఫెయిలవడం వద్దే నా సక్సెస్ స్టార్టింగ్ పాయింట్ ఉందనిపిస్తోంది. నా కెరీర్‌లో మార్పునకు, అభివృద్ధికి, సర్కిల్ పెరగడానికి, సమాజంలో జర్నలిస్ట్‌గా గుర్తింపు పొందడానికి, ఇంట్లో అందరూ నన్ను గౌరవించడానికి, నా స్నేహితులు, చదువుల విషయంలో నన్ను సలహాలడిగే స్థాయికి చేరడానికి, అప్పటి ఇంటర్ ఫెయిల్‌తో పాటు అంబేద్కర్ యూనివర్సిటీలో కాలుమోపడం కూడా కారణమే.***



అనిల్‌జ్యోతి

# కష్టాల సుడిలోంచి
# ఖండాంతర ఖ్యాతి

# అనిల్ జ్యోతి

నిప్పుల మీద నడిచే సాహసం ఆమెది. వంచించిన విధిని మెడలు వంచి నిలువరించిన ధీరత్వం ఆమెది. అంతా తలరాతని సగటు ఆడపిల్లలా సర్దుకు పోకుండా తన రాతను తానే సవరించుకోవాలన్న తపన ఆమెది. చీకటి పాలైన బతుకుని చూసి చితికిపోకుండా ఆశను విస్తరించి, ఆంక్షల నధిగమించి ఒంటిచేతితో బతుకు బండిని వెన్నెల లోకాల్లోకి లాక్కెళ్ళిన ఆమెలో అలుపెరుగని ఆత్మవిశ్వాసం ఉంది. ఆ విశ్వాసం తనకు డా. బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఇచ్చిందంటోంది జ్యోతి.

అమెరికాలోని ఆరిజోనాలో 'కీ' సొల్యూషన్స్ అధినేతగా ఉన్న జ్యోతిది వరంగల్ జిల్లా. తండ్రి గౌరవ ప్రదమైన స్కూల్ టీచర్. 1975 నాటి ఎమర్జెన్సీ ఆ కుటుంబంలో చీకటి నింపింది. 'తల్లిలేని అనాథనని' అబద్ధం చెప్పి హాస్టల్లో చేరిన తొమ్మిదేళ్ళ పసితనం నుంచి ఆమెకు చదువంటే చచ్చేంత ప్రేమ. కానీ ఆ ఆశలన్నిటినీ మూడు ముళ్ళ బంధానికి ముడివేయవలసి వచ్చింది. పదహారేళ్ళకే పెళ్ళయి పల్లెలో ఉండే అత్తవారింటికి పయనమైన జ్యోతి ఆ పల్లె దాటి, ఇల్లు దాటి, జిల్లా దాటి, ఒంటరిగా ఈ దేశపు ఎల్లలు దాటింది. అమెరికా వెళ్ళేదాకా అష్టకష్టాలు పడింది. అక్కడా కోటి బాధలు భరించింది. తన కలను సాక్షాత్కరింపజేసుకునే దాకా కంటి మీద కునుకైనా ఎరుగని జ్యోతి ఇవాళ తన భర్తకూ, పిల్లలకూ ఒక గౌరవ ప్రదమైన భవిష్యత్తుకు బాటలు వేసింది. ఆమె సాగించిన మహాప్రస్థానాన్ని, ఆమె జీవితంలో అంబేద్కర్ యూనివర్సిటీకున్న స్థానాన్ని ఆమె మాటల్లోనే విందాం రండి ...

**అం**బేద్కర్ యూనివర్సిటీ నాకేమిచ్చిందో తెలుసుకోవాలంటే నేను ఎక్కడి నుంచి జీవితం మొదలుపెట్టానో తెలియాలి. విధి నన్నెక్కడికి చేర్చిందో చెప్పాలి. నన్ను నేను ఎక్కడికి చేర్చుకోగలిగానో చెప్పాలి. స్త్రీ చుట్టూ ముసురుకునే చీకట్లనూ చూపాలి. కాలం చేసే పరిహాసాన్ని వినాలి. నవ్వుకుంటూ వీటిని నేను దాటిన విధానం చూడాలి.

## అమ్మ లేదని చెప్పి హాస్టల్‌లో

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందట. అమ్మాయి పుట్టగానే సమస్యలు ఇంకా గుబాళిస్తాయి. నేను వరంగల్ జిల్లా నర్సింహులగూడెంలో పుట్టాను. మా అమ్మా నాన్నలకు మేం ఐదుగురం. నాన్న టీచర్. మాది పేద కుటుంబం. ఆర్థిక సమస్యలకు తోడుగా 1975, ఎమర్జెన్సీ సమయంలో నాన్న ఉద్యోగం పోయింది. చెప్పాగా ... సమస్యల గుబాళింపు మొదలయ్యింది. నాన్న నిరుద్యోగం. ఆపై కుటుంబ భారం. నన్ను ఎక్కడైనా హాస్టల్‌లో చేరిస్తే బావుంటుందని నాన్న ఆలోచన. కాని మాది రెడ్డి ఫ్యామిలీ. అగ్రకులం. హాస్టల్‌లో చేరే అవకాశం లేదు. బీసీ హాస్టల్‌లో నాన్న ప్రయత్నం చేశాడు కానీ లాభం లేకపోయింది. అప్పటికి నా వయస్సు తొమ్మిది సంవత్సరాలు.

అయినా నాకు కుటుంబ పరిస్థితి అర్థం అవుతోంది. నాన్న తిరిగి తిరిగి విసుగు చెందాడు. హన్మకొండలో 'బాలసదనం' అనే హాస్టల్ ఉందని నాన్న స్నేహితుడి ద్వారా తెలిసింది. కానీ అక్కడ బీసీ, ఎస్సీ పిల్లలకు, అమ్మా, నాన్న లేనివారికి మాత్రమే ప్రవేశం. ఇక్కడ జీవితం విషాదకరమైన మలుపు తిరిగింది. జీవితం బెత్తంతో కొట్టి పాఠాలు నేర్పుతుందంటారు. అది నా జీవితంలో మొదటి దెబ్బ. అప్పటికే విసిగిపోయిన నాన్న నాకు 'అమ్మ లేదని' చెప్పి బాలసదనంలో చేర్పించాడు. నేను 'అమ్మలేని దానిలా' హాస్టల్‌లో చేరుతోంటే నా మీద నాకే జాలి, అసహ్యం, కసి, ద్వేషం, కోపం. పసి మనసును మెత్తగా కోసేసిన సంఘటన అది ... గుండె వక్కలైంది.

## హాస్టల్ లైఫ్

ఫిఫ్త్ నుంచి టెన్త్ దాకా హాస్టల్‌లో ఉండి చదువుకున్నాను. అమ్మ రావడానికి లేదు. నాన్న మాత్రమే వచ్చేవారు. ఆయన వస్తూ వస్తూ అమ్మ జ్ఞాపకాలు మోసుకొచ్చేవాడు. అమ్మ ఒడిలో ఉండాల్సిన నేను అమ్మ లేకుండా ... కన్నీళ్ళతో ... అయితే హాస్టల్ జీవితం నాకు స్నేహితులను ఇచ్చింది. ఒంటరితనాన్ని దూరం చేసింది. బాధలు, కష్టాలు, పేదరికం మధ్య వెన్నెలలా వెలిగేది స్నేహమే. ఇదే నా జీవితాన్ని నిలిపింది. గ్రూప్ యాక్టివిటీస్, పాటలు, డ్యాన్స్ ప్రోగ్రామ్స్. స్నేహితులతో జీవితం పెనవేసుకుపోయింది. నాకు శాపాన్నిచ్చిన దేవుడు నాకు చేసిన ఫేవర్ ఏమిటంటే నా చుట్టూ ఉన్న వాళ్ళకు గొప్ప మనసు ఇవ్వడం. నా జీవితంలో ప్రతి అడుగు స్నేహితుల చేయి పట్టుకునే వేశాను. చిన్నప్పటి నుంచీ గొప్ప వాళ్ళ జీవితానికి సంబంధించిన పుస్తకాలు చదివేదాన్ని. నాన్న నాకు డబ్బులు ఇవ్వలేకపోయినా గాంధీ, నెహ్రూ, షేక్స్పియర్ లాంటి మహానుభావుల పుస్తకాలు మాత్రం ఇచ్చారు. అవే కరదీపికలు. వేసవి సెలవులు వచ్చినా ఇంటికి వెళ్ళేదాన్ని కాదు. నాన్న కూడా రమ్మనే వారు కాదు. అమ్మతో కమ్యూనికేషన్ పోయింది. కన్నీటి పొరల వెనుక మసక మసగ్గా కనిపించే అమ్మ రూపం, జ్ఞాపకాలు క్రమక్రమంగా కనుమరుగవుతున్నాయి. అనుబంధాలు పేదరికం ముందు ఎలా తలవంచుతాయో తెలిసింది. బాధలో ఆనందాన్ని, అగ్నిలో మాధుర్యాన్ని పొందడం నేర్చుకున్నాను. వేసవి సెలవుల్లో హాస్టల్ సూపరింటెండెంట్ వాళ్ళతోనే ఉండి టైపింగ్ ప్రాక్టీస్ చేసేదాన్ని. తర్వాత కష్టకాలంలో అదే ఉపయోగపడింది.

## పెళ్ళయింది ... చదువు ఆగింది

నేను పడిన శ్రమ ఫలించింది. నాన్న కోరిక నెరవేరింది. టెన్త్ ఫస్ట్ క్లాసులో పాసయ్యాను. నాకింకా చదువుకోవాలన్న ఆశ. నాన్నకు మళ్ళీ ఉద్యోగం రావడం నా ఆశలకు ఊపిరిపోసింది. ఆంధ్ర బాలికా జూనియర్ కాలేజీలో ఇంటర్ (బైపిసి)లో సీటు వచ్చింది. నేను, నా ఫ్రెండ్ 'బాల' వరంగల్‌లో ఉమెన్స్ హాస్టల్‌లో చేరాం. డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్ గారి భార్య శోభగారు ఉచితంగా నిర్వహించే హాస్టల్ అది. నాన్నకు మహబూబాబాద్‌లో ఉద్యోగం. అందుకే నేను హాస్టల్‌లో చేరాలని నిర్ణయించుకున్నాను. నాన్నకు అది నచ్చలేదు. నన్ను ఆంధ్ర బాలికా కాలేజ్ నుంచి తీసేసి ఒకేషనల్ పాలిటెక్నిక్‌లో జాయిన్ చేశారు. అది రెండేళ్ళయితే టీచర్స్ ట్రెయినింగ్‌తో సమానం. టీచర్ ఉద్యోగం కోసం నాన్న చేర్పించాడు. కానీ తర్వాత సమానం కాదన్నారు. అది కాస్తా వృథా అయింది. కోర్సయితే పూర్తి చేయగలిగాను. నాన్న నాకు పెళ్ళి చేయాలని నిశ్చయించాడు. ఈ విషయంలో నాకూ, నాన్నకూ అభిప్రాయ భేదాలు వచ్చాయి. అమ్మ కూడా నాకు సహకరించలేదు. నాకు పెళ్ళే ముఖ్యమని ఆమె అభిప్రాయం. అప్పటికి నాకు పదహారేళ్ళు. ఇంకా చదువుకోవాలని హైదరాబాద్‌లో బిఎస్సీ (హోమ్‌సైన్స్) అడ్మిషన్ కూడా సంపాదించాను. కానీ చదువు కుదరలేదు. వరుసకు అత్తగారు మా ఇంటికి వచ్చి కాణీకట్నం లేకుండా నన్ను కోడలిగా చేసుకుంటానన్నారు. నాన్న సంతోషంగా ఓకే అన్నాడు. పెళ్ళి బాజాలు మోగాయి. నేను అత్తగారింట్లో అడుగుపెట్టాను. నాకేమాత్రం ఇష్టంలేని, నా ప్రమేయంలేని మలుపు ఇది. జీవితంలో గొప్ప మార్పును, చలనాన్ని కోరే నన్ను, కెరీర్‌పై దృష్టి, ఆసక్తి ఉన్న నన్ను కుటుంబ సంకెళ్ళు కట్టి పడేశాయి.

> **"నేను కోరి ఎంచుకున్న జీవితం కన్నా బంధించడమూ, శాసించడమూ నాకు ఇష్టం లేదు. నేను టైలరింగ్ నేర్చుకుని పెట్టీ కోట్స్ కుట్టి షాపులకు ఇచ్చేదాన్ని. టైపింగ్‌లో చేరి పాసయ్యాను. దాంతోపాటు అంబేద్కర్ యూనివర్సిటీలో చేరి డిగ్రీ చేయాలన్న ఆలోచన వచ్చింది. అదే పెద్ద మలుపు నా జీవితానికి. ఈ రోజు నేనీ స్థాయికి వచ్చానంటే అదే కారణం."**

## గృహిణిగా...

గుడ్డిలో మెల్లలాగా అత్తగారు దగ్గరి బంధువులే కావడం ఒడిదుడుకులున్నా సర్దుకు పోవడానికి సహకరించింది. వాళ్ళది వ్యవసాయ కుటుంబం. అప్పటిదాకా పట్టణంలో ఉన్న నాకు ఆ వాతావరణం రుచించలేదు. అయినా ఆ జీవితానికి అలవాటుపడ్డాను. మాకు తోడుగా ఇద్దరమ్మాయిలు భూమ్మీద కొచ్చారు. బంధాలింకా బిగుసుకుంటున్నాయి. గృహిణిగా బాగానే ఉన్నప్పటికీ

ఏదో వెలితి వెన్నాడుతుండేది. ఈ జీవితం నాది కాదు ... ఏదో మార్పు కావాలని ఉండేది. మా వారు సమ్మిరెడ్డి ఉద్యోగస్తులు కారు. ఇక కుటుంబాన్ని డెవలప్ చేయాల్సిన బాధ్యత నాదే అనుకున్నాను. మార్పుకు శ్రీకారం చుట్టాలన్న పట్టుదల రోజు రోజుకూ పెరుగుతూనే ఉంది. పైగా వ్యవసాయ పనులు చేయాల్సి వచ్చేది. అది నాకు ఇష్టం ఉండేదికాదు.

## ఉద్యోగంలోకి...

జీవితాన్ని మలుపుతిప్పే అద్భుతం వెతుక్కుంటూ వచ్చింది. నెహ్రూ యువజన కేంద్రం నుంచి రాత్రి బడి నడిపే అవకాశం వచ్చింది. అదే టర్నింగ్ పాయింట్. రాత్రిబడి రిపోర్ట్స్ ఇవ్వడానికి హన్మకొండ వెళ్ళేదాన్ని. అప్పుడే 'నేషనల్ సర్వీస్ వాలంటీర్' నోటిఫికేషన్ వచ్చింది. అప్లయి చేశాను. కాల్ లెటర్ వచ్చింది. ఎగిరి గంతేశాను. ఎంతో ఆనందం. నేను కోరుకున్న మార్పు నా దగ్గరికి వస్తున్నదనిపించింది. ఉద్యోగం వచ్చింది. నేను ఆ ఉద్యోగంలో చేరడం ఇంట్లో వాళ్ళకు ఇష్టంలేదు. మా కుటుంబంలో ఆడవాళ్ళు ఉద్యోగాలు చేయరు. అందరినీ ఎదిరించి, ఒప్పించి ఉద్యోగంలో చేరాను. మా ఆయనకు హన్మకొండకు మారడం ఇష్టం లేదు. పైగా నా జీతం 750 రూపాయలే. అయినా నేను మొండిధైర్యంతో ముందుకు అడుగేశాను. ఉద్యోగరీత్యా వరంగల్ జిల్లా అంతా తిరగాల్సి వచ్చింది. యూత్ క్లబ్‌లు, మహిళా మండళ్ళు ఏర్పాటుచేయడం నా పని. నాకెంతో ఇష్టమైన పని ... జనంలో ఉండడం.

## అంబేద్కర్ యూనివర్సిటీ పెద్ద మలుపు...

ఇంతకీ విషయం ఏమిటంటే నా ఉద్యోగం ఒక్క సంవత్సరం మాత్రమే. నేనా సంగతి ఇంట్లో చెప్పలేదు. అయిపోయాక నిరుద్యోగినయ్యాను. పిల్లలు స్కూలుకు వెళుతున్నారు. ఇల్లు గడవాలి. మా వారు ప్రైవేటు ఉద్యోగం చేసేవారు కానీ ఇల్లు గడవడం కష్టంగా ఉండేది. నేను కోరి ఎంచుకున్న జీవితం కన్నా బంధించడమూ, శాసించడమూ నాకు ఇష్టం లేదు. నేను టైలరింగ్ నేర్చుకుని పెట్టీ కోట్స్ కుట్టి షాపులకు ఇచ్చేదాన్ని. టైపింగ్‌లో చేరి పాసయ్యాను. దాంతోపాటు అంబేద్కర్ యూనివర్సిటీలో చేరి డిగ్రీ చేయాలన్న ఆలోచన వచ్చింది. అదే పెద్ద మలుపు నా జీవితానికి. ఈ రోజు నేనీ స్థాయికి వచ్చానంటే అదే కారణం. చదువు వల్ల పిల్లలతో తక్కువ సమయం గడిపేదాన్ని. పిల్లలు చిన్నవాళ్ళయినా బాగా అర్థంచేసుకుని సహకరించేవారు. నిజానికి ఫీజు కట్టడానికి డబ్బులు కూడా ఉండేవికాదు. ఎలాగైతేనం డిగ్రీ పూర్తి చేశాను.

## చిన్న వ్యాపారం...

అదే సమయంలో డాక్టర్ బండా ప్రకాశ్‌గారు పరిచయం అయ్యారు. ఆయన యూనివర్సిటీ సిండికేట్ మెంబర్. నేను ఆయన్ను ఉద్యోగం ఇప్పించమని అడిగాను. కానీ ఆయన నాతో లైబ్రరీ ఓపెన్ చేయించారు. లైబ్రరీ, టైపింగ్, టైలరింగ్ అన్నీ దానిలోనే. అలా ఎన్నో కష్టాలమధ్య నేను కోరిన జీవితాన్ని గడుపుతూ వచ్చాను. ఎన్ని కష్టాలు పడినా

మీరు చీకట్లో ఉన్నారు
కనుక తచ్చాడి అయినా
వెలుగుకోసం
ప్రయత్నించండి. అంతేగాని
ఎవరో మీకు వెలుగు
ప్రసాదిస్తారని మాత్రం
ఆగకండి.
- జిడ్డు కృష్ణమూర్తి

పిల్లలను చూస్తే శ్రమ మాయమయ్యేది. కష్టాలకు వెరచి వెనుకడుగు వేయలేదు. బుక్స్ బాగా చదివేదాన్ని. కింది స్థాయి నుంచి పైకి వచ్చిన వారంటే నాకు చాలా ఇష్టం. నేను పడే పాట్లు, నా జీవన విధానం... ఇదంతా మా ఫ్యామిలీలో వింతగా చూసేవారు. ఈసడింపులు, అసహ్యాలు నాకు మామూలయ్యాయి. నేనెప్పుడూ వాటికి భయపడలేదు. అందరూ పడుకున్నాక నాకు డే స్టార్ట్ అయ్యేది. చదువూ సంధ్యా అన్నీ అప్పుడే.

## స్పెషల్ టీచర్‌గా...

డిగ్రీ ఉండి వొకేషనల్ పాలిటెక్నిక్ చేస్తే టీచర్ ఉద్యోగానికి అర్హత వస్తుందని తెలిసింది. అప్పటికే డిగ్రీ ఫైనలియర్ రాశాను. ఫలితాలు రావాల్సి ఉంది. పరీక్షలు రాసినట్టుగా ప్రూఫ్ పెట్టి టీచర్ ఉద్యోగానికి అప్లయి చేయమని స్నేహితులు సలహా ఇచ్చారు. నేను దరఖాస్తు చేసుకున్నాను. స్పెషల్ టీచర్‌గా అపాయింట్ మెంట్ వచ్చింది. జీవితానికి ఒక దారి ఏర్పడింది. దానికి కారణం అంబేద్కర్ యూనివర్సిటీ. డిగ్రీ కూడా మంచి మార్కులతో పూర్తి చేశాను. అటు ఉద్యోగం, ఇటు డిగ్రీ ఇక నా ఆనందానికి అవధుల్లేవు. దానితోపాటు మా వారికి సిటిజన్ క్లబ్‌లో ఉద్యోగం వచ్చింది. జీవితం గాడిన పడింది.

> ***"పెళ్ళి బాజాలు మోగాయి. నేను అత్తగారింట్లో అడుగు పెట్టాను. నాకేమాత్రం ఇష్టంలేని, నా ప్రమేయంలేని మలుపు ఇది. జీవితంలో గొప్ప మార్పును, చలనాన్ని కోరే నన్ను, కెరీర్‌పై దృష్టి, ఆసక్తి ఉన్న నన్ను కుటుంబ సంకెళ్ళు కట్టి పడేశాయి."***

## ఉద్యోగం ... ఛాలెంజ్

నిజానికి టీచర్ ఉద్యోగంలో చేరిననాడు నా జీతం 398 రూపాయలే. అవి సరిపోక చిట్స్ నడిపేదాన్ని. టైలరింగ్ చేసేదాన్ని. నిరుత్సాహ పడేదాన్ని కాదు. ఆ తర్వాత ఉద్యోగం రెగ్యులర్ అయి జీతం పెరిగింది. కాస్త మంచి ఇంట్లోకి మారాము. మా వారి సంపాదన పెరిగింది. నేను చదువును వదలి పెట్టలేదు. ఎంఏ ఇంగ్లీషులో చేరాను. దానితో పాటు రామకృష్ణాపురంలో ఉద్యోగం. దానిపై బాగా దృష్టి పెట్టాను. చేతినిండా పని ఉండేది కాదు. ఊరికే తిని కూర్చున్నట్టు ఉండేది. ఫోర్త్‌క్లాస్ వరకే ఉండేది. గ్రామస్తులు, విద్యాకమిటీ, సర్పంచ్‌తో మాట్లాడి ఫిఫ్త్ క్లాస్‌కు పర్మిషన్ సంపాదించాను. అందరూ బాగా సహకరించారు. కొత్త స్కూలు బిల్డింగ్ కోసం చందాలు సేకరించాం. ఈ క్రమంలో నేను ఎదు ర్కొన్న వ్యతిరేకత... నొసటి విరుపులు... ఛాలెంజింగ్‌గా ఉండేది. మొత్తానికి సాధించాం. ఇదేకాకుండా ఫోర్త్ క్లాస్ అయిపోగానే ఆడపిల్లలను చదువు మాన్పించి ఆ తర్వాత పెళ్ళిళ్ళు చేసేవారు. అలాకాకుండా ఫిఫ్త్ నుంచి సెవెన్త్ వరకు పర్మిషన్ సంపాదించాను. డ్రాపౌట్లు, స్టాఫ్ ప్రాబ్లమ్ అని చాలామంది వ్యతిరేకించారు. నేను పట్టు వదల్లేదు. కొత్త బిల్డింగ్, సెవన్త్ వరకు స్కూల్ ... సాధించాక గొప్ప సంతృప్తి.

## ఎంఏ వన్ సిట్టింగ్ ... ప్రమోషన్

స్కూలు గొడవలో పడి చదువును అశ్రద్ధ చేశాను. పైగా ఇంగ్లీష్ లిటరేచర్ సరిగా అర్థమయ్యేది కాదు. అంతా తెలుగు మీడియం చదువు. ఎంఏ ఇంగ్లీషు మూలన పడింది. దానితో పట్టుదల మరింత పెరిగింది. ఎలాగైనా పీజీ చేయాలని అనుకున్నాను. ఈసారి ఎంఏ సోషియాలజీ రాసి వన్ సిట్టింగ్‌లో పూర్తిచేశాను. ఆ తర్వాత టీచర్ ఉద్యోగం నుంచి ప్రమోషన్. మండల్ గర్ల్ చైల్డ్ ఆఫీసర్‌గా. అమ్మా యిల డ్రాపౌట్లు నిరోధించడం, ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్ సెంటర్‌లు ఏర్పాటు చేయడం. స్కూళ్ళకు నిధులు మంజూరు చేయించడం. ఇలా నాకు ఇష్టమైన పనులు నా చేతుల్లోకి వచ్చాయి. జనంలో జలప్రవాహంలా తిరుగుతుంటేనే నాకు ఆనందం. టూ వీలర్ కొని చుట్టుప్రక్కల గ్రామాలన్నీ తిరిగాను. ఈ ఉద్యోగం నాకు చాలా నచ్చింది. ఫ్యామిలీ పరంగా కష్టమే అయినా మంచి విజయాలు సాధించాను. అప్పుడు పీహెచ్‌డీ చేయాలని నిర్ణయించుకున్నాను.

## అమెరికా ఆలోచన

ఆనందం పొందామా, ఏ బాధల్లేకుండా ఉన్నామా అని కాదు. జీవితం ఎంత గాఢంగా ఉందన్నది ముఖ్యం. అందుకే జీవితంలో మరో మలుపునకు నాంది పలికాను. అమెరికాలో మాకు చాలా మంది బంధువులు ఉన్నారు. వారిని చూసి నాకు అమెరికా వెళ్ళాలన్న ఆలోచన వచ్చింది. నేను మా కజిన్‌ను అడిగా.

అక్కడ సెటిలయ్యేంత వరకు సాయం చేస్తావా అని. నాకు కావల్సిన ఎడ్యుకేషన్ డిటెయిల్స్ చెప్పింది. ప్రయత్నం చేయమని ప్రోత్సహించింది. మరో కజిన్‌కు సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన కన్సల్టెన్సీ ఉంది. నేను కంప్యూటర్ కోర్సు చేయడానికి సిద్ధం అయ్యా. కంప్యూటర్ నాలెడ్జ్ ఉందని, అనుభవం కూడా ఉందని రెజ్యూమ్ తయారుచేసి వాళ్ళకు ఇచ్చా. తెలుగుమీడియం కాబట్టి హెచ్‌వన్ వీసా రాలేదని చెప్పారు. అదీ మొదటి విఘ్నం. నాకు బాధ కలిగింది. కానీ, నిరాశ పడలేదు. నా స్నేహితుల ద్వారా వివరాలు సేకరించాను. ఒక ఫ్రెండ్ సోదరుని కన్సల్టెన్సీ ద్వారా ప్రయత్నం చేశాను. ఆయన ద్వారా హెచ్‌వన్ వీసాకి అప్లయ్ చేశా.

## సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్...

ఈ మధ్యలో ఉద్యోగానికి సెలవు పెట్టి హైదరాబాద్‌కు మారాను. సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్‌లో జాయిన్ అయ్యాను. అయితే ఈసారి కూడా వీసా రాలేదు. మరో విఘ్నం, ఏం చేయాలో అర్థం కాలేదు. సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ చేస్తున్నప్పుడు అమెరికా వెళ్ళడానికి ఎన్నో మార్గాలున్నాయని తెలిసింది. మళ్ళీ ఉత్సాహం తెచ్చుకున్నాను. ఓ ఫ్రెండ్ విజిటర్ వీసాపై వెళ్ళవచ్చని చెప్పాడు. ఇదంతా జరుగుతోంది కానీ, పిల్లలకు ఇబ్బంది అవుతోంది. కష్టం అనిపించినా వారిని హాస్టల్‌లో చేర్పించాను. ఇంట్లో ఘర్షణ. అయినా నేను లెక్కచేయలేదు. అమెరికా నుంచి పేపర్లు వచ్చాయి. ఆ తర్వాత అనేక ప్రయాసల మధ్య నాకు వీసా వచ్చింది. ఈ విషయంలో నా స్నేహితులకు కృతజ్ఞతలు చెప్పాలి. నా జీవితాన్ని మార్చేసిన మలుపు ఇది.

> ఒక ఎదురుదెబ్బ
> తగిలినంత మాత్రాన
> సాధించదలచుకున్న
> ప్రయోజనం నుంచి
> వెనుకంజ వేయవద్దు.
>
> **– షేక్స్పియర్**

## అమెరికా ... కష్టాలు

ఉద్యోగానికి లాంగ్‌లీవ్ పెట్టి పిల్లలకు ఇబ్బంది కలగకుండా చూసుకొని, మే 2, 2000న అమెరికాకు ఎగిరి పోయాను. అమెరికా అయితే చేరాను కానీ ఊహించినంత అందమూ, అద్భుతాలూ లేవక్కడ. ఒంటరి పోరాటం చేయాల్సి వచ్చింది. అక్కడా విమర్శలే బంధువుల నుంచి. పిల్లలను, ఉద్యోగాన్ని వదలి వచ్చానని. మంచి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నానని. నేను చేసే ప్రతి పనిని సమాజం తప్పుపడుతోంది. ఒకసారి ఆ మాటలకు తలొగ్గామా ఇక అంతే. మనం కోరుకున్నది అందదు. అందుకే మనసు రాయి చేసుకున్నాను. గెస్ట్‌హౌస్‌లో ఉండే అవకాశం ఉంది కానీ, బంధువుల వద్దే ఉండాలని కుటుంబం నుంచి ఒత్తిడి. మా కజిన్ దగ్గరికి వెళ్ళాను. అక్కడా అనుకూల వాతావరణం లేదు. నాకు ఉద్యోగం చూడడం, నేను అక్కడ ఎక్కువ కాలం ఉండడం ఇష్టం లేదని గ్రహించాను. నా దగ్గరున్న వెయ్యి డాలర్లలో వారి దగ్గరికి వెళ్ళడానికే 350 డాలర్లు ఖర్చయ్యాయి. మరో వంద డాలర్లు ఫోన్ చేయడానికి. పైగా అప్పటికే మూడు వారాలు అయిపోయాయి. మరో కజిన్‌కు ఫోన్ చేశా. విజిట్ వీసాతో నువ్విక్కడ పని చేయకూడదు, చట్టవిరుద్ధం అన్నారు. అయితే ఇండియన్ షాపులో పని చేయవచ్చని నాకు తెలుసు. అదే చెప్పాను.

చివరికి మూవీ క్యాసెట్ షాపులో సేల్స్‌గర్ల్‌గా ఉద్యోగం దొరికింది. కాస్త ఆసరా... తర్వాత న్యూజెర్సీలో జాబ్ ఉందని అక్కడికి ఫ్లయిట్‌లో వెళ్ళే డబ్బుల్లేక బస్సులో వెళ్ళాను. మళ్ళీ ఎక్కడ ఉండాలనే సమస్య మొదలయ్యింది. మా బంధువులకు సొంత ఇల్లు ఉంది కానీ, వారు నేను ఉండటానికి ఇష్టపడలేదు. అక్కడే పనిచేస్తున్న గుజరాతి అమ్మాయి,

నేనూ కలిసి పేయింగ్ గెస్ట్‌గా ఉండేట్లు మాట్లాడుకున్నాము. ఆ ఇల్లు నేను పనిచేసే షాపునకు రెండు మైళ్ళ దూరం. రోజూ నడిచి వెళ్ళేదాన్ని. రోజుకు పన్నెండు గంటలు పనిచేసేదాన్ని. నేను హెచ్‌వన్ వీసాకు అప్లయి చేయాలంటే విజిటర్ వీసా ఎక్స్‌టెన్షన్ చెయ్యాల్సి ఉంటుంది. పరిస్థితి ఘోరం. ఎవరిని అడిగినా సరైన సలహా ఇవ్వడం లేదు. నాకు అక్టోబర్ వరకే విజిటర్ వీసా ఉంది. బంధువులకు ఫోన్‌చేస్తే ఫోన్ ఎత్తడం లేదు. మరికొందరు బిజీ అంటున్నారు. అప్పుడూ స్నేహితులే ఎంకరేజ్ చేశారు.

## మరో మలుపు...

ఒకసారి షాపులో పనిచేస్తుండగా ఒకతను గుర్తుపట్టి పలకరించాడు. ఆయన డాక్టర్ బండా ప్రకాశ్‌గారి అల్లుడు, సుధాకర్. వరంగల్‌లో ఒకసారి నన్ను చూశారు. ఆయన పరి చయంతో అమెరికాలో నా లైఫ్ మలుపు తిరిగింది. వాళ్ళ అన్నయ్య (సంజయ్) సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీలో ఉద్యోగం వచ్చేలా చేశాడు. ప్రకాశ్‌గారు మా ఫ్యామిలీకి క్లోజ్ కావడం కలిసి వచ్చింది. ఇండియానాలో ఒక వారం ట్రైనింగ్. వెయ్యి డాలర్ల జీతంతో ఉద్యోగం, వసతి. నాకు సంజయ్ శిక్షణ ఇప్పించి సౌత్ కరోలినాలోని ఆఫీసుకు తీసుకెళ్ళారు. అక్కడి వారిని పరిచయం చేశారు. వాళ్ళ కజిన్స్ కూడా అక్కడ పనిచేస్తున్నారు. తెలుగువాళ్ళ మధ్యలో చాలా కంఫర్ట్ అనిపించింది. ఎప్పుడో చిన్న ప్పుడు చేసిన టైపింగ్ అప్పుడు చాలా ఉపయోగపడింది. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఆఫ్ అమెరికా కంపెనీలో రిక్రూటర్‌గా ఉద్యోగం. జీతం తక్కువైనా బాగా ఉపయోగపడిన ఉద్యోగం అది. ఆ కంపెనీ లాయర్‌తోనే విజిటర్ వీసా ఎక్స్‌టెన్షన్‌కు అప్లయి చేశా. అదృష్టవశాత్తు ఎక్స్‌టెన్షన్ వచ్చింది. హెచ్‌వన్‌కు అప్లయి చేశాను. తర్వాత సంవత్సరానికి అరవై వేల డాలర్ల శాలరీతో జాబ్ ఆఫర్ వచ్చింది. దానితో వర్జీనియా వెళ్ళాను. మంచి జీతం, వసతి, ఫ్రీ ట్రాన్స్‌పోర్ట్. ఇక సెటిలయ్యాను అనుకున్నా. చాలా డబ్బు పొదుపు చేశా. ఇంతలో హెచ్‌వన్ వచ్చింది. అమెరికా ఒంటరి పోరాటంలో గెలిచాను.

> **"ఆనందం పొందామా, ఏ బాధల్లేకుండా ఉన్నామా అని కాదు. జీవితం ఎంత గాఢంగా ఉందన్నది ముఖ్యం. అందుకే జీవితంలో మరో మలుపునకు నాంది పలికాను. అమెరికాలో మాకు చాలా మంది బంధువులు ఉన్నారు. వారిని చూసి నాకు అమెరికా వెళ్ళాలన్న ఆలోచన వచ్చింది."**

## ఇండియాలో పిల్లలు...

వారానికి రెండుసార్లు ఫోన్ చేసేదాన్ని. దాదాపు రెండేళ్ళయ్యింది వారిని చూసి మరోవైపు పిల్లలకు టెన్త్ అయిపోయింది. హైదరాబాద్‌లోనే ఇంటర్‌లో చేరారు. బాగా చదువుతున్నారు. ఎక్కడ పనిచేసినా అందరితో సత్సంబంధాలు నెరపడం నాకు శ్రీరామ రక్ష అయింది. సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీ గురించి బాగా అవగాహన వచ్చింది. అదే బిజినెస్ చేస్తే బావుంటుందన్న ఆలోచన వచ్చింది. ఒక ఫ్రెండ్‌తో కలిసి బిజినెస్ ప్రారంభించాను. కానీ వర్కవుట్ కాలేదు. అప్పటికి డెన్వర్ స్టేట్‌లో ఉన్నాను. మళ్ళీ బిజినెస్ పార్టనర్ కోసం చూస్తున్నాను. పిల్లలను చూడాలని చాలా అనిపించేది. కానీ హెచ్‌వన్ స్టాంపింగ్ అయితేనే వెళ్ళాలని నిశ్చయించాను. ఆ రోజు రానే వచ్చింది. టికెట్ బుక్ చేసుకున్నా. ఈ మధ్యలో ఎప్పుడో అప్లయి చేసిన సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్ ఉద్యోగం కోసం కాల్‌లెటర్ వచ్చింది. అరిజోనా స్టేట్‌లో ఇంటర్వ్యూ. అక్కడ ఉద్యోగం రాలేదు కానీ, అక్కడే బిజినెస్ ప్రారంభించాలన్న ఆలోచన బలపడింది. వెంటనే కంపెనీ రిజిస్టర్ చేశాను. సెప్టెంబర్‌లో ఇండియాకు వచ్చాను. పిల్లలను చూసినప్పుడు కలిగిన ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. మళ్ళీ మూడు నెలలు వారితో గడిపి అమెరికాకు తిరిగి వచ్చాను. బిజినెస్ అయితే మొదలుపెట్టాను గానీ, కాస్త కష్టంగా అనిపించింది. మరో పార్టనర్‌ని చేర్చుకున్నాను. బిజినెస్ డెవలప్ చేయడంపైనే మా ధ్యాస. బాగా అభివృద్ధి సాధించాం. డబ్బు బాగా వస్తోంది. కానీ పిల్లలకు దూరంగా ఉన్నానన్న బాధ వెన్నాడుతోంది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇండియాకు వచ్చి పిల్లలను చూసి వస్తున్నాను. వేసవి సెలవుల్లో పిల్లలు, మా వారు అమెరికా వస్తుండేవారు. 2005 దాకా ఇలాగే సాగింది. గ్రీన్‌కార్డ్ వచ్చింది. ఇప్పుడందరం అమెరికాలోనే ఉన్నాం. హ్యాపీ ఫ్యామిలీ. పిల్లలు బీనా, బిందు ఇక్కడే చదువుతున్నారు. పిల్లలు ఇక్కడే సెటిలయ్యాక నేను ఇండియా వచ్చి అక్కడే ఉండాలన్న ఆలోచన. బాధ్యతలన్నీ అయిపోయాక, కాలం కలిసి వస్తే ఇండియాలో 'వృద్ధాశ్రమం' నడపాలని ఉంది.

**అమెరికాలో బిజినెస్ ఆలోచన...**


ఏ లక్ష్యంతో అమెరికా వచ్చానో అది సాధించగలిగాను. కానీ, పిల్లలు, భర్త ... చాలా మిస్సయ్యాను. పిల్లలు గుర్తొస్తే మనసు బ్లేడ్‌తో కోసినట్టు ఉండేది. ఎగిరి అక్కడ వాలాలనుండేది. నేను చిన్నప్పుడు అమ్మకు దూరమైన రోజులు గుర్తు కొచ్చేవి.

చూశారుగా వరంగల్ పల్లె అమ్మాయి ఎన్ని కష్టాలుపడి, ఎన్ని అవరోధాలను, విమర్శలను ఎదుర్కొని, అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ సాయంతో నిలదొక్కుకుని, అమెరికా దాకా ఎలా ఎదిగిందో... అందుకే అంబేద్కర్ యూనివర్సిటీ వారికి కృతజ్ఞతలతో సెలవు.

* * *

జ్ఞానం ఉన్న చోట శక్తి
ఉంటుంది. తెలివి
ఉన్నచోట వెలుగు
ఉంటుంది.

– హాబ్స్



చలపతిరావు

# జైలు గోడల మధ్య జీవిత పాఠాలు

# చలపతిరావు

చీకటి పడుతోంది. నరసరావుపేట, చిలకలూరిపేట రోడ్డుపై బస్సు దూసుకు పోతోంది. అప్పటిదాకా ప్రయాణికుల్లా కూర్చున్న ఇద్దరు వ్యక్తులు పెట్రోల్ డబ్బాలతో సీట్లలోంచి లేచారు. దోపిడీకి ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలో జరిగిన చిన్న పొరపాటుతో 22 ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఆ ఇద్దరూ చలపతిరావు, విజయవర్ధనరావు.

• • •

గుంటూరు జిల్లాకు చెందిన ఆ చలపతిరావే, ఇప్పుడు సాతులూరి 'చలపతిరావు, ఎంఏ' అయ్యాడు. ఘోరమైన నేరంతో ఉరికి చేరువయ్యాడు. సుప్రీంకోర్టు శిక్ష ఖాయం చేసింది. కొందరు సరైన శిక్షన్నారు. కొందరు జాలిపడ్డారు. మానవతావాదులు ఉరిపై చర్చలు జరిపారు. మొత్తం మీద ఉరిశిక్ష జీవిత ఖైదుగా మారింది. వెంట్రుక వాసిలో తప్పిపోయిన మృత్యువు. అప్పటి నుంచి పద్నాలుగేళ్ళు జైలు గోడల మధ్య గడిపాడు. జైలు జీవితం ఎన్నో పాఠాలు, గుణపాఠాలు నేర్పిందంటున్నాడాయన. చదువు తప్పి, జీవితం గాడితప్పి, చిన్న చిన్న నేరాలతో జులాయిగా తిరిగి పెద్ద నేరంచేసి జైలు పాలై బయట ప్రపంచం ఏమిటో తెలియకుండా గడిపే తనకు, అంబేద్కర్ యూనివర్సిటీ విద్యాదానంతో విశాల ప్రపంచాన్ని చూపిందంటున్నారు. యూనివర్సిటీ అందించిన ఉత్సాహంతో, ప్రోత్సాహంతో సోషియాలజీలో ఎంఏ పూర్తిచేసిన చలపతిరావు నేరశాస్త్రంలో పీహెచ్‌డీ చేయాలన్న ధ్యేయంతో ఉన్నాడు.

సాతులూరి చలపతిరావు, ఎంఏ. ఈ పేరు, దాని వెనుక పట్టా చూసినప్పుడల్లా ఆశ్చర్యమూ, ఆనందమూ కలుగుతాయి. ఈ పట్టా వచ్చే నాటికి ఉరిశిక్ష పడేంత నేరమూ, పద్నాలుగేళ్ళ కారాగారవాసమూ ఉన్నాయి. వాటికి ముందు ఈ పట్టా ఉండి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో? ఒక జీవిత ఖైదీగా అజ్ఞానంతో నిండిన నా గతమూ, ఎంఏ సోషియాలజీతో నేను అర్థం చేసుకుంటున్న వర్తమానమూ ... అంబేద్కర్ యూనివర్సిటీ వారికి కృతజ్ఞత తెలుపుకుంటూ మీకు వివరిస్తాను. ఖైదీ కూడా మనిషే. అతనికీ విజ్ఞానం కావాలి, ఖైదీలూ విద్యావంతులు కావాలనే ఉన్నతాశయంతో ఉచిత విద్యను అందిస్తున్న అంబేద్కర్ వర్సిటీకి సవినయంగా నమస్కరిస్తూ నా గురించి చెబుతాను.

## టెన్త్ ఫెయిల్...

నేను క్రైస్తవ మతాన్ని స్వీకరించిన మాలకులస్తుడిని. గుంటూరు జిల్లాలోని 'హుస్సేన్‌నగర్' అనే గ్రామం మాది. ఇక్కడే 'మాలపల్లి' అనే పేటలో మా నివాసం. నాన్న చినపాములయ్య, అమ్మ కాశమ్మ, మాల మాదిగలమంతా కలిసిమెలిసి ఉండేవాళ్ళం. మా కుల పెద్ద మా పెదనాన్న పెద పాములయ్య. నేను 3వ తరగతి వరకు నందిగామలోని జర్మన్ హాస్టల్‌లో, 5వ తరగతి వరకు హుస్సేన్‌నగర్‌లో, 6వ తరగతి నుంచి 10 దాకా గుంటూరు జిల్లా నరసరావుపేటలో చదివాను. టెన్త్‌దాకా నాకు కుటుంబ పరిస్థితులు తెలియవు. అవసరానికి కావలసిన డబ్బులు తీసుకోవడం, ఇవ్వకపోతే ఏదో పనిచేసి డబ్బులు సంపాదించి ఖర్చులకు వాడుకోవడం. స్నేహితులు, సినిమాలు, షికార్లు ... అంతే. అడిగినప్పుడు డబ్బులు ఇవ్వకపోతే తిండి మానేయడం ... అమ్మా నాన్న అప్పో సప్పో చేసి తెచ్చివ్వడం. వాటికోసం వారెంత బాధ పడతారన్న విషయం అప్పట్లో తెలిసేదికాదు. స్నేహితులు, సరదాలు ... టెన్త్ ఫెయిల్ అయ్యాను. చదువుపై కోరికా పోయింది. ఇదిలా ఉండగా అనేక మార్పుల మధ్య మా కుటుంబం గుంటూరుకు మారింది.

## పెదనాన్న ఇంటికి ...

గుంటూరులో అప్పటికే మా పెదనాన్న స్థిరనివాసం ఏర్పాటుచేసుకున్నారు. మేము ఆయన దగ్గరికి వెళ్ళాము. మా నాన్న నాలుగు చక్రాల బండిపై కూరగాయలు అమ్మి మమ్మల్ని పోషించేవారు. అప్పటికే ధనవంతుల పిల్లలతో నా స్నేహం నడుస్తుండడంతో నాకు మా నాన్న చేసే పని తక్కువగా కనిపించేది. చెప్పుకోవడానికి కూడా సిగ్గుపడే వాడిని. మేము నివాసం ఉండే ప్రాంతంలో అంతా దళితులే. వారంతా రిక్షా తొక్కి, ఆటో నడిపి, లేదా కూలి పనిచేస్తూ జీవనం గడిపేవారు. వారందరి మధ్యా నేను తిరుగుతున్నా నా స్థితి చెప్పుకోవడానికి సిగ్గు పడేవాణ్ణి. స్నేహితులతో తిరుగుతూనే 1987లో టెన్త్ పూర్తిచేయగలిగాను. అప్పటికి కొంత జ్ఞానం వచ్చింది. అమ్మానాన్నలను వేధించడం తగ్గించాను.

## ప్రేమ, వివాహం...

ఆటో నేర్చుకుని కొంతకాలం ఆటో నడిపాను. అలాగే బిల్డింగ్‌లకు పెయింట్ చేస్తూ నా ఖర్చులకు సంపాదించుకునే వాడిని. దానితోపాటు ఇంట్లో డబ్బులు కూడా వాడుకునేవాడిని. 'హీరో చిరంజీవి సిగరెట్ కాల్చాడని నేను సిగరెట్ తాగడం నేర్చుకున్నా'. ఆ తర్వాత హీరోలాగే ప్రేమలో పడ్డాను. ప్రేమించిన అమ్మాయి 'రమణి'నే పెళ్ళి చేసుకున్నాను. పెద్దవాళ్ళే పెళ్ళి చేశారు. 1992లో మాకు తోడుగా ఆడశిశువు ఈ లోకంలోకి వచ్చింది. నాన్న జబ్బున పడ్డాడు. అమ్మా, నాన్న, నేను, రమణి, పాప ... కుటుంబం పెరిగింది. రాబడి తగ్గిపోయింది. ఖర్చులు పెరిగాయి. ఆర్థిక సమస్యలు ఇంతకు ముందూ నాకు తెలుసు... కానీ అవి జల్సాలకు. ఇప్పటి ఆర్థిక సమస్యలు, కుటుంబ బాధ్యతలకు సంబంధించినవి. ఈ ఆర్థిక సమస్యల నుంచి బయటపడడానికి నేను ఎంచు కున్న మార్గం నేరాలు. ఇదీ స్నేహితుల ద్వారానే.

## 22 మంది మరణం...

నేను చేసిన ఘోరమైన నేరం వెనుక మరో నేరగాథ, ప్రేమగాథ ఉంది. అదే ఇప్పటి నా కారాగార వాసానికి కారణమయింది. నా చెల్లెలు ప్రేమలో పడిందని తెలిసిన నేను ఆమె ప్రేమించిన వ్యక్తిని చంపేయాలని నిర్ణయించుకున్నాను. స్నేహితులతో కలిసి ప్లాన్ చేశాను. హత్య చేస్తే వచ్చే ఆర్థిక అవసరాలు, జైలు, బెయిలు లాంటి ఖర్చులు, కుటుంబ పోషణ. వీటన్నింటికీ ముందుగానే డబ్బు సంపాదించి ఆ తర్వాత 'హత్య'కు ప్లాన్ చేయాలని నేను, నా స్నేహితులు నిర్ణయించాం. దాదాపు లక్ష రూపాయలు కావాలని అనుకున్నాం. డబ్బు ఎలా సాధించడం అన్న ఆలోచనతో అన్ని రకాల పేపర్లు తిరగేసి వివిధ నేరాలను పరిశీలించాం. పెట్రోలుతో బెదిరించి ప్రయాణీకుల దగ్గర డబ్బులు దోచుకున్న సంఘటన పేపర్లో చూశాం. మేమూ అదే మార్గం ఎంచుకున్నాం. నేను, నా స్నేహితుడు విజయవర్ధనరావు కలిసి బయలుదేరాం. నిజానికి నలుగురం వెళ్ళాలి. కానీ ఇద్దరమే వెళ్ళాం. ఇద్దరం ప్రయాణికుల్లా బస్సు ఎక్కాం. మా దురదృష్టం కొద్దీ 22 మంది అమాయకులు ఆ సంఘటనలో చనిపోయారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలు మీకు తెలిసినవే. మాకు ఉరిశిక్ష పడడమూ, రాష్ట్రపతి క్షమాభిక్ష ప్రసాదించకపోవడమూ, ఆ తర్వాత ఒక అద్భుతం జరిగి ఉరి ఆగిపోవడమూ, జీవిత ఖైదీగా మిగిలిపోవడమూ. మానవతావాదుల కృషి, దేవుని కృప ఫలితం ఇది.

> ***"పెట్రోలుతో బెదిరించి ప్రయాణీకుల దగ్గర డబ్బులు దోచుకున్న సంఘటన పేపర్లో చూశాం. మేమూ అదే మార్గం ఎంచుకున్నాం. నేను, నా స్నేహితుడు విజయవర్ధనరావు కలిసి బయలుదేరాం. నిజానికి నలుగురం వెళ్ళాలి. కానీ ఇద్దరమే వెళ్ళాం. ఇద్దరం ప్రయాణికుల్లా బస్సు ఎక్కాం. మా దురదృష్టం కొద్దీ 22 మంది అమాయకులు ఆ సంఘటనలో చనిపోయారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలు మీకు తెలిసినవే."***

## జైల్లో చదువు...

రాజమండ్రి జైల్లో ఖైదీ జీవితం ప్రారంభమయింది. అక్కడే ఓ కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న వేదాంత శేషగిరిరావు పరిచయం అయ్యాడు. మా మధ్య స్నేహం పెరిగింది. అతనే చదువుకొమ్మని సలహా ఇచ్చాడు. నాకు చదువు సరిపడదన్నాను. సరిపడకపోతే జీవితమే లేదన్నాడు. నా చేతిలోని బైబిలు చూపించి ఇదే నా జీవిత మార్గదర్శనం అన్నాను. దీనికి మించిన జ్ఞానం లోకంలో లేదని చెప్పాను. ఇదిలా ఉండగా, ఒక సహోదరి ఉత్తరాల ద్వారా పరి చయం అయింది. ఇసుమంత గర్వంలేని కోటీశ్వరురాలామె. ఆమె కూడా చదువు కొమ్మని ప్రోత్సహించింది.

కారాగారవాసం పూర్తయ్యేలోగా డిగ్రీ పూర్తి చేయవచ్చునని లెటర్ రాసింది. అప్పటికి డిగ్రీ ప్రయోజనం ఏమిటో నాకు అర్థం కాలేదు. కొద్దికాలం అనంతరం శేషగిరి నాకు తెలియకుండా అంబేద్కర్ యూనివర్సిటీ నిర్వహించే డిగ్రీ ఎంట్రన్స్ పరీక్ష అప్లికేషన్ పూర్తిచేసి నా వద్దకు తెచ్చి నన్ను సంతకం చేయమన్నాడు. నేను వద్దన్నా బలవంతంగా నాతో సంతకం చేయించి అప్లయ్ చేశాడు. అలా నేను అంబేద్కర్ యూనివర్సిటీ విద్యార్థినయ్యాను. ఇది మరో జీవితం.

## అంబేద్కర్ యూనివర్సిటీ, డిగ్రీ...

మొదటి రెండు సంవత్సరాలు నాకు చదువుపై అంత ఇంట్రస్ట్ కలగలేదు. ఆదివారం క్లాసులకు కూడా సరిగా వెళ్ళేవాడిని కాదు. ఖైదీగా పనులలో శ్రమతోపాటు, తాత్కాలిక విడుదలకు కూడా నిరాకరించడంతో నేను కుంగి పోయాను. చదువుపై శ్రద్ధ పెట్టకపోవడంతో డిగ్రీ రెండవ సంవత్సరం ఒక సబ్జెక్టు తప్పాను. అందరూ పాసయ్యారు. నేను ఒక్కణ్ణే ఫెయిలయ్యానన్న ఆలోచన. చాలా చిన్నతనంగా ఫీల్ అయ్యాను. అయితే ఈ డిగ్రీలు కూడు పెడతాయా? లేక విడుదలకు సహకరిస్తాయా? అన్న ఆలోచన ఉండేది. కో-ఆర్డినేటర్ సత్యనారాయణ ఎంత ఎంకరేజ్ చేసినా సహకరించే వాణ్ణికాదు. అయినా ఆయన వదలకుండా నన్ను మూడవ సంవత్సరంలో అడ్మిషన్ చేయించారు. అప్పటికే ఫెయిలయ్యానని ఫీల్ అవుతున్న నేను పౌరుషం వచ్చి ఎలాగైనా పాస్ కావాలనుకున్నాను. శ్రద్ధగా చదవడం మొదలు పెట్టాను. అర్థం అయ్యీ కానట్టు ఉండేది. అలా చదువుతూనే దానిలో రుచి తెలుసుకున్నాను. మొత్తానికి 2002 కల్లా డిగ్రీ పూర్తయింది. అంటే **సాతులూరి చలపతిరావు, బీఏ** అన్నమాట.

## ఎంఏ సోషియాలజీ...

డిగ్రీ పూర్తయ్యాక పీజీ చేయాలని సత్యనారాయణ మాస్టారు పట్టుబట్టారు. అప్పటికే నా శిక్షాకాలం దాదాపుగా పదేళ్ళు పూర్తయ్యింది. ఎప్పుడైనా విడుదల అయ్యే అవకాశం ఉంది. అప్పట్లోగా పీజీ పూర్తి చేస్తానా అనుకున్నాను. అందుకే పీజీకి అప్లయి చేయలేదు. అంబేద్కర్ యూనివర్సిటీ అప్పటి రిజిస్ట్రార్ ఘంటా చక్రపాణి పీజీకి అప్లయి చేసిన వారిలో నా పేరు లేకపోవడం గమనించి సత్యనారాయణ గారితో మళ్ళీ చెప్పించి పీజీకి అప్లయ్ చేసేలా ఒప్పించారు. ఎంఏ సోషియాలజీ తీసుకున్నాను. ఆదివారం క్లాసులు చెప్పడానికి వచ్చే మంగాయమ్మ మేడమ్, కోటిరెడ్డి సార్ ... ఎంతో సులభంగా అర్థమయ్యేట్లు చెప్పేవారు. సమాజంలో నిత్యం జరిగేవే చదువుకోవడం కాస్త ఉత్సాహాన్ని ఇచ్చింది. సమాజం గురించి ఇంకా తెలుసుకోవాలనిపించింది. ఎంతో తెలుసుకున్నట్టు అనిపించింది. మొత్తానికి సోషియాలజీ ఆసక్తికరంగా చదివాను. ఫస్ట్‌క్లాసులో పాసయ్యాను. **సాతులూరి చలపతిరావు, ఎంఏ..** వింతగా, ఆనందంగా అనిపించింది.

## పీహెచ్‌డీ చేయాలని...

నేను నేర్చుకున్న విద్య, సాధించిన డిగ్రీలు నాకేమిచ్చాయి అన్న ఆలోచన అప్పుడప్పుడూ వస్తుంది. విజ్ఞానాన్ని, వివేకాన్ని నేర్పిందని అనుకుంటాను. ఖైదీగా చిన్నచూపు చూసినవారే నా చదువు చూసి గౌరవిస్తున్నారని గమనించాను.

> నేరస్తులను శిక్షించుటే ప్రధానం కాదు. నేరం చేయడానికి ఏ పరిస్థితులు పురికొల్పుతున్నాయో వాటిని తొలగించడం ముఖ్యం.
>
> **– అల్బర్ట్ కామూ**

బయట ఉన్నప్పుడు అతికష్టమ్మీద టెన్త్ పూర్తి చేసిన నేను ఖైదీగా ఎంఏ పూర్తి చేయడం నమ్మశక్యంగా అనిపించలేదు. అప్పుడప్పుడూ నా పేరు పక్కన ఎంఏ అని రాసుకుంటూ ఉంటాను. చాలా ఆనందంగా అనిపిస్తుంది. ఎంత గొప్పగా ఉంటుందో చెప్పలేను. ఎంఏ పక్కనే పీహెచ్‌డీ కూడా రాసుకోవాలన్న కోరిక కలిగింది. నేను చూసిన వ్యక్తులపైనే పరిశోధన చేయాలనుకున్నాను. ఉరిశిక్షలో ఉండగా నేరస్తుల మనస్తత్వాన్ని గమనించేవాడిని. వారిలో మార్పు గమనించాను. ఇదే సబ్జెక్టుపై పీహెచ్‌డీ చేయాలనుంది. సోషియాలజీ తెలుసుకున్నాక సమాజం బాగా అర్థమవుతోంది. నేరం, నేరస్తుడి మనస్తత్వమూ అర్థమవుతున్నాయి.

మానవజాతిని మార్చాలని ప్రతివారూ చూస్తారు. కానీ తనను తాను మార్చుకోవాలని మాత్రం ఎవరూ చూడరు.


**- లియో టాల్‌స్టాయ్**

## పాఠాలు, గుణపాఠాలు...

14 సంవత్సరాలుగా జైల్లోనే ఉంటున్నాను. 1993 నుంచి నేటివరకు బయట ప్రపంచం ఎలా ఉంటుందో తెలియదు. పేపర్లలోనూ, టీవీల్లోనూ చూడడమే. అంబేద్కర్ యూనివర్సిటీ విద్యద్వారా విజ్ఞాన ప్రపంచాన్ని చూపించింది. దానికి ఖైదీలంతా కృతజ్ఞులై ఉండాలి. జైల్లో చదువుతోపాటు చాలా నేర్చుకున్నాను. వాటిలో ముఖ్యమైంది చిత్రకళ. దాదాపు ఐదారు వందలు పెయింటింగ్స్ వేశాను. బాగా పేరొచ్చింది. కొంతమందికి నేర్పించాను. బుక్ బైండింగ్, స్క్రీన్ ప్రింటింగ్, స్ప్రే పెయింటింగ్ ... ఇలా ఎన్నో నేర్చుకున్నా. కంప్యూటర్ విద్యలో కూడా ప్రవేశించాను. ఫోటోషాప్, పేజిమేకర్‌లను కూడా నేర్చుకున్నాను. ఇవేకాక అనేక పాఠాలు, గుణపాఠాలు నేర్చుకున్నాను.

* * *

**నేను నేర్చుకున్న విద్య, సాధించిన డిగ్రీలు నాకేమిచ్చాయి అన్న ఆలోచన అప్పుడప్పుడూ వస్తుంది. విజ్ఞానాన్ని, వివేకాన్ని నేర్పిందని అనుకుంటాను. ఖైదీగా చిన్నచూపు చూసినవారే నా చదువు చూసి గౌరవిస్తున్నారని గమనించాను. బయట ఉన్నప్పుడు అతికష్టమ్మీద టెన్త్ పూర్తి చేసిన నేను ఖైదీగా ఎంఏ పూర్తి చేయడం నమ్మశక్యంగా అనిపించలేదు. అప్పుడప్పుడూ నా పేరు పక్కన ఎంఏ అని రాసుకుంటూ ఉంటాను.**



జైలులో పరీక్ష రాస్తున్న ఖైదీలు



కట్టా హైమావతి

## డిప్యూటీ కలెక్టరయిన 'మట్టి' మనిషి...

# కట్టా హైమవతి

పల్లెటూరు నుంచి 'మట్టి' కాళ్ళతో నడుచుకుంటూ వచ్చిన మామూలు రైతుబిడ్డ ఆమె. నాట్లేస్తూ, కలుపులు తీస్తూ పొలం పనులన్నీ అవలీలగా చేసుకుంటూ తన కలలను మరిచి పోకుండా, లక్ష్యం వదులుకోకుండా డిప్యూటీ కలెక్టర్‌గా ఎదిగిన మట్టి మనిషి ఆమె. నలుగురు ఆడపిల్లల్లో ఒకతెగా పుట్టి, దూరవిద్యద్వారా సుదూర తీరాలు ప్రయాణించి అలిసిపోయిన ఆమె కళ్ళల్లో 'తల్లిదండ్రుల పేరు నిలబెట్టాన'న్న ఆనందం మిలమిలా మెరుస్తోంది. గుంటూరు జిల్లాకు చెందిన కట్టా హైమవతి పని చేసుకుంటూనే చదువుకుని ఇవాళ డిప్యూటీ కలెక్టర్ కాగలిగింది. డా. బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో బిఏ, ఎంఏతో పాటు ఉస్మానియాలో మరో రెండు ఎమ్మేలు చేసిన హైమవతి చదువంటే తనకు ప్రాణమంటోంది. ఆడ పిల్లలకు చదువెందుకంటూ ఈసడించుకున్న ఎందరికో ఆమె తన ఎదుగుదలతో సమాధానాలు చెప్పి, ఇంకెందరికో మార్గదర్శి అయ్యింది. టైపిస్టుగా, టీచర్‌గా ఇలా ఎన్నో పనులు చేసి ప్రతి పనిలో తనదైన ముద్రవేసిన హైమవతి ఇవాళ తనలాంటి ఆడపిల్లలను ఆదుకుంటోంది. 'కాలేజీకి వెళ్ళి కలెక్టరవుతావా' అని ప్రశ్నించే పురుషాధిక్యపు అవహేళనలకు తన చదువుల్తో మౌనంగా జవాబు చెప్పిన డిప్యూటీ కలెక్టర్ కథ...

## రైతు కుటుంబం

"**మా**ది గుంటూరు జిల్లా పొన్నూరు మండలంలోని మామిళ్ళపల్లి గ్రామం. నాన్న కట్టా సుబ్బారెడ్డి. అమ్మ భారతీదేవి. వ్యవసాయ కుటుంబం. నాలుగైదు ఎకరాల మించి పొలం మాకు లేదు. అమ్మా నాన్నలకు మేం నలుగురం ఆడ పిల్లలం. నేను మూడో దానిని. మేం నలుగురమూ ఎవరికి నచ్చిన కెరీర్‌లో వాళ్ళం ప్రవేశించాం. అక్క వ్యాపారం చేస్తోంది. రెండో సోదరి మద్రాసులో సిఏ చేసి ప్రాక్టీస్ చేస్తోంది. నా తర్వాత సోదరి టీచర్‌గా పనిచేస్తోంది. నేను గ్రూప్ I పరీక్షలు రాసి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యాను. ఇది నేను ఊహించనిదే కాని ఈ విజయం నాకు ఇచ్చిన ఆనందం మాటల్లో చెప్పలేను. ముఖ్యంగా మా నాన్న 'నా పేరు నిలబెట్టావు' అంటూ సంతోషంతో ఉప్పొంగిపోవడం నా జీవితంలో ఎన్నటికీ మరిచిపోలేను.

ఆడపిల్లలం విద్యావంతులం కాగలిగామంటే అంతా మా అమ్మా నాన్నల క్రెడిట్. ఇప్పుడు మా కుటుంబం పొందుతున్న ఆనందం వెనుక కొన్ని సంవత్సరాలు ఎడతెగకుండా పడ్డ కష్టం దాగుంది. ఈ స్థాయికి రావడానికి చుట్టాల నుంచి అమ్మా నాన్నలు ఎదుర్కొన్న విమర్శలు, అవహేళనలు ఎన్నో ఉన్నాయి. పొలం తప్ప ఆస్తిపాస్తులు ఏమీలేని వాళ్ళం. ఉన్న ఆ కొద్దిపొలం కూడా నాన్న మా చదువుల కోసం వదులుకున్నారు. మా చదువులు, లక్ష్యాల పరంగా బంధువులు కావాల్సినంత నిరుత్సాహ పరచాలనే చూశారు. కాని వారి ఆ చర్యలు, మాటలే నన్ను మొండిదాన్ని చేశాయి. నా లక్ష్యంపై మరింత ఏకాగ్రతతో దృష్టి సారించి కృషి చేసేట్టు చేశాయి. డిప్యూటీ కలెక్టర్ లక్ష్యాన్ని చేరుకునేలా చేశాయి.

## పొలాలు అమ్మి చదివించారు...

ఇంటర్ వరకూ నేను కాలేజీకి వెళ్ళి చదివాను. నాకు చిన్నతనం నుంచీ చదువంటే ప్రాణం. అక్కచెల్లెళ్ళం నలుగురం చదువుకుంటామంటే నాన్న ఏనాడూ 'వద్దు' అనలేదు. 'మీకు నచ్చిన పని చేయండి' అన్నది ఆయన సరళి. చాలా మితభాషి. ఆడపిల్లలం ఏం చేసినా నేను మీ వెన్నంటి ఉన్నానన్న భరోసాను మౌనంగానే మాకు అందించారాయన. మా చదువుల కోసం సొంత ఊరును, ఉన్న కొద్ది పొలాన్ని వదులుకుని 1990లో హైదరాబాద్ వచ్చేశారు.

వ్యవసాయాన్ని కొంతకాలం కౌలుకిచ్చారు. ఆ తర్వాత మా చదువులకు అవసరపడి ఉన్న పొలాన్ని కూడా నాన్న అమ్మేశారు. తర్వాత మా రెక్కల కష్టమే కుటుంబ పోషణకు ఆధారమైంది. కుటుంబంలోని ఆర్థిక ఒడిదుడుకుల కారణంగా ఏదో ఒక ఉద్యోగం చేస్తూ చదువును కొనసాగించాం.

మేం చదువుకోవడం, నాన్న మా కోరికను వద్దనకుండా అనుమతించడం ఊళ్ళో ఎందరికో ఆశ్చర్యంగా ఉండేది. ఎందుకంటే మాలో ఏడవ తరగతి అవగానే ఆడపిల్లల్ని చదువు మాన్పించేస్తారు. 15 ఏళ్ళకు పెళ్ళిచేసి అత్త వారింటికి పంపేస్తారు. నాన్న వేరే ఊరికి పంపి మరీ మమ్మల్ని చదివించడాన్ని ఎత్తిపొడిచేవారు. 'పెళ్ళి ఎప్పుడు చేసుకుంటావు? అంటూ నన్ను అడిగేవారు. పొలాలు అమ్మి పిల్లల్ని చదివిస్తున్నారు. ఇక వాళ్ళ పెళ్ళిళ్ళు చేయగలరా? కట్నం ఇవ్వగలరా? చదివి వాళ్ళేం సాధిస్తారు? ఇలా సాగిపోయేవి వాళ్ళ మాటలు. ఇలా ఎందరో మాటల 'దాడుల'కు పాల్పడుతున్నా అమ్మా నాన్నలు చెదరలేదు. మా చదువులను చదువెందుకని ఏనాడూ ఆపలేదు. నిరుత్సాహపరచలేదు.

ఇంటర్ వరకూ డైరెక్టు స్టూడెంట్‌నే కాని పల్లెలో నేను పెరిగిన పరిస్థితులు, ఉన్న పరిసరాలు వేరు. 15 ఏళ్ళకే పెళ్ళి చేసేస్తారు. చదువంటే ప్రాణం పెట్టే నాలో ఇక ఇంటర్‌తో నా చదువు ఆగిపోతుందేమోననే భయం పట్టుకుంది. ఆ ఊహకే నా గుండెలు పిండేసినట్టు అనిపించింది. పైగా ఆడపిల్లవి నువ్వేం చేయగలవు? పెళ్ళి చేసుకుని వెళ్ళిపోవాలి అన్న చుట్టాల విసుర్లు నన్ను తీవ్ర అశాంతికి గురిచేశాయి. ఇంకా చెప్పాలంటే నన్నెంతో రెచ్చగొట్టాయి కూడా. అలాంటి మానసిక స్థితిలో నాకు తెలిసిన ఒక అమ్మాయి 'కాలేజీకి వెళ్ళకుండానే మనం చదువుకునే వీలుంది' అంటూ అంబేద్కర్ యూనివర్సిటీ గురించి చెప్పింది. అప్పటి వరకూ దాని గురించి నేను వినలేదు. ఆ రోజు నా సంతోషానికి పట్టపగ్గాలు లేవు. నాకు చిన్నదారి కనిపించింది. దాన్ని 'రాదారి'గా మలచుకోగలిగే స్వభావం నాలో పుష్కలంగా ఉంది. అలాగే నాకు నచ్చని పని ఎవరు చెప్పినా చేయని మొండితనమూ తక్కువేమీ లేదు. ఇవి నన్ను నా లక్ష్యం వైపు ప్రయాణించేలా రాటుదేల్చాయి.

***"మాకు అన్నయ్యలుంటే మమ్మల్ని ఇలా చదివించి ఉండేవారా అనే అనుమానం వస్తుంటుంది అప్పుడప్పుడు. కాని అన్నయ్యలుండి ఉంటే మమ్మల్ని చదివించరనేది నా నిశ్చితాభిప్రాయం. ఆడపిల్లలకు పెళ్ళి, మగపిల్లాడికి ఉద్యోగం అన్న ఆలోచన ఊళ్ళల్లో పెద్ద వాళ్ళకే కాదు ఎక్కువ మంది అబ్బాయిల్లోనూ ఉండడాన్ని నేను గమనించాను. ఇది పురుషాధిక్య సమాజమని వారి ఈ ఆలోచనా సరళి మనకు అనుక్షణం గుర్తు చేస్తుంటుంది."***

## లక్ష్యాన్ని ఎవ్వరికీ చెప్పలేదు

నేను గ్రూప్-I టార్గెట్‌గా పెట్టుకున్న విషయం ఏనాడూ బయటకు చెప్పలేదు. ఒకవేళ నేను దాన్ని సాధించలేకపోతే మమ్మల్ని ఇంకెంత అవహేళన చేస్తారో నేను ఊహించగలను. కష్టాలు నన్ను బాగా రాటుదేల్చగా, క్రమ శిక్షణా యుతమైన జీవితం వల్ల ఎటువైపు నుంచి ఎన్ని రకాల వ్యతిరేకతలు వెల్లువైనా నాకిష్టమైన పనులను సంకోచించకుండా చేసుకుంటూ పోయాను. నాకు మంచి అనిపించింది చేశాను.

నా కెరీర్ కోసం, చదువుకోసం నేను పడ్డ కష్టం ఊరికే పోలేదు. ఏడవ తరగతి వరకు మామిళ్ళపల్లిలో చదివాను. ఎనిమిదవ తరగతి నుంచి పదవ తరగతి వరకు కావూరులోని చెరుకుపల్లి ఎ.పి రెసిడెన్షియల్ స్కూల్ ఫర్ గర్ల్స్‌లో చదివాను. ఇంటర్ పొన్నూరులోని కె.ఎస్.కె. కాలేజీలో చదివాను. నాన్న ఎం.పి.సి గ్రూపులో చేర్పించారు, నాకు సైన్సెస్ అంటే అస్సలు ఇష్టం ఉండేదికాదు. మొదటి నుంచి సమాజమన్నా, మానవ సంబంధాలన్నా నాకు బాగా ఆసక్తి, ఉత్సుకతలు ఉండేవి. ఆ కారణం వల్లనో ఏమో నాకు ఆర్ట్స్ కోర్సులపైనే మక్కువ ఎక్కువ ఉండేది. ఇంటర్‌లో మార్కులు బాగా రాలేదు. దానికి కారణం సైన్సెస్ పట్ల నాకు ఆసక్తి లేకపోవడమే. అందుకే ఓపెన్ యూనివర్సిటీలో ఆర్ట్స్ తీసుకుంటానని పట్టుపట్టి మరీ తీసుకున్నాను. 'సైన్స్ సబ్జెక్టు చదవకపోతే నిన్ను కాలేజీలో చేర్పించను' అని నాన్న మందలిస్తే నెలరోజులు ఏడ్చి నా పంతాన్ని నెగ్గించుకున్నాను. హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ కాంబినేషన్‌లో జాయినయ్యాను.

## అన్నయ్యలుంటే...

1994లో ఆగస్టులో డిగ్రీ అయింది. ఈ మధ్యలో టైప్ నేర్చుకుని కొంతకాలం టైపిస్టుగా పనిచేశాను. తర్వాత టాక్స్ కన్సెల్టెంట్ దగ్గర కొంతకాలం పనిచేశాను. 1994-95లో చిక్కడపల్లిలో ఒక ఎంటర్‌ప్రైజెస్‌లో ఆఫీసు ఇన్‌చార్జిగా చేరాను. 1995 సంవత్సరంలో బిఇడి (ఆర్ట్స్ సబ్జెక్టులతోనే) ప్రవేశ పరీక్ష రాస్తే దాని ఫలితాలు డిసెంబర్‌లో వచ్చాయి. నాకు బిఇడిలో సీటు వచ్చింది. విజయవాడ మాంటిస్సోరి మహిళా కళాశాలలో బిఇడి చేశాను. 1997లో బిఇడి ఫలితాలు రావడం, పాసవడం, పట్టా తీసుకోవడం జరిగాయి.

నాకు పొలిటికల్ సైన్స్, సోషియాలజీ ఇష్టమైన సబ్జెక్టులు. అందుకే 1996 మేలో ఉస్మానియా డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో పొలిటికల్ సైన్స్ ఎంఏ చేశాను. తర్వాత అక్కడే హిస్టరీ చేశాను. ఎకనామిక్స్‌ను మాత్రం అంబేద్కర్ యూనివర్సిటీలో చేశాను. ఇన్ని ఎంఏలు ఎందుకు చేశారు అని మీరు అడగొచ్చు. నాకు చదువంటే అంత పిచ్చి. ఎప్పుడూ ఏదో ఒక కోర్సు చదువుతూనే ఉండాలనిపిస్తుంది. మాకు అన్నయ్యలుంటే మమ్మల్ని ఇలా చదివించి ఉండేవారా అనే అనుమానం వస్తుంటుంది అప్పుడప్పుడు. కాని అన్నయ్యలుండి ఉంటే మమ్మల్ని చదివించరనేది నా నిశ్చితాభిప్రాయం. ఆడపిల్లలకు పెళ్ళి, మగపిల్లాడికి ఉద్యోగం అన్న ఆలోచన ఊళ్ళల్లో పెద్ద వాళ్ళకే కాదు ఎక్కువ మంది అబ్బాయిల్లోనూ ఉండడాన్ని నేను గమనించాను. ఇది పురుషాధిక్య సమాజమని వారి ఈ ఆలోచనా సరళి మనకు అనుక్షణం గుర్తు చేస్తుంటుంది.

## ఉద్యోగం చేస్తూ చదివాను...

ఉద్యోగం చేస్తూ చదువుకోవడం వల్ల ప్రపంచజ్ఞానంతో పాటు సమాజం గురించిన అవగాహన కూడా నాలో సహజంగానే పెరిగింది. మా అమ్మ ఇంట్లో వంట పనులు చూసేది. నేను బయట పనులు చేసేదాన్ని. వాటివల్ల ప్రాక్టికల్ జీవితానికి సంబంధించిన పాఠాలు ఎన్నో నేర్చుకున్నాను. పల్లెలో పెరిగిన దానిని కావడం వల్ల 'ఇన్‌బిల్ట్ ఇన్నోసెన్స్' నాలో బాగా ఉండేది. అంతెందుకు ఉద్యోగాలకు పోటీ పరీక్షలు రాయాలని ముందర నాకు తెలియదు. అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో ప్రవేశంవల్ల లోకం పోకడ బాగా అవగతం చేసుకున్నాను. వార్తాపత్రికలు చదవడం అప్పుడే బాగా అలవాటైంది. అప్పుడే గ్రూప్-I పరీక్షల గురించి తెలిసింది. ఎలా అయినా ఈ పరీక్ష రాయాలని నిశ్చయించుకున్నాను.

సరిగా వినియోగించుకుంటే
పుస్తకాలంత మంచివి
ఏవీలేవు. సరిగా
వినియోగించుకోకపోతే
వాటంత
నిరుపయోగమైనవీ లేవు.
**- వివేకానంద**

ఓపెన్ యూనివర్సిటీ క్లాసులు మాకు కాచిగూడలో జరిగేవి. ఇక్కడ ఒక విషయం ముఖ్యంగా చెప్పాలనుకుంటు న్నాను. పోటీ పరీక్షలకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మెటీరియల్ బాగా ఉపయోగపడుతుంది. ఇది నా ఒక్కదాని అనుభవంతో అంటున్న మాటలు కాదు, ఎందరో నా దగ్గర వ్యక్తం చేసిన అభిప్రాయం. దీని విద్యా ప్రమాణాలు కూడా చాలా బాగా ఉంటాయి. ఇది చెప్పకపోతే నేను సాధించిన విజయానికి సంబంధించిన ఒక ముఖ్య కారణాన్ని చెప్పకుండా ఉన్నట్టవుతుంది. అందుకే చెపుతున్నాను. నా విజయానికి ఇంకొక ముఖ్య కారణం కూడా ఉంది. ఎన్ని ముఖ్యమైన

పనులున్నా ఓపెన్ యూనివర్సిటీ క్లాసులకు మటుకు తప్పనిసరిగా హాజరయ్యే దాన్ని. ఉద్యోగ విధులను నిర్వహిస్తూనే చదువును కొనసాగించడంలో క్రమ శిక్షణతో వ్యవహరించాననే చెప్పాలి. చిక్కడపల్లిలోని సిటీ గ్రంథాలయానికి క్రమం తప్పకుండా వెళ్ళేదానిని. రోజులో కనీసం ఒక గంటైనా లైబ్రరీలో గడపకపోతే నాకు ఎలాగో ఉంటుంది. ఆ అలవాటు ఇప్పటికీ పోలేదు. ఓపెన్ యూనివర్సిటీ పాఠాలు బోధించిన ఉపాధ్యాయులతో పాటు నన్ను ఎంతో ప్రోత్సహించిన మరో వ్యక్తి మా మామయ్య, ప్రముఖ కవి శివారెడ్డి. నన్ను అనుక్షణం 'చదువు మానొద్దు, చదువుకుంటే అనుకున్నది సాధించగలుగుతావు' అని ఆయన చెప్పారు.

## ఇష్టమైందే చదివాను...

ఉద్యోగం చేసుకుంటూ చదువుకునే క్రమంలో నాదైన సొంత వ్యక్తిత్వాన్ని పెంపొందించుకున్నాను. ఆర్థిక ఇబ్బందులున్నాయి కదా అని ఏనాడూ మానసికంగా బలహీనపడలేదు. చదువు ఆపేయాలని అనుకోలేదు. కష్టాలు పడితేనే కదా అనుకున్నది సాధించగలుగుతాము. దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందుతాం. రెసిడెన్షియల్ స్కూల్‌లో కొంతకాలం చదివాను కదా. అది నాకు క్రమ శిక్షణతో జీవించడాన్ని నేర్పింది, చేయాలనుకున్న పనిని ఎలాంటి పరిస్థితుల్లోనైనా పూర్తిచేయడం అబ్బింది. నేను సమయ పాలన ఖచ్చితంగా పాటిస్తాను. రెసిడెన్షియల్ స్కూల్‌లో చదవడం వల్ల మరో మంచి గుణం కూడా ఒంటబట్టింది. అప్పుడు విద్యార్థులు ప్రతిరోజూ ఒక గంటపాటు తప్పనిసరిగా లైబ్రరీలో కూర్చుని చదవాలి. జనరల్ నాలెడ్జ్ పుస్తకాల మీద ఆసక్తి పెరగడం, వాటిని చదవడం నాకు రెసిడెన్షియల్ స్కూల్‌లో ఉండగా అలవాటైందే. ఆ అలవాటు ఇప్పుడు నా కెరీర్‌కే దిక్సూచి అయింది.

"ఆడపిల్లలకే ఆర్థికంగా నేను సహాయపడాలనుకోవడానికి మరో కారణం కూడా ఉంది. అమ్మాయిలు తమకు అందించిన ఏ అవకాశాన్నైనా సంపూర్ణంగా ఉపయోగించుకుంటారు. దాన్ని సాధించడం కోసం ఎంత కష్టపడడానికైనా వెనుకాడరు. పెట్టుకున్న లక్ష్యాన్ని ఎంతో నిబద్ధతతో, నిజాయితీతో సాధించే ప్రయత్నం చేస్తారు."

పెద్దలు చెప్పినట్టు చదివింది ఇంటర్ వరకే. ఆ తర్వాత ఏం చదివినా నా ప్లానింగ్‌కి అనుగుణంగానే చేసుకుపోయాను. నా కిష్టమైన చదువునే చదివాను. నేను గ్రూప్-I ఎంచుకోవడం వెనుక కూడా ఒక స్పష్టమైన లక్ష్యం, ఉద్దేశం ఉన్నాయి. నేను డిప్యూటీ కలెక్టర్‌గా చేపట్టబోయే విధులు ప్రజా సంబంధాలతో ముడిపడి ఉన్నవే. ప్రజల కోసమే మేమున్నామన్న స్ఫూర్తిని విడనాడకుండా విధులు నిర్వహించేవారు ప్రజల మెప్పు పొందే అధికారులవుతారని నా అభిప్రాయం. నా వరకు నేను నా విధుల్లో చేయగలిగింది చేయడానికే ప్రయత్నిస్తాను. ప్రజలకు న్యాయం చేయడమే నా ప్రయారిటీ. ఎక్కువ మందికి సహాయపడాలనే ఇందులోకి రావాలనుకున్నాను. చేయాలనుకున్న పనిని సక్రమంగా చేయాలన్నదే నా ప్రస్తుత లక్ష్యం.

## ఆడపిల్లలను ఆదుకుంటున్నా...

చదువుపరంగా మేం పడిన కష్టాలు, ఇబ్బందులు నాకు నేర్పిన జీవిత పాఠం వల్లనేమో పేదవారికి ముఖ్యంగా అమ్మాయిలకు చదువు విషయంలో సహాయపడాలనే వాంఛ నాలో మొలకెత్తింది. చదువుకోవాలనే కోరిక ఉన్నా ఇంటి పరిస్థితులు కలిసిరాక ఆడపిల్లలు నాలుగైదు తరగతులకే చదువుమానేసి వంటింటి పనులకు పరిమితమవడం నేను చూశాను. అందుకే కుల, మత, ప్రాంత తేడాలు లేకుండా చదువు కొనసాగించలేని మంచి తెలివితేటలు ఉన్న పేద అమ్మాయిలు కొందరికి పాఠశాల ఫీజులు కట్టి చదివిస్తున్నాను. 1999 నుంచి ఏడున్నర సంవత్సరాలు హైదరాబాద్‌లోని శాలిబండ ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా చేశాను. అప్పటి నుంచే పేద అమ్మాయిలకు సహాయ పడుతున్నాను. వాళ్ళకి ప్రభుత్వ స్కాలర్‌షిప్పులు వచ్చే వరకూ నేను ఆర్థిక సహాయాన్ని అందిస్తాను. కాలేజీ చదువుకుంటున్న అమ్మాయిలకు కూడా ఫీజులు కడుతుంటాను.

ఆడపిల్లలకే ఆర్థికంగా నేను సహాయపడాలనుకోవడానికి మరో కారణం కూడా ఉంది. అమ్మాయిలు తమకు అందించిన ఏ అవకాశాన్నైనా సంపూర్ణంగా ఉపయోగించుకుంటారు. దాన్ని సాధించడం కోసం ఎంత కష్టపడడానికైనా వెనుకాడరు. పెట్టుకున్న లక్ష్యాన్ని ఎంతో నిబద్ధతతో, నిజాయితీతో సాధించే ప్రయత్నం చేస్తారు. చంచల స్వభావం వీరికి తక్కువ. అన్నింటి కంటే తాము ఏ

నేపథ్యం నుంచి వచ్చి ఇలా చదువుకుంటున్నారు. ఏ ఉద్దేశంతో చదువు కొనసాగించాలనుకుంటున్నారు వంటి వాటిని స్పష్టంగా గుర్తించి ప్రవర్తిస్తారు. వాళ్ళలో తమ కాళ్ళమీద తాము నిలబడాలన్న కోరిక కూడా ఎక్కువే. నాకు కావాల్సింది, అమ్మాయిల విషయంలో నేను కోరుకుంటున్నది అదే. అబ్బాయిలకు ఉద్యోగం, అమ్మాయిలకు పెళ్ళి అని ఆలోచించేవారు మన సమాజంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎందరో ఉన్నారు. అబ్బాయి, అమ్మాయిలను సమానంగా చూసిన రోజు అమ్మాయిలు కూడా ఎన్ని విజయాలు సాధించగలరో అందరికీ అర్థమవుతుంది.

### చదువుల లోగిలి ఇది...

చదువుకోవాలనే తపన ఉండే పేద అమ్మాయిలకు ఓపెన్ యూనివర్సిటీ ఒక అదృష్ట విద్యాద్వారం అంటాను. నా వ్యక్తిత్వ స్ఫూర్తి అంబేద్కర్, వివేకానందుడు, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, మహాత్మాగాంధీ, అబ్దుల్ కలామ్ ఇలా ఎందరో ఉన్నారు. ఏదో ఒక సందర్భంలో ఒక్కొక్కరి ప్రభావం ఒక్కొక్క రీతిలో నాపై పడింది. గ్రూప్-Iకి 1992లో నేను ప్రయత్నించాను. రాలేదు. అప్పుడు నన్ను చాలామంది నిరుత్సాహపరిచారు. ఆ క్షణాల్లో ఇలాంటి మహానుభావుల మాటలే నాకు స్ఫూర్తినిచ్చాయి. నా లక్ష్యాన్ని సాధించేలా చేశాయి. లక్ష్యం సాధించడానికి ఒక యువతిగా నేను ఎన్నో ఆనందాలను వదులుకోవాల్సి వచ్చింది. అయినా బాధపడలేదు. అసంతృప్తికి గురికాలేదు. కష్టాలు అధిగమించి నేను అనుకున్న గోల్‌ని కొట్టాను. నా జీవిత లక్ష్యానికి 'రూపు' నిచ్చాను.

గార్డెనింగ్ అంటే నాకు చాలా ఇష్టం. వ్యవసాయ పనులన్నీ నాకు వచ్చు. నాట్లు వేస్తాను. కోతలు కోస్తాను. ఎరువులు చల్లుతాను. కలుపు తీస్తాను. బర్రెలు, గొర్రెల్ని కాస్తాను. ఒక్క మాటలో చెప్పాలంటే పల్లె యువతి చేసే అన్ని పనులూ నాకు రావడమే కాదు చేశాను కూడా. ఈత కొడతాను. చెట్లపైకి సైతం ఇట్టే ఎక్కేస్తాను. గ్రామీణ ప్రాంతాల వారైనా, పట్టణ ప్రాంతాల వారైనా నేటి అమ్మాయిలకు నేను చెప్పేది ఒక్కటే. ఎవరికి వారు తమదైన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలి. అప్పుడే వారికేం కావాలో తెలుస్తుంది. అప్పుడు వాళ్ళకు నచ్చిన పనులను ఎంతో ఆత్మవిశ్వాసంతో చేసుకుపోతారు. తమ సామర్థ్యాన్ని చేతల్లో నిరూపించుకోగలుగుతారు. సర్దుబాటు జీవితాన్ని సాగించరు. నా జీవితాన్ని ఈ స్థాయికి తెచ్చిన క్రెడిట్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకే దక్కుతుంది.

గ్రామీణ, పేద, మధ్య తరగతి యువతకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఒక విజ్ఞాన వేదిక. బంగారు భవిష్యత్‌కు బాటవేసే మార్గదర్శి. ఈ బంగారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ లక్ష్యాలను సాధించడమనేది యువత చేతుల్లోనే ఉంది. పైగా గ్రామీణ యువత, పట్టణ యువతతో అన్ని విషయాల్లో ధీటుగా ఉండగలదని ఇప్పటికే ఎందరో నిరూపించారు. అలా రాబోయే మరెన్నో తరాలవారు కూడా నిరూపించడానికి ఈ విశ్వవిద్యాలయం వారికి అండగా, ఒక స్ఫూర్తిగా నిలబడుతుందనడంలో సందేహం లేదు.

* * *

జీవితం ఒక గొప్ప
విశ్వవిద్యాలయం.
ఇందులో మనం
నేర్చుకోగలిగినంత
నేర్చుకోవచ్చు.
- జవహర్‌లాల్ నెహ్రూ



వెంకటేశ్వరరావు

# పాన్ షాపు నుంచి వోల్వో మేనేజర్‌గా ...

# వెంకటేశ్వరరావు

నాన్న బొగ్గుగని కార్మికుడు... బొగ్గుగని వెనుక 'యముని మహిషపు లోహ గంటల' చప్పుడే వినిపించేది. భూతంలా తెరుచుకున్న గనిలోకి నాన్న పోతున్నప్పుడల్లా అతని లేత గుండెలు అవిసిపోతుండేవి. గని కార్మికుల మరణాలు ప్రశ్నలు రేకెత్తించేవి. చదువులేమి ఎలాంటి పనులు చేయిస్తుందో, బతుకు తెరువుకోసం మృత్యువు అంచుదాకా ఎలా వెళ్ళేలా చేస్తుందో అమ్మ మాటలతో తెల్సింది. అప్పుడే అతనికి చదువు విలువ మనసుకు పట్టింది. అందుకే ఆర్థికస్థితి ముళ్ళబాట పరుస్తున్నా, పాన్ షాప్ నడపాల్సి వచ్చినా, తన ఉన్నత విద్య లక్ష్యాన్ని మరచిపోలేదు. చెల్లీ, తమ్ముళ్ళ చదువుకోసం, కుటుంబ భారాన్ని మోయడం కోసం ఉద్యోగాలెన్నో చేయాల్సి వచ్చినా ఉన్నత విద్యను విస్మరించలేదు. అంబేద్కర్ యూనివర్సిటీలో ఎంబీఏ చేసి బహుళజాతి సంస్థలో మేనేజర్ అయ్యారు. చెల్లీ, తమ్ముళ్ళను స్థిరపడేలా చేశారు. కష్టాలను జయించారు. పాన్ షాపు నుంచి వోల్వో సంస్థ మేనేజర్ దాకా వెంకటేశ్వరరావు ప్రస్థానం సాగింది.

* * *

నేను జీవితం ఎక్కడ నుంచి మొదలు పెట్టానో చెబుతాను. ఆర్థిక సమస్యలు మనిషిని ఎలా ఎదగకుండా అడ్డుకుంటాయో చెబుతాను. అన్ని సంకెళ్ళ మధ్య నుంచి నేనెలా బయటపడగలిగానో చెబుతాను. లక్ష్యం స్పష్టంగా ఉన్నప్పుడు మార్గం ఎన్ని ముళ్ళ పొదలతో ఉన్నా లక్ష్య సాధన సాధ్యమేనని నమ్మిన వాడిని నేను. ఒక్కసారి నా జీవితపు పుటల్లోకి రండి ...

**మా**ది మాదికరీంనగర్ జిల్లా గోదావరిఖని. ఐదు దశాబ్దాల క్రితం ఇక్కడికి వచ్చిన మా నాన్న బొగ్గుగని కార్మికుడిగా చేరాడు. బొగ్గు వెలికి తీయడానికి 1960లో అధునాతన టెక్నాలజీ ఉండేదికాదు. భూమి పొరల్లోంచి బొగ్గును మనుషులు తవ్వి తీయాల్సిందే. అత్యంత ప్రమాదకరమైన పని ఇది. ఎంతో మంది చనిపోయేవారు. ఇది నా బాల్యాన్ని ఎంతో కలవరపెట్టింది. బతుకు తెరువుకోసం చేసే పని బతుకునే మింగేయడం. గనిలో కూరుకుపోయి మరణించిన కార్మికుల శవాలు వారి ఇళ్ళకు తీసుకు వస్తుంటే అంతులేని విషాదం. భార్యా పిల్లలు, బంధువుల రోదన... పనికోసం బతుకును బలిపెట్టడం నా చిన్న మనసుకు మింగుడు పడేదికాదు. అసలెందుకు మరణిస్తున్నారన్న ప్రశ్న వేధించేది. నేను ప్రశ్నలతో అమ్మను వేధించేవాడిని. గని పైకప్పు కూలి కార్మికులు మరణిస్తున్నారని అమ్మ చెప్పేది. మరి ఎందుకు ఆ పని చేయడం అన్న ప్రశ్న. "మనకు చదువుల్లేవు. అందుకే ఇలాంటి పని" అని అమ్మ సమాధానం. చదువు ఎంత అవసరమో మనసులో నాటుకున్న సందర్భం అది. ఏదైనా జరగరానిది మా కుటుంబానికి కూడా జరిగితే, అన్న ప్రశ్న వెన్నును వణికించేది. నాన్న పనికి వెళ్ళినప్పుడల్లా భయం వేసేది. 'నువ్వు బాగా చదువుకుంటే ఇలాంటి కష్టాలు ఉండవు. కష్టపడి చదువుకో..." అని అమ్మ అంటుండేది. ఆ మాటలే నాకు మార్గదర్శకం అయ్యాయి. చిన్నప్పుడే నా లక్ష్యం ఏమిటో నాకు స్పష్టమయింది. కానీ అది చేరడం అంత సులభం కాదని తర్వాత తెలిసింది. వీందుకంటే దారినిండా ముళ్ళే.

## బొగ్గు గనిలో నాన్న ...

మేము నలుగురం అన్నదమ్ములం, ఒక సోదరి. నాన్న బొగ్గు గనిలో

జీవితాన్ని, ఆరోగ్యాన్ని కరిగించుకుంటే వచ్చే ఆదాయం నెలకు 120 రూపాయలు. దానితో ఇల్లు గడవడమే కష్టమయ్యేది. ఇక చదువుల సంగతి చెప్పేదేముంది? అందరం అదే జీతంతో చదవడం సాధ్యమయ్యే పనికాదని గోదావరి ఖనిలోని ఒక థియేటర్ దగ్గర పాన్ షాప్ తెరిచాం. నాన్న ఉద్యోగానికి వెళ్తాడు కనుక షాపు చూసుకునే అవకాశం లేదు. అందుకే నేను, తమ్ముడు పాన్‌షాప్ నడిపేవాళ్ళం. అప్పటికి నా వయస్సు పదమూడు సంవత్సరాలు. సాధారణ జీవనం గడవడమే ఎంత కష్టమో అంత లేత వయసులోనే తెలిసి వచ్చింది. అలా కూడగట్టిన పైసా, పైసా ఇల్లు గడవడానికి ఉపయోగపడేది. పనిభారం చదువుపై దృష్టి పెట్టనిచ్చేది కాదు. అయినా నా మనసులో ముద్రపడిన లక్ష్యం – చదువుకోవడం.

## నాన్నకు అనారోగ్యం...

అతి కష్టంమీద టెన్త్ పూర్తి చేయగలిగాను. అది గట్టెక్కగలిగానంటే చదువుపై నాకున్న అమితమైన ఆసక్తి కారణం. అది కొంచెం సడలినా చదువుకు దూరమై నేను ఇంకా అక్కడే ఉండే వాడినేమో. ఇంటర్‌లో చేరాక ఆర్థిక ఇబ్బందులతో పాటు మరో పెను సమస్య ఎదురయ్యింది. ఇంటికి ఆధారమైన నాన్న అనారోగ్యంతో మంచం పట్టాడు. ఆర్నెల్లూ మంచంలోనే. అప్పుడు నేను సెకండియర్‌లో ఉన్నాను. ఇంటర్ మీడియట్ తర్వాత హైదరాబాద్ వెళ్ళి పైచదువులు చదవాలని ఉండేది. కానీ, నాన్న ఆరోగ్యంతోపాటు కుటుంబ ఆర్థిక పరిస్థితీ క్షీణించింది. ఇంటర్ పూర్తయ్యాక సంవత్సరంపాటు ఇంట్లోనే ఉండిపోయాను. నాకు చాతనైనది చేసి అమ్మ నాన్నకు అండగా ఉండాలనుకున్నాను. వారికి సాయంగా ఉండడంతో పాటు నేను నా లక్ష్యాన్ని మరవలేదు. హైదరాబాద్‌లో చదవడానికి కొంత పొదుపు చేయగలిగాను.

> ***"నేను, తమ్ముడు పాన్‌షాప్ నడిపేవాళ్ళం. అప్పటికి నా వయస్సు పదమూడు సంవత్సరాలు. సాధారణ జీవనం గడవడమే ఎంత కష్టమో అంత లేత వయసులోనే తెలిసి వచ్చింది. అలా కూడగట్టిన పైసా, పైసా ఇల్లు గడవడానికి ఉపయోగపడేది. పనిభారం చదువుపై దృష్టి పెట్టనిచ్చేది కాదు. అయినా నా మనసులో ముద్రపడిన లక్ష్యం – చదువుకోవడం."***

## హైదరాబాద్‌కు...

అదృష్టవశాత్తు నాన్న కోలుకున్నాడు. ఇల్లంతా ఆనందం. చెట్టంత మనిషి మంచంలో ఉన్నంతకాలం ఎవ్వరి ముఖంలో ఆనందం లేదు. ఆయన లేచి ఉద్యోగానికి వెళ్తుండడంతో ఇంటికి మళ్ళీ కళ వచ్చింది. కానీ, ఇంతకుముందులా రెగ్యులర్‌గా ఉద్యోగానికి వెళ్ళలేకపోయేవారు. ఆయన చేసే ఉద్యోగానికి శారీరకంగా ఆరోగ్యంగా ఉండడం ఎంతో అవసరం. నేను హైదరాబాద్ వెళ్ళి చదువుకోవాలని దృఢంగా నిర్ణయించుకున్నాను. నేను దాచుకున్న కొంత డబ్బుతో హైదరాబాద్ బయలుదేరాను. అమ్మా నాన్నకు ఆసరాగా తమ్ముడు పాన్‌షాప్ నడుపుతూ అక్కడే ఉండిపోయాడు. నేను చదువు పూర్తికాగానే ఉద్యోగంచేసి వారికి అండగా ఉండాలనుకున్నాను.

## ఉద్యోగపర్వం...

ఆటోమొబైల్‌లో ఇంజనీరింగ్ పూర్తి కాగానే ఒక్క నెల కూడా ఖాళీగా ఉండలేదు. వెంటనే ఒక ప్రైవేటు కంపెనీలో చేరిపోయాను. అది మా చెల్లి, తమ్ముళ్ళ చదువుకు ఉపయోగపడింది. ఒక సిమెంట్ ప్లాంట్‌లో ట్రెయినీ ఇంజనీర్‌గా ఉద్యోగం రావడంతో వారి పై చదువులకు ఢోకా లేకుండా పోయింది.

## చెల్లి, తమ్ముళ్ళ చదువు

పూర్తయిన డిగ్రీ ఉద్యోగాన్ని ఇచ్చింది కానీ, సంతృప్తిని ఇవ్వలేదు. ఇంకా చదవాలన్న కోరిక అలాగే ఉండిపోయింది. కానీ ఉద్యోగం మానేస్తే ఆర్థిక పరిస్థితి మళ్ళీ మొదటికి వస్తుంది. చెల్లి, తమ్ముళ్ళ చదువులకు ఆటంకం కలుగుతుంది. అందుకే నేను చదవడంకోసం ఉద్యోగం మానేసే సాహసం చేయలేదు. ఉద్యోగం చేస్తూనే చదువుకునే అవకాశంకోసం ఎదురు చూస్తున్నాను. ఈ మధ్యలో కెరీర్ గ్రాఫ్ పెరుగుతోంది. మూడేళ్ళు పూర్తయ్యేసరికి బిర్లా గ్రూపు కంపెనీలో కస్టమర్ సపోర్ట్ ఇంజనీర్‌గా ఉద్యోగం వచ్చింది. సీనియర్ల సహకారంతో గోదావరిఖనికి డిప్యూటేషన్‌పై వెళ్ళగలిగాను. అక్కడ పనిచేస్తుండగానే పెళ్ళయింది. బాబు పుట్టాడు. 1991లో నాన్నకు ప్రమాదం సంభవించింది. దానితో ఆయన స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. దానితో

మా కుటుంబ భారం మొత్తం నాపైనే పడింది. నేనొక్కడినే సంపాదించేది. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఎదురైనా చెల్లీ, తమ్ముళ్ళను చదివించడం మాత్రం ఆపలేదు. చదువెంత ముఖ్యమో తెలిసే సంఘటనలు చిన్నప్పుడే మనసులో నాటుకున్నాయి. ఇక చదువు లక్ష్యం నుంచి దృష్టి మరల్చలేదు. జీవితాలు మారాలంటే చదువే మార్గం.

## అంబేద్కర్ వర్సిటీ, ఎంబీఏ...

అంబేద్కర్ యూనివర్సిటీ ఎంబీఏ కరస్పాండెన్స్ కోర్సు ఆఫర్ చేస్తోందని తెలిసింది. నాకు తెలిసేటప్పటికే ఫస్ట్ బ్యాచ్ అడ్మిషన్ అయిపోయింది. అప్పటి నుంచే ఎంట్రన్స్ పరీక్షకు ప్రిపేర్ అయ్యాను. 1995లో ఎంట్రన్స్ రాశా. 44వ ర్యాంక్ వచ్చింది. హైదరాబాద్‌లోని స్టడీ సెంటర్‌లో జాయిన్ అయ్యే అవకాశం వచ్చింది. కానీ గోదావరిఖని నుంచి ప్రతివారం రావాలంటే కష్టమని వరంగల్ స్టడీ సెంటర్ ఎంచుకున్నాను. ప్రతివారం రెగ్యులర్‌గా క్లాసులకు హాజరయ్యేవాడిని. వరంగల్‌కు ప్రతివారం రావాలంటే చాలా కష్టమయ్యేది. ఆదివారం పొద్దున్నే 4 గంటలకు లేవడం, ఐదు గంటలకల్లా రైల్వేస్టేషన్‌కు, ఎనిమిది గంటల కల్లా వరంగల్ స్టేషన్‌లో దిగేవాడిని. తొమ్మిది గంటల నుంచి క్లాసెస్. సాయంత్రం నాలుగున్నర దాకా. ఐదున్నరకు ట్రెయిన్. ఇంటికి చేరేసరికి రాత్రి తొమ్మిదిన్నర అయ్యేది. వార మంతా కంపెనీలో పని, ఆదివారం రోజంతా చదువు, ప్రయాణం. చాలా కష్టంగా అనిపించేది. కానీ, క్లాసెస్ బాగా ఉపయోగపడతాయి. అందుకే వాటిని మిస్సయ్యేవాడిని కాదు. ప్రతి సంవత్సరం చివరిలో కరెస్పాండెన్స్ కోర్సులు చేసే విద్యార్థులకు అంబేద్కర్ యూనివర్సిటీ వారు కౌన్సిలింగ్ క్లాసులు నిర్వహిస్తారు. అవి ఎంతో ఉపయోగకరమైనవి. మార్కెట్ విజ్ఞానం కూడా పెంచే విధంగా ఉంటాయి. పరీక్షలకు ముందు ప్రతి ఏటా వారం రోజులు సెలవుపెట్టి ప్రిపేర్ అయ్యేవాణ్ణి. దానితో ఎప్పుడూ ఫెయిలవకుండా ఎంబీఏ పూర్తిచేశాను. పని ఒత్తిడిలో కూడా ఎంబీఏ పూర్తి చేయగలిగాను. ఎంబీఏ కల నెరవేరడంతో పాటు ఉద్యోగంలో ఇంక్రిమెంట్ కూడా ఇచ్చారు.

2005 సంవత్సరంలో మల్టీ నేషనల్ సంస్థ 'హోల్వో'లో రీజినల్ మేనేజర్‌గా చేరాను. మంచి ఉద్యోగం. చెల్లెలు, తమ్ముళ్ళు కూడా బాగా చదువుకున్నారు. దానితో జీవితంలో మంచిగా స్థిరపడ్డారు. మా అబ్బాయి, అమ్మాయి కూడా బాగా చదువుతున్నారు.

* * *

> గొప్ప లక్ష్యాన్ని సాధించాలని ప్రయత్నించి విఫలం కావడం నేరం కాదు. గొప్ప లక్ష్యం లేకపోవడమే నేరం.
>
> **- లోవెల్**

చూశారుగా, బాగా చదువుకోవాలన్న అమ్మ మాటలు ... నన్నెక్కడిదాకా తీసుకు వచ్చాయో. నేను చదువుకోవడంతో పాటు మా వాళ్ళను కూడా చదివించగలిగాను. అంబేద్కర్ యూనివర్సిటీ ఎంబీఏతో మంచి ఉద్యోగంలో సెటిలయ్యాను. అర్జునుడు పిట్ట కన్నును మాత్రమే చూసినట్టు నేను నా చిన్నప్పటి నుంచి పైచదువులపైనే దృష్టి పెట్టాను. ఎన్ని అవరోధాలైనా అధిగమించగలిగాను. స్థిరపడగలిగాను. దానికి అంబేద్కర్ యూనివర్సిటీ సాయం చేసింది.

* * *



కొండ్రు పుష్పలీల

# చదువుతో వచ్చిన సదవకాశం...

# కొండ్రు పుష్పలీల

అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ ఆమె జీవితాన్ని అనూహ్యంగా మార్చేసింది. కాలేజీలోకి, ఉస్మానియా యూనివర్సిటీలోకి, ఉద్యమాల్లోకి, చర్చల్లోకి, ప్రజల్లోకి, రాజకీయాల్లోకి, చివరికి అధికారంలోకీ ఆమెను నడిపించింది. అప్పటిదాకా సాధారణ గృహిణిగా ఉన్న పుష్పలీల అమాంతం ఎమ్మెల్యేగా, మంత్రిగా అవతరించారు. కుటుంబం ఆలనా పాలనకు మాత్రమే పరిమితమైన ఆమె జీవితం అనేక సామాజిక ఆంక్షలను బద్దలు కొట్టుకుని విశాల ప్రపంచంలోకి విస్తరించింది. అక్షరంతో పాటు వచ్చిన అదృష్టం ఆమె జీవితాన్ని మార్చేసింది. చదువు ఇచ్చే ధైర్యం, గౌరవం, ఆత్మవిశ్వాసం ఆమెకు అనుభవంలోకి వచ్చాయి. 'దళిత కుటుంబంలో పుట్టిన నేను ఇంటికే పరిమితం కాకుండా బాహ్యప్రపంచంలోకి వచ్చి భిన్నమైన వ్యక్తులను, వ్యక్తిత్వాలను గమనించగలిగాను' అంటారామె. లెక్చరర్‌గా, కౌన్సిలర్‌గా, రేడియోలో యాంకర్‌గా, ఎమ్మెల్యేగా, మినిస్టర్‌గా... ఇన్ని అవతారాలకు అంబేద్కర్ యూనివర్సిటీ అందించిన 'డిగ్రీ'యే కారణమని పుష్పలీల కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

**ఆటపాటల చదువు...**

**చి**న్నప్పుడు చదువుపై ఆసక్తి ఉండేది కాదు. ఇప్పటిలా అప్పుడు అంత ఒత్తిడి ఉండేదికాదు. ఎనిమిది మంది సంతానంలో నేను రెండవ దాన్ని. చాలా గారాబం. స్కూలుకు వెళ్ళాలంటే బద్ధకం. చదువంతా ఆటాపాటగా సాగింది. ఇంటికి దగ్గర్లోనే చిన్న స్కూల్లో చదివేవాళ్ళం. ఆ తర్వాత సికిందరాబాద్, మహబూబ్ కాలేజీ దగ్గర్లోని 'కాన్వెంట్ స్కూల్'కు మార్చారు. అప్పుడది చాలా ఫేమస్. టాంగాలో వెళ్ళే వాళ్ళం నేనూ మా అక్కయ్య. ఓ రోజు టాంగా రాకపోతే మేమిద్దరం నడిచి వెళ్ళాం. పిల్లలు నడచి వెళ్ళకూడదని మళ్ళీ స్కూలు మార్చి ఇంటి దగ్గరే చిన్న స్కూల్లో వేశారు. కాన్వెంట్‌లోనే చదివితే ఏమయ్యేదాన్నో. మొత్తానికి గవర్నమెంట్ స్కూల్లో పడ్డాం. పదవ తరగతిలోపే ఐదారు స్కూళ్ళు మారాను. టీచర్ నచ్చకపోతే స్కూలు మారడమే. మా నాన్న చదువుపై ఎప్పుడూ ఒత్తిడి చేసేవారు కాదు. ప్రోగ్రెస్ రిపోర్టులో 'ఎర్రగీత' రాకుండా చూసుకో ... అనేవారు.

**టెన్త్... పెళ్ళి...**

ఏడవ తరగతి పాసయ్యాను. అప్పుడు గుండా ఈశ్వరయ్య స్కూల్లో ఉన్నాను. ఎనిమిదవ తరగతిలో మ్యాథమ్యాటిక్స్ టీచర్ లేరు. టీచర్ లేకుంటే ఏం చదువుతామని ఫ్రెండ్స్‌తో, వాళ్ళ పేరెంట్స్‌తో మాట్లాడి, టీసీలు తీసుకుని వెస్ట్‌మారేడ్ పల్లిలోని స్కూలుకు అడ్మిషన్ కోసం వెళ్ళాం. పేరెంట్స్ లేకుండానే. మేమే ఐదారు గురు పిల్లలం 'గ్యాంగ్' లాగా వెళ్ళాం. ఆ స్కూలు వాళ్ళు షాక్. చిన్న పిల్లలే అడ్మిషన్లకోసం రావడం ఏమిటని, పైగా అందరం అమ్మాయిలం. సెయింట్ జాన్స్ స్కూల్ కమ్ కాలేజీ అది. ఆ సంఘటన అప్పుడొక న్యూస్ అయింది. అక్కడా చదువు అంతంత మాత్రమే. అటెండెన్స్ చాలా తక్కువ. క్లాసులు ఎగ్గొట్టి కాలేజీ అమ్మాయిలతో కలిసి పాటలు పాడడం. టీచర్లకు మస్కాకొట్టి ఆటలు. అలా టెన్త్ దాకా చదువు సాగింది. టెన్త్ రిజల్ట్ రాకముందే పెళ్ళయిపోయింది.

**మా ఆయన... చదువు...**

మా ఆయన బాగా చదువుకున్న వారు. బ్యాంక్ మేనేజర్ ఉద్యోగం చేస్తుండే వారు. చదువంటే ఆయనకు మహా ఇష్టం. ఈ విషయంలో మా ఇద్దరికీ పొంతన లేదు. పెళ్ళయిన కొత్తలో ఓ సారి అడిగారు. 'టెన్త్ దాకా వచ్చావు కదా! ఇంకా చదువుకుంటావా' అని. నేనేదో 'క్యాజువల్'గా సరేనన్నాను. దీన్ని ఆయన 'సీరియస్'గా తీసుకున్నారు. ఇంటర్ పుస్తకాలు తీసుకు వచ్చారు. నాకు గుండె

ఆగినంత పనయ్యింది. టెన్త్‌తో చదువు గొడవ వదిలిందనుకున్నాను కానీ, మళ్ళీ చదువు సమస్య. ఆయనకేమో భార్య బాగా చదువుకోవాలని కోరిక. ఆయనెప్పుడూ పుస్తకాల మధ్యే ఉండేవారు. నాకు ఏం చదువురా బాబూ! అనిపించేది. ఈ మధ్యలో పిల్లలు పుట్టారు. నాకు చదువు నుంచి కొంత వెసులుబాటు దొరికింది. చదువు ఒత్తిడి తగ్గింది. ఆయన వదల్లేదు. మధ్యమధ్యలో గుర్తు చేస్తూనే ఉన్నారు. ఏం మాట్లాడినా చదువు రిలేటెడే. ఆయన జ్ఞానానికి, నా జ్ఞానానికి పొంతన కుదరడం లేదు. ఆయన ఎంఏ ఎంఫిల్. నేను టెన్త్. ఎక్కడ కుదురుతుంది. నాకు ఇల్లు, సంసారమే పని అయిపోయింది. అది కూడా బోర్‌కొట్టడం మొదలయ్యింది? ఆయన ఒత్తిడితోనేమి, ఎప్పుడూ ఉండే బాధ్యతల నుంచి కొంచెం రిలాక్సేషన్ కోసం అయితేనేమి చదువుకోవ డమే మార్గంగా తోచింది. అలా చదువుపై ఆసక్తి మొదలయింది.

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ... డిగ్రీ

వికారాబాద్‌లో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సెంటర్ మొదలయ్యింది. మా ఆయన డిగ్రీ ఎంట్రెన్స్ టెస్ట్ రాస్తావా అని అడిగారు. నేను 'ఓకే' అన్నాను. టెస్ట్ రాయడం, పాసవ్వడం అయిపోయింది. అది చాలా గొప్పగా అనిపించింది. పిల్లల ఆలనా పాలనా, మా ఆయన అవసరాలు చూసుకుంటూనే ఇది పాసవడం చాలా ఆనందంగా అనిపించింది. మా ఆయన ఫ్రెండ్ 'వెంకటయ్య' గారు ఓపెన్ యూనివర్సిటీలో పని చేసేవారు. ఆయన 'కీస్ హైస్కూల్ సెంటర్ తీసుకొమ్మని సలహా ఇచ్చారు. 'హైదరాబాద్‌కు వచ్చి క్లాస్ అటెండ్ అవమనండి. డౌట్స్ ఉంటే నాకు ఫోన్‌చేస్తే నేను చెబుతాను' అన్నారు. నా చదువు విషయంలో ఆయన బాగా ఎంకరేజ్ చేశారు. తర్వాత హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ అయి వచ్చాం.

పిల్లలు, వంట, ఇంటి పనులు, వాటి మధ్య చదువు కనాకష్టమైపోయింది. ఒక్కోసారి వంటచేస్తూనే చదివేదాన్ని. దిండు కింద పుస్తకం పెట్టుకుని ఎప్పుడు మెలకువ వస్తే అప్పుడు చదవడం. ఒక రకమైన కసి. చదువు లేకపోతే వేస్ట్. గుర్తింపు ఉండదు. మీ ఆవిడ ఏం చదువుకుంది అని అందరూ ఆయనను అడిగేవారు. ఇక దానితో ఎలాగైనా డిగ్రీ పూర్తి చేయాలనుకున్నాను. వెంకటయ్య గారు బ్రీఫింగ్ చేసేవారు. అది బాగా ఉపయోగపడింది. అలా బీఏ అయిపోయింది. కష్టపడి చదివి పాసయ్యానని మా సర్కిల్‌లో గుర్తింపు వచ్చింది. 'నాకు, పిల్లలకు ఇబ్బంది లేకుండా ఎంత వరకైనా చదువుకో' అన్నారు మా ఆయన. దాంతో ఇంకా చదవాలనుకున్నాను.

## ఉస్మానియా యూనివర్సిటీకి...

ఓసారి ఉస్మానియా యూనివర్సిటీ చూస్తే ఆ వాతావరణం... గొప్పగా అనిపించింది. ఇక్కడ చదువుకోవాలనుంది అని చెప్పాను. మా ఆయన సీరియస్‌గా తీసుకోలేదు. రెగ్యులర్ స్టూడెంట్స్‌కే కష్టం. నీకెలా సాధ్యం అన్నారు. నేను ఇందులో చదువుకుని చూపిస్తానన్నాను. నేనొక్క దాన్నే బస్సులో కోఠి వెళ్ళి పుస్తకాలు వెతికి కొనుక్కుని, పీజీ ఎంట్రన్స్‌కు ప్రిపేర్ అయ్యాను. ఎంట్రన్స్ రాయడం కూడా గమ్మత్తుగా జరిగింది. పెళ్ళికి వెళ్ళి అలాగే పట్టుచీరెతో పరీక్ష హాలుకు వెళ్ళి ఎంట్రన్స్ రాశాను. అంతా వింతగా చూశారు. నాకు ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ ఇంట్రస్ట్. కానీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో సీటు వచ్చింది. ఆ రోజు రిజల్ట్స్‌లో నా నంబర్ చూస్తే ఎవరెస్ట్ ఎక్కినంత ఆనందం. అడ్మిషన్ సమయంలో ఉస్మానియా ఉద్యోగులు ఆశ్చర్యపోయారు. 'ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చేసి ఉస్మానియాలో రెగ్యులర్ సీటు సాధించావా...' అని. అక్కడ స్టాఫ్ అందరికీ ఈ విషయం చెప్పారు కూడా. అందరూ నన్ను అభినందించారు. ఉస్మానియాలో కాలు పెట్టగానే ఒక అద్భుత ప్రపంచంలోకి అడుగుపెట్టినట్టు అనిపించింది. పుష్పలీల బీఏ అని అనుకోవ డానికే ఆశ్చర్యం అనిపించేది. అలాంటిది పీజీ చేస్తున్నానంటే ... అసలు చదువుకు, నాకు ఆమడదూరం. అలాంటిది యూనివర్సిటీ దాకా వచ్చానన్న ఆనందం, గర్వం. ఆనంద్ థియేటర్ దగ్గర అఫిలియేటెడ్ కాలేజీలో చేరాను. ఇంటికి చేరువగా ఉంటుందని. చిన్నప్పుడు ఎంజాయ్ చేయాల్సిన కాలేజీ లైఫ్ పెళ్ళయి, పిల్లలు

**"ఆ రోజు రిజల్ట్స్‌లో నా నంబర్ చూస్తే ఎవరెస్ట్ ఎక్కినంత ఆనందం. అడ్మిషన్ సమయంలో ఉస్మానియా ఉద్యోగులు ఆశ్చర్యపోయారు. 'ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చేసి ఉస్మానియాలో రెగ్యులర్ సీటు సాధించావా...' అని. అక్కడ స్టాఫ్ అందరికీ ఈ విషయం చెప్పారు కూడా. అందరూ నన్ను అభినందించారు."**

పుట్టాక అమ్మాయిలు... అయినా వారితో పోటీపడేదాన్ని. వాళ్ళే ఆశ్చర్యపోయారు. 'అక్కా! మమ్మల్నే బీట్ చేస్తున్నావ్' అనేవారు. అసలు బయట ప్రపంచం ఏమిటో నాకు అప్పుడు తెలిసింది. సెకండ్ క్లాస్‌లో పీజీ పాసయ్యాను.

## లెక్చరర్‌గా...

చదువుకున్న దాన్ని ఉపయోగించుకోకపోతే వృథా అనుకునేదాన్ని. అందుకే రిజల్ట్ రాగానే ప్రైవేట్ కాలేజ్‌లో లెక్చరర్‌గా చేరాను. ఇంటర్, డిగ్రీలకు తెలుగు, ఇంగ్లీషు మీడియం. పిల్లలకు పాఠాలు చెప్పేముందు నేనే పుస్తకాలు ముందేసుకుని అధ్యయనం చేసి ఆ తర్వాత వారికి చెప్పేదాన్ని. చదువుకున్నది తెలుగులో. ఇంగ్లీషు మీడియం వాళ్ళకు లెసన్స్ చెప్పాలి. బాగా హోంవర్క్ చేశాను. మొత్తానికి వారిని కన్విన్స్ చేయగలిగాను. సివిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ చెప్పేదాన్ని. అవి నాకు ఇంకా బాగా అర్థమయ్యాయి. ఎక్కడ నుంచైతే నేను చదువులోకి మళ్ళీ అడుగుపెట్టానో అక్కడే ఉద్యోగం చేయాలనుకున్నాను. ఓపెన్ యూనివర్సిటీలో ఏ సెంటర్‌లో నేను విద్యార్థిగా చేరానో అక్కడే 'కౌన్సెలర్'గా జాయిన్ అయ్యాను. ఆరు సంవత్సరాల పాటు పాఠాలు చెప్పాను. పెళ్ళి, వయసు ఏమీ చదువుకు అడ్డం రావని వారికి నన్ను ఉదాహరణగా చూపి మోటివేట్ చేసేదాన్ని. నిజానికి క్లాసులకు వచ్చేవారు నా కన్నా పెద్దవాళ్ళే ఉండేవారు. ఫస్ట్ క్లాస్ చెప్పేటప్పుడు నాకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఎక్కడ నుంచి ఎక్కడ దాకా వచ్చానూ అని. ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీకి వాల్యూ లేదనే అభిప్రాయం ఉండేది ఆ కాలంలో. అది చాలా రాంగ్ అని చెప్పేదాన్ని. నేనెలా ఉస్మానియాలో సీటు సంపాదించానో చెప్పేదాన్ని. స్టూడెంట్స్‌కు నా పాఠాలు బాగా నచ్చేవి. జీవితంలో అదొక మైలురాయి.

అనేక పొరపాట్లకు

జాప్యమే కారణం

**– జఫర్‌సన్**

## భిన్నమైన బాహ్యప్రపంచంలోకి...

వాల్యుయేషన్‌కు, స్క్వాడ్‌గా, స్క్రూటినైజర్‌గా కూడా వెళ్ళాను. వాల్యుయేషన్ బాగా ఉపయోగపడింది. చాలా మంచి టీచర్లు, లెక్చరర్లు పరిచయం అయ్యారు. అనేక సూచనలు ఇచ్చేవారు. అభిప్రాయాలు పంచుకునే వాళ్ళం. చదువు వల్లే నేనింత ప్రపంచాన్ని చూడగలిగాను. భిన్నమైన వ్యక్తులను, వ్యక్తిత్వాలను గమనించగలిగాను. నాలుగు గోడల మధ్య నుంచి విశాల ప్రపంచంలోకి రాగలిగాను. పైగా నేను ఫ్రెండ్లీగా ఉండడం, గలగలా మాట్లాడగలగడం నాకు పరిచయాలు పెరిగాయి. నాకు జెండర్ డిఫరెన్స్ లేదు. ఇంట్లో సమస్యలున్నా బయటికి వెళ్తే మరచిపోయి ఉల్లాసంగా ఉండేదాన్ని. అది అందరికీ దగ్గర చేసింది. నాకు సమస్య, టెన్షన్ ఉంటేనే హుషారు. లేకుంటే స్మశాన విషాదమే. ఏదో కోల్పోయినట్టే. అందరికీ భిన్నంగా చేయాలనే ఉత్సాహం నన్నిక్కడి దాకా తీసుకు వచ్చింది. ఆడవాళ్ళ పని, మగవాళ్ళ పని విడిగా ఉంటాయంటే నేనొప్పుకోను. రేడియోలో ప్రోగ్రామ్స్ నిర్వహించాను, చర్చల్లో పాల్గొన్నాను. సినిమాల్లో నటించాను. ఇలా విభిన్నమైన రంగాల్లోకి వెళ్ళాను. దానికి కారణం నా చదువే అనిపిస్తుంది.

ఎంఫిల్ సీటు వచ్చింది. రూరల్ బ్యాంకింగ్ సబ్జెక్ట్ తీసుకున్నాను. మా ఆయన అదే ఫీల్డ్ కనుక ఈజీగా ఉంటుందని పార్ట్ వన్ కూడా పాసయ్యాను. తర్వాత వేరు వేరు పనుల వల్ల మిగతాది ఆగిపోయింది. ఎంఫిల్ పూర్తి చెయ్యాలనుంది. అది అయిపోయాక పీహెచ్‌డీ కూడా చేస్తాను. డాక్టర్ పుష్పలీల అని రాసుకోవాలనుంది.

## రాజకీయాలు... మంత్రి పదవి

ఆ తరువాత ప్రస్థానం. పాలిటిక్స్. చదువు క్రమంగా నన్ను రాజకీయాలకు చేర్చింది. ఎమ్మార్పీఎస్ ఉద్యమం ప్రారంభమయింది. లెక్చరర్‌గా పనిచేస్తున్న నేను ఆ ఉద్యమంలో పాల్గొని ప్రసంగించేదాన్ని. చిన్నప్పటి నుంచీ నేను డాషింగ్. దానికి చదువు మెరుగుపెట్టింది. నా ప్రసంగాలు, ఉత్సాహం చూసి కృష్ణమాదిగ ఉద్యమంలోకి ఆహ్వానించారు. అదే పొలిటికల్ ఎంట్రన్స్. అప్పటికే నేనొక ఆర్గనైజేషన్ మొదలుపెట్టాను. మహిళా హక్కుల పోరాట సమితి పేరుతో గ్రామీణ మహిళల సమస్యలపై పోరాటం చేశాం. కలెక్టర్ సతీష్ చంద్రను చీఫ్ గెస్ట్‌గా పిలిచాము. తర్వాత నేను మినిస్టర్ అయ్యాక మేమిద్దరం ఓ ప్రోగ్రామ్‌లో కలుసుకున్నాం. అప్పుడు ఆయన నా గురించి ఎంత గొప్పగానో చెప్పారు. ఒక గృహిణి, లెక్చరర్‌గా, మినిస్టర్‌గా ఎలా ఎదిగారో చెప్పారాయన.

ఎంఏ చేస్తున్నప్పుడు పాశ్వాన్ పార్టీ 'దళిత సేన'లో సిటీ సెక్రటరీగా చేశాను. పార్టీలో తిరగడం చూసి ఇంటెలిజెన్స్ వాళ్ళు వచ్చారు. రాజకీయాల్లో ఆసక్తి ఉందా అని అడిగారు. పిల్లలు అప్పటికి చిన్నవాళ్ళు. నాకిప్పుడే అంత ఇంట్రస్ట్ లేదన్నాను. నేనప్పుడు ఒప్పుకుని ఉంటే నా రాజకీయ జీవితం మరోలా ఉండేది. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు. ఇబ్రహీంపట్నం నుంచి టిక్కెట్ వచ్చింది. చంద్రబాబు నాయుడు కొత్త ప్రతిపాదన తెచ్చారు. ప్రతిభ గలవారిని, చదువుకున్న వారిని ఎంకరేజ్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. మొదట కుటుంబం నుంచి వ్యతిరేకత వచ్చింది. వెంకటయ్యలాంటి వారు ఉత్సాహపరిచారు. ప్రోత్సహించారు. మా ఆయన నా బయోడేటా చంద్రబాబుకు ఇచ్చారు. మొదట పురుషులకు టిక్కెట్ ఇవ్వాలనుకున్నారు. దానితో మా ఆయన పేరు ముందుకు వచ్చింది. అప్పటికే నేను ఎమ్మార్పీయస్ ఉద్యమంలో బాగా తిరగడం వల్ల ఇంటెలిజెన్స్ రిపోర్ట్‌లో నా పేరు చంద్రబాబు దగ్గరికెళ్ళింది. అలా నా పేరు ఖాయమైంది. మా కమ్యూనిటీలో నా క్వాలిఫికేషన్ అనుకూలమైంది. బాగా చదువుకోవడం కలిసి వచ్చింది. మా ఆయనతో కలిసి స్కూటర్‌పై వెళ్ళి 'బి-ఫారం' తెచ్చుకున్నాం. అనూహ్యంగా గెలిచాను. ధైర్యం, పట్టుదలతో పాటు చదువు నాకు దేవుడిచ్చిన వరం.

ప్రతిభ అనేది ఒక్క శాతం ప్రేరణ, తొంభై తొమ్మిది శాతం అవిరళకృషి.
**– థామస్ ఎడిసన్**

ఆ తర్వాత వివిధ సమీకరణల మధ్య నేను సాంఘిక సంక్షేమ మంత్రినయ్యాను. చదువుకోవడం, వివిధ ఉద్యోగాలు చేయడం, ఉద్యమాలలో తిరగడం ... సహజంగా ఉన్న డాషింగ్ నేచర్ మంత్రి పదవి నిర్వహించడానికి బాగా ఉపయోగ పడ్డాయి. ఇప్పుడు గతంలోకి వెళితే ఆనందం, ఆశ్చర్యం అనిపిస్తోంది. చదువుపై ఏమాత్రం ఆసక్తిలేని నేను ఎలాగో టెన్త్ దాకా రావడం, పిల్లలు, సంసారం మధ్య చదువుకోవడం ... అదే చదువు నన్ను ప్రపంచంలోకి తీసుకురావడంతో పాటు. ఎమ్మెల్యేనీ, మంత్రినీ కూడా చేసింది. దీనికి అంబేద్కర్ యూనివర్సిటీ నాకు దారి చూపింది అనిపిస్తుంది. మా లాంటి వాళ్ళకోసమే ఇది వెలిసిందేమో. అందుకే ఇప్పటికీ నేను అందరినీ ఎంకరేజ్ చేస్తాను. 'వయసు మరిచిపోయి చదువులో చేరండీ' అని.

* * *




గవర్నర్ క్రిష్ణకాంత్ నుండి గౌరవ డాక్టరేట్‌ను అందుకుంటున్న
డా॥ బి.ఆర్. అంబేద్కర్ సతీమణి సవితా అంబేద్కర్ (1994)



రాజేంద్రప్రసాద్

# ఆత్మవిశ్వాసమే ఆయన ఆయుధం

# రాజేంద్రప్రసాద్

"ఈ రోజు నేను విజేతను కాకపోవచ్చు. భవిష్యత్‌ను జయించగల ఆత్మవిశ్వాసం ఉంది ... దాని వెనుక నేను శ్రమించి నేర్చిన విద్య, విజ్ఞానాలున్నాయి."

'కాళ్ళు తడవకుండా జీవితాన్ని దాటడం ...' కష్టమంటారు. కానీ, కాళ్ళు లేకుండా జీవితంతో పోరాటం ఎంత దుర్భరమో రాజేంద్రప్రసాద్‌కు తెల్సు. పోలియో మహమ్మారి చిన్నప్పుడే కాళ్ళను తీసుకుంది. ఆటలు, పాటలు, చదువు సంధ్యలతో పరుగెత్తే ప్రపంచం అతన్ని ఒంటరిగా ఇంట్లో వదలిపోయింది ... ఏం ప్రయత్నం చేసినా 'నా కెందుకు ...' అన్న ప్రశ్న అతనిలో నిరుత్సాహాన్ని, న్యూనతను మిగిల్చింది ... కదలలేని జీవితంలోంచి నిరాశను పార్రదోలడానికి అతను పుస్తకాలను ఆశ్రయించాడు. కనపడిన ప్రతి కాగితం అతనికి అపురూపంగా కనిపించింది ... చిన్నప్పుడే దూరమైన చదువును అంబేద్కర్ యూనివర్సిటీ దగ్గర చేసింది. డిగ్రీ సాయంతో రాజేంద్రప్రసాద్ ఆత్మ న్యూనతను జయించాడు. కొత్త వెలుగులను ఆహ్వానించాడు. శ్రీకృష్ణ మాస్టారు ఆలోచనలు, సి.నరసింహారావు 'రేపు' పత్రిక, ఆంగ్లో ఇండియన్ లాంబర్ట్ ఇంగ్లీషు పాఠాలు ... ఇవన్నీ అతనికి కొత్త జీవితం చిగురులు తొడగడానికి సాయపడ్డాయి. ప్రకృతి పాదాలను హరిస్తే, బడికి దూరం చేస్తే అతను అక్షరాల మీద నడచి ప్రకృతినే వెక్కిరించగలిగాడు. ఇదీ రాజేంద్రప్రసాద్ సక్సెస్ స్టోరీ....

## పోలియో కాటు...

**మా**ది దళిత కుటుంబం. అమ్మ శ్యామల, నాన్న డోమెనిల్. పశ్చిమ గోదావరి జిల్లాలోని జగన్నాథపురం మాది. ఐటిఐ చదివిన నాన్న హైదరాబాద్‌లో ఆల్విన్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసేవారు. పోలియో వ్యాధిపై అవగాహన లేక వ్యాక్సిన్ వేయించలేదు. అదే నా జీవితాన్ని కాటేసింది. రెండు కాళ్ళు చచ్చుబడి పోయాయి. నడక నా జీవితం నుంచి తొలగిపోయింది. కొన్ని విషయాలు తెలియకపోవడం ఎంత విషాదాన్ని మిగులుస్తాయో నాకు అనుభవంలోకి వచ్చింది. అందుకే నాలో ప్రతి విషయాన్నీ తెలుసుకోవాలన్న ఆసక్తీ, కోరికా పెరిగాయి.

## దూరమైన బడి ...

ఐటిఐ ఇన్‌స్ట్రక్టర్ ఉద్యోగం రావడంతో మా మకాం విజయవాడకు మారింది. నాన్నకు చదువంటే మహా ఇష్టం, గౌరవం. మమ్మల్ని బాగా చదివించాలని తాపత్రయపడేవాడు. విజయవాడలో తమ్ముళ్ళతోపాటు నన్ను స్కూలుకు పంపారు. క్రీస్తురాజుపురమనే ఆ ప్రాంతంలోని బడి ఓ కొండపై ఉండేది. మోకాళ్ళు వంగని కాలిపర్స్ (వికలాంగులు వాడే ప్రత్యేక బూట్లు) వేసుకుని, చంకలో కర్రలు పెట్టుకుని వెళ్ళేవాణ్ణి. ఆ బడిలో బెంచీలు లేవు. కిందే కూర్చునేవాణ్ణి. పైకి లేవడానికి చాలా శ్రమ పడాల్సి వచ్చేది. నా శ్రమను గమనించిన టీచర్ "ఇంత కష్టపెట్టి ఈ పిల్లాడిని స్కూలుకు పంపకండి ... కిందపడి ఏదన్నా జరిగితే ఇంకా ప్రమాదం" అని అమ్మానాన్నను హెచ్చరించింది. అంతే ... ఆ రోజుతో స్కూలు జీవితం ముగిసిపోయింది.

## పుస్తకాలతో స్నేహం

నన్ను ఇంట్లోనే ఉంచి చదివించడానికి నిర్ణయించారు. అంగవైకల్యం జీవితాన్ని ఎంత దుర్భరం చేస్తుందో తెలిసివచ్చింది. నా దృష్టంతా తోటి పిల్లలు ఆడుకునే ఆటల మీదే. నేను వెళ్ళలేని ప్రదేశాల మీదే. తమ్ముళ్ళు పుస్తకాలు

తెచ్చి ఇచ్చి చదవమనేవారు. స్వయంగా చదివితే సరిగా అర్థమయ్యేవి కావు. ముఖ్యంగా లెక్కలంటే భయం కూడా. కానీ, చదవాలన్న, ప్రతి విషయాన్ని తెలుసుకోవాలన్న తృష్ణ మాత్రం పెరుగుతూనే ఉంది. పాఠ్య పుస్తకాలపై మనసు పోయేదికాదు కానీ, కాల్పనిక సాహిత్యం బాగా చదివేవాడిని. పుస్తకం దొరికితే ఆనందమే. అది తెలుగు పుస్తకం అయితే చాలు. ఇంటికి ఎవరైనా వస్తే వాళ్ళ చేతుల్లో పుస్తకం ఉందేమోనని చూసేవాడిని.

## అసహాయత, అక్షరాలు...

అప్పట్లో నా ఆలోచనలో స్పష్టత ఉండేదికాదు. కొంచెం న్యూనత. కొంచెం ఉత్సాహం. ఏదైనా సాధించాలన్న తపన, సహకరించని శరీరం... వీటిమధ్య ఆలోచనలు అస్తవ్యస్థంగా ఉండేవి. చిత్ర లేఖనం నేర్చుకోవడానికి ప్రయత్నించాను. చుట్టు పక్కల వారినుంచి విమర్శలే ఎదురయ్యాయి. జన్మతః రావాలని కొందరు, బొమ్మలు కూడు పెడతాయా అని మరికొందరు ఉత్సాహంపై నీళ్ళు చల్లేవారు. పుస్తకాలు చదువుతుంటే నాకు రాయాలని ఉండేది. కానీ, రాయడం మొదలుపెడితే అన్నీ అనుమానాలే. అప్పుడప్పుడు నా ఆలోచనలన్నీ అత్యాశలుగా అనిపించేవి. "చేయగలిగింది ఏమీ లేదు ... దొరికిన జీవితాన్ని అనుభవించడం తప్ప" అనే నిస్పృహ, రాజీ ధోరణి. ఎటూ తేల్చుకోలేని అసహాయత. పుస్తకాలు చదవడం కన్నా ఏమీ చేయలేనేమో అనుకునే వాడిని. మా తమ్ముళ్ళకు పుస్తకాలు చదివే అలవాటు లేకపోయినా నా కోసం లైబ్రరీ నుంచి తెచ్చేవాళ్ళు, పెద్ద తమ్ముడు మోహన్ నుంచి ఈ విషయంలో చాలా సహకారం ఉండేది. కప్పు గంతుల మల్లికార్జునరావు స్పానిష్ పోరాట కథ అనువాదం ... నగ్నసుందరి, జాక్ లండన్ 'ప్రకృతి పిలుపు' నాపై చాలా ప్రభావం చూపాయి.

> *"అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ నాకు పునర్జన్మనిచ్చింది. వికలాంగుడిగా ఆత్మ న్యూనతలో కొట్టుకుని పోతున్న నన్ను లేపి నిల్చోబెట్టింది. వైకల్యంతో ప్రకృతి నన్ను నిమ్నపరిస్తే... నా విద్యావకాశాలను కొల్లగొడితే యూనివర్సిటీ వీటిని తిరిగి నా దగ్గరికి చేర్చింది. నేను డిగ్రీలో చేరినప్పుడు 'ఈ చదువు ఉపయోగపడుతుందా...' అని పెదవి విరిచారు. కానీ, ఏ ఇంటర్వ్యూలోనూ నాకా ప్రశ్న ఎదురు కాలేదు."*

## శ్రీకృష్ణ మాస్టారు పరిచయం...

శ్రీకృష్ణ మాస్టారు పరిచయం పుస్తక పఠనాన్ని మరికొంత పెంచింది. ఆయన సిద్ధార్థ కాలేజీలో అధ్యాపకులు. అమ్మ, అమృతం కురిసిన రాత్రి, వేదాలలో ఏమున్నది? నిత్యజీవితంలో భౌతికశాస్త్రం ... ఇలాంటి వైవిధ్యమైన పుస్తకాలు ఇచ్చేవారు. ఆలోచనలు అస్తవ్యస్థంగా ఉండకూడదని, బాధ్యతాయుతంగా ఉండాలని చెప్పే మాస్టారు నా దృక్పథంలో మార్పుకు కారణం అయ్యారు. న్యూనతలో పాతరేసిన నా వ్యక్తిత్వం చిగురు తొడగడం ప్రారంభించింది. దానికి తోడు సి.నరసింహారావు 'రేపు' మాసపత్రిక నన్ను ప్రభావితం చేసింది. ఆత్మవిశ్వాసాన్ని, వ్యక్తిత్వాన్ని పాదుకొల్పింది.

## అమ్మ ఆశలు ...

తమ్ముళ్ళు ముగ్గురూ ఫస్ట్ క్లాస్ విద్యార్థులు. నాన్న నన్ను చదివించలేక వదిలేశారు. నాన్న నా గురించి ఎంతో బాధపడేవారు. అమ్మకేమో మేము వాళ్ళ అన్నయ్యల్లా తయారవ్వాలని కోరిక. మా మేనమామల్లో ఒకరు ఇంజనీర్, మరొకరు డాక్టరు. మేము ఎదగడానికి అమ్మ ఎంతో శ్రమ పడేది. దురదృష్టవశాత్తు అమ్మ ఆలోచనలకు అనుగుణంగా పరుగెత్తే శక్తి నాకు లేకపోయింది. మా డాక్టరు మామ సలహా మేరకు నాన్న నాకు మూడు చక్రాల బండి కొన్నారు. దాంతో బాహ్య ప్రపంచానికి దారులు తెరచుకున్నాయి. చక్రాల సాయంతో నేను బయట అడుగుపెట్టాను. ఖాళీగా ఉండలేక నాన్నగారి స్నేహితుడి వద్ద ఎలక్ట్రీషియన్ పని నేర్చుకున్నాను. అక్కడ పనికి కుదిరాను. నెలకు ఇరవై రూపాయల జీతం. ఆ డబ్బుతో 'చిత్రసూత్ర' అనే కరస్పాండెన్స్ కోర్సులో జాయిన్ అయ్యాను. చిత్రలేఖనం అంటే ఆసక్తి ఉండేది. తర్వాత అది కొనసాగించడానికి డబ్బులు సరిపోయేవి కావు. తమ్ముళ్ళ చదువుల కోసం కష్టపడుతున్న అమ్మా నాన్నలను డబ్బులు అడగాలనిపించేది కాదు. దానితో చిత్రలేఖనం మూలన పడింది. వచ్చిన జీతంతో పాత పుస్తకాలు కొనేవాడిని. ఎప్పటికైనా హోం లైబ్రరీ ఏర్పాటుచేసుకోవాలన్న కోర్కెకు అప్పుడే పునాది పడింది.

## 24వ ఏట డిగ్రీలో...

ఒక రోజు రెండో తమ్ముడు రమణ "నువ్వు బిఏ ఎందుకు రాయకూడదు" అన్నాడు. అంబేద్కర్ యూనివర్సిటీ గురించి చెప్పాడు. కానీ, నేను ఒప్పుకోలేదు. నా వల్ల అవుతుందా అన్న అనుమానం, పరీక్షలంటే భయం. దానితో నేను రాయనన్నాను. "నీకు నాలెడ్జ్ ఉంది. నువ్వు బిఏ చదవగలవు, తప్పకుండా డిగ్రీ చేయాలి. లేకపోతే నువ్వు సంపాదించిన విజ్ఞానానికి విలువ ఉండదు" అని నన్ను రమణ ప్రోత్సహించాడు. రమణ మాటలతో నేను 24వ ఏట అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ కోర్సులో చేరాను.

## ఇంగ్లీషుపై విజయం...

ఎంట్రన్స్ పాసై డిగ్రీలో చేరాను. కాని, ఇంగ్లీషు సమస్య ఎదురయ్యింది. ఇంగ్లీషు నేర్చుకోవడానికి ప్రయత్నం చేశాను. ఇంగ్లీషు వచ్చిన వాళ్ళు 'నీ కెందుకు ...' అనే వాళ్ళు. ప్రతి విషయంలో ఇదే ప్రశ్న నన్ను న్యూనతపరిచేది. దానితో ఇతరులను అడగడం మానేశాను. కానీ డిగ్రీ గట్టెక్కాలంటే తప్పదు. అందుకే సెయింట్ రీటాస్ స్పోకెన్ ఇంగ్లీష్ సెంటర్‌కు వెళ్ళాను. ప్రిన్సిపాల్ మిసెస్ లాంబర్ట్. ఆమె ఆంగ్లో ఇండియన్. ఇంగ్లీషు పట్ల నా ఆసక్తి గమనించి ఫీజు లేకుండా, నాకు ఎప్పుడు కుదిరితే అప్పుడు పాఠాలు చెప్పింది. ఆమెకు తెలుగురాదు. నాకు ఇంగ్లీషు రాదు. కానీ మూడు నెలల్లో ఇంగ్లీషు రాయడం, చదవడం నేర్చుకున్నాను. ఇంగ్లీషు ఆమె పెట్టిన భిక్షేనని చెప్పాలి. వాత్సల్య పూర్వకమైన సహకారం అది.

## పూర్తయిన డిగ్రీ...

చెప్పాగా ... పరీక్షలంటే భయం. డిగ్రీ మొదట సంవత్సరం పరీక్షలు దగ్గర పడుతుంటే గుండె దడగా ఉండేది. దానిని గమనించిన మూడో తమ్ముడు రవి పరీక్షల టైమ్‌కు ఢిల్లీ నుంచి వచ్చాడు. పరీక్ష రాస్తున్నంత సేపూ కాలేజీ వద్దే ఉండేవాడు. అది చాలా మనోధైర్యాన్ని ఇచ్చింది. నేను పరీక్ష బాగా రాశానంటే తాను పాసయినంతగా ఆనందించేవాడు. అది చూసి మరో నాలుగు పరీక్షలు రాసే శక్తి వచ్చేది. మూడు సంవత్సరాలు గడిచాయి. బిఏ సెకండ్ క్లాస్‌లో పాసయ్యాను. ఇది నాలో నింపిన ఆత్మవిశ్వాసం ఎంతని చెప్పను? పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ... ఇవీ నా సబ్జెక్టులు. మా కోఆర్డినేటర్ రఘునాథ్ గారి సహాయం మరిచిపోలేనిది. నా కోసం పైఅంతస్థులోని క్లాసులను కిందకు దింపేవారు. అలాగే డిగ్రీ కూడా నడచి నా దగ్గరికి వచ్చింది.

## అది పునర్జన్మ...

అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ నాకు పునర్జన్మ నిచ్చింది. వికలాంగుడిగా ఆత్మ న్యూనతలో కొట్టుకుని పోతున్న నన్ను లేపి నిల్చోబెట్టింది. వైకల్యంతో ప్రకృతి నన్ను నిమ్నపరిస్తే... నా విద్యావకాశాలను కొల్లగొడితే యూనివర్సిటీ వీటిని తిరిగి నా దగ్గరికి చేర్చింది. నేను డిగ్రీలో చేరినప్పుడు 'ఈ చదువు ఉపయోగపడుతుందా...' అని పెదవి విరిచారు. కానీ, ఏ ఇంటర్వ్యూలోనూ నాకా ప్రశ్న ఎదురు కాలేదు. డిగ్రీ తర్వాత రచనా వ్యాసంగంపై ఆసక్తితో అంబేద్కర్ యూనివర్సిటీలోనే 'రైటింగ్ ఫర్ మాస్ మీడియా"లో పీజీ డిప్లొమో చేశాను. పత్రికాఫీసులన్నీ పైఅంతస్థుల్లో ఉన్నాయి. అందుకే నా ఉద్యోగ ప్రయత్నాలు ఫలించలేదు. ఎస్టీడీ బూత్ పెట్టాను. కానీ, సెల్ ఫోన్ నా రాత మార్చేసింది. ఎస్టీడీ బూత్ మూతపడింది. ఇప్పుడు జీవనోపాధి కోసం ఓ చిన్న వ్యాపారం చేస్తున్నాను. హాబీగా అప్పుడప్పుడు పత్రికలకు వ్యాసాలు రాస్తున్నాను. కథలు పంపుతుంటాను. అయినా... అందరిలా నీకెందుకు అని ప్రశ్నించకుండా నన్ను అక్కున చేర్చుకుని నాలోని ఆత్మన్యూనతను పారదోలిన అంబేద్కర్ యూని వర్సిటీని ఎలా మర్చిపోగలను.

* * *



సూర్యధనుంజయ్ నాయక్

# చీకటి తాండాలోంచి వెండి వెన్నెల్లోకి...

# సూర్యా ధనుంజయ్ నాయక్

ఆమె మట్టిలోంచి వచ్చిన మాణిక్యం. చీకటి తండాలో ఉదయించిన సూర్యతేజం. తెలుగు భాషతో సంబంధమే లేని బంజారా కుటుంబంలో పుట్టి - ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యాపకురాలిగా ఎదిగిన ఈమె విజయగాథకు డా. బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయమే మూలవేదిక. నల్లగొండ జిల్లాలోని ఒక మారుమూల గిరిజన తండా నుంచి వచ్చిన సూర్యాధనుంజయ్ నాయక్ విజయం వెనుక వెన్నుతట్టి ఆడపిల్లను చదివించిన అమ్మ ఆదర్శం ఉంది. అంతకు మించి వేలుపట్టి చదువుల లోగిళ్ళలో నడిపించిన భర్త సహకారమూ ఉంది. ఓపెన్ యూనివర్సిటీ నుంచి బిఏ, ఎంఫిల్, పీహెచ్‌డీలు పూర్తిచేసి, తన సుదర్ఘ విద్యాయాత్రను విజయవంతంగా పూర్తిచేసుకున్న సూర్య ఇవాళ తండా యువతులకు గొప్ప స్ఫూర్తి. తెలంగాణ లంబాడీల్లో తెలుగులో పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ పొంది, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఎదిగిన తొలి బంజారా అధ్యాపకురాలు ఆమె. ఎన్ని 'భోజరాజు మెట్లు' దాటితే... సూర్యా ఈ తేజోమయ విజయాన్ని సొంతం చేసుకుందో తెలియాలంటే ఆ విజయగాథను ఆమె నోటి నుంచే విందాం.

**న**ల్లగొండ జిల్లా మిర్యాలగూడ 'జప్తి వీరప్పగూడెం' గ్రామంలోని 'భల్లూ నాయక్ తండా' మాది. చాలా మారుమూల తండా. అమ్మ ధ్వాళీబాయి. నాన్న భల్లూనాయక్. మాది వ్యవసాయ కుటుంబం. బాగా బతికి చెడిన వాళ్ళమని అమ్మ ఎప్పుడూ అంటుండేది. మేం పదిమంది సంతానం. ఏడుగురు అక్కా చెల్లెళ్ళం. ముగ్గురం అన్నదమ్ములం. నేను తొమ్మిదవ దానిని. నాకు మూడేళ్ళ వయసు ఉన్నప్పుడనుకుంటా నాన్న చనిపోయారు. అప్పటి నుంచి అమ్మే అన్నీ తానై మమ్మల్నందరినీ పెంచి పెద్ద చేసింది. వ్యవసాయ పనులు కూడా తనే చేసేది. పెద్దక్కని ఇల్లరికం ఇచ్చి పెళ్ళి చేసింది. మా అన్నయ్యలు చదువుకోవ డానికి వెళ్ళిపోయారు. ఇంట్లో అక్కే, అమ్మ తర్వాత అమ్మలా మా కుటుంబానికి అండగా నిలబడింది.

## చదువంటే ఎంతో ఇష్టం

బాగా చదుకోవాలని చిన్నతనం నుంచీ నాకు ఉండేది. మా తండాలో రెండవ తరగతి వరకే ఉంది. మూడవ తరగతి చదువుకోవాలంటే దూదియ తండాకు పోవాలి. అక్కడ ఐదవ తరగతి వరకూ చదువు చెప్తారు. ఆ తండా మాకు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంది. మా అక్కకు అప్పటికి నా ఈడు కూతురు ఉంది. మా ఇద్దరినీ చదువుకోవడానికి అక్కడికి పంపడానికి అమ్మ భయపడలేదు. నేను, అక్క కూతురు మాజీబాయి ఇద్దరం కలిసి పొద్దున్నే అంత దూరమూ నడిచి వెళ్ళేవాళ్ళం. ఆ తండాకి పోవాలంటే చక్కటి దారిలేదు. మడికట్ల మీద నుంచి నడుచుకుంటూ పోవాల్సి వచ్చేది.

ఐదవ తరగతి తర్వాత మళ్ళా నా చదువు కొనసాగింపు ప్రశ్నార్థకమైంది. మిర్యాలగూడలో బాలికల ఉన్నత పాఠశాల ఉంది. అక్కడ 6-10వ తరగతి వరకూ బోధిస్తారు. మా ఊర్లోని ప్రసాద్ అనే మాస్టారు నేను బాగా చదువు తానని, ఎలాంటి పరిస్థితుల్లో నన్ను చదివించడం మాన్పించవద్దని మా ఇంటికి వచ్చి మరీ అమ్మకు చెప్పారు. సారు మాటలతో నన్ను మిర్యాలగూడలోని పాఠ శాలకి పంపించడానికి అమ్మ సిద్ధపడింది. నేను, మాజీబాయి ఇద్దరం అక్కడ చేరాం. మిర్యాలగూడ హైస్కూలు చేరుకోవాలంటే మా తండా నుంచి దాదాపు 15 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలి. అప్పుడు అక్కడికి బస్సుల రాకపోకలూ ఉండేవికావు. రోడ్లూ లేవు. ఆ పాఠశాలకు నేను, మాజీ ఇద్దరం తండా నుంచి కొన్నాళ్ళు నడుచుకుంటూ వెళ్ళి వచ్చేవాళ్ళం. ఒక నెల తర్వాత అనుకుంటా మిర్యాలగూడ ఎస్సీ హాస్టల్‌లో మాకు సీటు వచ్చింది. (అప్పటికి అక్కడ మాకు

ఎస్టీ హాస్టలు లేదు.) నేను హాయిగా ఊపిరి పీల్చుకున్నాను. ఉచిత విద్యాబోధన కావడంతో ఇంట్లో వాళ్ళు చదువు ఆపించేస్తారేమోనన్న భయం, మానసిక ఒత్తిడులు పోయాయి.

## ఇంటర్‌లో ఉండగా పెళ్ళి...

అక్కడ చదువుకునేటప్పుడు ప్రతి వారాంతంలోనూ నేను, మాజీ ఇంటికి వెళ్ళి వస్తుండేవాళ్ళం. అప్పుడు ఇంట్లో వాళ్ళు మాకు పొలం పనులు, మట్టి ఎత్తమనడం, చెత్త ఏరమనడం, నాట్లేయమనడం చెప్పేవారు. నేను, మాజీబాయి ఆ పనులు చేయమని ఒకటే ఏడ్చేవాళ్ళం. చదువుకుంటాం అనే వాళ్ళం. మాకప్పుడు ఎంతసేపూ చదువు మీదే ధ్యాస ఉండేది. మా మనసు గ్రహించిన అమ్మ 'వాళ్ళని వదిలేయండి. వాళ్ళకేం పనులూ చెప్పొద్దు' అని ఆదేశాలిచ్చింది. అప్పటినుంచీ ఇంట్లో వాళ్ళు మా ఇద్దరికీ పనులు చెప్పడం మానేసి మమ్మల్ని హాయిగా వదిలేశారు. మొత్తానికి విజయవంతంగా నేను, మాజీబాయి పదవ తరగతి పాసయ్యాం. భల్లూనాయక్ తండాలో పదవ తరగతి వరకు చదివి, పాసైన 'ఇద్దరమ్మాయిలు'గా మేం అక్కడ చరిత్ర సృష్టించాం. అప్పుడు అమ్మ, అక్కల ఆనందం మాటల్లో చెప్పలేం. మల్లా ప్రసాద్ సార్ మాటతోనే అమ్మావాళ్ళు మిర్యాలగూడ కళాశాలలో నన్ను ఇంటర్ బైపీసీలో చేర్పించారు.

అయితే తండాలోని మా బంధువులకు మాత్రం నేను ఇలా చదువుకోవడం మింగుడు పడలేదు. ఎందుకంటే 10-11 సంవత్సరాలు రాగానే మా తండాలో ఆడపిల్లలకి పెళ్ళి చేసేస్తారు. అప్పటికే నాకు 17 సంవత్సరాలు. అంటే వాళ్ళ దృష్టిలో నా పెళ్ళి వయసు దాటిపోయి చాలా ఏళ్ళు అయినట్టు లెక్క. తండాలో వాళ్ళు 'ఏంటి ఇంకా అమ్మాయికి పెళ్ళి చేయలేదు. కలెక్టర్‌ని చేద్దామనుకుంటున్నారా' అంటూ సూటిపోటీ మాటలు అనడం ప్రారంభించారు. నాకు చదువు మీదున్న ఆసక్తిని గ్రహించే అమ్మ అంతవరకూ పట్టుదలగా నన్ను చదివించింది.

చివరకు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసేనాటికి ధనుంజయ్‌తో పెళ్ళి నిశ్చయించారు. నేను పెళ్ళి చేసుకోను, చదువుకుంటానంటూ ఏడ్చాను. అమ్మ ధనుంజయ్ దగ్గరి నుంచి నన్ను చదివిస్తానన్న మాట తీస్కుంది. అందుకే పెళ్ళి నిశ్చయించాను అని నాకు సర్దిచెప్పింది. 1987లో మా పెళ్ళి అయింది. పెళ్ళికి ముందు ఇచ్చిన తన మాటకు ఆయన ఎంతగా కట్టుబడి ఉన్నారన్నదానికి నేను కెరీర్ పరంగా సాధించిన ఈ 'పొజిషనే' నిదర్శనం. తాను మాటల మనిషిని కాదని, చేతల వ్యక్తినని 'అక్షరాలా' నిజం చేసి చూపించారాయన. ఎమ్మెస్సీ జియోలజీ చేసి ఆయన కమర్షియల్ టాక్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు.

***"చివరకు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసేనాటికి ధనుంజయ్‌తో పెళ్ళి నిశ్చయించారు. నేను పెళ్ళి చేసుకోను, చదువుకుంటానంటూ ఏడ్చాను. అమ్మ ధనుంజయ్ దగ్గరి నుంచి నన్ను చదివిస్తానన్న మాట తీస్కుంది. అందుకే పెళ్ళి నిశ్చయించాను అని నాకు సర్దిచెప్పింది. 1987లో మా పెళ్ళి అయింది. పెళ్ళికి ముందు ఇచ్చిన తన మాటకు ఆయన ఎంతగా కట్టుబడి ఉన్నారన్నదానికి నేను కెరీర్ పరంగా సాధించిన ఈ 'పొజిషనే' నిదర్శనం."***

ఇంటర్ రెండవ సంవత్సరంలో నేను గర్భవతిని కావడంతో థియరీ పరీక్షలు రాయలేకపోయాను. ఇంటర్ చదువుకు అలా గండిపడింది. 1988లో బాబు పుట్టాడు. 1989లో మా వారు నా చేత అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశ పరీక్ష రాయించారు. ఇది నా జీవితాన్ని మలుపు తిప్పింది. ప్రవేశ పరీక్షకు అవసరమైన మెటీరియల్ అంతా ఆయన తెచ్చిపెట్టారు. నేను ఈ ప్రవేశ పరీక్ష రాస్తున్న విషయం మటుకు స్నేహితులెవ్వరికీ తెలియనివ్వద్దన్నాను. అందులో అర్హత పొందలేకపోతే అవమానమని అలా చేశాను. కాని ఆ ప్రవేశ పరీక్ష రోజే మా ఇంటికి ఆయన స్నేహితులు వచ్చారు. వాళ్ళందరికీ నేను పరీక్ష రాస్తున్నట్టు తెలిసిపోయింది. పైగా ఆ రోజు మా ఇంటి నిండా బంధువులు కూడా ఉన్నారు. మరొకవైపు పిల్లాడి గురించి ఆలోచన. వీటి మధ్యనే ఆ ఎంట్రన్స్ పరీక్షకు హాజరయ్యాను.

## ఇల్లు, పిల్లల బాధ్యతల మధ్యనే...

ఆ పరీక్ష రాయడానికి వచ్చిన వాళ్ళు ఎన్నోసారి నేను ప్రవేశ పరీక్ష రాస్తున్నానంటూ అడిగారు. జీకే పేపరు చాలా కష్టంగా ఉంటుందన్నారు. సిటీలో ఉండేవాళ్ళే ఈ పరీక్ష కష్టంగా ఉంటుందనుకుంటే పల్లెటూరి అమ్మాయిని,

అందులో తండా నుంచి వచ్చిన నేను పరీక్ష ఏం రాయగలనన్న సందేహం కలిగింది. కాని వారందరూ భయపడిన జీకే నేను బాగా రాశాను. ఇదంటే నాకు భయం లేకపోవడానికి కారణం మా వారు గ్రూప్-Iకి సిద్ధమయ్యేటప్పుడు నేను కూడా ఆయనతో పాటు జీకే పుస్తకాలను బాగా చదివేదానిని. రోజూ పేపర్లు చూసేదాన్ని. వీటికితోడు మా ఇంటికి వచ్చే ఆయన స్నేహితులు చేసే రాజకీయ చర్చలను కూడా వంటింట్లో వంట చేసుకుంటూ వినేదాన్ని. ఇవన్నీ జీకే పరీక్ష రాయడానికి నాకు ఉపయోగపడ్డాయి. కాని ఇంగ్లీషంటేనే కొద్దిగా భయం. మొత్తానికి యూనివర్సిటీ ప్రవేశ పరీక్ష బాగానే రాశాననిపించింది. తర్వాత ఆ విషయం మరచిపోయాను కూడా. ప్రవేశ పరీక్షలో అర్హత పొందాను. ఈ విజయం నాలో ఆత్మవిశ్వాస బీజాలు నాటింది. పిల్లలు, బంధువులు, ఇంటి పనుల మధ్యే డిగ్రీలన్నీ పూర్తిచేశాను.

డిగ్రీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, పొలిటికల్ సైన్సెస్ తీసుకున్నాను. సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలపట్ల మొదటి నుంచీ నాలో ఆసక్తి ఎక్కువ. అందుకే వీటిని ఎంచుకున్నాను. 1990లో ఇందులో చేరాను. 20 ఏళ్ళకే ఇద్దరు పిల్లలు నాకు. పిల్లల బాధ్యతలతో ఓపెన్ యూనివర్సిటీ క్లాసెస్‌కి వెళ్ళింది లేదు. ఇంటి పనులతో చదవలేక పరీక్ష రాయనని ఏడ్చాను. కాని ఆయన 'మోడల్ పేపరైనా తెలుస్తుంది కదా' అని పంపారు. నాకు కావాల్సిన మెటీరియల్ ఎప్పటికప్పుడు అందిస్తూ చదువులో బ్రేక్ రాకుండా చూశారు. చివరకు అలాగే పరీక్షలకు హాజరయ్యాను. అప్పటికి పాపకూడా పుట్టింది. పిల్లల్ని ఇంట్లో వదిలి పరీక్ష రాయలేకపోయేదాన్ని. వాళ్ళ చుట్టూ మనసు కొట్టుకునేది. అందుకని మా వారు నాతోపాటు వచ్చి పరీక్ష అయ్యేవరకూ అక్కడే ఉండి వాళ్ళని ఆడించేవారు. చివరి పరీక్ష రోజు పాపకు మీజిల్స్ వచ్చి ఒక పేపరు రాయలేకపోయాను. ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ రెండు సంవత్సరాల పేపర్లు కలిపి ఒకేసారి రాసి అన్ని పేపర్లు పాసయ్యాను. ఈ ఒత్తిడుల మధ్యనే టైపు కూడా నేర్చుకున్నాను. టైపు ఇన్‌స్టిట్యూట్‌కు నాతోపాటు ఇద్దరు పిల్లల్ని తీసుకెళ్ళేదానిని. వాళ్ళు ఆడుకుంటూ ఉంటే నేను టైప్ నేర్చుకునేదానిని.

> నిరాశా, నిస్పృహలకు లోనుకాకుండా ప్రయత్నం కొనసాగిస్తే మనం ఏ పనైనా సాధించగలం.
>
> **- షేక్‌స్పియర్**

## నాతో పిల్లల్ని తీసుకెడుతూ ఎంఏ రెగ్యులర్‌గా చేశాను ...

1990లో డిగ్రీలో చేరితే 1994లో పూర్తయింది. ఓపెన్ యూనివర్సిటీ వేసిన పునాదితో బీఈడీ ప్రవేశపరీక్ష రాశాను. సీటు వచ్చింది. ఆంధ్ర మహిళా సభలో చేరాను. దాన్నీ పూర్తి చేశాను. బీఈడీ ఇంగ్లీషు మీడియం బోధనంతా ఇంగ్లీషులోనే ఉండేది. నాకు మొదట్నించీ ఇంగ్లీషు సమస్య. అందుకని మా వారు వాటికి సంబంధించిన తెలుగు మెటీరియల్‌ని సేకరించి నాకు అందించారు. పరీక్షలు తెలుగులో రాసే సౌలభ్యం ఉండేది. 1995లో బీఈడీ పూర్తయింది. తర్వాత ఎంఏ రెగ్యులర్ చేయమన్నారాయన. తెలుగు, సోషియాలజీ ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు పెట్టుకున్నాను. పరీక్షలూ రాశాను. సోషియాలజీలో అర్హత పొందాను. ఎంఏ తెలుగు సీటు కూడా వచ్చింది. తెలుగు సబ్జెక్టుపై నాకు విపరీతమైన ఆసక్తి ఏర్పడడానికి కారణం నేను చదువుకున్న బడిలోని మా టీచర్లే. 1996లో తెలుగు ఎంఏ కోఠి ఉమెన్స్ కాలేజీలో చేరాను. నాతోపాటు పిల్లల్ని కూడా కాలేజీకి తీసుకెళ్ళేదానిని. పిల్లలిద్దరూ అప్పుడు ఎల్‌కేజీ, యూకేజీలు చదువుతున్నారు.

సరిగ్గా అప్పుడే డీఎస్సీ ప్రకటన పడింది. ఆ పరీక్ష రాశాను. జనరల్‌లోనే అర్హత పొందాను. పెద్ద అంబర్‌పేట జడ్పీ హెచ్ఎస్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఏడు, ఎనిమిది తరగతులకు సైన్స్ పాఠాలు చెప్పేదానిని. అప్పటికే అక్కడ సీనియర్

తెలుగు టీచర్ తెలుగు సబ్జెక్టును చెబుతుండడంతో నేను సైన్స్ క్లాసులు తీసుకోవాల్సి వచ్చింది. బైపీసీ విద్యార్థినిని కాబట్టి పాఠాలు బాగానే చెప్పగలిగాను. బీఎడ్ చేస్తున్నప్పుడు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో గ్రూప్-I ప్రీ కోచింగ్ క్లాసులకు కూడా వెళ్ళేదాన్ని. నా నాలెడ్జ్‌ను మెరుగుపరచుకోవడానికి, చదివే పద్ధతులను మరింత పదునుపెట్టుకోవడానికి ఈ కోచింగ్ చాలా ఉపయోగపడింది.

## ఆర్ట్స్ కళాశాలలో చదవాలన్న కోరికా తీరింది...

ఎంఏ మొదటి సంవత్సరం చదివేటప్పుడు టీచర్ ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో చేరి దీర్ఘకాలిక సెలవు పెట్టి ఎంఏ పూర్తిచేశాను. ఎంఏ రెండవ సంవత్సరంలో ఉండగా మూడవ పిల్లాడిని కన్నాను. ఎంఏ పూర్తిచేసిన వెంటనే ఎంఫిల్ చేసే ఛాన్సు లేకపోవడంతో లైబ్రరీ సైన్సెస్ కోర్సులో చేరాను. అలా ఆర్ట్స్ కాలేజీలో చదవాలన్న కోరికను కూడా నెరవేర్చుకున్నాను. ఇది నాకు మరుపురాని అనుభవం. ఎందుకంటే ఈ జన్మకు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో చదువుతానని అనుకోలేదు నేను. చదువు మీద నాకున్న తృష్ణకు ఎన్ని కోర్సులు చేస్తున్నా విసుగు అనిపించేది కాదు, రాను రాను ఆసక్తి పెరగడమే తప్పించి. అయితే నా విజయాల్లో నేను చేసిన కృషి వెనుక మా వారి ప్రోత్సాహం రెట్టింపు ఉంది. అది కొరవడి ఉంటే ఈ స్థాయిలో ఉండి ఉండేదానిని కాదు. నన్ను చదివించే క్రమంలో నా భర్త ధనుంజయ్‌కి లండన్ కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేసే అవకాశం వచ్చింది. నా చదువు కోసం ఆయన ఆ అపురూపమైన అవకాశాన్ని వదులుకున్నారు.

*"మా అమ్మ నా చదువులు అర్థంకాక 'ఇప్పుడు ఎన్నో తరగతిలో ఉన్నావు?' అని తరచూ అడుగుతుండేది. నా పీహెచ్‌డి డిగ్రీ అమ్మ చేతిలో పెట్టి, డిగ్రీ తీసుకునే రోజు అమ్మ చేత వేదికపై నాలుగు మాటలు మాట్లాడిద్దామనుకున్నాను. అమ్మకు కూడా నా మనసులో మాట చెప్పాను. కానీ ఆ కోరిక తీరలేదు. హఠాత్తుగా మూత్రపిండాలు చెడిపోయి అమ్మ చనిపోయింది. ఇది నా జీవితంలోని తీరని కోరికగా మిగిలిపోయింది."*

1997లో పీజీ, 1998లో లైబ్రరీ సైన్సెస్ పూర్తయింది. తర్వాత ఉస్మానియాలో ఎంఫిల్ సీటు వచ్చింది. 1999-2000లో ఎంఫిల్ సమర్పించాను. 'రామాయణ అరణ్యకాండలోని ఆశ్రమాలు - శ్రీరాముడు దర్శించిన ఆశ్రమాలు' పై పరిశోధన చేశాను. ఎంఫిల్ చేసేటప్పుడు ఉస్మానియా తెలుగుశాఖలో ఎస్టీ మహిళా కోటా కింద అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇంటర్వ్యూలు జరిగాయి. అదే కాకుండా డిగ్రీ, జూనియర్ కాలేజీ లెక్చరర్ పోస్టులకు ఏపీపీఎస్సీ నుంచి ఎంపికయ్యాను. మెదక్ జిల్లా సదాశివపేట డిగ్రీ కాలేజీలో పోస్టింగ్ వచ్చింది. ఆదిలాబాద్ జూనియర్ కాలేజీలో వచ్చింది. సదాశివపేటలో 1999 జులైలో చేరాను. కాలేజీ మధ్యాహ్నం ఉండేది. పొద్దున్న పది గంటలకు ఇంటి నుంచి బయలుదేరితే రాత్రి పది గంటలకు ఇంటికి చేరేదాన్ని. అలా ఆరు నెలలు కష్టపడ్డాను. మా పిల్లలు కూడా అప్పుడు నాకు ఎంతగానో సహకరించారు.

## తండాకు అండగా ఉండాలని ...

ఉస్మానియాలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సెలక్టయ్యాను. 1999 నవంబరు 30న యూనివర్సిటీలో చేరాను. 2001లో పీహెచ్‌డీలో చేరాను. మసన చెన్నప్ప నా గైడ్. 'నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం - జీవన చిత్రాల'పై పీహెచ్‌డీని చేశాను. ఫీల్డు వర్కు బాగా ఉండేది. మా బంజారా భాషే కదా మెటీరియల్ సంపాదించడం కష్టం కాదు అనుకున్నాను. కాని చాలా కష్టమైంది. పైగా మా భాషకు లిపిలేదు. ఓరల్‌గా వాటిని సేకరించడమే. ఎఫ్ఐపీ కింద రెండు సంవత్సరాలు సెలవు తీసుకుని ఒకటిన్నర ఏడాదిలో పీహెచ్‌డి పూర్తి చేశాను. 2006 మేలో పీహెచ్‌డి పట్టా పొందాను. జనవరిలో అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకి దరఖాస్తు పెట్టుకున్నాను. 2007, మే 14న అసోసియేట్ ప్రొఫెసర్‌ను అయ్యాను. మా అమ్మ నా చదువులు అర్థంకాక 'ఇప్పుడు ఎన్నో తరగతిలో ఉన్నావు?' అని తరచూ అడుగుతుండేది. నా పీహెచ్‌డి డిగ్రీ అమ్మ చేతిలో పెట్టి, డిగ్రీ తీసుకునే రోజు అమ్మ చేత వేదికపై నాలుగు మాటలు మాట్లాడిద్దామనుకున్నాను. అమ్మకు కూడా నా మనసులో మాట చెప్పాను. కానీ ఆ కోరిక తీరలేదు. హఠాత్తుగా మూత్రపిండాలు చెడిపోయి అమ్మ చనిపోయింది. ఇది నా జీవితంలోని తీరని కోరికగా మిగిలిపోయింది.

ఇదీ నా సుదీర్ఘ విద్యా ప్రయాణం. నేనెంత విజయాన్ని సాధించానో మా


గురువులు, ఇతరులు నన్ను మెచ్చుకున్నప్పుడుగాని తెలియలేదు నాకు. అన్నింటికన్నా నాకు ఆనందాన్ని ఇచ్చిన విషయం నన్ను స్ఫూర్తిగా తీసుకుని ఇంటర్ వరకూ చదివిన మా తండాలోని ఎందరో అమ్మాయిలు ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చేయడం. ఇప్పుడు 37 సంవత్సరాలు నాకు. నా లక్ష్యం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బంజారాలపై పరిశోధనకు ఒక ప్రత్యేక కేంద్రాన్ని నెలకొల్పాలని, గిరిజన సాహిత్య సాంప్రదాయాలపై కృషి చేయాలని. అంతేకాదు తండా ప్రజలకోసం కూడా ఏదైనా చేయాలని ఉంది. ముఖ్యంగా బాలికల విద్య కోసం.

* * *

ఈ ప్రపంచం కఠినాతి కఠినమైంది. ఈ వాస్తవాన్ని ఎదుర్కొనడంలోనే ఆనంద రహస్యం ఇమిడి ఉంది.

**– బెర్ట్రాండ్ రస్సెల్**

*నేనెంత విజయాన్ని సాధించానో మా గురువులు, ఇతరులు నన్ను మెచ్చుకున్నప్పుడుగాని తెలియలేదు నాకు. అన్నింటికన్నా నాకు ఆనందాన్ని ఇచ్చిన విషయం నన్ను స్ఫూర్తిగా తీసుకుని ఇంటర్ వరకూ చదివిన మా తండాలోని ఎందరో అమ్మాయిలు ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చేయడం.*



నరేందర్

# విధినే ఎదిరించిన ధీరత్వం

# నరేందర్

కన్నీటి చారల్లో కారిపోయిన బాల్యం అతనిది. బాధల మధ్య, బాధ్యతల మధ్య నలిగిపోయిన జీవితాన్ని నిటారుగా నిలబెట్టుకున్న పట్టుదల అతనిది. అడుగడుగునా అవరోధమై నిలిచిన విధిని అవలీలగా ధిక్కరించి నడిచిన ధీరత్వం అతనిది. వరంగల్ జిల్లా మారుమూల పల్లెలో పుట్టి, నిజామాబాద్ జిల్లాలో పసితనమంతా పనిలోనే మునిగిపోయిన నరేందర్... చదువు సాయంతో ఏటికి ఎదురీదిన సాహసి. లేత చేతుల్తో సోడాలమ్మి, పసిపాదాల్తో ఊరూరూ తిరిగి పాలూ, పెరుగు అమ్మి, కడుపు మాడ్చుకుని అమ్మ చేసిన కమ్మని ఇడ్లీలు అమ్మి కుటుంబాన్ని నిలబెట్టి ఇవాళ తహసీల్దారుగా తలెత్తుకు నిలబడగలిగేలా ఎదగడం సాహసం కాక ఇంకేమవుతుంది. బాల్యమంతా కష్టాల కొలిమిలో మగ్గిపోయిన నరేందర్ జీవన పోరాటంలో చదువే ఆయుధం అయ్యింది. స్కూలు దశలోనే ఆగిపోయిన చదువుతో నిరాశ చెందకుండా డా. బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ చేసి, ఆ తరువాత పైచదువులు చదివిన నరేందర్ జీవితంలో ఎన్నో మలుపులు, ఎన్నెన్నో మజిలీలు. ప్రతీ మలుపులో తన కృషి, పట్టుదల, పుట్టెడు శ్రమతో జీవితాన్ని మలుచుకుని తన సొంత జిల్లాలోనే డిప్యూటీ తహసీల్దారుగా ఎదిగిన నరేందర్‌ను చూసి తన ఊరు మురిసిపోతోంది. ఒకప్పుడు చీదరించుకున్న వాళ్ళే ... 'నింగి కెగిరితే నిబిడాశ్చర్యంతో వీరు...' అన్నట్టుగా అవాక్కవుతున్నారు. తన కష్టాలు తీరే రోజు కోసం కళ్ళల్లో వత్తులేసుకుని ఎదురుచూసే తల్లికి... ఉద్యోగం వచ్చిందని ఫోన్ చేసి చెప్పడానికి జేబులో ఒక్క రూపాయి కూడా లేక విలవిల్లాడిన క్షణాన్ని ఇప్పటికీ గుర్తుచేసుకుని తల్లడిల్లిపోయే నరేందర్ అవమానాల చీకటి పొరలను అక్షరాల దివిటీల్తో ఎలా తరిమేశాడో ఆయన మాటల్లోనే వినండి ...

### బాల్యంలోనే బాధ్యతలు

**అ**వమానానికి అంత శక్తి ఉంటుందని ఆ క్షణం వరకూ నాకు తెలియదు. ఒకటికాదు, రెండు కాదు. పొద్దున లేచినప్పటి నుంచి రాత్రి పడుకునేదాకా ఏదో ఒక రూపంలో వెటకారం నన్ను వెంటాడుతూనే వచ్చింది. వరంగల్ జిల్లా పరకాలలో నేను పుట్టాను. మా నాయన అప్పట్లో భూస్వామి. నక్సలైట్లు మా భూమిని ఆక్రమించుకున్నారు. ఆ తర్వాత మా నాయన తాగుడుకు అలవాటు పడ్డాడు. ఏకంగా మద్యానికి బానిసయ్యాడు. పోయేది పోగా మిగిలిన కొద్దిపాటి ఆస్తిని కూడా అమ్మేసి మా సోదరి పెళ్ళి చేశారు. కట్టుబట్టలతో మిగిలిన మేము నిజామాబాద్ జిల్లా మక్లూర్ మండలం కొత్తపల్లికి మకాం మార్చాం. అప్పుడు నా వయస్సు పన్నెండేళ్ళు. ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకు కొత్తపల్లిలో చెట్టుకింద చదువులు చెప్పే మాస్టర్ దగ్గర చదువుకున్నాను. నాల్గవ తరగతి నుంచి 7వ తరగతి వరకు వరంగల్ జిల్లా పరకాలలో బీసీ హాస్టల్‌లో చేరి చదివాను. కానీ ఏడో తరగతి ఫెయిల్ అయ్యాను. మా నాయిన నిరంతరం మద్యం మత్తులో జోగడంతో ఇంటి బాధ్యత నాపై పడింది. నేను తిరిగి కొత్తపల్లి చేరాల్సి వచ్చింది. కొత్తపల్లి నుంచి నందిపేటకు రోజూ ఉదయం పాలు, పెరుగు తీసుకెళ్ళి అమ్మేవాడిని. మధ్యాహ్నం పూట సోడాలు కూడా అమ్మే వాడిని. అలా సంపాదించిన దానితోనే మా కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడిని. కొత్తపల్లికి సరైన రవాణా సౌకర్యాలు లేవు. పోయి రావడం కష్టమయ్యేది. దీంతో కొత్తపల్లి నుంచి ధర్మారం గ్రామానికి మకాం మార్చాల్సి వచ్చింది. అక్కడికి సమీపంలోని సుద్దపల్లి నుంచి పాలు, పెరుగు తీసుకుని నిజామాబాద్‌కు వెళ్ళి అమ్ముకునేవాడిని. నా కష్టాన్ని గమనించిన మా అమ్మ వేడినీళ్ళకు చన్నీళ్ళలా సహకరించేది. తనకు తెలిసిన విద్యల్లో కమ్మని ఇడ్లీలు చేయడం ఒకటి. మా అమ్మ ఇడ్లీలు చేసి ఇస్తే

వాటిని తీసుకెళ్ళి అమ్మేవాడిని. ఇలా రకరకాల పనులు చేసుకుంటూనే 1986–87లో కొత్తపల్లిలోని జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యాను. దురదృష్టం నా నెత్తిమీదనే ఉంది. ఇంగ్లీష్‌లో ఒక్క మార్కుతో ఫెయిలయ్యాను. చుట్టుపక్కల వారి మాటలు మనసును కష్టపెట్టేవి. నీకెందుకురా చదువు అనే వారి వెటకారం పుండుమీద కారం చల్లినట్టు ఉండేది నాకు.

## పగలు హోటల్, రాత్రి సెక్యూరిటీ గార్డు

నలుగురూ నవ్వి నగుబాటు అయిన ఆ ఊళ్ళో ఉండలేకపోయాను. మాదాపూర్‌కు వచ్చేసి అదే ఊరిలో కొంతపెట్టుబడితో ఓ చిన్న హోటల్ ప్రారంభించాను. పగలంతా అక్కడ పనిచేస్తూ రాత్రిళ్ళు ఓ బాటిలింగ్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా కుదిరాను. ఇట్లా కొన్నాళ్ళు గడిచిపోయాయి. నాలుగు రాళ్ళు పోగుపడ్డాక సొంతంగా ఓ జీపు కొన్నాను. అలాగే సొంత డైరీని కూడా ఏర్పాటుచేసుకుని మళ్ళీ పాలవ్యాపారం చేయడం మొదలెట్టాను. అప్పుడు నిజామాబాద్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా గిరిధర్ సారు పని చేస్తుండే. ఆయన ఇంటికి నేను రోజూ పాలు తీస్క పోయేవాణ్ణి. అట్లా ఆయన ప్రభావం నాపై బలంగా పడింది. ఆయనను ఆదర్శంగా పెట్టుకున్న నాకు చదువుకోవాలన్న ఆశ మళ్ళీ చిగురించింది. గిరిధర్ సారుతో మాట్లాడే అవకాశం రావడంతో నా మనసులోని మాటను ఆయనకు చెప్పాను. నా ఆసక్తి గమనించిన ఆ సారు నన్ను బాగా ప్రోత్సహించారు.

> *"సోడాలు, పాలు, ఇడ్లీలు అమ్మిన నేను... నిత్యం అవమానాలు, ఛీత్కారాలతో బతికిన నేను... ఇప్పుడు సమాజంలో ఓ గౌరవనీయమైన వృత్తిలోకి అడుగు పెడుతున్నాను. అసలు ఈ ఊహే నన్ను ఓ క్షణం నిలువనీయలేదు. వెంటనే ఈ సంతోషకరమైన వార్త అమ్మకు చెప్పాలనుకున్నాను. ఇక్కడ మరో విషాదం. కనీసం ఓ రూపాయి బిళ్ళవేసి అమ్మకు ఫోన్ చేయడానికి కూడా ఆ క్షణంలో నా దగ్గర డబ్బు లేదంటే నా పరిస్థితిని ఊహించుకోవచ్చు."*

## రాజధానికి మకాం...

ఇలా కొన్నాళ్ళు గడిచాక హైదరాబాద్‌కు మకాం మార్చాను. అప్పటికీ ఏం చేయాలన్న దానిపై ఖచ్చితమైన ప్రణాళికలేవీ నా దగ్గర లేవు. పూట గడవటానికి ఆటో నడపడానికి సిద్ధమయ్యాను. పగలంతా ఆటోనడపటం, రాత్రి రెస్టు తీసుకోవటం నా దినచర్యగా మారింది. నేనుండే గదిలో నాతోపాటు మరి కొందరు కూడా ఉండేవారు. వారి ద్వారానే అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ గురించి మొదటిసారి తెలుసుకున్నాను. ఎలాంటి ఫార్మల్ ఎడ్యుకేషన్ లేకుండా నేరుగా డిగ్రీలో చేరే అవకాశం ఉండటంతో చదవాలన్న నా కోరిక మళ్ళీ విజృంభించింది.

## అంబేద్కర్ వర్సిటీ ...

1991లో ఓపెన్ యూనివర్సిటీ నిర్వహించే ఎంట్రన్స్ పరీక్ష రాసి పాసయ్యాను. నిజామాబాద్‌లోని ప్రభుత్వ గిరిరాజ్ కాలేజీలోని యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో డిగ్రీలో చేరాను. 1995లో అత్తెసరు మార్కులతో డిగ్రీ పూర్తిచేశాను. ఇక ఆ తర్వాత ఉస్మానియా యూనివర్సిటీ ప్రవేశ పరీక్షలో నాలుగో ర్యాంక్ వచ్చింది. పీజీ కోర్సులో చేరాను. కానీ నాకు పోటీ పరీక్షలు రాసి ఏదైనా ఉద్యోగంలో స్థిరపడాలన్న కోరిక. కలెక్టర్ కావాలన్న కల. దాన్ని చంపుకోలేకపోయాను. కోచింగ్ తీసుకుంటే ... ఆలోచన వచ్చిందే తడవుగా పీజీ చేస్తూనే హైదరాబాద్‌లోని ఆర్.సి. రెడ్డి స్టడీ సెంటర్‌కు వెళ్ళాను. అక్కడ వారంతా ఇంగ్లీషులో మాట్లాడించారు. అప్పటికి నాకు ఇంగ్లీష్‌లో నాలెడ్జి అసలు లేదు. ఎలాగైనా సివిల్ సర్వీసెస్ రాయాలని, కలెక్టర్ కావాలని కలలు కంటున్న నాకు అక్కడికెళ్ళాక తెలిసింది అది ఎంత కష్టమైన పనో. అయినా ఆశ చావలేదు. అక్కడి నుంచి బయటకు వచ్చాక ఏవో కొన్ని పుస్తకాలు కొని ఇంటికెళ్ళాను. స్నేహితులు ఆ పుస్తకాలు చూసి ఎగతాళి చేశారు. నీ ముఖానికి కలెక్టర్ చదువెందుకురా అని. బాగా ఆటపట్టించారు. అంతో ఇంతో పట్టుదలగా చదువుకుంటున్న నాకు వారి మాటలు మరింత పట్టుదలను తెప్పించాయి.

## కలెక్టర్ కల...

హైదరాబాద్‌కు తిరిగి వచ్చాక ఎలాగైనా సరే కలెక్టర్ కావాలి, సివిల్స్ రాసి

తీరాలి, అందులో నెగ్గి తీరాలి అన్న కసితో ప్రిపేర్ అవడం మొదలెట్టాను. ఈ క్రమంలో అడపాదడపా కాంపిటీటివ్ ఎగ్జామ్స్ రాశాను. 2001లో అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్‌గా ఉద్యోగం వచ్చింది. ఆ తర్వాత జూనియర్ లెక్చరర్ పోస్టు కూడా వచ్చింది. మెదక్ జిల్లా అల్లాదుర్గంలో పోస్టింగ్. నా సంతోషానికి పట్టపగ్గాలు లేవు. సోడాలు, పాలు, ఇడ్లీలు అమ్మిన నేను... నిత్యం అవమానాలు, ఛీత్కారాలతో బతికిన నేను... ఇప్పుడు సమాజంలో ఓ గౌరవనీయమైన వృత్తిలోకి అడుగుపెడుతున్నాను. అసలు ఈ ఊహే నన్ను ఓ క్షణం నిలువనీయలేదు. వెంటనే ఈ సంతోషకరమైన వార్త అమ్మకు చెప్పాలనుకున్నాను. ఇక్కడ మరో విషాదం. కనీసం ఓ రూపాయి బిళ్ళవేసి అమ్మకు ఫోన్ చేయడానికి కూడా ఆ క్షణంలో నా దగ్గర డబ్బు లేదంటే నా పరిస్థితిని ఊహించుకోవచ్చు. వెంటనే వెళ్ళి అల్లాదుర్గం జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా చేరిపోయాను.

## డిప్యూటీ తహసిల్దారుగా ...

లెక్చరర్‌గా పనిచేస్తూనే 1999లో గ్రూప్-II పరీక్ష రాశాను, ఆ తర్వాత గ్రూప్-I కూడా రాశాను. మూడేళ్ళు లెక్చరర్‌గా పనిచేసిన నేను 2004లో గ్రూప్-II ఫలితాల్లో విజయం సాధించి ఇప్పుడు డిప్యూటీ తహసిల్దార్‌గా నా సొంత జిల్లాలో పని చేస్తున్నాను. గ్రామీణ పేద వ్యవసాయ కుటుంబంలో పుట్టిన నేను బాల్యంలోనే కుటుంబ భారాన్ని మోస్తూ, అవమానాల పాలవుతూ అనుకున్న లక్ష్యం చేరుకోవడానికి ఎంతో కష్టపడ్డాను. పగవారికి కూడా రావద్దనిపించేంత ఇబ్బందులు పడ్డాను. పట్టుదలతో ఏదైనా సాధించవచ్చుననడానికి నా జీవితం కంటే నిదర్శనం ఏముంటుంది.

## ఒక్కమాట ...

ఆర్థిక ఇబ్బందుల వల్ల చదవలేక పోతున్నామనుకునే వారికి నేను చెప్పగలిగే మాట ఒకటే. నా జీవితానికో రూపునిచ్చిన అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నా లాంటి మరెందరి జీవితాలనో తీర్చిదిద్దింది. ఇంకా దిద్దుతోంది. అధైర్యపడకుండా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ చేయూతను అందుకోండి. మీ జీవితాల్లోకీ అద్భుతాలను ఆహ్వానించండి.

* * *

ఏదైనా ఒక లక్ష్యంతో
గట్టిగా కృషిచేస్తే ప్రతి
వ్యక్తికీ నేడు కాకపోతే
రేపైనా విజయావకాశం
వచ్చి తీరుతుంది.

– స్టాన్లీ



జాజుల గౌరి

# తలెత్తుకుని నిల్చిన పిడికెడు చైతన్యం

# జాజుల గౌరి

వాగులో వరదనై
వానలో బురదనై
ఎటుతోస్తే అటు
గమ్యం తెలియక
వెనుతిరిగే వెర్రిదాన్నని
అక్షరాలకు దూరం చేసి
నన్ను వెక్కిరించారు
ఉప్పెనే వచ్చినా ...
ఊర్లేకొట్టుకుపోయినా
ఈ బతుకు కలపై
తలెత్తుకుని నిలిచే
పిడికెడు చైతన్యాన్ని ...

* * *

చీకట్లు కమ్ముకున్న జీవితంలో అక్షరాలు నక్షత్రాల్లా ఎలా మిలమిలా మెరుస్తాయో ఆమెకు తెల్సు, అమావాస్యలను తొలగిస్తూ డిగ్రీలు చందమామల్లా ఎలా వెన్నెల పంచుతాయో ఆమెకు అనుభవం. దళిత కుటుంబం నుంచి వచ్చి చదువుకు దూరమైన జాజుల గౌరి ... తన ప్రతి చెమట చుక్కను అక్షరంగా మార్చి రచయితగా ఎలా ఆవిర్భవించిందో, అక్షరంపై సాధికారత ఎలా సంపాదించిందో, ఆమె జీవిత సంఘర్షణలు, అవమానాలు సాక్ష్యాలిస్తాయి. ఎనిమిదో తరగతితో చదువు మానేసి, పదమూడేళ్ళకు పెళ్ళికూతురై, పెళ్ళంటే ఏవిటో తెలియకుండా అత్తగారింట్లో అడుగు పెట్టింది. ఉప్పెనలా తన చుట్టూ ముసురుకుంటున్న ఆర్థిక సమస్యలు, అవమానాలు, బాధ్యతలను జయించడానికి చదువే మార్గమని నమ్మింది. రోజుకు ఐదు రూపాయల కూలీగా పనిచేసినా, మీటర్ ఫ్యాక్టరీలో రోజుకు 7.30 కూలికి చెమటోడ్చినా, నాలుగు డబ్బులు మిగులుతాయని ప్లాస్టిక్ పేపర్లు కడిగే పనికి కుదిరినా, ఆమె మనసు నిండా శిఖరంలా పెరుగుతున్నది చదువుకోవాలనే ఆకాంక్ష... కుటుంబ బాధ్యతలు, ఆర్థిక సమస్యలు, కూలి పని భారం, సామాజిక ఆంక్షలు వీటన్నింటి మధ్య ఆమె శిఖరాయమాన పట్టుదలను చూసి చదువుల తల్లి వేయి చేతులతో ఆమెను ఆహ్వానించింది. అభినందించింది. ఇప్పుడామె చేతిలో అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ, బీసీజే, ఎంసీజే, ఎల్ఎల్బి, ఎల్ఎల్ఎం ఉన్నాయి. ఆమె రాసిన 'మన్నుబువ్వ' కథా సంకలనానికి వరించిన ప్రతిష్ఠాత్మక అవార్డులున్నాయి. ఆమె మనసు నిండా మట్టివాసన వేసే కవితలున్నాయి, జీవితమంతా సుగంధాలు చిమ్మే ఆశలు, ఆకాంక్షలు ఉన్నాయి. అవి సాకారం చేసుకునేందుకు ఆమెకు... తాను సాధించిన అక్షరాలున్నాయి..

## సంసార నావ

పుట్టి పెరిగిందంతా సికిందరాబాద్‌లోని లోతుకుంట. నాన్న వ్యవసాయం చేసేవారు. దానితోపాటు ఉప్పర పని. చదువు మా వంశంలో నాతోనే ప్రారంభమయింది. దళిత కుటుంబాలకు మట్టితోనే కానీ, అక్షరాలతో అనుబంధం తక్కువ. నేను ఎనిమిదవ తరగతిలో ఉన్నప్పుడే మా బావ నాగరాజు కిచ్చి పెళ్ళి చేశారు.

అప్పటికి పెళ్ళంటే ఏమిటో తెలియదు. అలా అత్తగారింట్లో అడుగుపెట్టాను. నాకు చదువుకోవాలనుండేది, కానీ పెళ్ళితో అది ఆగిపోయింది. మా వారికి సైకిల్ షాపు ఉండేది. సైకిళ్ళను అద్దెకు ఇచ్చేవారు. డెవలప్ కాకపోవడంతో అది మానేసి ఆల్విన్‌లో కాంట్రాక్ట్ లేబర్‌గా జాయిన్ అయ్యారు. జీతం 350 రూపాయలు. ఇది మాకు బొటాబొటీగా సరిపోయేది. మా సంసార నావలోకి మరో ఇద్దరు వచ్చారు. అమ్మాయి వసంత పల్లవి, అబ్బాయి మహిన్ ... నావ బరువెక్కింది. ఆర్థిక సమస్యలు ప్రారంభమయ్యాయి.

## చదువంటే ఇష్టం...

నాకు చిన్నప్పటి నుంచి చదవడం అంటే మహాఇష్టం. ఏది దొరికితే అది చదవే దాన్ని. అక్షరం అంటే మహాప్రేమ. మా అమ్మ జానపద గీతాలు బాగా పాడేది. మాది వ్యవసాయ కుటుంబం కావడంతో నాట్లేసేటప్పుడు, కోతలు కోసేటప్పుడు ... ఆమె గొంతులోంచి అలవోగ్గా పాటలు ప్రవహించేవి. ఆ జానపదం నా మనసును చుట్టేసింది. నాలోంచి కూడా పాటలు వస్తుండేవి. నేను ఆరో తరగతి నుంచే పాటలు రాసేదాన్ని. ఎవ్వరికీ చూపించేదాన్ని కాదు. సిక్స్‌త్ క్లాస్‌లో ఉన్నప్పుడే టెన్త్ తెలుగు చదివే దాన్ని. లిటరేచర్‌కు సంబంధించి ఏం చదివినా గొప్ప అనందంగా ఉండేది. నిజానికి లిటరేచర్ అన్న విషయం నాకు తెలియదు ... నా మనసుకు నచ్చిన కథలు. అంతే.

> ***"జీవితం అంతా అంతులేని సంఘర్షణ. చాలాసార్లు ఆత్మహత్య చేసుకుందామనుకున్నా. కానీ పిల్లలు, కుటుంబ బంధాలు అడ్డుపడ్డాయి. నిజానికి నేను ఇంత కష్టపడి చదువుకున్నది కూడా పిల్లల కోసమే. నేను చదువుకుంటే... ఆర్థికంగా స్థిరపడితే పిల్లలను బాగా చదివించవచ్చు. ఈ ఒక్క లక్ష్యంతోనే అక్షరాన్ని దివిటీలా పట్టుకుని కష్టాలను ఈదగలిగాను. ఈ క్రమంలో రైటర్‌గా నిలబడగలిగాను."***

## 'అన్నమ' టీచర్...

పెళ్ళయ్యాక చదువుపై నాకు ఉన్న ఇంట్రస్ట్ చూసి మా వారు టెన్త్ పుస్తకాల్ని తెచ్చిచ్చారు... పరీక్ష రాయమని. కానీ నేను లెక్కల్లో చాలా పూర్, అలాగే ఇంగ్లీషు కూడా ఇబ్బందే. టెన్త్ పాసవలేదు. చదువాగింది. ఆయన సైకిల్ షాప్, నేను గృహిణిగా... అయితే పుస్తకాలు మాత్రం వదల్లేదు. 'ఆంధ్రభూమి' విపరీతంగా చదివేదాన్ని. సీరియల్స్, నవలలు అంటే పిచ్చి. అదే తర్వాత నాకు బాగా ఉపయోగపడింది. దీని వెనుక ఒక పిట్ట కథ ఉంది. చిన్నప్పుడు 'అన్నమ' టీచర్ ఉండేది. ఆమె ఫస్ట్ క్లాస్ టీచర్. మేము చాలా పేదవాళ్ళం. జుట్టంతా చెదిరి పోయి ... డ్రెస్సులు సరిగ్గా లేకుండా ... దళిత కుటుంబం అని వెంటనే తెలిసేది. అందరూ మమ్మల్ని దూరం పెట్టేవారు. 'అన్నమ' టీచర్ మాత్రం తన దగ్గర కూచోబెట్టి తినిపించేది. ఆమె నాకు హీరోయిన్‌లాగా కనిపించేది. గొప్పగా అనిపించేది. బుద్ధి తెలిశాక ఆమెలాగా ఎదగాలనుకున్నా. ఆమెలాగా చదివి టీచర్ కావాలనుకున్నా. బహుశా ఇదే నాకు చదువుపై ప్రేమ, ఇష్టాన్ని కలిగించిందనుకుంటా. అపుడు పడ్డ అక్షర బీజాలు వృక్షాలై ఇప్పుడు నన్ను రచయితని చేశాయి.

## కుటుంబ భారం

ఆర్థిక సమస్యతో కుటుంబం భారం అయింది. నేనేమైనా చేసి సమస్యల్లోంచి బయట పడాలనుకున్నా. తెలంగాణ ప్రాంతంలో ఆడవారిని పనికి పంపించడానికి ఇష్టపడరు. నేను ఇంట్లో ఫైట్ చేసి మా వారిని ఒప్పించి 5 రూపాయల రోజు కూలీకి పనిలో చేరాను. అది ప్రగతివైపు నా తొలి అడుగు. తర్వాత రూ. 7.30 పైసల రోజు కూలీకి మీటర్ ఫ్యాక్టరీలో చేరాను. నాలుగు సంవత్సరాలు చేశాను. ఇంత కష్టపడ్డా ఇద్దరి కష్టార్జితం ఆరు వందలు దాటక పోయేది. అమ్మాయి అప్పటికే స్కూలుకు పోతోంది. బాబుకు స్కూలు ఈడు వచ్చింది. నేను ఇంగ్లీషులో ఇబ్బంది పడ్డాను కనుక పిల్లలను ఇంగ్లీషు మీడియం చదివించాలని నా కోరిక. దానికి 1800 రూపాయిలు అడ్మిషన్ ఫీజు కట్టాలి. ఎంతో స్ట్రగుల్. చదువులేక పోవడం వల్లే కదా ఈ పరిస్థితి... అన్న ఘర్షణ.

## అంబేద్కర్ వర్సిటీ...

డిగ్రీ చదివే వాళ్ళంటే నాకు మహా మక్కువగా ఉండేది. నేనెప్పుడు అక్కడికి చేరతానా అనిపించేది. ఓసారి పేపర్‌లో అంబేద్కర్ వర్శిటీ నోటిఫికేషన్ చూశా. అసలిలాంటివన్ని పేపర్లో వస్తాయని తెలియదు. దళిత విద్యార్థులకు చదవడం,

రాయడం వస్తే చాలు... డిగ్రీ ఎంట్రన్సు రాయవచ్చని తెల్సుకున్నా. టెన్త్ ఎట్లాగూ గట్టెక్కలేనని తెల్సుకుని డిగ్రీ ఎంట్రన్స్ రాయాలనుకున్నా. బాబును చంకలో వేసుకుని పంజాగుట్టలో అంబేద్కర్ యూనివర్శిటీ ఆఫీసుకు నడిచి వెళ్ళాను. అప్లికేషన్ ఫారమ్ కోసం. అట్లా రెండు సార్లు... రెండు సంవత్సరాలు వెళ్ళాను. రెండుసార్లూ అప్లికేషన్‌లు అయిపోయాయి అన్నారు. ఆ తర్వాత 1992-93లో 'అగ్రిమ్ కో లెదర్స్'లో 'పేస్టర్' పనిలో చేరాను. 400 రూపాయల జీతం. మూడేళ్ళు చేశాను. ప్రమోషన్లు కూడా ఉంటాయి. అంతకుముందు ప్లాస్టిక్ పేపర్లు కడిగే పని చేశాను. దుర్భరమైన పని అయినా డబ్బులు ఎక్కువ వస్తాయని అక్కడ పని చేసేదాన్ని. హాస్పిటల్‌లో ఆయాగా చేశాను. అక్కడా అవమానాలు. ఇలా ఉద్యోగాలు చేస్తున్నప్పుడు అంతులేని ఘర్షణ. ఎలాగైనా చదవాలన్న కోరిక రోజు రోజుకూ పెరుగుతోంది. ఛీత్కారాలు, అవమానాలు - వాటన్నింటి నుంచీ దూరంగా పోవాలంటే డబ్బు కావాలి. డబ్బు కావాలంటే చదవాలి. మీటర్ ఫ్యాక్టరీలో పనిచేసేటప్పుడు గోపాల్ గౌడ్ అప్లికేషన్ తెచ్చి ఇచ్చారు. అదే టర్నింగ్ పాయింట్. 'అగ్రిమ్ కో లెదర్'లో పనిచేసేటప్పుడు నాతో ఉండే వాళ్ళందరికి చదువుపై ఆసక్తి ఉండేది. అందరం చర్చించేవాళ్ళం. చదువుకు దారి అప్పుడే పడింది. తర్వాత అంబేద్కర్ ఓపెన్ వర్శిటీ ఎంట్రన్స్ రాశా. పాసయ్యా. ఇంకేం డిగ్రీలో చేరా. మూడేళ్ళు తిరిగే సరికి 'జాజుల గౌరి, బి.ఎ.' అయ్యాను. గాలిలో తేలిపోయాను. అలౌకిక స్థితి. ఎంతో కష్టపడ్డాను బిఏ పాసవడానికి. రిజర్వేషన్ ఉపయోగపడింది. స్నేహితులు ఫీజులు కట్టారు. కేవలం చదవడమే నా పని. అదే చేశాను. డిగ్రీ పాస య్యాను. చదివేటప్పుడు ఎన్నో వెక్కిరింతలు. అవమానాలు. వీటిన్నంటికి సమాధానం చెప్పగలిగాను.

"నీవు కావాలన్నది సాధించుకోవాలంటే నీలో ఉన్న శక్తిని నీవు విశ్వసించాలి."
**- రాబర్ట్ ఆంథోనీ**

## నాకు కొంచెం నమ్మకమివ్వు...

డిగ్రీ సెకండియర్‌లో తెలుగు లిటరేచర్ తీసుకున్నాను. దానిలో నా కిష్టమైన కథలు, కవితలు. మళ్ళీ బాల్యం వచ్చిందన్నమాట. ఎంతో ఇష్టమైన చదువు. తెలుగు లిటరేచర్‌లో ఉన్న ఆలూరి బైరాగి రాసిన 'నాకు కొంచెం నమ్మక మివ్వు...' కవిత నాకు బాగా నచ్చింది. ఇది నన్ను మార్చిన కవిత. నాలో ఆలోచనలు పోసిన కవిత. నమ్మకాన్ని ఎవరికి ఎవరు ఇవ్వాలి అన్న ప్రశ్నకు నాలోంచి వచ్చిన సమాధానం - ఎవరికి వారే నమ్మకం ఇచ్చుకోవాలి అని. ఇదే నా జీవిత ఫిలాసఫీ అయింది. నా ఘర్షణలు ఎదుర్కోవడానికి ఆలంబన అయింది.

డిగ్రీ సెకండియర్‌లో ఉండగా శ్రీలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్‌లో రిసెప్షనిస్టుగా ఉద్యోగం వచ్చింది.. కొండలరావు ప్రొప్రయిటర్. ఎడ్యుకేషన్‌కు సంబంధించి ఎంకరేజ్ చేశారు. ఇంటికి దగ్గర్లో ఉందని చేరాను. మొదట 700 రూపాయిలు ఉన్న జీతం జర్నలిజం పీజీ చేసే వరకు 3500 రూపాయల దాకా చేరింది. డిగ్రీలు పెరుగుతున్న కొద్దీ శాలరీ పెరిగింది. రిసెప్షన్ కౌంటర్‌లో కూర్చునే చదివేదాన్ని. ఫీజులు కట్టడానికి కొండలరావుగారు సాయం చేసేవారు. ఇదే సమయంలో కథలు, కవితలు రాయడం మొదలు పెట్టాను. పత్రికలకు పంపడం, అవి తిరిగి రావడం. పత్రికలంటే ఒక రకమైన ఫోబియా ఏర్పడింది.

## అంబేద్కర్‌పై ప్రసంగం

అంబేద్కర్ జయంతి రోజు... ఆయన గురించి మాట్లాడటానికి విద్యార్థులందరినీ ఆహ్వానించారు. పార్టిసిపేట్

చేయాలనుకున్నవారి పేర్లివ్వమన్నారు. కానీ మేం ఇవ్వలేదు. అప్పటికే పరీక్షలు వస్తున్నాయి. సెమినార్ జరుగుతుంటే మేము వెళ్ళాం. అంబేద్కర్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ అంతా ఉన్నారు. అక్కడున్న వాళ్ళంతా ఆయన విజయాలూ, గొప్ప తనాన్ని గురించే మాట్లాడుతున్నారు. వారంతా అగ్రకులాల వాళ్ళు. ఆయన చేరుకున్న ఎత్తుల గురించే మాట్లాడుతున్నారు. ఆయన జీవితంలో ఘర్షణ, అవమానం గురించి ప్రస్తావించక పోవడం నాకు సమంజసంగా అనిపించలేదు. అయినా అంబేద్కర్ తండ్రి లాంటి వారు. నాలాంటి ఎన్నో దళిత జీవితాలకు ఆయన మార్గదర్శకుడు. ఆయన గురించి నేను మాట్లాడకపోవడం ఏమిటని ... వేదికపైకి వెళ్ళాను. ఐదు నిమిషాల ప్రసంగం. ఇరవై నిమిషాలకు చేరింది. ఇదంతా అనుకోకుండా జరిగింది. అంబేద్కర్, తన చుట్టూ ఉన్న చీకట్లను చేధించుకుని ఎలా. ఎదిగాడో ... నా స్వానుభవాన్ని గుర్తు చేసుకుంటూ ఎమోషనల్‌గా 20 నిమిషాల స్పీచ్. ఫస్ట్ ప్రైజ్ ఇచ్చారు. అందరూ అభినందించారు. బీసీజే ఎంట్రన్స్ ఎగ్జామ్ రాశాను. ఉస్మానియా, తెలుగు యూనివర్సిటీలలో సీట్లు వచ్చాయి. ఉస్మానియాలో చేరాను. 1997లో పూర్తయ్యింది. ఆ తర్వాత పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో ఎంసీజేలో చేరాను.

> **"నేను ఆర్థికంగా స్థిరపడినా, సామాజికంగా నేను ఈ స్థాయిలో ఉన్నా దానికి అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఇచ్చిన డిగ్రీయే కారణం. అది ఇచ్చిన ఆత్మవిశ్వాసం కారణం. నేను ఎల్ఎల్ఎం పూర్తిచేసి 'లా'లోనే పీహెచ్‌డీ చేయాలనేది నా లక్ష్యం. అక్షరం ఏ విధంగా నమ్మకం ఇస్తుందో నా జీవితమే సాక్ష్యం."**

మళ్ళీ ఓపెన్ వర్సిటీలో అడుగుపెట్టాను. చదవాలనే ఉద్దేశమే కానీ ఏం చదవాలన్న గైడెన్స్ లేదు. ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో చేరాను. ఎడ్యుకేషన్‌కు సంబంధించి నాకు నేనే గైడ్.

## రచయితగా

బీసీజేలో ఉన్నప్పుడు మొదటిసారిగా కె.జి.సత్యమూర్తి గారి 'ఏకలవ్య' పత్రికలో 'ఉతికి ఆరేస్తా...' అన్న కవిత అచ్చయింది. అదే సమయంలో 'ఉస్మానియా దళిత దండోరా' అనే సంకలనంలో 'దళిత సామ్రాజ్యం' అచ్చయ్యింది. రైటర్‌గా నాకు గుర్తింపు తెచ్చిందది. డాక్టర్ నాగప్పగారి సుందర్‌రాజు (సెంట్రల్ యూనివర్సిటీ) చిన్న ప్రకటన ఇచ్చారు. మాదిగ కులాల రచయితలు రచనలు పంపమని ప్రకటన అది. నేను వారికి పంపితే అక్కడ నుంచి నాకు నాలుగు పేజీల ఉత్తరం వచ్చింది. నిజానికి రచనలు వెనక్కు వచ్చాయనే అనుకున్నాను. కానీ, అభినందన లేఖ అది. నేను బాగా రాశానంటూ ప్రోత్సహించారు. సార్వజనీన సాహిత్యం నుంచి స్వానుభవంలోంచి వచ్చిన కులపర సాహిత్యం వైపు మరల్చిన సంఘటన అది. ఆ తర్వాత క్రమంలో 'మాదిగ సాహిత్య వేదిక'కు ఉపాధ్యక్షురాలినయ్యాను. ఒక వైపు చదువు, మరో వైపు రచయితగా పేరు, దానితో పాటు ఆర్థికంగా మెరుగుపడడం ... జీవితం ఒక గాడిలో పడుతున్నట్టు అనిపించింది.

## లాయర్ కావాలని

ఎంఏ చదువుతుండగా శ్రీలక్ష్మి ఎంటర్ ప్రైజెస్ మూతపడింది. చదువుకున్నా, ఏం ఉద్యోగం చేయాలో ఇంకా తెలియడం లేదు. గ్రూపు వన్ రాశా. ఫస్ట్ టైమ్ పోయింది. ఆ తర్వాత రాసినప్పుడు ఇంటర్వ్యూ దాకా వెళ్ళాను. కానీ రెండు మార్కుల్లో పోయింది. ఇదే సమయంలో తప్పుచేసిన డాక్టర్లపై చర్య తీసుకోవచ్చునన్న చట్టం వచ్చింది. అప్పుడే నా మనసును కలిచి వేసిన పాత సంఘటన జ్ఞాపకం వచ్చింది. నేను పనిచేసిన హాస్పిటల్‌లో డెలివరీ టైమ్ పూర్తికాక ముందే ఆపరేషన్ చేయడం, శిశువు చనిపోవడం, తల్లి హృదయ వేదన. అంతులేని దుఃఖం ఆమెది. చూస్తూ ఏమీ చేయలేని నిస్సహాయత నాది. ఎలాగైనా ఇలాంటి సంఘటనలు ఎదిరించాలనిపించింది. దానికి 'లా' చేయడమే మార్గం అనుకున్నాను. లాయర్ అవడమే నా లక్ష్యం అనుకున్నాను. నిస్సహాయంగా తలవంచుకుని కాకుండా ... వ్యక్తిగా నేను నిలబడాలంటే 'లాయర్' కావాలనుకున్నాను. నిజానికి అప్పటికే 'లా' ఎంట్రన్స్ రాశాను. కానీ, డబ్బులు లేక జాయిన్ కాలేదు. మళ్ళీ రాశా. మళ్ళీ సీటు వచ్చింది. పడాల రామిరెడ్డి కాలేజీలో పుస్తకాలు ఫ్రీగా ఇస్తారని అక్కడ చేరాను. 2005 కల్లా 'లా' అయిపోయింది. ఇప్పుడు ఎల్ఎల్ఎమ్ చేస్తున్నాను. త్వరలో అయిపోనుంది. ఈ క్రమంలో ఎంఏ పూర్తి చేయలేక పోయాను. ఎల్ఎల్‌బీలో చేరడానికి

వెళ్ళినప్పుడు నా దగ్గర 2.50 రూపాయ లున్నాయి. శంకర్ గారి సహకారంతో, తెల్సినతను ఆర్థిక సాయం అందించడంతో ఎల్ఎల్‌బీలో చేరగలిగాను. నా 'లాయర్' కల అలా నెరవేరింది. చిన్నవాళ్ళలోనే పెద్ద మనసుంటుందని నేను అప్పుడు తెల్సుకోగలిగాను.

## ప్రకృతి ఎన్విరాన్‌మెంట్‌లోకి...

లక్ష్మి మోటర్ పంప్‌సెట్‌లో పిఆర్‌వో, కేసరీ, బిజినెస్ మీడియా పత్రికలో జర్నలిస్ట్‌గా పనిచేశాను. జర్నలిస్ట్ వృత్తి ఆర్థికంగా పెద్దగా కలిసి రాలేదు. దానితో నాకిష్టమైన 'రిపోర్టింగ్' నుంచి వైదొలగాల్సి వచ్చింది. అసలే ఆర్థిక ఇబ్బందులు. ఎల్ఎల్‌బీ ఫైనల్ ఇయర్‌లో ఉన్నప్పుడు "ప్రకృతి" ఎన్విరాన్‌మెంట్ సొసైటీలో చేరాను. ఎన్జీవో అది. నాలో చురుకుదనం, బెరుకులేనితనం వారిని ఆకట్టుకున్నాయి. కానీ నెలకు వెయ్యి రూపాయలే జీతం. ఆర్థిక పరిస్థితి మళ్ళీ మొదటికి. నా జర్నలిస్ట్ టాలెంట్ ఉపయోగించి వారికి మూడున్నర లక్షల వ్యాపారం చేయగలిగాను. అంతే ఆరు నెలలు తిరిగేలోగా ఐదు వేల జీతం, సెల్‌ఫోన్, కన్వేయన్స్ అన్నీ ఇచ్చారు. శ్రమకు తగిన ఫలితం అది. తర్వాత అనేక ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తి చేయడంతో మంచి పేరు వచ్చింది. దానితో శాలరీ పెంచుతూ చీఫ్ ప్రాజెక్టు ఆఫీసర్ (సిపిఓ)గా ప్రమోట్ చేశారు.

## కథలు... అవార్డులు

జీవితం అంతా అంతులేని సంఘర్షణ. చాలాసార్లు ఆత్మహత్య చేసుకుందామనుకున్నా. కానీ పిల్లలు, కుటుంబ బంధాలు అడ్డుపడ్డాయి. నిజానికి నేను ఇంత కష్టపడి చదువుకున్నది కూడా పిల్లల కోసమే. నేను చదువుకుంటే... ఆర్థికంగా స్థిరపడితే పిల్లలను బాగా చదివించవచ్చు. ఈ ఒక్క లక్ష్యంతోనే అక్షరాన్ని దివిటీలా పట్టుకుని కష్టాలను ఈదగలిగాను. ఈ క్రమంలో రైటర్‌గా నిలబడగలిగాను. నా 'మన్నుబువ్వ' కథా సంకలానికి 2004 సుశీలా నారాయణ రెడ్డి అవార్డు, దానికే తెలుగు అధికార భాషా సంఘం అవార్డు, చాలో అవార్డులు వచ్చాయి. 'మన్నుబిడ్డ' అనే నవల రాశాను. నేను ఆర్థికంగా స్థిరపడినా, సామాజికంగా నేను ఈ స్థాయిలో ఉన్నా దానికి అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఇచ్చిన డిగ్రీయే కారణం. అది ఇచ్చిన ఆత్మవిశ్వాసం కారణం. నేను ఎల్ఎల్ఎం పూర్తిచేసి 'లా'లోనే పీహెచ్‌డీ చేయాలనేది నా లక్ష్యం. అక్షరం ఏ విధంగా నమ్మకం ఇస్తుందో నా జీవితమే సాక్ష్యం. అందుకే నేను చదవగలిగినంత కాలం చదువుతూనే ఉంటాను. నా బాధ్యతగా నేను కొంతమందిని అంబేద్కర్ యూనివర్సిటీలో చేర్పించాను. ముగ్గురు అనాధ పిల్లలను నా పిల్లలుగా స్వీకరించి వారి విద్యా, ఆర్థిక విషయంలో బాధ్యతను తీసుకున్నాను. అక్షరం సొంతం చేసుకోవాలంటే ఎంత కష్టమో నాకు తెలుసు. అందుకే ఈ సాయం... వారిని హాస్టల్‌లో చేర్పించాను. కన్నీరును కలల సాగుకు వాడుకుని నేను చేసిన అక్షర యాత్ర ఇది.

* * *

ఉన్నతమైన విద్య అంటే కేవలం మనకు సమాచారాన్ని ఇచ్చేది కాదు. మన జీవితానికి సంబంధించిన ఉనికిని తెలిపేది

**– రవీంద్రనాథ్ ఠాగోర్**



ఎల్లా వేంకటేశ్వరరావు

## శ్రుతి చేసిన
## అక్షర నాదం

# ఎల్లా వేంకటేశ్వరరావు

'శృతి' తప్పని ఆయన మృదంగవాద్య సంగీతం ప్రేక్షకుల హృదయాలను 'లయ' తప్పిస్తుంది. జేఎన్‌టీయూ నుంచి డాక్టరేట్ పొంది తెలుగు యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా, డీన్‌గా పనిచేసి ఎన్నో కోర్సులను ప్రవేశపెట్టి, ఆ యూనివర్సిటీ బహుముఖ విస్తృతి కావడానికి కారకులైన ఎల్లా వేంకటేశ్వరరావుకు ప్రాథమిక విద్యకూడా లేదంటే ఆశ్చర్యం వేస్తుంది. మృదంగ వాయిద్యంలో అంతర్జాతీయ ఖ్యాతిపొందిన ఆయన ఏడేళ్ళ వయసు నుంచే కచేరీలు ఇవ్వడం ప్రారంభించారు. దానితో చిన్నతనంలో స్కూలుకు వెళ్ళే అవకాశం లేకుండా పోయింది. ఆయన డిగ్రీ చేయాలన్న కోరికను అంబేద్కర్ యూనివర్సిటీ నుంచి తీర్చుకున్నారు. ఆయన సరిగమల స్వరాల మధ్య అక్షర నాదాన్ని విందాం.

## నేను, నా భార్య ... అంబేద్కర్ వర్సిటీ

ఏడవ ఏట నుంచే కచేరీలు మొదలుపెట్టిన నాకు చదివే తీరిక ఎక్కడిది. సంగీతమే లోకం. సినారే, ఎన్టీఆర్ లాంటి పెద్దవారిని కలిసినప్పుడు వారు సూచించారు. మీకు డిగ్రీ లేనిలోటు ఎందుకు? అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో చేరాలని ప్రోత్సహించారు. కచేరీలకు, సంగీత సేవలకు ఆటంకం ఉండదన్న ధైర్యంతో అంబేద్కర్ యూనివర్సిటీ ఎంట్రన్స్ ఎగ్జామ్ రాశా. నాతోపాటు మా ఆవిడ కూడా ప్రవేశ పరీక్ష రాసింది. ఇద్దరం బీఏలో చేరాం. నా డిగ్రీ చేయాలన్న కల అక్కడే నిజమైంది. నిజానికి నాలాంటి వారికి ఇలాంటి యూనివర్సిటీ తప్ప వేరే దారిలేదు. అనేక మంది కలలను ఈ యూనివర్సిటీ నిజం చేస్తోంది.

## థర్డ్ ఇయర్ ... అమెరికా కచేరీ

నాకు విదేశాల్లో కూడా కచేరీలు బాగా పెరిగాయి. చాలా బిజీగా ఉండే వాణ్ణి. చదవడానికి సమయం సరిపోయేది కాదు. డిగ్రీలో కాంటాక్ట్ క్లాసులు అటెండయ్యే ఛాన్స్ లేకుండా పోయింది. కాసింత సమయం దొరికినా ఇంట్లోనే చదివేవాణ్ణి. నా భార్య త్రిమూర్తులమ్మ మాత్రం రెగ్యులర్‌గా క్లాసులకు వెళ్ళేది. ఆ తర్వాత మేమిద్దరం సబ్జెక్టులపై చర్చించే వాళ్ళం. ఫస్టియర్, సెకండియర్ పాసయ్యాం. పరీక్షలప్పుడు బాగా చదివేవాళ్ళం. కానీ, చివరి సంవత్సరాని కొచ్చేసరికి పరీక్షల సమయంలో అమెరికాలో కచేరీలు చేయాల్సి వచ్చింది. దాంతో మూడవ సంవత్సరం పూర్తి చేయలేకపోయాను. త్రిమూర్తులమ్మ పరీక్ష రాసి డిగ్రీ పూర్తిచేసింది. నా కన్నా ముందే. ఇక ఆ తర్వాత ఎంత బిజీ అయినా డిగ్రీ పూర్తిచేయాలనుకున్నా. మూడవ సంవత్సరం కూడా పూర్తిచేశా. ప్రాథమిక విద్య కూడా లేని నాకు అంబేద్కర్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ లభించింది. చాలా ఆనందకర విషయం. నిజానికి పీజీ కూడా చేయాలనుండేది. అయితే అప్పటికి కాసింత సమయం కూడా దొరకనంత బిజీ. అమెరికా, బ్రిటన్, కెనడా, జపాన్, బహ్రెయిన్ ... ఇలా అనేక దేశాల్లో ఉత్సవాలు, కచేరీలు, వర్క్‌షాపులు, ఊపిరి ఆడనంత బిజీ. త్రిమూర్తులమ్మ మాత్రం చదువు కొనసాగించింది. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీజీ కూడా పూర్తి చేసింది.

## ప్రొఫెసర్‌గా...

నా జీవితం సంగీతంతోనే ముడిపడి ఉంది. ప్రాథమిక విద్యార్హత లేని నేను తెలుగు యూనివర్సిటీలో ప్రొఫెసర్‌ను అయ్యాను. ఏ రంగంలోనైనా అంతర్జాతీయ ఖ్యాతిపొందిన వారిని ప్రొఫెసర్‌గా నియమించవచ్చునని యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ)లో ఒక క్లాజ్ ఉంది. దాంతో ఎన్టీరామారావు గారు నన్ను ప్రొఫెసర్‌గా రమ్మని ఆహ్వానించారు. అయితే అప్పటికే అంబేద్కర్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ చేయడం నాకు ప్రొఫెసర్‌గా పనిచేసే ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. డిగ్రీ చదివిన విశ్వాసంతో, విజ్ఞానంతో నేను మృదంగం సబ్జెక్టుకు

సిలబస్ కూడా రాయగలిగాను. 15 ఏళ్ళపాటు డీన్‌గా పనిచేసి అనేక కోర్సులు ప్రవేశపెట్టి తెలుగు యూనివర్సిటీ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయగలిగాను.

### మాది సంగీత కుటుంబం...

సరిగమలే ఓనమాలు మాకు. నాకు సంగీతంలోనే అక్షరాభ్యాసం. అదే చదువు. అదే లోకం. సరస్వతి సంగీత రూపంలో మమ్మల్ని కటాక్షించింది. నా ముందు నాలుగు తరాలు సంగీతంలో మునిగితేలిన వారే. మా తాతతరం వారు స్వాతంత్ర్య సమరయోధులు. గాంధీగారి భజనలకు వారు వాద్యసహకారం అందించే వారట. మా నాన్న రామమూర్తిగారు వయోలిన్ విద్వాంసులు. మా పెదతండ్రి సోమన్నగారు మృదంగ నిపుణులు. ఆయన వద్దే నేను గురుకుల పద్ధతిలో సంగీతాన్ని అభ్యసించాను. ఆయనకు వందల మంది శిష్యులుండే వారు. సోమన్నగారు పాల్ఘాట్ మణిఅయ్యర్ శిష్యులు. పాల్ఘాట్ మణి అయ్యర్ సంగీత ప్రపంచంలో మేరుశిఖరం. నాకు సంగీతజ్ఞానం జన్మతః వచ్చిందనుకుంటాను. దైవప్రసాదమది. నేను ఏడేళ్ళ వయస్సులోనే కచేరీ చేశాను. అప్పటినుంచి మృదంగమే నా జీవితమైంది.

> ***"నేను బడికి వెళ్ళి సాధారణ విద్యను అభ్యసించింది లేదు. అంబేద్కర్ విశ్వవిద్యాలయమే నా తొలి బడి. అకాడమీ విద్య చేయలేకపోయినా నా సంగీతానుభవంతో, వివిధ దేశాలలో తిరిగి అక్కడ పద్ధతులు గమనించిన అనుభవంతో అనేక కోర్సులను ... నా హయాంలో తెలుగు యూనివర్సిటీలో ప్రవేశపెట్టాను. విద్యార్థులకు అనేక అవకాశాలు కల్పించాను."***

### 14 ఏళ్ళకు జాతీయ అవార్డు...

అప్పట్లో ఆకాశవాణి జాతీయస్థాయి పోటీలు నిర్వహించేది. ప్రతి సంవత్సరం జరిగే గొప్ప ఉత్సవం అది. దానిలో నాకు గోల్డ్‌మెడల్ వచ్చింది. అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు బహూకరించారు. తర్వాత ఎన్ని విజయాలు సాధించినా నా జీవితంలో అదే గొప్ప సంఘటన. ద్వారం వెంకటస్వామి నాయుడు, సెమ్మంగుడి శ్రీనివాస్, సుబ్రహ్మణ్య పిళ్ళై, బృందా ముక్త, బుధలూరి కృష్ణమూర్తి, వోలేటి వెంకటేశ్వర్లు లాంటి ఉద్దండులైన జడ్జిలను మెప్పించి గెలవడం గొప్ప జ్ఞాపకం. ఆ తర్వాత జరిగిన సంఘటన మరీ అద్భుతం. ఢిల్లీ ఆకాశవాణి నాతో సోలో కచేరీ ఏర్పాటు చేసింది. అప్పటిదాకా సోలో లేదు. అదో రికార్డు. అప్పట్లోనే వెయ్యి రూపాయల పారితోషికం ఇచ్చారు. ఢిల్లీలోని ప్రప్రథమ స్టార్ హోటల్ 'అశోక'లో విడిది. చాలా గౌరవం ఇచ్చారు. బొంబాయిలో ఒకసారి పాల్ఘాట్ మణిఅయ్యర్ చేయాల్సిన కచేరి చేసే అదృష్టం నాకు కలిగింది. ఇంకా విశేషమేమంటే హాస్పిటల్‌లో ఉన్న ఆయన నా మృదంగ వాయిద్యం వినడానికి నలుగురి సాయంతో నా కచేరీకి వచ్చారు. ప్రేక్షకుల మధ్యలో కూర్చుని నా కచేరి విని అక్కడి నుంచే నన్ను ఆశీర్వదించారు. నవమృదంగంపై నేషనల్ అవార్డు వచ్చినప్పుడు 'మృదంగ చరిత్రలో గొప్ప అధ్యాయం మొదలయింది' అని ఆయన నన్ను ఆశీర్వదించారు. సంగీతంలో ఒక సంప్రదాయాన్నే సృష్టించిన మహావిద్యాంసుల వాత్సల్యం అది..

### గిన్నిస్ రికార్డు...

నా జీవితంలో మరో మరుపురాని ఘట్టం మృదంగ మహాయజ్ఞం. అన్న పానాదులు లేకుండా 36 గంటల పాటుచేసిన సంగీత యజ్ఞం అది. నేను ప్రతిపాదించగానే తామే ప్రభుత్వం తరపున నిర్వహిస్తామని అప్పటి సాంస్కృతిక శాఖామంత్రి భాట్టం శ్రీరామమూర్తి ముందుకు వచ్చారు. ఆ శాఖలోని డైరెక్టర్ జేవీ సోమయాజులు ఈ యజ్ఞాన్ని పర్యవేక్షించారు. హైదరాబాద్‌లోని శృంగేరి మఠంలో వేదమంత్రాల మధ్య జరిగిన ఈ యజ్ఞం 24 గంటలు అనుకున్నది 36 గంటలు సాగింది. ఇది గిన్నీస్ బుక్‌లోకి చేరింది. ఈమని కృష్ణశాస్త్రి, బాలమురళీ కృష్ణ, నూకల చినసత్యనారాయణ లాంటి మహా మహులు పాల్గొన్నారు. దాశరథి, సి.నారాయణరెడ్డి, శేషేంద్రశర్మ లాంటి కవులూ, ముఖ్యమంత్రి అంజయ్య, గవర్నర్ అబ్రహం వచ్చారు. తెల్లవార్లూ సంగీతం ప్రవహించిందక్కడ.

### సినిమా సంగీతం...

సప్తపది, భద్రం కొడుకో... సినిమాలకు సంగీతాన్నందించాను. ఎన్టీరామారావు గారు ఆయన విశ్వామిత్ర సినిమాకు కూడా పనిచేయాలని ఆహ్వానించారు. దానికీ సంగీతం అందించాను. సినిమా... అదో లోకం. అక్కడి సంస్కృతి,

గౌరవం వేరు. సాధారణంగా సంగీత ప్రపంచంలో కనిపించే గురుశిష్య సంబంధాలు ఉండవు. ఎంతటి వాడైనా సినిమా సక్సెస్ అయితేనే నిలబడేది. ఇప్పటిదాకా సినిమా ఎందుకు సక్సెస్ అవుతుందో చెప్పగలిగే వారు లేరు. అంతా దైవాధీనం. నేనప్పటికే సంగీత రంగంలో పేరు సంపాదించుకున్నా. మళ్ళీ నేనిక్కడ కెరీర్ మొదలుపెట్టాలి. వంద కచేరీలు చేసినా రాని డబ్బు రెండు మూడు సినిమాల్లో వస్తుందేమోగానీ ... కచేరీల్లో దొరికే ఆత్మసంతృప్తి అక్కడరాదు. అందుకే మళ్ళీ నా ప్రపంచంలోకి వచ్చా.

## పీఠాధిపతిగా ఎన్నో కోర్సులు ...

నేను బడికి వెళ్ళి సాధారణ విద్యను అభ్యసించింది లేదు. అంబేద్కర్ విశ్వవిద్యాలయమే నా తొలి బడి. అకాడమీ విద్య చేయలేకపోయినా నా సంగీతానుభవంతో, వివిధ దేశాలలో తిరిగి అక్కడ పద్ధతులు గమనించిన అనుభవంతో అనేక కోర్సులను ... నా హయాంలో తెలుగు యూనివర్సిటీలో ప్రవేశపెట్టాను. విద్యార్థులకు అనేక అవకాశాలు కల్పించాను. తెలుగు యూనివర్సిటీని ఒక మోడల్ విశ్వవిద్యాలయంలా తీర్చిదిద్దాను. అప్పటిదాకా గాత్రం మాత్రమే ఉన్న బీఏ సంగీతం కోర్సులో మృదంగం, వీణ, వయోలిన్ ప్రవేశపెట్టాను. ఎంఏ కోర్సు ప్రవేశపెట్టాను. పెయింటింగ్, మోడ్రన్ ఆర్ట్ ... లాంటి బహుముఖ కోర్సులతో బీఏ నాలుగేళ్ళ కోర్సు చేశాను. ఇది బాగా పేరు తెచ్చిపెట్టింది. నాట్యంలో భరత నాట్యం, ఆంధ్రనాట్యం నేను తెచ్చిందే. ఇప్పుడు బాగా ప్రాచుర్యం పొందిన సాయంత్రం కోర్సులు నా హయాంలో వచ్చినవే. గాత్రం, వీణ, వయోలిన్, మృదంగం, డోలు ... ఇవన్నీ సాయంత్రం కోర్సులలో ఉన్నాయి. టూరిజం కోర్సు, నాట్యంలో జానపదం నృత్యం, హరికథ, లలిత సంగీతం ... సంగీతంలో పీహెచ్‌డీ ఇవన్నీ నా పర్యవేక్షణలో రూపు దిద్దుకున్నవే. నాదస్వరం, డోలులో కూడా పీహెచ్‌డీ చేయవచ్చు. వీటన్నింటిని రూపుదిద్దడానికి నేనెంతో శ్రమించాను. నా కచేరీలన్నీ వదులుకున్నాను. అయినా తెలుగు వర్సిటీని ఒక మోడల్ విశ్వవిద్యాలయంలా తీర్చిదిద్దానన్న సంతృప్తి మాత్రం ఉంది.

* * *

కష్టాలనేవి కలకాలం ఉండవు. క్లిష్ట సమస్యలు వచ్చినప్పుడు స్థిరచిత్తులై నిలవండి.

**– గోల్డ్‌స్మిత్**



సుజాత

# చదువు రాసిన సువర్ణ చరిత

# గొట్టిపాటి సుజాత

టెన్త్ ఇంగ్లీషులో రెండుసార్లు ఫెయిలైన అమ్మాయి డిగ్రీ ఇంగ్లీషు లిటరేచర్ సబ్జెక్టుతో, ఇంగ్లీషు మీడియంలో చదివి స్టేట్ ఫస్ట్ వచ్చింది. ఆటపాటల్లో పడి అంతంత మాత్రపు ఆసక్తితో చదువు మూలనపడి, మూడేళ్ళు ఇంట్లోనే ఉన్న ఈ అమ్మాయి గవర్నర్, ముఖ్యమంత్రులకు స్వతంత్ర, గణతంత్ర దినోత్సవ ఉపన్యాసాలు రాసిస్తోంది. ఈమెను కదిపితే అక్షరం ఇచ్చిన బలంతో దేశాన్ని, ప్రపంచాన్ని మార్చగలమనే విశ్వాసం కనిపిస్తోంది. దీనికి పునాది వేసిన అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీపై కృతజ్ఞతా కనిపిస్తోంది. టెన్త్ రెండేళ్ళు రెగ్యులర్‌గా చదివి రెండుసార్లు మూడు సబ్జెక్టుల్లో ఫెయిలైన గొట్టిపాటి సుజాత, అంబేద్కర్ యూనివర్సిటీలో అడుగుపెట్టి డిగ్రీలో స్టేట్ ఫస్ట్, గోల్డ్‌మెడల్ సాధించింది. వరుసగా బీసీజే, ఎంసీజే, బిపిఆర్ (పబ్లిక్ రిలేషన్స్) అన్నింటిలోనూ ఈమెది 'సువర్ణ' చరిత్రే. ప్రస్తుతం ఎపిఎస్ఎఫ్‌సిలో డిప్యూటీ డైరెక్టర్ (పీఆర్) గా పనిచేస్తోన్న గొట్టిపాటి సుజాత చదువు వెలుగులివీ.

## నాన్న ... ప్రయోగాలు

**నిజామాబాద్** జిల్లాలోని బీర్కూర్ మాది. నాన్న హెడ్‌మాస్టర్. నేను థర్డ్ క్లాస్ కొచ్చేసరికే ఆయన రిజైన్ చేశారు. జీవితంలో చాలా ప్రయోగాలు చేశారాయన. వైవిధ్యాన్ని కోరుకునే మనిషి. చలనశీలి. ఆ రోజుల్లోనే వంద ఎకరాల వ్యవసాయం, ఆధునికంగా చేసేవారు. పెద్ద పెద్ద మడులు, పెద్ద కట్టలు. సెంట్రలైజ్డ్ ఇరిగేషన్ సిస్టమ్. దిగుబడి భారీగా ఉండేది. ఉల్లి పండిస్తే ఊర్లో నిల్వ చేయడానికి ప్లేస్ దొరికేదికాదు. సహజంగా వ్యవసాయంలో ఉండే సమస్యలతో ఆయన నష్టపోయారు. ఆ తర్వాత భూమి అమ్మేసి గుజరాత్‌లో సివిల్ వర్క్ టేకప్ చేశాడు. అది కూడా భారీ స్థాయిలోనే. పదిమంది ఇంజనీర్లు ... అక్కడా దెబ్బతిన్నారు. ఎక్కడ సమస్య వచ్చినా దానికి లొంగే మనిషి కారాయన. వ్యవసాయంలో స్పెషలిస్ట్. చుట్టుపక్కల గ్రామాల్లో పంటలకు సంబంధించి ఏ డౌట్ వచ్చినా ఆయన దగ్గరికే వచ్చేవారు. జీవితంలో భిన్నకోణాలు చూసిన మనిషాయన. ఆయన నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే ఆయన హెడ్‌మాస్టర్‌గానే ఉంటే నా చదువు తీరు ఎలా ఉండేదో కానీ ఆయన వేర్వేరు పనులపై ఉండడంతో నా స్టడీస్‌లో కొంత ఇబ్బంది కలిగింది. నాన్న మాథ్స్ బాగా చెప్పేవారు. ఆయన స్టూడెంట్స్ ఎన్నోసార్లు గుర్తు చేసుకుంటారు. ఆయన శిష్యరికంలో నేర్చుకుని స్థిరపడిన వారెందరో ఆయనను తలుచుకుంటుంటారు. మా చదువు దగ్గరికి వచ్చేసరికి ఆయన మాపై దృష్టి పెట్టే అవకాశం లేకపోయింది.

## అంతా ఆటలే...

ప్రైమరీ ఎడ్యుకేషన్ బీర్కూర్‌లోనే. ఏడు, ఎనిమిది తరగతులు మాత్రం చెన్నయ్‌లో చదివాను. మళ్ళీ తొమ్మిది, పదవ తరగతులు బీర్కూరు గవర్నమెంట్ స్కూల్లో. టీచర్లంతా నిజామాబాద్ నుంచి వచ్చేవారు. టీచింగ్ అంతంత మాత్రం. మా టెన్త్ బ్యాచ్‌లో అంతా ఫెయిలయ్యాం. అప్పటికి నాకు చదువుపై ఆసక్తి తక్కువ. ఆటలంటే మాత్రం మహా ఇష్టం. చదువు తప్ప ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌లో నేను చాలా యాక్టివ్. వ్యాసరచన, స్టోరీ టెల్లింగ్, క్యారమ్స్, ఖోఖో ... ఏదైనా వరుసపెట్టి నాకే ప్రైజులు. ఓసారి ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్‌కు వచ్చిన ఎమ్మెల్యే ఆశ్చర్యపోయారు నా ప్రైజులు చూసి. అలా ఆటలపై ఆసక్తి ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇప్పటికీ నాకు ఆటలంటే మహా ఇష్టం. ఆడే అవకాశం వస్తే ఏమాత్రం వదిలేది లేదు. బాల్యం గుర్తు చేసుకుంటే టెన్త్ రెండుసార్లు ఫెయిలైనానన్న బాధ కన్నా ... ఆటలతో బాల్యం బాగా ఎంజాయ్

చేశానన్న ఆనందమే ఎక్కువ. స్నేహితులతో కలిసి వెన్నెల్లో రాత్రి పది గంటలదాకా ఆడేదాన్ని. ఇప్పటి బాల్యానికి లేని అద్భుతమైన ఆనందం అది.

## మళ్ళీ టెన్త్ ఫెయిల్

టెన్త్ మూడు సబ్జెక్టులు పోయాయి. మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లీషు. మా నాన్న, నేను మెడిసిన్ చేయాలని అంటుండేవారు. ఇంట్లో ఆ వాతావరణం లేకుండే దనుకోండి. నేను ఫెయిలై కూర్చున్నా. ఇంకా చిన్నదాన్నే, పదమూడేళ్ళే కావ డంతో మళ్ళీ టెన్త్‌లో వేశారు. అదే స్కూలు, అదే చదువు... అవే ఆటలు. అలాగే అవే సబ్జెక్టుల్లో టెన్త్ ఫెయిలయ్యాను. అంతే, చదువుకు బ్రేక్ పడింది. ఆటలు మాత్రం మానలేదు. రెండు మూడు సంవత్సరాలు ఖాళీ. లైబ్రరీకి వెళ్ళి పుస్తకాలు తెచ్చుకుని చదవడం, స్నేహితులతో ఆటలు. క్లాసు పుస్తకాలంటే అయిష్టం కానీ, మిగతా జనరల్ నాలెడ్జ్, చరిత్ర ఇలాంటి పుస్తకాలు మాత్రం బాగా చదివేదాన్ని. ఇక ఖాళీగా ఉన్నానని పెళ్ళి చేస్తా మన్నారు ఇంట్లో. అదే జరిగితే ఏ ఊర్లోనో గృహి ణిగా సెటిలయ్యేదాన్ని. ఈ హోదా కలే అయ్యేది.

> ***"ప్రాథమిక విద్యలో తప్పటడుగులు పడిన నేను 'విద్యారత్న' అవార్డు దాకా ఎదగడానికి అంబేద్కర్ యూనివర్సిటీలో పడిన అక్షర బీజమే కారణం. ఎన్నో విదేశాలు తిరిగాను. అక్కడ ఆర్థిక, సామాజిక స్థితిగతులు, రోడ్లు, అక్కడి జీవన విధానం గమనించాను. మనం అలా ఎందుకు ఎదగలేం అనిపిస్తుంది. మన దేశం ముందుకు పోవడానికి ఎంతో చేయొచ్చు అనిపిస్తుంది."***

## 'కల' కలం...

నా జీవితాన్ని మార్చేసిన కల ఇది. అప్పటికి 17 ఏళ్ళు అనుకుంటా. పూర్తిగా గుర్తులేదు కానీ, చదువుకు సంబంధించిందే. బాగా చదువుకున్నట్టు, ప్రపంచం అద్భుతంగా మారిపోయినట్టు, ఇంకా చదువుకోవాలని ఆశపడుతున్నట్టు. తెల్లారి లేచిన దగ్గర్నుంచీ అదే ఆలోచన. రోజంతా ఏడుస్తూ కూర్చున్నా. అప్పటికే పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నారు. నేను చదువుకుంటానని పట్టుబట్టాను. ఆ రోజంతా ఏడుపు, ఉపవాసం, మొత్తానికి ఇంట్లో సరేనన్నారు. అదీ టర్నింగ్.

## అంబేద్కర్ ఓపెన్‌వర్సిటీ...

అప్పుడే అంబేద్కర్ ఓపెన్‌వర్సిటీ నోటిఫికేషన్ పడింది. బహుశా మాదే ఫస్ట్ బ్యాచ్. టెన్త్ రాయడం, ఇంటర్ చేయడం ... ఇదంతా ఎందుకు ఓపెన్ వర్సిటీ నుంచి డిగ్రీ చేస్తావా అని నాన్న అడిగారు. సరేనన్నాను. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీతో పాటు, ఆంధ్రా యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ రాశాను. రెండింటిలో పాసయ్యాను. ఆంధ్రా యూనివర్సిటీ స్టడీ సెంటర్ లేదు. అంబేద్కర్ వర్సిటీకి నిజామాబాద్‌లో స్టడీ సెంటర్ ఉంది. అందుకే ఈ యూనివర్సిటీలో చేరిపోయాను. ఆదివారాలు క్లాసులకు అటెండ్ అయ్యేదాన్ని.

## ఇంగ్లీషు మీడియం...

టెన్త్‌లో ఇంగ్లీషు రెండుసార్లు ఫెయిలైన నేను డిగ్రీ ఇంగ్లీషు మీడియంలో రాయడం ఒక సాహసం. నా ఈ నిర్ణయం విని నాన్న ఆశ్చర్యపోయారు. ఇంగ్లీషు అక్షరం ముక్కరాదు. ఇంగ్లీషు మీడియం ఎలా చదువుతావు అన్నారు. కానీ, నేను ఏదైనా ఒక పట్టాన వదిలేదాన్ని కాదు. అనుకున్నానంటే నూరు శాతం పర్‌ఫెక్ట్‌గా చేయాల్సిందే. డిగ్రీలో ఇంగ్లీషు లిటరేచర్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ తీసుకున్నాను. ఇంగ్లీషులో చాలా పూర్. ఇక దానిపై పడ్డాను. చేతిలో ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ... ఒక గ్రామర్ బుక్. ఒక్కొక్క పదం, ఒక్కో వాక్యం నాకు నేనే నేర్చుకున్నాను. పల్లెటూర్లో మరో అవకాశం లేదు. ట్యూషన్ చెప్పడానికి ఎవరూ లేరు. ఆదివారం నిజామాబాద్‌లో స్టడీ క్లాసులకు వెళ్ళినప్పుడు జిల్లా లైబ్రరీలో రిఫరెన్స్ పుస్తకాలు తెచ్చుకుని చదివేదాన్ని. మొదటి నుంచీ పుస్తకాలు చదివే అలవాటు బాగా ఉపయోగపడింది. ఇంగ్లీషు లిటరేచర్ తీసుకోవడం వెనుక చిన్న కారణం ఉంది. మా దగ్గర ఓ సభకు ఎన్టీఆర్ వచ్చారు. ఆయన ప్రసంగం, అక్కడ జర్నలిస్టుల హడావుడి, ఆ తర్వాత పేపర్లలో వారి రిపోర్టింగ్ నాకు చాలా ఆసక్తి అనిపించింది. ఆ తర్వాత మా దగ్గర రేషన్ షాపులో జరుగుతున్న అవకతవకలపై ఆంధ్రప్రభకు లెటర్ రాశాను. పాఠకుల లేఖలో అది నా పేరు, ఊరుతో సహా అచ్చయ్యింది. చాలా థ్రిల్లింగ్. అప్పటి నుంచీ జర్నలిజంపై ఆసక్తి

కలిగింది. నిజానికి నాన్న 'లా' చేయమనేవారు. నాకేమో జర్నలిస్ట్ కావాలని, జర్నలిస్ట్ కావాలంటే ఇంగ్లీషు లిటరేచర్ బాగా చదవాలని ఎవరో చెప్పారు. అందుకే డిగ్రీలో ఇంగ్లీషు లిటరేచర్ తీసుకున్నా ... ఇంగ్లీషు రాకపోయినా.

## డిగ్రీలో గోల్డ్ మెడల్...

అంబేద్కర్ యూనివర్సిటీ మళ్ళీ నన్ను చదువులో పడేసింది. ఏదైనా నాకు మనసా వాచా కర్మణా చేయడం అలవాటు. చదువూ అలాగే. పూర్తి స్థాయిలో కాన్‌సంట్రేషన్. ఓసారి పేపర్లో ఎవరికో గోల్డ్‌మెడల్ ఇచ్చిన వార్త, ఫోటో చూశాను. నాకు వస్తే అన్న ఊహ, ఆ వెంటనే అంత సీన్ లేదన్న ఆలోచనా వచ్చాయి. డిగ్రీ ఎగ్జామ్స్ అయిపోయిన తర్వాత ఎంఏ చేద్దామని హైదరాబాద్ వచ్చాను. ఒక ఫ్రెండ్ ఇంట్లో ఉండగా లెటర్ వచ్చింది. ఇంటికి వచ్చిన ఆ లెటర్ హైదరాబాద్ పంపించారు. దాంట్లో డిగ్రీలో స్టేట్ ఫస్ట్ వచ్చానని, గోల్డ్‌మెడల్ వచ్చిందని ఉంది. ఇక ఆ రోజంతా నేను గాలిలోనే. పేపర్ వాళ్ళు... ఇంటర్వ్యూలు, వార్తలు, జీవితం ఒక్కసారిగా మారిపోయినట్టు అనిపించింది. గొప్ప ఫీలింగ్ అది. ఏ పనిచేసినా నన్ను నేను మరిచిపోయి లీనమై చేయడమే ఇలాంటి విజయాలకు కారణమని అనిపిస్తుంది. ఆ తర్వాత ఎచీవ్‌మెంట్లకు, ఉద్యోగంలో సక్సెస్ అవడానికి ఇదే పనితీరు ఉపయోగపడింది.

## జర్నలిస్టుగా...

అప్పటికే గుజరాత్ సివిల్ వర్క్స్‌లో నాన్న నష్టపోయి ఉన్నారు. ఇక చదవడం కష్టం. జాబ్ చేయడమే మార్గం అనిపించింది. ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభలో అప్లయి చేశాను. రెండింటిలోను వచ్చింది. మొదట కొంతకాలం ఆంధ్ర జ్యోతిలో చేశాక, ఆంధ్రప్రభలో చేరాను. దాదాపు ఆరేళ్ళు జర్నలిస్టుగా విభిన్నమైన అనుభవాలు. నేననుకున్న జర్నలిస్టు ఉద్యోగం బాగా ఎంజాయ్ చేశాను. చాలా వ్యాసాలు, వార్తలు రాశాను. బాగా పేరొచ్చింది. నిజానికి ఆంధ్రప్రభలో చేరేటప్పుడు 'నువ్వు చేసింది డిగ్రీ, మాకు పీజీ వాళ్ళు కావాలి, నీ చదువు సరిపోదు' అన్నారు. కానీ వాళ్ళుపెట్టిన పరీక్షలో పీజీ వాళ్ళ కన్నా నేనే బాగా రాసి ఒప్పించగలిగాను. ఉద్యోగంలో కుదుట పడ్డాక పెళ్ళయింది. ఆ తర్వాత పాప పుట్టింది.

> పనిచేసే తత్వము, పని పట్ల విశ్వాసమూ విజయానికి మూలకారణాలు.
>
> – హెన్రీఫోర్డ్

## బీసీజే... గోల్డ్ మెడల్

డిగ్రీతో ఆపితే ఎలా? ఇంకా చదవాలనిపించింది. తెలుగు యూనివర్సిటీ బీసీజే ఎంట్రన్స్ రాశాను. సీటు వచ్చింది. ఆంధ్రప్రభలో ఉద్యోగం, పాపను చూసుకోవడం. బీసీజే డిగ్రీ ... వాటి మధ్య బాలన్స్ కష్టం అయింది. చెప్పాగా... నేను దేన్నీ అంత తేలిగ్గా వదిలేదాన్ని కానని. బీసీజే విజయవంతంగా పూర్తయ్యింది. అదీ యూనివర్సిటీ ఫస్ట్‌లో. యూనివర్సిటీ చరిత్రలో మొదటి డిస్టింక్షన్. గోల్డ్‌మెడల్ వచ్చింది. టెన్త్ రెండుసార్లు ఫెయిలైన అమ్మాయి చదువులో రెండో విజయం.

## మళ్ళీ అంబేద్కర్ వర్సిటీకి ... మరో గోల్డ్ మెడల్

బీసీజే అయిపోయాక అంబేద్కర్ యూనివర్సిటీ నుంచి బీపీఆర్ (పబ్లిక్ రిలేషన్స్) కోర్సులో చేరాను. అక్కడ స్టేట్

ఫస్ట్ వచ్చింది. మళ్ళీ గోల్డ్‌మెడల్. ఆ తర్వాత ఉస్మానియా యూనివర్సిటీలో ఎంసీజే రెగ్యులర్‌గా చేశాను. యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. మరో గోల్డ్‌మెడల్. అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీలో పడిన పునాది పైచదువుల్లో బాగా పనిచేసింది. డిగ్రీలో నేను పడిన కష్టం, చేసిన శ్రమ నన్ను బాగా సంతోషపెట్టింది. కరెంట్ పోతే దీపం వెలుతురులో కూడా చదివే దాన్ని. అంత ఇంట్రస్ట్ వచ్చిందప్పుడు. అదే తర్వాత ఉపయోగపడింది. నిజానికి ఎంఫిల్ చేయాలనుంది. బాబు పుట్టడం, ఉద్యోగంలో ఒత్తిడి ... సాధ్యం కాలేదు.

## ఉద్యోగ జీవితం

ఏపీపీఎస్సీ నుంచి డీపీఆర్‌వో ఉద్యోగం వచ్చింది. చాలా కాంపిటీషన్ ఎదుర్కొని సాధించా. నాన్న ప్రభావం, నాకు స్వతహాగా ఉండే పట్టుదల, ఉద్యోగంలో రాణించడానికి బాగా ఉపయోగపడ్డాయి. దాదాపు పన్నెండేళ్ళ నుంచి గవర్న మెంట్ సర్వీస్‌లో ఉన్నాను. కృష్ణా జిల్లాలో మొదటి పోస్టింగ్. నా జర్నలిస్ట్ అనుభవంలో 'ఆంధ్రప్రదేశ్' మ్యాగజైన్‌ని బాగా తీర్చిదిద్దాను. సర్క్యులేషన్ అనూహ్యంగా పెరిగింది. 'ఈ-సేవా' పేరును సూచించింది నేనే. స్వతంత్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా గవర్నర్, ముఖ్యమంత్రులకు ఉపన్యాసాలు ఎన్నోసార్లు నేనే రాసిచ్చాను. ప్రాథమిక విద్యలో తప్పటడుగులు పడిన నేను 'విద్యారత్న' అవార్డు దాకా ఎదగడానికి అంబేద్కర్ యూనివర్సిటీలో పడిన అక్షర బీజమే కారణం. ఎన్నో విదేశాలు తిరిగాను. అక్కడ ఆర్థిక, సామాజిక స్థితిగతులు, రోడ్లు, అక్కడి జీవన విధానం గమనించాను. మనం అలా ఎందుకు ఎదగలేం అనిపిస్తుంది. మన దేశం ముందుకు పోవడానికి ఎంతో చేయొచ్చు అనిపిస్తుంది. నేనైతే ఆయా విభాగాల్లో ఇంకా బాగా పనిచేసేదాన్ని అనిపిస్తుంది. ఎందుకు చెబుతున్నానంటే చదువు నాకు ఇచ్చిన ఆలోచనే ఇదంతా. చదువు వల్ల మనిషిగా ప్రవర్తన, నలుగురిలో ఉండే తీరు మారలేదు. 'క్వాలిటీ ఆఫ్ థింకింగ్'ను పెంచింది. సమాజం గురించి ఆలోచించేలా చేసింది. దేశాన్ని, ప్రపంచాన్ని మార్చగలమన్న ఆత్మవిశ్వాసాన్నీ ఇచ్చింది.

* * *

ఆశావాది ప్రతి విపత్తులోనూ అవకాశాన్ని చూస్తే నిరాశావాది ప్రతి అవకాశంలోనూ విపత్తును చూస్తాడు.

**- మహాత్మాగాంధీ**



విశ్వవిద్యాలయ తొలి స్నాతకోత్సవంలో ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ కుముద్‌బెన్ జోషీ నుండి
గౌరవ డాక్టరేట్ స్వీకరిస్తున్న విశ్వవిద్యాలయ వ్యవస్థాపక వైస్ ఛాన్సలర్ ఆచార్య జీ. రాంరెడ్డి (1987)



కిష్టయ్య

# ఆటో వాలా అధ్యాపకుడయ్యిందిలా...

# కిష్టయ్య

"ఏదీ తనంతతానుగా నీ దరికి రాదు ... శోధించి సాధించాలి... అదే ధీర గుణం ..."

ఈ గీతం కిష్టయ్య లాంటి వారి జీవితానుభవాలను చూసి రాసుంటారు శ్రీశ్రీ. కిష్టయ్యకు తండ్రి నుంచి తనంతట తానుగా వచ్చింది పాత ఆటోరిక్షా మాత్రమే. ఆ ఆటోనే ఆసరా చేసుకుని సత్యశోధన మొదలుపెట్టిన కిష్టయ్య తన బతుక్కి కొత్త బాట వేసుకోగలిగాడు. రెక్కల కష్టం నుంచి నేర్చుకున్న అక్షరాలు ఒక్కొక్కటిగా కూర్చుకున్న ఆయనను అవే లెక్చరర్‌ను చేశాయి. హైదరాబాద్ పొలిమేరల్లో ఒక దళితవాడలో పుట్టిన కిష్టయ్య చదువుకు కూడా అంటరాని వాడయ్యాడు. పొట్టకూటికోసం బాల్యాన్ని, బతుకుని ఇటుక బట్టీల్లో, చక్కెర ఫ్యాక్టరీల్లో తాకట్టు పెట్టాల్సి వచ్చింది. పాఠశాల వయసు నుంచే ఫ్యాక్టరీల్లో, పొలాల్లో... కూలీగా, అడ్డమీద లేబర్‌గా నిలబడిపోయిన కిష్టయ్య ప్రతి అక్షరాన్నీ చెమటోడ్చి చదవాల్సి వచ్చింది. బతుకు లెక్కల్లో చిక్కుకు పోయిన కిష్టయ్యకు గణితం అర్థంకాక ఇంటర్ ఫెయిలై ఆగిపోతే పైచదువులకు దగ్గరి దారిని చూపించింది అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ. ఆటో నడిపిస్తూ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తిచేసిన కిష్టయ్య ఆ తరువాత పీజీ చేసి ఏపీపీఎస్సీ ద్వారా లెక్చరర్‌గా ఎదిగి ఎంతో మందికి మార్గదర్శిగా నిలిచాడు. కిష్టయ్య విజయం వెనుక నిరంతర శ్రమ, నిరుపమాన శోధన కనిపిస్తాయి. చదువే బతుకుని మార్చగలుగుతుందన్న అంబేద్కర్ జీవన సందేశాన్ని, బీజాక్షరాలుగా మలుచుకుని అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ద్వారా తన బతుకు బాట మార్చుకున్న కిష్టయ్య విజయ గాథను ఆయన మాటల్లోనే విందాం.

హైదరాబాద్ నగరానికి యాభై కిలోమీటర్ల దూరంలో ఉన్న కంది గ్రామం మాది. దళితవాడలో జననం. నాన్న మణయ్య, అమ్మ పోచమ్మ. ఇద్దరూ ఇటుక బట్టీలో కూలీలుగా పనిచేసేవారు. అమ్మా నాన్నలతో కలిసి ఆరుగురు ఇంట్లో. చిన్నపెంకుటింట్లో ఉండేవాళ్ళం. కూలి డబ్బులతోనే మా పూట గడవడం. జీవిత రథచక్రాల కింద నలిగిపోవడం అంటే ఏమిటో ఆ జీవితం చెబుతుంది. దుర్భర దారిద్ర్యం నుంచి 'బయటపడే మార్గం చదువొక్కటే' అన్న ఆలోచన చిన్నప్పటి నుంచీ నా బుర్రలో కదిలేది. ఆటో నడిపే నేను పీజీ చేసినా, లెక్చరర్‌గా ఉద్యోగం సంపాదించినా ఆ ఆలోచనే ఆలంబన... ఆ ఆలోచనే డ్రైవింగ్ ఫోర్స్.

మా ఊర్లో టెన్త్ దాకా చదువుకున్నా. అది సర్కారు సెకండరీ స్కూల్. చిరుగుల చొక్కా లాగులతోనే స్కూలుకు వెళ్ళేవాడిని. పెన్నులు, నోటుబుక్కులు కొనలేని ఆర్థిక పరిస్థితి. మాలాంటి లక్ష్మీకటాక్షం లేని వారికి సరస్వతీ కటాక్షమూ కష్టమే. చదువు కత్తిమీద సామే. చదువుపై ఆసక్తి కలిగించే సంఘటనల కన్నా... చదువు మానేయడానికి దోహదపడే పరిస్థితులే ఎక్కువ. అలాంటి స్థితిగతుల్లో పంటి బిగువున టెన్త్ పూర్తి చేశా.

## సాయిలు మామ... అంబేద్కర్

మా ఇంటి ఎదురుగా జయరాజ్ అని నాకు అన్నయ్య వరుస అవుతాడు. ఎమ్‌కాం చేసి ఆర్‌బీఐలో ఉద్యోగం సంపాదించాడు. మాలాంటి వారికి ఆయన ఆదర్శం. కూలిపని చేసి చదువుకుని ఉద్యోగం సంపాదించిన ఆయనను చూస్తే పిల్లలకు ఆరాధన. నన్ను జయరాజ్ బాగా ప్రభావితం చేశారు. అలాగే నన్ను మార్చిన మరో మనిషి గురించి చెప్పాలి. ఆయనే సాయిలు. మామ అవుతాడు. గ్రామ పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసేవారు. అంబేద్కర్ గురించి ఆయనే నాకు చెప్పాడు. చదువుకోసం అంబేద్కర్ పడిన తపన, కష్టం, ఎదుర్కొన్న అవమానాలు, దళితజాతి కోసం ఆయన పోరాటం ... ఇవన్నీ ఎంత

బాగా చెప్పాడంటే మా ఊరి చెరువు సాక్షిగా మొదలైన నా మనసు కదలికలు ఇంకా ఆగనే లేదు. బహుశా జీవితాంతం ఆ ప్రభావం ఉంటుందేమో. చెప్పడమే కాదు. అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకం ఇచ్చాడు. పుస్తకాలు జీవితాన్ని మార్చు తాయని ఎవరైనా చెబితే దానికి ఉదాహరణ నేనేనంటాను. కులవ్యవస్థ, నిచ్చెన మెట్ల సమాజం, అంటరానితనం, సామాజిక రుగ్మతలు, దళితుల దుర్భర జీవితం ... ఇవన్నీ నా కళ్ళముందు గిర్రున తిరిగాయి. నా జీవితంతో పోలిక ఉందనిపిం చింది ... ఆయన చరిత్ర చదువుతుంటే, అమితంగా ప్రభావితం చేసిన పుస్తకం అది. జీవన స్థితిగతులను మార్చుకోవడానికి చదువొక్కటే మార్గం అని మనసులో శిలాక్షరాలతో ముద్రపడడానికి కారణం అదే.

## భూమయ్య మాస్టారు...

నేను ఆరో తరగతి చదివేటప్పుడు మాకు భూమయ్య మాస్టారు సాంఘిక శాస్త్రం చెప్పేవారు. చదువు చెప్పడమే కాదు ... సాంఘిక సమస్యలపై దళితులలో చైతన్యం కలిగించే కార్యక్రమాలు, ఉద్య మాలు చేసే వారాయన. ఇవన్నీ ఎందుకు చెబు తున్నానంటే దళితవాడలో పుట్టిన నేను అక్షరజ్ఞానం అలవర్చుకుని అడుగడుగూ ఎదిగి ఈ స్థాయికి ఎలా, ఎవరి ప్రభావంతో వచ్చానో మీకు తెలియాలి. ఒక మాట, ఒక మనిషి, ఒక పుస్తకం జీవితాన్ని మార్చేస్తాయి. నేను అంబేద్కర్ యువజన సంఘంలో చేరినా, ఇంటర్లో నిరక్షరాస్యులను అక్ష రాస్యులుగా మార్చే ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నా అది భూమయ్య మాస్టారు ప్రభావమే. అలాగే నాగేశ్వరరావు మాస్టారు కూడా తన విద్యతో, గానంతో విద్యార్థులను ఉత్తేజపరిచేవారు.

> ***"చదువుకు ఇబ్బంది కాకూడదనుకున్నాను. అలాగే ఇంటికి ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించుకున్నాను. ఇదే లక్ష్యంతో ఆటో నడపడం నేర్చుకున్నాను. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల దాకా ఆటో నడపడం, ఇంటికి వచ్చాక రాత్రి రోజూ కనీసం గంటయినా చదువు. ఆదివారం మాత్రం అంబేద్కర్ వర్సిటీ క్లాసులకు అటెండ్ అయ్యేవాడిని. నిజంగా ఆ క్లాసులు విద్యార్థులకు ఒక వరం."***

## కూలి పని ... టెన్త్ పరీక్షలు

స్కూలుకు వెళ్తూనే వేసవి సెలవుల్లో అమ్మా నాన్నతో కూలికి వెళ్ళేవాడిని. మిరపకాయలు తెంపడం, వరి, జొన్న కోతలు... ఇలా ఏ పనైనా రడీ. మా అమ్మతో కలిసి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న వేపచెట్ల దగ్గరి కెళ్ళేవాడిని. వేపకాయలు ఏరి, వాటిని శుభ్రం చేసి మార్కెట్లో అమ్మడం. వచ్చిన డబ్బుతో నోట్‌బుక్స్, డ్రస్సులు కొనుక్కునే వాళ్ళం.

టెన్త్ పరీక్షలప్పుడు సంగారెడ్డిలో సెంటర్. మా ఊరి నుంచి ఎగ్జామ్స్ రాయ డానికి అక్కడికి వెళ్ళాలంటే ఒక్కో రోజు డబ్బులుండేవి కాదు. పొద్దున్నే లేచి నడచి సమయానికి ఎగ్జామ్ సెంటర్‌కు వెళ్ళేవాణ్ణి. నా ఇబ్బంది చూడలేక అమ్మా నాన్న అప్పుచేసి ఇచ్చారు. బస్సు చార్జీలు కూడా బరువే ఆ కాలంలో.

టెన్త్ పరీక్షలయ్యాక సెలవుల్లో చక్కెర ఫ్యాక్టరీలో కూలి పని, ట్రాక్టర్‌పై ఇసుక, ఇటుక లేబర్ పని ... మేస్త్రీ దగ్గర కూలి పని. ఇలా రకరకాల పనులతో కొంచెం డబ్బు పోగేశాను. ఇంతలో రిజల్ట్స్ వచ్చాయి. సెకండ్ క్లాసులో పాసయ్యాను. కాయలు కాచిన చేతులకు ... పులిసిన ఒంటికి అదే ఓ ఔషధం అయింది.

## ఇంటర్ ఫెయిల్

చిరిగిన చొక్కాతో, కూలి డబ్బులతో టెన్త్ మెట్టు ఎక్కాను. ఇక ఇంటర్... బతుకు భారంపై మరో బరువు ... నా స్నేహితుడి భరోసాతో ఎంపీసీలో చేరాను. అదే నేను చేసిన పొరపాటు. ఆర్ట్స్ గ్రూపులో చేరితే తేలిగ్గా గట్టెక్కేవాణ్ణి. భరోసా ఇచ్చిన స్నేహితుడు ఐటీఐ సీటు రావడంతో వెళ్ళిపోయాడు. నేను గణితం, భౌతికశాస్త్రం బుర్రకు ఎక్కక ఫెయిలయి కూర్చున్నాను. నిచ్చెన మెట్ల కింద నిస్సహాయంగా నిలబడాల్సి వచ్చింది. చీకటి కమ్మి నట్టయ్యింది.

## అంబేద్కర్ యూనివర్సిటీ... ఒక మలుపు

ఎలాంటి అర్హతలు లేకుండానే అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ చేయవచ్చన్న ప్రకటన నా జీవితాన్ని మరో మలుపు తిప్పింది. రెగ్యులర్

డిగ్రీ, ఈ డిగ్రీ ఒకటేనని, సివిల్ సర్వీసెస్ అయినా రాయవచ్చన్న సమాచారం. ఇంటర్ ఫెయిల్‌తో చదువు అయిపోయిందన్న నాలో ఈ వార్తలు ఉత్సాహాన్ని నింపాయి. అప్పటికే అంబేద్కర్ యూనివర్సిటీ గురించి విన్నాను. కానీ, అది రెగ్యులర్ డిగ్రీతో సమానం కాదని, ప్రయోజనం, విలువ ఉండదనీ తప్పుడు అభిప్రాయం ప్రచారంలో ఉంది. 'ఉదయం' పేపర్లో దాని గురించి రాసిన సమగ్ర సమాచారం ఆ అభిప్రాయాన్ని మార్చేసింది. అంబేద్కర్ వర్సిటీ అర్హత పరీక్ష రాసి పాసయ్యాను. 1993లో డిగ్రీ ఫస్టియర్‌లో చేరాను. ఇంటివైపు చూస్తే ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతోంది. ఉన్నత చదువులు చదవగలుగుతాననే ఆశ సన్నగిల్లుతోంది.

## ఆటో... డిగ్రీ

చదువుకు ఇబ్బంది కాకూడదనుకున్నాను. అలాగే ఇంటికి ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించుకున్నాను. ఇదే లక్ష్యంతో ఆటో నడపడం నేర్చుకున్నాను. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల దాకా ఆటో నడపడం, ఇంటికి వచ్చాక రాత్రి రోజూ కనీసం గంటయినా చదువు. ఆదివారం మాత్రం అంబేద్కర్ వర్సిటీ క్లాసులకు అటెండ్ అయ్యేవాడిని. నిజంగా ఆ క్లాసులు విద్యార్థులకు ఒక వరం. పరీక్షలకు నెల రోజులు ముందు నుంచీ టైంటేబుల్ పెట్టుకుని చదివే వాడిని. పరీక్షలప్పుడు మాత్రం అంతా చదువే ... వేరే పని, లోకం లేదు. ఉదయం నుంచీ సాయంత్రం దాకా చదవడమే. అలా 1996లో డిగ్రీ పూర్తిచేశాను. ఆ తర్వాత లాసెట్ రాశాను. వెయ్యి లోపు ర్యాంకు వచ్చింది. పడాల రామిరెడ్డి లా కాలేజీలో అడ్మిషన్ కోసం ప్రయత్నించాను. కానీ, ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కారణంగా అడ్మిషన్లు వాయిదా పడ్డాయి. అలా 'లా' మిస్సయ్యింది.

## ఉస్మానియా... పీజీ

1998లో ఉస్మానియా యూనివర్సిటీ పీజీ ఎంట్రెన్స్ నోటిఫికేషన్ పడింది. నేను, నా ఫ్రెండ్ నా ఆటోలోనే వెళ్ళి ఎంఏ పొలిటికల్ సైన్స్‌కు అప్లయి చేశాం. ప్రవేశ పరీక్ష కోసం బాగా కష్టపడ్డాను. ముప్పయి ఎనిమిదవ ర్యాంకు వచ్చింది. ఉన్నత విద్య లక్ష్యానికి చేరువయ్యాను అనిపించింది. పూట గడవడమే కష్టమవుతుంటే ఉస్మానియాలో పీజీ చేయడం ... ఇంట్లో వ్యతిరేకత వచ్చింది. ఎలాగో కష్టపడి చదువుకుంటానని వారిని ఒప్పించాను. ఉస్మానియాలో సీటు రావడమే గొప్ప. దానిని వదులుకోవద్దనుకున్నాను. నా చదువుతో కుటుంబ ఆర్థిక పరిస్థితి మారుస్తానని వారికి ఆశ కల్పించి 'ఉస్మానియా'లో చేరాను. కాని అదంత సులభం కాదని తర్వాత తెలిసింది. కాలేజీ, హాస్టల్స్, లైబ్రరీ... చదవడం ఇదే నా దినచర్య. ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ బాగా ఉపయోగపడింది. ఆ పుస్తకాలు చదివే ఏపీపీఎస్సీ పరీక్షలు రాసేవాణ్ణి. మొత్తానికి ఎంఏ ఫస్టియర్‌లో నేనే క్లాస్ ఫస్ట్. రెండో సంవత్సరం పూర్తయ్యేసరికి నాలుగో ర్యాంకులో నిలిచాను. ఐదు వేల రూపాయల మెరిట్ స్కాలర్‌షిప్ వచ్చింది.

## మళ్ళీ క్యాంపస్‌కు...

పీజీ పూర్తి చేశాను. చదువు సరే... బతుకు తెరువు ఎట్లా? ఇంట్లో ఒత్తిడి... ఎలా స్థిరపడడం? గ్రూప్-I, గ్రూప్-

> గడచిపోయిన కష్టాలను
> జ్ఞప్తికి తెచ్చుకో,
> అనుభవిస్తున్న సుఖాల
> తియ్యదనం పెరుగుతుంది.
>
> – సి.సి.కోల్టన్

II పరీక్షలు రాశా కానీ, ఉద్యోగం రాలేదు. ఊర్లో ఉండడం సాధ్యం కాలేదు. మా హాస్టల్‌లో వార్డెన్‌గా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ ముసలయ్యకు ఫోన్‌చేసి నా బాధలు చెప్పాను. ఆయన రెండు నెలలకు సరిపడా కిరాణా సామానుతో పాటు పాకెట్‌మనీ ఇచ్చి క్యాంపస్‌లో ఉండే అవకాశం కల్పించారు. రెండు నెలలపాటు కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అయ్యాను. ఆ తర్వాత మళ్ళీ ఆటోను ఆశ్రయించాను. అలా ఆటో నడుపుతూనే ఆర్ట్స్ కాలేజీ కోచింగ్ సెంటర్‌లో సివిల్స్ ప్రిలిమ్స్ కోసం అడ్మిషన్ తీసుకున్నాను. ఆరు నెలలపాటు కొంత వెసులుబాటు. చదువుపై పూర్తిగా దృష్టి పెట్టే అవకాశం.

పేరు ప్రఖ్యాతులు
పెరుగుతున్న కొద్దీ
తలదించుకునే నడవాలి
తప్ప, తలకెక్కించు
కోకూడదు.

**- హరివంశరాయ్**


**జూనియర్ లెక్చరర్‌గా ...**

2001 సంవత్సరంలో ఎంఫిల్ నోటిఫికేషన్ వచ్చింది. ఐదవ ర్యాకు సాధించి ఎంఫిల్ అడ్మిషన్‌తో ఓల్డ్ పీజీ హాస్టల్‌కు చేరాను. ఇక అక్కడి నుంచి చదువు పతాక స్థాయికి చేరింది. రోజుకు పన్నెండు నుంచి పద్నాలుగు గంటలదాకా చదివే వాడిని. ఇంతలో జూనియర్ లెక్చరర్ నోటిఫికేషన్ పడింది. గతంలో 'గ్రూపు' పరీక్ష రాసిన అనుభవం, సివిల్స్ కోచింగ్, అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ పునాది బాగా ఉపయోగపడ్డాయి. చివరికి అనుకున్న లక్ష్యం సాధించాను. జూనియర్ లెక్చరర్ అయ్యాను. ఆటో నడిపిన నేను... జీవితంలో అనేక పాఠాలు నేర్చుకున్న నేను... ఇక పిల్లలకు పాఠాలు నేర్పాలి.

**అంబేద్కర్ వర్సిటీకి కృతజ్ఞతలు**

ఎక్కడ కంది గ్రామం... ఎక్కడి దళితవాడ. ఇసుక బట్టీల్లో, చక్కెర ఫ్యాక్టరీల్లో నలిగిన బాల్యం ... ఆటో చక్రాలతో పరుగిడిన యవ్వనం. అక్షరమక్షరాన్ని చెమట చుక్కలు పిండి సాధించిన ఆనందం. అడుగడుగూ ఎదుగుతూ... నాకు నేను ప్రోత్సహించుకుంటూ ... దీని చుట్టూ అంబేద్కర్ యూనివర్సిటీ మెరుపు ఉంది, ఇంటర్ ఫెయిలై, ఇక మ్యాథ్స్‌లో పాసవనని నిరాశపడి, చదువుకు దారులు మూసుకు పోయాయనుకున్న సమయంలో అంబేద్కర్ యూనివర్సిటీ దారి చూపింది. క్యాంపస్ చదువులకు చేర్చింది. ఉన్నత విద్యావకాశాలను కల్పించింది. నాకు గుర్తింపు, గౌరవాన్ని ఇచ్చింది. జీవితంలో స్థిరపడేలా చేసింది. భూమయ్య మాస్టారు, సాయిలు మామ, ముసలయ్య సారు ... వీరందరితోపాటు నేను శిరసు వంచి నమస్కరించేది అంబేద్కర్ యూనివర్సిటీకే. దళితవాడ కూలీని, హైదరాబాద్ వీధుల్లో ఆటో డ్రైవర్‌ను... ఇప్పుడు లెక్చరర్‌గా చేసింది అదే.

* * *




జూబ్లీహిల్స్‌లోని విశ్వవిద్యాలయ భవన సముదాయానికి శంకుస్థాపన సందర్భంగా అప్పటి గవర్నర్ శంకర్‌దయాల్ శర్మతో ముఖ్యమంత్రి యన్.టి.రామారావు (1988)



పద్మప్రియ

# ఆగిపోయిన చదువు నుంచి ఐబిఎం దాకా...

# పద్మప్రియ

జీవితం నిరంతర ప్రవాహం. దాన్ని మనకు అనువుగా మరల్చుకోగలిగితే అందమైన లోకాన్ని స్పృశిస్తూ ప్రవహించవచ్చు. ఇదే కెరీర్‌కు వర్తిస్తుంది. మనకు అనుకూలమైనప్పుడు, అవసరమైనప్పుడు కెరీర్ కూడా మార్చుకుని ఎదగగలగాలి .. పద్మప్రియ అదే చేసింది. కంప్యూటర్ ట్రైనర్ స్థాయి నుంచి ఐబీఎం మేనేజర్‌గా ఎదగడానికి అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ ఎలా సాయపడిందో 'పద్మప్రియ' చెబుతుంది. పాలిటెక్నిక్ చేసి చిన్న ఉద్యోగం చేస్తూ ఉన్న ఈమె బీకాం, ఎంబీఏ చేసి తన కెరీర్ మార్చుకుంది. పెరుగుతున్న డిగ్రీలతో పాటు హోదానూ, జీతాన్ని పెంచుకున్నారు. కుటుంబ పరిస్థితుల వల్ల పాలిటెక్నిక్‌లోనే ఆగిపోయిన చదువుకు అంబేద్కర్ వర్సిటీ ప్రాణం పోసింది. ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా కలలుకనే ప్రతిష్ఠాత్మక 'ఐబీఎం' సంస్థలో మేనేజర్ స్థాయికి చేర్చింది. బహుళజాతి సంస్థల్లో పనిచేసే అవకాశాన్ని ఇచ్చింది. అంబేద్కర్ యూనివర్సిటీతో తన అనుబంధాన్ని, అనుభవాలను, ఉద్యోగంలో తన ప్రగతిని ఇలా వివరిస్తోందామె.

**మా** పేరెంట్స్‌ది గుంటూరు జిల్లా. కానీ, మేము హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగాము. టెన్త్ దాకా సీబీఎస్ఈ సిలబస్‌లోనే చదివాను. నాన్నకు ఇసిఐఎల్‌లో ఉద్యోగం. అప్పట్లో పాలిటెక్నిక్‌కు డిమాండ్ ఉండేది. దాంతో టెన్త్ అయిపోగానే పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ రాశాను. టెక్నికల్ కోర్సు కదా ఉద్యోగాలు తొందరగా వస్తాయని పాలిటెక్నిక్ చదివాను. నిజామాబాద్‌లో హాస్టల్లో ఉంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో పాలిటెక్నిక్‌లో చేర్పించారు. అది చేశాక ఇంజనీరింగ్ చేయాల్సి ఉండేది కానీ అప్పటికి పరిస్థితులు అనుకూలించలేదు. ఫీజులు అయితేనేమి, ఇంట్లో పరిస్థితులు అయితేనేమి చదువు అక్కడే ఆగిపోయింది. ఉద్యోగంలో చేరాను కానీ జీతం తక్కువ.

## అంబేద్కర్ వర్సిటీ... డిగ్రీ...

చదువుపై ఆసక్తి బాగా ఉండేది. పాలిటెక్నిక్‌లో నేనే కాలేజీ ఫస్ట్. ఇంకా చదవాలి అన్న ఆలోచనలో ఉండగా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ గురించి తెలిసింది. ఎంట్రన్స్ ఎగ్జామ్ రాసి బీకామ్‌లో చేరాను. ఉద్యోగం చేస్తూ వీకెండ్‌లో క్లాసులకు అటెండ్ కావడం చాలా అనుకూలమైంది. ఉద్యోగానికి, కుటుంబ బాధ్యతలకు ఇబ్బంది కలగకుండా చదువుకోవచ్చు. ఇది నాకు బాగా కలిసి వచ్చింది. లెక్చరర్లు చాలా సహకరించే వాళ్ళు. సండే క్లాస్‌లో సమయమే తక్కువ. ఆ సమయంలో ఎలా ప్రిపేర్ కావాలో చెప్పేవాళ్ళు. పాఠాలు చెప్పే తీరు కూడా ఎంతో బావుంటుంది. ఇంకా స్టడీ సెంటర్ల గురించి కూడా చెప్పాలి. అంబేద్కర్ ఓపెన్ వర్సిటీకి చాలా స్టడీ సెంటర్లు ఉన్నాయి. ఎక్కడైనా చేరవచ్చు. ఒక సెంటర్లో చేరి మరో సెంటర్లో క్లాసులకు అటెండ్ కావచ్చు. నేనలాగే చేసేదాన్ని. ఆదివారం మా అమ్మ దగ్గరికి వెళ్ళి బాబుని అక్కడ దింపి అక్కడే క్లాసులకు అటెండయ్యేదాన్ని. దానితో బాబుకూ ఇబ్బంది ఉండేదికాదు. నేను వాళ్ళను కలిసినట్టుగా కూడా ఉండేది. మళ్ళీ సాయంత్రం కూకట్‌పల్లి వచ్చేదాన్ని. స్టడీ సెంటర్లలో ఉన్న వెసులుబాటు ఇది. డిగ్రీ ఎలా కంప్లీట్ చేయాలి అన్న బాధ లేకుండేది. చాలా ఈజీగా గడిచింది. ఫీజులు కూడా చాలా తక్కువ. శనివారం, ఆదివారాల్లో కూడా పరీక్షలు నిర్వహించడంతో ఉద్యోగస్తులు ఎక్కువ సెలవులు పెట్టాల్సిన అవసరం ఉండదు. ఇలా చెబుతూ పోతే ఎన్నో ఉపయోగాలున్నాయి.

## ఉద్యోగంలో ప్రమోషన్

ఓ కంప్యూటర్ కోచింగ్ సెంటర్‌లో ట్రెయినర్‌గా పనిచేసేదాన్ని. సి, సి ప్లస్ నేర్పేదాన్ని. శాలరీ రెండు వేల దాకా ఉండేది. అప్పటికి డిగ్రీ పూర్తి కాలేదు. అంబేద్కర్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తిచేశాక జీతం పెరిగింది. జీవితమూ మారింది. టెక్నికల్ కో-ఆర్డినేటర్‌గా ప్రమోషన్ వచ్చింది.

## అంబేద్కర్ వర్సిటీ... ఎంబీఏ...

అప్పుడే పెళ్ళయింది. ఇక మళ్ళీ చదువు ఆగిపోయిందనుకున్నా. ఎంబీఏ సెట్ రాశాక అంబేద్కర్ యూనివర్సిటీ సీటు వచ్చింది. చేరాను కానీ పెళ్ళివల్ల కంటిన్యూ చేయలేకపోయాను. ఓపెన్ యూనివర్సిటీలో ఉన్న గొప్ప అనుకూలత ... తొమ్మిదేళ్ళలో ఎప్పుడైనా ఈ కోర్సు పూర్తిచేయవచ్చు. దానివల్ల కట్టిన ఫీజు వేస్టవుతుందనే బాధ లేకుండా తర్వాత కంటిన్యూ చేశాను. ఫస్టియర్, సెకండియర్ రెండూ ఒకే సంవత్సరంలో పూర్తిచేశాను. రెండేళ్ళ గ్యాప్ వచ్చి కుటుంబ పరిస్థితుల వల్ల చదవలేకపోయినా, రెండేళ్ళు వృధా కాకుండా నేను ఎంబీఏ కోర్సు కొనసాగించగలిగాను. అదీ అంబేద్కర్ యూనివర్సిటీ గొప్పతనం. డిగ్రీ అయిపోయాక 'హెచ్ఆర్' లైన్‌లోకి వెళ్ళడానికి ఎంబీఏ చేస్తే బావుంటుందనిపించింది. రెగ్యులర్ ఎంబీఏ చేస్తే ఉద్యోగం మానెయ్యాలి. కానీ ఆ పరిస్థితి లేదు. అందుకే అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో జాయిన్ అయ్యాను. నేను కెరీర్ కంటిన్యూ చేస్తూ చదువుకోగలిగాను. ఎంబీఏలో ఎసైన్‌మెంట్స్ ఉంటాయి. వాటిని పూర్తి చేసేటప్పుడు అక్కడ లెక్చరర్ల సహకారం గురించి ఎంత చెప్పినా తక్కువే. అందుకే ఎంబీఏ చేయడం కష్టం అనిపించలేదు. ముఖ్యంగా ప్రాజెక్టు గైడ్ సుధాకర్ గారి వల్ల సునాయాసంగా ఎంబీఏ పూర్తి చేయగలిగాను, ప్రొఫెసర్ కిరణ్మయి మేడం కూడా ఎంతో సహకరించారు. వీరందరినీ ఎప్పుడు కలిసినా ఓపిగ్గా అన్నీ వివరించి చెప్పేవారు.

## 'డెలాయిట్'లోకి ...

ఎంబీఏ చేసేటప్పుడు నేను 'వెర్టెక్స్' సంస్థలో ట్రైనీ కో–ఆర్డినేటర్‌గా పని చేస్తుండేదాన్ని. ఎంబీఏ రెండు సంవత్సరాలు పూర్తిచేశాక నాకు 'అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్' అని అంబేద్కర్ యూనివర్సిటీ వారు సర్టిఫికెట్ ఇచ్చారు. అది బాగా ఉపయోగపడింది. అది పీజీతో సమానం కావడంతో నా కెరీర్‌కు బాగా ఉపయోగపడింది. అంటే చదువుతున్నప్పుడే కెరీర్‌కు ఉపయోగం. దాంతో 'డెలాయిట్' సంస్థలో మంచి ఉద్యోగం వచ్చింది. రిసోర్స్ మేనేజ్‌మెంట్ రిలేటెడ్ ఉద్యోగం. పేరున్న బహుళజాతి సంస్థ అది. కెరీర్ మంచి దారిలో పడింది. ఇది డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అని ఏ సంస్థ భావించలేదు. వాళ్ళకు సర్టిఫికెట్‌తో పాటు చదువు, ప్రాక్టికల్ ఎక్స్‌పీరియన్స్ కావాలి. నేను అంబేద్కర్ యూనివర్సిటీలో చదువుకుంటూనే పనిచేశాను. కనుక కంపెనీలకు కావాల్సిన అనుభవం కూడా వచ్చింది. పైగా అంబేద్కర్ వర్సిటీ సిలబస్ బావుంటుంది. కనుక ఫౌండేషన్‌కు ఢోకా లేదు. 'ఓపెన్ వర్సిటీలో చేస్తే కెరీర్ బావుండదు' అనేది అపోహనని నా కెరీర్ చూస్తే అర్థమవుతుంది.

> *"ఎంబీఏ రెండు సంవత్సరాలు పూర్తిచేశాక నాకు 'అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్' అని అంబేద్కర్ యూనివర్సిటీ వారు సర్టిఫికెట్ ఇచ్చారు. అది బాగా ఉపయోగపడింది. అది పీజీతో సమానం కావడంతో నా కెరీర్‌కు బాగా ఉపయోగపడింది. అంటే చదువుతున్నప్పుడే కెరీర్‌కు ఉపయోగం. దాంతో 'డెలాయిట్' సంస్థలో మంచి ఉద్యోగం వచ్చింది. రిసోర్స్ మేనేజ్‌మెంట్ రిలేటెడ్ ఉద్యోగం. పేరున్న బహుళజాతి సంస్థ అది. కెరీర్ మంచి దారిలో పడింది. ఇది డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అని ఏ సంస్థ భావించలేదు."*

## 'ఐబీఎం' సంస్థలోకి...

'డెలాయిట్' సంస్థలో చేస్తుండగా ఎంబీఏ పూర్తయింది. ఆ తర్వాత ఐబీఎంలో ఉద్యోగం వచ్చింది. అది అంబేద్కర్ యూనివర్సిటీ ఇచ్చిన ఎంబీఏ (హెచ్ఆర్) మూలంగానే సాధ్యమయింది. రెగ్యులర్ విద్యార్థులు కలలుగనే, పోటీపడే ఈ సంస్థలో నాలాంటి వారికి ఉద్యోగం రావడం అంటే మాటలుకాదు. అంబేద్కర్ యూనివర్సిటీ ఫౌండేషన్ అలాంటిది. ఇంజనీరింగ్ చేసినవారు కూడా ఐబీఎంలో చేరాలనుకుంటారు. కరెస్పాండెన్స్‌లో ఎంబీఏ చేసిన నేను ఐబీఎంను చేరుకోగలిగాను. హెచ్ఆర్ మేనేజర్‌గా పనిచేస్తున్నాను.

## కెరీర్‌కు ఎంతో ఉపయోగం

కెరీర్‌లో ఈ స్థాయికి వచ్చానంటే ... అంబేద్కర్ యూనివర్సిటీ ఆధారంగా నేను 'లైన్' మార్చుకుని డిగ్రీ, ఎంబీఏ సాధించడమే కారణం. పాలిటెక్నిక్‌లోనే


ఆగిపోయి ఉంటే చాలా తక్కువ జీతానికి, చిన్న ఉద్యోగంతో ఆగిపోవాల్సి వచ్చేది. ఇప్పుడు ట్రయినర్ నుంచి మేనేజర్‌దాకా ఎదగగలిగాను. అంబేద్కర్ యూనివర్సిటీ నుంచి హెచ్ఆర్‌లోనే డబుల్ పీజీ చేయవచ్చని విన్నాను. అది చేయాలని ఆలోచిస్తున్నాను.

* * *

మనం ఉన్నత లక్షణాలు కలిగివుంటే సరిపోదు, వాటిని నిలబెట్టుకోవడానికి తగిన సామర్థ్యం కూడా కలిగి ఉండాలి.

\- సెయింట్ థెరిస్సా

**నేను అంబేద్కర్ యూనివర్సిటీలో చదువుకుంటూనే పనిచేశాను. కనుక కంపెనీలకు కావాల్సిన అనుభవం కూడా వచ్చింది. పైగా అంబేద్కర్ వర్సిటీ సిలబస్ బావుంటుంది. కనుక ఫౌండేషన్‌కు ఢోకా లేదు. 'ఓపెన్ వర్సిటీలో చేస్తే కెరీర్ బావుండదు' అనేది అపోహేనని నా కెరీర్ చూస్తే అర్థమవుతుంది.**



ఈశ్వర్

# దర్జీ కుటుంబంలో చదువుల దర్జా

# ఈశ్వర్, వెంకటేశ్వర్లు

ఇల్లంతా దులిపినా చిల్లిగవ్వ రాలని పరిస్థితి. నోట్‌బుక్స్ కొనే అవకాశం లేని ఆర్థిక స్థితిగతులు, స్కూలుకు వెళ్ళాలంటే మైళ్ళకొద్దీ నడక. ఇలాంటి పరిస్థితుల్లో ప్రాథమిక విద్యే భారం. మామూలు దర్జీ కుటుంబంలో పుట్టిన ఈశ్వర్ అననుకూల పరిస్థితుల్లో టెన్త్ గట్టెక్కి... ఆర్థిక సమస్యల కారణంగా ఇంటర్ తప్పి ఒక చిన్న ఉద్యోగంలో సెటిలయ్యాడు. ఇక చదువు, ఉద్యోగం ఇంతే అని సరిపెట్టుకున్న సమయంలో అంబేద్కర్ యూనివర్సిటీ అతనికి అండగా నిలిచింది. కుటుంబ సాయానికి అనివార్యమైన ఉద్యోగ బాధ్యతలకు ఆటంకం కలగకుండా ఈశ్వర్ డిగ్రీ పూర్తి చేయగలిగారు. ఆ డిగ్రీ సాయంతో ప్రతిష్ఠాత్మకమైన డిఆర్‌డీఎల్‌లో ఉద్యోగం సంపాదించగలిగారు. ఆ డిగ్రీ విలువ తెలుసుకున్న ఆయన తన సోదరులను కూడా అంబేద్కర్ యూనివర్సిటీలో చేర్పించి వారు జీవితంలో స్థిరపడడానికి కారకుడయ్యారు.

'**చి**ప్పలోనబడ్డ చినుకు ముత్యంబయ్యె' ... అన్నట్టుగా అంబేద్కర్ యూనివర్సిటీని ఆలంబనగా చేసుకుని జీవితాన్ని మార్చుకున్న 'ఈశ్వర్' కథ ఇది. గ్రామీణ భారతంలోని అన్ని పర్వాలు పేదరికంతో రాసుకున్నవే. అలాంటి పేదరికంలోనే చెరుకుపల్లె గ్రామంలో ఈశ్వర్ జన్మించాడు. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలో ఓ పల్లె అది. తండ్రి దర్జీ, నలుగురు సంతానంలో చివరివాడు ఈశ్వర్. దుస్తులు కుట్టి తండ్రి సంపాదించే డబ్బు పైనే కుటుంబం ఆధారపడాలి. అందుకే జీవితం ఎప్పుడూ చిరిగిన చొక్కాలాగే ఉండేది. బేరం ఉన్ననాడు తిండి, లేనినాడు లేదు.

పిల్లలకు తనలాంటి ఇబ్బంది రాకూడదనుకున్నాడు తండ్రి. అందుకే నలుగురు పిల్లలను స్కూల్లో చేర్పించాడు. చదువు, పిల్లల భవిష్యత్తును తీర్చి దిద్దుతుందని కలలుకన్నాడు. కానీ పేదరికానికి చదువుకు చాలా దూరం. సరస్వతీ కటాక్షానికి ఈశ్వర్ చాలా కష్టపడ్డాడు.

అసలే పుస్తకాల కొరత, నోట్‌బుక్స్ కొనుక్కోవడానికి చిల్లిగవ్వ లేనిపరిస్థితి. ఆపై రోజూ స్కూలుకు ఐదు కిలోమీటర్ల నడక. రోజూ నడచి వెళ్ళి రావల్సిందే. మరో దారిలేదు. కానీ, చదువుపై ఉన్న అమితాసక్తి ఆర్థిక ఇబ్బందులను అధిగమించేలా చేసింది. అతని మనసులో ఒక్కటే ధ్యేయం. బాగా చదవాలి, మంచి ఉద్యోగం సంపాదించాలి. తండ్రికి సాయపడాలి. తమ కుటుంబ ఆర్థిక ఇబ్బందులను తొలగించాలి. ఇదే అతన్ని చదువుకు మరింత దగ్గర చేసింది. టెన్త్‌దాకా చదువు బాగానే సాగింది. టెన్త్ పాసై ఇంటర్‌లో చేరాడు. ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో చదువు సరిగ్గా సాగలేదు. దాంతో ఇంటర్ ఫెయిలయ్యాడు. చదువు అర్ధంతరంగా ఆగిపోయింది. ఇంట్లో చూస్తే ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం. ఇక తాను తండ్రికి భారం కాకూడదనుకున్నాడు. చదివిన కాడికి సార్థకత ఉండాలనుకుని ... వెంటనే ఎంకేఆర్ డిగ్రీ కాలేజీలో లాబ్ అసిస్టెంట్‌గా చేరాడు.

చిన్న ఉద్యోగం. తక్కువ జీతం రోజులెలాగో గడుస్తున్నాయి కానీ, తను అనుకున్న లక్ష్యాన్ని చేరలేకపోయాననే అని మనసులో దిగులు ఉండేది. బాగా చదివి మంచి ఉద్యోగం సంపాదించాలనే తపన అలాగే ఉండిపోయింది. కానీ, ఉద్యోగం చేయక తప్పనిసరి పరిస్థితి. రెక్కాడితేనే డొక్కాడదు మరి.

ఇక్కడే అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఈశ్వర్‌కు దారిచూపింది. ఉద్యోగం చేస్తూనే చదువుకునే అవకాశం కల్పించింది. అంబేద్కర్ యూనివర్సిటీ గురించి స్నేహితుల ద్వారా తెలుసుకున్న ఈశ్వర్ డిగ్రీలో చేరాడు. ఇప్పుడాయన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పరిశోధనా సంస్థ డీఆర్‌డీఎల్ (హైదరాబాద్)లో కంప్యూటర్ రీసెర్చ్ ఎనలిస్ట్‌గా పనిచేస్తున్నారు. ఈశ్వర్ పట్టుదలతో పాటు అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ సహకారం రాసిన విజయగాథ ఇది.

టెన్త్ ఫస్ట్ క్లాసులో పాసైన ఈశ్వర్ ఇంటర్‌లో బీపీసీ గ్రూపు తీసుకున్నాడు. ఇంటర్ చదువుతున్నప్పుడే కంప్యూటర్స్ నేర్చుకోవడం బతుకు తెరువుకు దారి చూపింది. అతని కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలిచాడు. అతను పని చేస్తున్న ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలోనే అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ రావడం ఈశ్వర్ జీవితంలో పెద్ద మలుపు. చాలామంది ఉద్యోగ బాధ్యతలకు ఇబ్బంది లేకుండా అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ క్లాసులకు అటెండ్ కావడం అక్కడ ఈశ్వర్ గమనించాడు. ఆ యూనివర్సిటీ ఆఫర్ చేస్తున్న కోర్సులు, అందులో వెసులుబాటు అర్థం చేసుకున్నాడు. ఆ సంస్థ విద్యార్థులను కలుసుకుని మాట్లాడాడు. తనకు నేర్చుకోవడానికి అంబేద్కర్ యూనివర్సిటీనే సరైన మార్గం అని నిర్ణయించుకున్నాడు. ఇంటర్‌లో ఫెయిలై ఇక ఇంతే అన్న నిస్పృహలో ఉన్న తనకు అంబేద్కర్ యూనివర్సిటీ ప్రోగామ్స్ కొండంత బలాన్ని ఇచ్చాయంటారాయన. దానికి తోడు ఎంకేఆర్ కాలేజీ లెక్చరర్లు, విద్యార్థులు బాగా ఎంకరేజ్ చేశారు. దానితో అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ ఎంట్రన్స్ ఎగ్జామ్ రాశాడు. దానిలో ఉత్తీర్ణుడై బీఎస్సీలో అడ్మిషన్ తీసుకున్నాడు.

> **"అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ డిగ్రీలు ఇచ్చి తమ జీవితాలను ఆర్థికంగా స్థిరపడేలా చేశాయని అన్నదమ్ములందరూ ఆనందం, కృతజ్ఞతలు వ్యక్తం చేస్తున్నారు."**

కాలేజీలో పని అయిపోయాక సాయంత్రం ఇంటికి వచ్చాక చదవడం. మామూలు డిగ్రీ కన్నా బీఎస్సీ ప్రిపేర్ కావడం – అలా బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీలలో కష్టమేనని గ్రహించి ఇంకా శ్రమించాడు. ట్యూషన్‌కు వెళ్ళే తాహతు లేదు. టెస్ట్ పేపర్లు కొనే స్థోమత లేదు. పూర్తిగా అంబేద్కర్ యూనివర్సిటీ మెటీరియల్ పైనే ఆధారపడ్డాడు. నిజానికి ఈ సిలబస్ ఎంతటి కాంపిటీటివ్ పరీక్షలోనైనా నిగ్గుతేలడానికి సరిపోతుందంటారాయన. అర్థం కాని విషయాలు యూనివర్సిటీ లెక్చరర్లు విడమర్చి, సులభంగా చెప్పేవారని, తాను తేలిగ్గా డిగ్రీ పూర్తి చేయడానికి అదే ముఖ్య కారణమని ఈశ్వర్ కృతజ్ఞతలు చెబుతారు. ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూనే ఈశ్వర్ బీఎస్సీ సెకండ్ క్లాసులో పాసయ్యారు. దూరమయిందన్న చదువు దగ్గర కావడం, డిగ్రీ కూడా పూర్తిచేయడంలో ఈశ్వర్‌లో విశ్వాసం పెరిగింది. రెగ్యులర్ డిగ్రీలాగే ఈ డిగ్రీతో కూడా ఉపయోగాలున్నాయని గమనించాడు.

తానిప్పుడు బతుకుదెరువుకోసం చేస్తున్న ల్యాబ్ అసిస్టెంట్ ఉద్యోగం కన్నా మంచి ఉద్యోగం సంపాదించగలనన్న నమ్మకం ఏర్పడింది. అయితే ఇంకా చదవాలన్న ఆసక్తి, అంబేద్కర్ యూనివర్సిటీ ఇచ్చిన ఉత్సాహం ఆయన్ను పీజీ చేయడానికి పురికొల్పింది. అప్పటికే ఐటీ బూమ్ నడుస్తోంది. తానూ అదే దారిలో నడవాలనుకొన్నాడు. నాగార్జున యూనివర్సిటీ ఆఫర్ చేస్తోన్న ఎంఎస్సీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో చేరాడు.

ఎంఎస్సీ చేస్తుండగానే, డీఆర్‌డీఎల్‌లో రీసెర్చ్ ఎనలిస్ట్ కావాలంటూ వచ్చిన ప్రకటన చూశాడు. అతని సహోద్యోగులు అప్లయి చేయాలంటూ ప్రోత్సహించడంతో ఆ ఉద్యోగానికి దరఖాస్తు చేశాడు. దానికి కావలసిన అర్హతలు డిగ్రీ, కంప్యూటర్ స్కిల్స్ .. రెండూ ఈశ్వర్‌కు ఉన్నాయి. దానితో పాటు, కంప్యూటర్ రంగంలో మూడేళ్ళ అనుభవం ఉంది. ఇంకేం ... ప్రతిష్ఠాత్మకమైన సంస్థలో జూనియర్ రీసెర్చ్ ఎనలిస్ట్‌గా ఉద్యోగం సంపాదించాడు.


### అన్నదమ్ములంతా అదే దారి...

ఇంత మంచి ఉద్యోగం ... అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ భిక్షే నంటాడాయన. రెగ్యులర్ డిగ్రీలాగే దానికీ విలువ ఉందన్న విషయాన్ని తన ఉద్యోగం నిరూపిస్తుందంటున్నారు. ఇదే విషయాన్ని స్నేహితులకు, సహోద్యోగులకు చెబుతుంటారు. అంబేద్కర్ యూనివర్సిటీలో చేరాలని ప్రోత్సహిస్తుంటారు. ఈయన సూచనతోనే అతని సోదరుడు లోకేశ్ అంబేద్కర్ యూనివర్సిటీలో చేరి బీఏ పూర్తి చేశాడు. ఇప్పుడు లోకేశ్ కూడా హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు కాలేజీలో ఆఫీస్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నారు. అలాగే ఈశ్వర్ అన్నయ్య వెంకటేశ్వర్లు కూడా అంబేద్కర్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తి చేయడమే కాదు, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీజీ కూడా చేశారు.

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ డిగ్రీలు ఇచ్చి తమ జీవితాలను ఆర్థికంగా స్థిరపడేలా చేశాయని అన్నదమ్ములందరూ ఆనందం, కృతజ్ఞతలు వ్యక్తం చేస్తున్నారు.

### రణతంత్రాల మధ్య...

కఠిన సైనిక శిక్షణ మధ్య చదువు విస్మరించని వెంకటేశ్వర్లు కథ ఇది.



వెంకటేశ్వర్లు

ఈశ్వర్ సోదరుడైన వెంకటేశ్వర్లు దేవరకొండలో ఇంటర్ చేస్తుండగా ఆర్మీ సెలక్షన్‌లకు నోటిఫికేషన్ పడింది. అసలే ఆర్థిక సమస్యలు, తండ్రికి భారం కూకూడదనే ఉద్దేశంతో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టి 'ఆర్మీ'లో చేరారు. కనీసం డిగ్రీ అయినా చేయాలని తన కోరిక అంటారాయన. ఉద్యోగంలో చేరడం తన కోరిక తీరకుండా చేస్తుందనుకుంటుండగా అంబేద్కర్ ఓపెన్‌వర్సిటీ గురించి తెలుసుకుని డిగ్రీలో చేరారు. నల్లగొండలోని నాగార్జున కాలేజీలో స్టడీ సెంటర్, ఆర్మీ సర్వీసు కొనసాగిస్తూనే సెలవులు ఉపయోగించుకుని డిగ్రీ పూర్తి చేశారాయన. ఈ డిగ్రీ ఉద్యోగంలో ప్రమోషన్లకు ఉపయోగపడిందని వెంకటేశ్వర్లు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి కృతజ్ఞతలు చెబుతున్నారు. అయితే అక్కడితో ఆగకుండా అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలోనే ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పూర్తిచేశారు. త్వరలోనే తాను మిలటరీ సర్వీసు నుంచి రిటైర్ అవుతున్నానని తర్వాత ఉద్యోగాలకు తన డిగ్రీలు ఉపయోగపడతాయన్న ఆనందాన్ని వెంకటేశ్వర్లు వ్యక్తం చేస్తున్నారు.

* * *



త్రివేణి నర్సింహా

## మగ్గం పేదరికంలో
## నిగ్గు తేలిన అక్షరం

# త్రివేణి నర్సింహ

భావాలకు
సంకెళ్ళు వేయకండి ...
శిల్పం మళ్ళీ శిలగా
మారవచ్చు ...

* * *

ఈ దార్లో వస్తుంటే
మనసు గాల్లో తేలుతోంది.
నా బాల్యాన్ని మోసింది
ఈ స్కూలే ...

* * *

వసంతమొక
మెరుపు మొక్క
దాని అంచున
గ్రీష్మం కాపు కాస్తుంది ...

*(త్రివేణి నర్సింహ 'తూనీగలు' నుంచి)*

* * *

ఆమెది 'చిరుగు పాతల బడుగు బతుకుల నేత' జీవితం. తరతరాలుగా మగ్గం పేదరికాన్నే అల్లుతోంది. నాలుగు వేళ్ళు నోట్లోకి వెళ్ళేప్పుడు వేళ్ళ మధ్య సందులే కానీ మెతుకులు కనిపించవు ... వాటి మధ్య జారిపోతున్న జీవితమే కనిపిస్తుంది. ఇలాంటి దుర్భర దారిద్ర్యంలో నాలుగక్షరాలు మనసుకు పట్టాలంటే శరీరాన్ని ఎంతో కష్ట పెట్టాల్సిందే. అందుకే ఆమె స్పిన్నింగ్ మిల్‌లో రోజు కూలికి చేరింది. ఆ కూలి డబ్బులతోనే ఇంటర్ పాసయ్యింది. విద్యావాలంటీర్ ఉద్యోగం సంపాదించింది. అంబేద్కర్ యూనివర్సిటీ వైపు ఆమె వేసిన అడుగు ఆమె జీవితాన్నే మార్చేసింది. ఎంఏ, ఎంఫిల్, పిహెచ్‌డీలు చకచకా చేయడానికి ఉపయోగపడింది. నిద్రాణంగా ఆమెలో ఉన్న శక్తి అక్షర రూపంలో బయటపడింది. ఆ డిగ్రీ చేతికి వచ్చాక ఆమె కెరీర్ గ్రాఫ్ కూడా మిస్సైయిల్‌లా దూసుకుపోయింది. కౌన్సెలర్‌గా, లెక్చరర్‌గా... తెలంగాణ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎదిగింది. ఆర్థిక భారంలో కూరుకుపోయిన ఆశలను, ఆశయాలను పట్టుదలతో పెళ్ళగించి... మహిళలు విజయాలను సమాజానికి చూపించాలంటోంది ఇప్పుడామె.

**కుటుంబ పరిస్థితి ...**

మాది చేనేత కుటుంబం. పూర్వీకులంతా కులవృత్తి చేసి పేదరికంలోనే మగ్గిపోయారు. మా పరిస్థితీ అంతే. తాత ముత్తాతల ఆస్తిపాస్తులేం లేవు. వారు మా చేతికి మిగిల్చి వెళ్ళిన మగ్గం మా బతుకులకు చిరుగులనే మిగిల్చింది. అందుకే మా నాన్న నేతను వదలి బడిపంతులు ఉద్యోగం ఎన్నుకున్నారు. అదీ అంతంత మాత్రమే ఆదుకున్నది. మేము ఐదుగురం సంతానం. నాన్నకు కుటుంబ భారం పెరిగింది. ఉద్యోగానికి తోడు చిన్నచిన్న వ్యాపారాలను చేసి నిలదొక్కుకోవడానికి

ప్రయత్నించారు. కానీ కాలం కలిసి రాలేదు. ఆర్థికంగా బాగా దెబ్బతిన్నాం. అది నేరుగా మా చదువులపై ప్రభావం చూపింది. ఉన్నత చదువులు దూరమయ్యాయి. అక్కాచెల్లెళ్ళం నలుగురం పదవ తరగతి వరకే చదివాం.

## స్పిన్నింగ్ మిల్‌లో పనికి...

ఆర్థిక భారాన్ని మోయడం నాన్న ఒక్కడి వల్లా కావడం లేదు. ఒంటి చేత్తో బతుకు నేత అసాధ్యం కదా. అందుకే మేమందరం తలో చేయి వేశాం. నలుగురం దగ్గర్లోనే ఉన్న స్పిన్నింగ్ మిల్ కంపెనీలో కార్మికులుగా చేరాం. చదువు దూదిపింజల్లా గాలికి కొట్టుకు పోయింది. బతుకు బరువు ముందు అది అల్పం. దాదాపు మూడు సంవత్సరాలు ఆ కంపెనీలో పని చేశాం. ఆ తర్వాత ముగ్గురు అక్కల పెళ్ళిళ్ళు జరిగాయి. కుటుంబం గడవడమే కష్టం అంటే ఇదింకా భారం అయింది. ఇంటి పరిస్థితి ఇంకా ఘోరంగా మారింది. భయంకరమైన పేదరికం. తినడానికి తిండి కూడా లేని పరిస్థితిని ఎదుర్కొన్నాం.

> ***“అంబేద్కర్ యూనివర్సిటీలో పడిన ఉన్నత చదువుల పునాదిపై ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీలను ఉస్మానియా యూనివర్సిటీ నుంచి సాధించాను. అంతకు ముందే తెలుగు పండిట్ శిక్షణను పూర్తిచేసి డీఎస్సీ ద్వారా పండిట్ గ్రేడ్-I, పండిట్ గ్రేడ్-II ఉద్యోగాలను పొందగలిగాను. యుజీసీ వారు నిర్వహించే నెట్/ జేఆర్ఎఫ్ పరీక్షను పీజీ తర్వాత రాసి అత్యున్నతమైన జేఆర్ఎఫ్ అవార్డు పొందాను.”***

## విద్యావాలంటీర్‌గా

చదువు విషయానికొస్తే నేను పుట్టిన ఊరు లాల్‌గడి మలక్‌పేట (రంగారెడ్డి జిల్లా) లోని స్కూల్లో టెన్త్‌దాకా లేదు. అక్కడ సెవెన్త్ వరకూ చదువుకుని పొరుగూరిలో టెన్త్ చదివాను. చిన్నప్పటి నుంచి చదువంటే ప్రాణం. ప్రతి తరగతిలో నేనే ఫస్ట్. చదువే కాదు ... పాటలు, పద్యాలు, ఆర్ట్, ఆటలు, కల్చరల్ యాక్టివిటీస్‌లో చురుగ్గా ఉండేదాన్ని. అమ్మాయిలు పొరుగూరికి పోయి చదవడమే కష్టం. అలాంటిది అక్కా చెల్లెళ్ళం పదవ తరగతి దాకా చదవగలిగాం. అక్కలందరి చదువు పదవ తరగతి వద్దే ఆగిపోయింది. ఇక నా పనీ అంతే అనుకున్నాను. పైగా కంపెనీలో రోజువారీ కూలి. అప్పటి దాకా చదువుల్లో ఫస్ట్‌గా ఉన్న నేను కంపెనీలో పనికి కుదరడం చాలా బాధగా అనిపించేది. అందుకే రోజువారీ కూలీపని చేస్తూనే ప్రైవేటుగా వన్‌సిట్టింగ్‌లో ఇంటర్ పరీక్షలు రాసి పాసయ్యాను. దానితో ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యావాలంటీర్‌గా మా ఊరిలోనే ఉద్యోగం వచ్చింది. కంపెనీ కూలి పని నుంచి మోక్షం లభించింది. మళ్ళీ చదువుల తల్లికి దగ్గరయ్యాను. కాసింత ఊరట. నేను చదివిన పాఠశాలలోనే ఉద్యోగం దొరకడం అదృష్టంగా భావించాను. పైగా ఆ పాఠశాలలోనే మా నాన్న కూడా ఉపాధ్యాయుడు.

## అంబేద్కర్ వర్సిటీ ... డిగ్రీ

ఆ పాఠశాలలో సహోద్యోగుల ప్రోత్సాహంతో అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీలో చేరాను. నాకు మొదటి నుంచీ తెలుగు సాహిత్యంపై ఆసక్తి ఉండేది. అందుకే డిగ్రీలో తెలుగు సాహిత్యం, సోషియాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సబ్జెక్టులు తీసుకున్నాను. అలా ప్రైవేటు టీచర్‌గా ఉంటూనే డిగ్రీ చదివాను. సుహాసినీ, హనుమంతరెడ్డి, మోహన్‌రెడ్డి, గోపాలరెడ్డి ... ఈ ఉపాధ్యాయులంతా నాకెంతో సహకరించారు, ప్రోత్సహించారు. గోపాలరెడ్డి భార్య మణెమ్మ అంబేద్కర్ యూనివర్సిటీ క్యాంపస్‌లో పని చేస్తున్నారు. నేను డిగ్రీ పూర్తి చేయడానికి వీరిరువురూ ప్రధాన కారణం. వీరిని నా జన్మంతా స్మరిస్తాను. డిగ్రీ ఫస్టియర్‌లోనే నాకు వివాహం అయింది. ఆయన పెద్దగా చదువుకోకపోయినా విద్యపై అభిమానం, గౌరవం ఉన్నవారు. ఉన్నత చదువులు చదవాలన్న నా ఆశకు ఆయన ఊపిరి పోశారు.

## చదువుల గ్రాఫ్...

ఎంఏ (తెలుగు) కూడా అంబేద్కర్ యూనివర్సిటీలో చేయాలనుకున్నా. కానీ ఆ సబ్జెక్టు అక్కడలేదని తెలియడంతో ఉస్మానియా నుంచి ఎంఏ (తెలుగు) చేశా. అంబేద్కర్ యూనివర్సిటీలో పడిన ఉన్నత చదువుల పునాదిపై ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీలను ఉస్మానియా యూనివర్సిటీ నుంచి సాధించాను. అంతకు ముందే తెలుగు పండిట్ శిక్షణను పూర్తిచేసి డీఎస్సీ ద్వారా పండిట్ గ్రేడ్-I, పండిట్ గ్రేడ్-II ఉద్యోగాలను పొందగలిగాను. యుజీసీ వారు నిర్వహించే నెట్/

జేఆర్ఎఫ్ పరీక్షను పీజీ తర్వాత రాసి అత్యున్నతమైన జేఆర్ఎఫ్ అవార్డు పొందాను.

2005లో పాఠశాలకు సెలవుపెట్టి పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థిగా ఉంటూ హైదరాబాద్‌లో కోఠి మహిళా కళాశాలలో లెక్చరర్‌గా పనిచేశాను. అలాగే సికిందరాబాద్ వైఎంసీఏ బాలుర జూనియర్ కాలేజీలోని అంబేద్కర్ యూనివర్సిటీ కేంద్రంలో తెలుగు సాహిత్యంలో కౌన్సెలర్‌గా పనిచేసిన అనుభవం కూడా ఉన్నది. ఇక్కడే డిగ్రీ చేసిన నేను ఇక్కడే కౌన్సెలర్‌గా పని చేయగలిగాను.

## అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ...

అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీతో కదలిన అడుగు... వడివడిగా పడుతూనే ఉంది. టీచర్‌గా, కౌన్సెలర్‌గా, లెక్చరర్‌గా నన్ను నేను తీర్చిదిద్దుకున్నాను. పెద్దల పరిచయ భాగ్యం కలిగింది. వారి నుంచి ఎన్నో నేర్చుకున్నాను. ప్రగతి వైపు ప్రస్థానానికి కామాలే కాని, ఫుల్‌స్టాప్‌లు ఉండవని తెలుసుకున్నాను. అందుకే చేరిన ప్రతి మజిలీలో మరింత ఉత్సాహం తెచ్చుకోవడమే గాని విశ్రమించడం ఎరుగను నేను. ఈ క్రమంలోనే జనవరి, 2007లో తెలంగాణ విశ్వవిద్యాలయం లోని తెలుగు అధ్యయన శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం సాధించాను. మరో ఉన్నత మజిలీ, మరో విజయం.


## రచనా వ్యాసాంగం...

చెప్పాగా, తెలుగు సాహిత్యం అంటే ఎంతో మక్కువ అని. అందుకే రచన ప్రవృత్తిగా చేపట్టాను. కవితలు, వ్యాసాలు రాసేదాన్ని. ఎంఫిల్‌లో నా సిద్ధాంత వ్యాసం, "చిల్లరిగె స్వరాజ్యలక్ష్మి కవిత్వ పరిశీలన." అలాగే 'తూనీగలు' అనే నానీల సంపుటిని ప్రచురించాను. మా పుట్టింటివారు పడుగు, పేకల్లో నలిగి పోయినా సాహిత్యంలో నిగ్గు తేలారు. సాహిత్యం, ఆధ్యాత్మిక తత్వభావం వారిలో అల్లుకుపోయింది. మా పెదనాన్న గారు అచల పరిపూర్ణశ్రీ నిర్మలానంద వంగరి వేంకట నారసింహాచార్యులు రచించిన నాలుగు రచనలు – వామన చరిత్రము, మార్కండేయ పురాణం, శ్రీ రామలింగేశ్వర శతకం, భక్తితత్వ సంకీర్తనలను పరిష్కరించి ప్రచురించాను. ఇదేగాక 'శ్రీ నారసింహాచార్య జీవిత చరిత్ర'ను రచించాను. ఇప్పుడు నా హెచ్‌హెచ్‌డీ సిద్ధాంత వ్యాసం "ముదిగంటి సుజాతారెడ్డి రచనలు– సమగ్ర పరిశీలన,' 'విపంచిక' అనే వచన కవితా సంపుటిని ముద్రించే ప్రయత్నంలో ఉన్నాను.

## కలలు కనండి...

"కలలు కనండి ... వాటిని సాకారం చేసుకోండి" అన్న రాష్ట్రపతి కలామ్ మాటలు చూస్తే నాకు ... నా జీవితం, కష్టాలు, చదువులు, ఆశలు, ఆకాంక్షలు, కన్నీళ్ళు, ఆనంద భాష్పాలు, డిగ్రీలు, అవార్డులు, విజయాలు గుర్తుకు వస్తాయి. కూలీగా పనిచేసిన నేను కన్నకలలు, అంబేద్కర్ యూనివర్సిటీ సహకారంతో అవి సాకారం చేసుకున్న తీరు గుర్తుకు వస్తాయి. సమాజంలో నాలాంటి మహిళలు ఎంతో మంది ఉన్నత చదువులు చదవాలన్న ఆశతో ఉండవచ్చు. వారిని నేను కోరేదొక్కటే. ఆశలకు సంకెళ్ళు వేయకండి. వివాహం, వయసు, ఉద్యోగం, ఆర్థిక పరిస్థితి... ఏవీ మన ఆశయాలకు అడ్డం రావు. చెమటోడ్చి జీవితాన్ని నెగ్గడమే మనం చేయాల్సింది. ఇప్పుడు నా పిల్లలకు అదే చెబుతున్నాను.

* * *



కృష్ణప్రసాద్

## గురి తప్పని
## గుండె ధైర్యం...

# కృష్ణప్రసాద్

మాట వినని గుండె అతన్ని ఇబ్బంది పెట్టింది. లక్ష్యంపై గురి తప్పేలా చేసింది. కానీ అతనిలో ఉత్సాహాన్ని, ధైర్యాన్ని, పట్టుదలను తగ్గించలేకపోయింది. అదుపుతప్పి వేగంగా కొట్టుకునే గుండెముందు అతని వ్యక్తిత్వం తలవంచకుండా నిబ్బరంగా నిలబడింది. శ్రమ చేయనివ్వని గుండె జబ్బు డాక్టర్ కావాలన్న లక్ష్యాన్ని చేరుకోనివ్వకుండా తప్పించగలిగిందే కానీ, మరో కొండలాంటి లక్ష్యాన్ని ఎంచుకోలేకుండా చేయలేకపోయింది. ఆయన ఐఏఎస్ లక్ష్యం కోసం అంబేద్కర్ యూనివర్సిటీలో డిగ్రీ చేశారు. తన శక్తిమేరకు శ్రమించి ప్రయత్నం చేశాడు. అనారోగ్యాన్ని జయించిన అతని గుండె ధైర్యం... అతన్ని డిగ్రీకి, పీజీకి, టీచర్‌గా జీవితంలో స్థిరపడడానికి, ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవడానికి చేరువ చేసింది.

## గుప్పెడంత గుండె

**మా**ది వరంగల్ జిల్లా కడిపికొండ. నాన్న సరస్వతీ శిశుమందిర్‌లో టీచర్. అది సేవాసంస్థ కనుక జీతం తక్కువ. ఆర్థిక సమస్యలు ఎక్కువగానే ఉండేవి. పైగా తరచూ బదిలీలు. నేను సరస్వతీ శిశుమందిర్‌లోనే టెన్త్ పూర్తి చేశాను. చదువులో బాగానే ఉండేవాడిని. కానీ ఆరోగ్యమే సరిగా ఉండేదికాదు. గుండె జబ్బు. కొద్దిగా శ్రమ కలిగినా హార్ట్‌బీట్ పెరిగేది. అందుకే ఆటలు, ఇతర యాక్టివిటీస్‌కు దూరంగా ఉండేవాడిని. వాటినుండి దృష్టి మరల్చడానికి చదువులో ఎక్కువ సమయం గడిపేవాడిని. చదువుకుంటే మంచి ఉద్యోగంలో సెటిల్ కావచ్చని అమ్మా నాన్న ఎంకరేజ్ చేసేవారు. అలా కష్టపడడం వల్లే టెన్త్‌లో స్టేట్‌లో 11వ ర్యాంకు వచ్చింది. అమ్మా నాన్న ఎంతగానో సంతోషపడ్డారు.

## ఉప్పెనంత ఊహ...

ఒక ఊరిలో హాస్టల్ పక్కనే మేం నివాసముండేవాళ్ళం. అక్కడ పిల్లల ఆరోగ్య సమస్యలు, డాక్టర్ లేక వారుపడే పాట్లు రోజూ చూసేవాణ్ణి. ఇదంతా నా మనసుపై బాగా పనిచేసింది. ఎలాగైనా డాక్టర్ కావాలనుకున్నా. పేద, గ్రామీణ ప్రజలకు సేవచేయాలని నిశ్చయించుకున్నాను. ఈ ఊహ మేరకు ఇంటర్‌లో బైపీసీ గ్రూపు తీసుకున్నా. స్టేట్ ర్యాంకర్ కనుక ఎస్.ఆర్.జూనియర్ కాలేజీ ఉచితంగా సీట్ ఆఫర్ చేసింది. సీటేకాదు పుస్తకాలు, హాస్టల్ సీటు కూడా ఫ్రీగానే ఇచ్చింది. ఇది అమ్మా నాన్నలకు భారం తగ్గించినట్టయ్యింది. ఇక పుస్తకాల మధ్యే గడపడం మొదలుపెట్టాను. సెలవుల్లో కూడా హాస్టల్లోనే ఉండేవాడిని. ఆటలపై ఆసక్తి, ఆరోగ్యం రీత్యా అవకాశమూ లేకపోయేసరికి ఎక్కువగా లైబ్రరీలోనే గడిపేవాడిని. ఎప్పుడూ అదే ఆలోచన డాక్టర్ కావాలని.

ఫస్టియర్‌లో బాగా మార్కులొచ్చాయి. స్టేట్ ర్యాంక్ వచ్చింది. రెండో సంవత్సరంలో మళ్ళీ అనారోగ్యం. గుండె చెప్పిన మాట వినడం లేదు. హార్ట్ బీట్ పెరిగింది. డాక్టర్లు శ్రమ పడకూడదన్నారు. విశ్రాంతి అవసరమన్నారు. అప్పటికే అమ్మా నాన్న చాలా డబ్బులు వెచ్చించారు. ఇక వాళ్ళను కష్టపెట్టకూడదు. విశ్రాంతి తీసుకున్నాను. దానితో చదువుకునే సమయం తగ్గింది. అమ్మానాన్న పక్కనే ఉండి అన్నీ చూసుకునేవారు. నా అనారోగ్యం వారిని బాగా కలిచివేసింది. మరోవైపు అనారోగ్యం చదువుకు సహకరించడం లేదు. సెకండియర్‌లో పాసయ్యాను. కానీ ఎక్కువ మార్కులు స్కోర్ చేయలేకపోయాను. అలాగే ఎంసెట్‌లో కూడా మంచి ర్యాంక్ రాలేదు. వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి నన్ను వైద్యుడిని కానీయకుండా అడ్డుపడింది.

## సడలని దీక్ష...

మొదటిసారి ఎంబీబీఎస్ సీటు రాలేదు. నిరాశగా అనిపించింది. పట్టుదల మాత్రం తగ్గలేదు. మెడిసిన్ తప్ప మరొకటి చేయకూడదనుకున్నాను. ఆ సంవ

త్సరం కూడా ఎంసెట్‌కే ప్రిపేర్ అయ్యాను. ఇంట్లోనే ప్రాక్టీస్. కోచింగ్ తీసుకునే ఆర్థిక స్థోమత లేదు. ఆరోగ్యం సహకరించలేదు. లక్ష్యంలో మళ్ళీ ఫెయిల్. నాన్న డీఈడీ చేసి టీచర్ అవమన్నారు. ఆ ఉద్యోగం అయితే నా ఆరోగ్య పరిస్థితికి సహకరిస్తుందని ఆయన సలహా. వారి సూచన ప్రకారం డీఈడీ ఎంట్రన్స్ రాశా, మంచి ర్యాంకు వచ్చింది. కానీ జాయిన్ అవలేదు. నా లక్ష్యం డాక్టర్ ... అంతే. అమ్మా నాన్న మండిపడ్డారు... ర్యాంకు వచ్చినా చేరనందుకు. నేను అతి కష్టంమీద వారిని ఒప్పించాను. ఇదే చివరి ప్రయత్నం. ఈ ఒక్క సంవత్సరం కష్టపడి ఎంసెట్ రాస్తానన్నాను. ఆ తర్వాత వారిష్టమన్నాను. కానీ, మళ్ళీ అదే పరిస్థితి. మందులు, అనారోగ్యం. మెడిసిన్ సాధించలేకపోయాను. డాక్టర్ అవుదామన్న నా కల కరిగిపోయింది. పేదలకు సేవ చేయాలన్న లక్ష్యం నీరుకారిపోయింది.

## డీఈడీ, డీఎస్సీ...

అమ్మా నాన్నకు ఇచ్చిన హామీ ప్రకారం డీఈడీ మళ్ళీ రాశాను, సీటు వచ్చింది. వరంగల్ డీఐఈటీ కాలేజీలో చేరాను. డాక్టర్ కల చెదిరి పోయింది. ఇక టీచర్ కావాలి. ఈ ఆలోచనల్లో ఉండగా మా కాలేజీ యాన్యువల్‌డే ఫంక్షన్‌కు వరంగల్ మునిసిపల్ కమిషనర్, ఐఏఎస్ అధికారి వెంకటేశం చీఫ్ గెస్ట్‌లుగా వచ్చారు. ఉన్నత వర్గమైనా, వెనుకబడిన వర్గమైనా, ఏ తరగతికి చెందిన వారమైనా నిరుత్సాహపడొద్దు. మన లక్ష్యం నెరవేరేదాకా పట్టుదల వదలొద్దు. కల నెరవేరాలంటే ఎన్ని అవరోధాలైనా అధిగమించాలని ఉద్బోధించారు. అది నాపై బాగా ప్రభావం చూపింది. పర్సనల్‌గా వెంకటేశం గారిని కలిశాను. ఐఏఎస్ ఆఫీసరైతే పేద ప్రజలకు బాగా సేవ చేయవచ్చని ఆయన సూచించారు. పేదరి కాన్ని, నిరుద్యోగాన్ని తొలగించే ప్రయత్నం చేయవచ్చన్నారు. ఆ మాటలు నాపై బాగా పనిచేశాయి. సివిల్స్ రాయాలనుకున్నాను. ఆయన సూచన మేరకే డీఈడీ పూర్తిచేసి ఆర్థికంగా స్థిరపడి అమ్మా నాన్నలకు బరువు తగ్గించాలనుకున్నా. డీఎస్సీకి ప్రిపేర్ అయి 2000 సంవత్సరంలో టీచర్ ఉద్యోగం సంపాదించగలిగాను. ఐఏఎస్ రాయడానికి అవసరమైన ఆర్థికస్థితి సమకూరింది. టైమ్ కూడా దొరికింది.

## అంబేద్కర్ యూనివర్సిటీ, డిగ్రీ...

ఐఏఎస్ లక్ష్యమైతే ఎంచుకున్నాను గానీ, దానికి కావల్సిన డిగ్రీ అర్హత నాకు లేదు. మొదట డిగ్రీ చేయాలని యూనివర్సిటీ కోసం, అదీ దూరవిద్య అందించే వర్సిటీకోసం వెదికాను. సైన్స్ గ్రూపు తీసుకుందామనుకున్నా, దానికి మంచి సదుపాయాలు ఉండాలి. ఫ్రెండ్స్, సీనియర్స్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీని సూచించారు. దూరవిద్యలో క్వాలిటీ ఎడ్యుకేషన్ కావాలంటే అంబేద్కర్ యూని వర్సిటీ మంచిదన్నారు. వారి స్టడీ సెంటర్ ఉన్న సీకేఎం కాలేజీలో మంచి ఫెసిలిటీస్ ఉన్నాయి. దాంట్లో చేరిపోయా. రెగ్యు లర్‌గా క్లాసులకు అటెండ్ అయ్యేవాణ్ణి. నిజానికి నేను బయాలజీ నుంచి మ్యాథ్స్‌లోకి మారాను, సివిల్స్‌కు ప్రిపేర్ కావడం ఈజీ అని. తర్వాత భయం వేసింది. ట్యూషన్‌కు వెళ్ళాల్సి వస్తుందని. కానీ, అంబేద్కర్ వర్సిటీ పుస్తకాలు చూశాక నా అను మానాలు, భయాలు పటాపంచలయ్యాయి. చాలా ఈజీగా, ఇంట్రెస్టింగ్‌గా తోచాయి. ఇక క్లాసులలో టీచింగ్ గురించి చెప్పనక్కరల్లేదు. రెగ్యులర్ వాళ్ళకు ఏమాత్రం తీసిపోకుండా ప్రిపేర్ చేశారు మమ్మల్ని.

ప్రాక్టికల్స్ విషయంలో సీకేఎం కాలేజీ వాళ్ళు చాలా సహకరించారు. అసలు వారి సపోర్ట్ లేకుండా మేమంతా ప్రాక్టికల్స్ పాసయ్యే వాళ్ళమే కాదు. ఎంతో ఓపిగ్గా, సమగ్రంగా ప్రాక్టికల్స్ చేయించారు. ఇలా డిగ్రీ చేస్తున్న వారిలో ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులే కాదు. కాంపిటీటివ్ పరీక్షలకోసం డిగ్రీ రాస్తున్న వారు కూడా ఉన్నారు. మా అందరికీ సకాలంలో ప్రాక్టికల్స్, పాఠాలు కంప్లీట్ చేసినందుకు సీకేఎం కాలేజ్‌కి, అంబేద్కర్ యూనివర్సిటీకి అందరం కృతజ్ఞతలు చెప్పుకోవాలి.

> ***"చాలా పేద కుటుంబం మాది. వాడికి కోచింగ్ ఇప్పించలేం, డొనేషన్లు కట్టలేం. అందుకే డీఈడీ చేయమని ఎంకరేజ్ చేశాను. ఏదో ఉద్యోగం దొరుకుతుంది కదా అని. కానీ వాడి లక్ష్యం మారిపోయింది. నేను 'డాక్టర్' లక్ష్యం నుంచి వాణ్ణి తప్పిస్తే వాడు 'ఐఏఎస్' లక్ష్యంగా పెట్టుకుని కష్టపడ్డాడు. నాకు వాడి కల నిజం కావాలని ఉంది. వాడికి అంబేద్కర్ యూనివర్సిటీ ఎంతో ఉపయోగపడింది" అంటున్నారు, మా నాన్న."***

## సివిల్స్, గ్రూప్–I...

డిగ్రీ రాస్తూనే ఐఏఎస్ అధికారి వెంకటేశం సలహాలు తీసుకుంటూ సివిల్స్‌కి ప్రిపేర్ అయ్యాను. 2004 సంవత్సరంలో మొదటిసారి రాశాను. క్వాలిఫై కాలేదు. నిరుత్సాహపడలేదు. చాలెంజ్‌గా తీసుకుని మళ్ళీ రాశాను. ఈసారి మెయిన్స్ కూడా పాసయ్యాను కానీ ఇంటర్వ్యూలో పోయింది. 2006 సంవత్సరంలో గ్రూప్–I పరీక్ష రాశాను. ప్రిలిమ్స్, మెయిన్స్ కూడా పాసై ఇంటర్వ్యూకు కూడా వెళ్ళాను. బీసీ–డి క్యాండిడేట్ల ఎంపిక కోర్టు పరిధిలో ఉండడంతో సెలక్షన్ పెండింగ్‌లో పడింది. పాజిటివ్ రిజల్ట్స్‌కోసం ఎదురు చూస్తున్నాను. నెగ్గుతానో లేదో అన్న విషయం పక్కన పెడితే గ్రూప్–I, సివిల్స్ లాంటి కొండలను ఢీకొట్టే శక్తి సామర్థ్యాలను అంబేద్కర్ యూనివర్సిటీ ప్రసాదించింది. విశ్వాసాన్ని, విజ్ఞానాన్ని ఇచ్చింది. నా ప్రయత్నం నేను చేశాను. అంతే చాలు.

డిగ్రీ అయిపోయాక నాగార్జున యూనివర్సిటీ నుంచి కెమిస్ట్రీలో పీజీ చేశాను. ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యను.

అలాగే ఇగ్నో నుంచి బీఈడీ కూడా కంప్లీట్ చేశాను.

## ఇది నాన్న మాట...

"డిగ్రీ పూర్తయ్యాక వాడి జీవితంలో చాలా మార్పు వచ్చింది. కొత్త విశ్వాసం చూశాను. చాలా పేద కుటుంబం మాది. వాడికి కోచింగ్ ఇప్పించలేం, డొనేషన్లు కట్టలేం. అందుకే డీఈడీ చేయమని ఎంకరేజ్ చేశాను. ఏదో ఉద్యోగం దొరుకుతుంది కదా అని. కానీ వాడి లక్ష్యం మారిపోయింది. నేను 'డాక్టర్' లక్ష్యం నుంచి వాణ్ణి తప్పిస్తే వాడు 'ఐఏఎస్' లక్ష్యంగా పెట్టుకుని కష్టపడ్డాడు. నాకు వాడి కల నిజం కావాలని ఉంది. వాడికి అంబేద్కర్ యూనివర్సిటీ ఎంతో ఉపయోగపడింది" అంటున్నారు, మా నాన్న.

## అదనంగా సంపాదన...

గ్రూప్–I మెయిన్స్ అయిపోయాక టీచర్ ఉద్యోగంతో పాటు ఆర్కే ఇనిస్టిట్యూట్‌లో పనిచేయడం మొదలుపెట్టాను. ఆంత్రోపాలజీ, జాగ్రఫీ చెబుతున్నాను. కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ చేయడం నా పని. ఇది అంబేద్కర్ యూనివర్సిటీ ఇచ్చిన విశ్వాసమే కదా. దానివల్ల అదనంగా కొంత ఆదాయం, కొంత ఉత్సాహం వస్తోంది. కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అయ్యేవాళ్ళు క్షుణ్ణంగా అంబేద్కర్ యూనివర్సిటీ పుస్తకాలు చదివితే చాలు, బాగా స్కోర్ చేయవచ్చు. ఇప్పటికీ నా కరదీపికలు అవే.

* * *

> మన సమస్యలకు
> పరిష్కారాలు మన దగ్గరే
> ఉంటాయి. కాని మనం
> ఎవరో పరిష్కరించాలని
> అనుకుంటామంతే...
>
> **– షేక్‌స్పియర్**



నీరజ

# ఇనుమడించిన ఆత్మగౌరవం

# నీరజ

అనేక ఆర్థిక ఇబ్బందుల మధ్య, అతి కష్టంమీద ఇంటర్ పూర్తి చేసిన పల్లెటూరి అమ్మాయి ఉద్యోగం కోసం బెరుకు బెరుకుగా రాష్ట్ర రాజధానిలో అడుగుపెట్టింది. పై చదువులు చదవలేని పరిస్థితి. ఉద్యోగం చేయడం అనివార్యం. ఏ బస్సు ఎక్కాలో, ఎక్కడ దిగాలో తెలియక అవస్థలు. దానికితోడు చిన్న ప్రపంచంలోంచి అమాయకంగా బయటకి వచ్చిన ఆమె ఒక్కసారి కఠినమైన, విశాలమైన ప్రపంచంలో పడినట్టయింది. అదీ ఒంటరిగా. ఆమె చేయాల్సిన ఉద్యోగం దళితులపై అక్రమాలు, అన్యాయాలను గుర్తించి, అవసరమైతే సంఘటనా స్థలానికి వెళ్ళి నివేదికలివ్వడం. దళితుల పౌర, రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంఘిక, మానవ హక్కుల ఉల్లంఘన, వారిపై అణచివేత, వేర్పాటు, విద్యావకాశాలు గౌరవంగా బతికే హక్కుల నిరాకరణ ... ఇవన్నీ స్వయంగా చూసిన ఆమెకు సమాజం అసలు స్వరూపం కనిపించింది. సమాజంలో బతకడం ఎలాగో నేర్పింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అర్ధంతరంగా ఇంటర్‌లో ఆగిన చదువును అంబేద్కర్ యూనివర్సిటీ సాయంతో కొనసాగించింది. ఉద్యోగం చేస్తూనే బిఏతో పాటు సోషియాలజీలో ఎంఏ చేయగలిగింది. ఇప్పుడు మదురై కామరాజ్ యూనివర్సిటీలో ఎంఫిల్ చేస్తోంది.

## ఆర్థిక పరిస్థితి...

**అ**మ్మ ఎస్ఎస్ఎల్‌సీ దాకా చదువుకుంది. నాన్న ఆర్ఎంపీ ప్రాక్టీస్ చేసేవారు. హాస్పిటల్లో నాన్నకు అమ్మ సాయంగా ఉండేది. మా సొంతూరు పశ్చిమ గోదావరి జిల్లా పుల్లేటికుర్రులో ప్రాక్టీసు నడిచేది. ఆ తర్వాత ప్రక్కనున్న రామచంద్రపురంలో కొంతకాలం ప్రాక్టీసు చేశారు. హాస్పిటల్ బాగా నడిచేది కానీ, నాన్న బాధ్యతగా ఉండేవారు కాదు. వృత్తిలోనే కాదు... మా పట్ల కూడా బాధ్యత తక్కువే. నాన్న చాలా దుబారా, విచ్చలవిడిగా ఖర్చులు, దానికి తోడు అప్పులు. ఉన్న పొలం కాస్త హారతి అయిపోయింది. ఇల్లు గడవడమే కష్టమై పోయింది. మేము ముగ్గురం... అక్కా, నేను తమ్ముడు. నాన్న ప్రవర్తనతో మా చదువులు ప్రశ్నార్థకమయ్యాయి.

## అమ్మ చొరవతో...

మా చదువులు కుంటుపడతాయని గ్రహించిన అమ్మ నన్ను, అక్కను ఎస్సీ హాస్టల్‌లో చేర్పించింది. నేను తొమ్మిదవ తరగతి వరకు హాస్టల్‌లో ఉన్నాను. ప్రక్కనే ఉన్న కొత్తపేట గర్ల్స్ హైస్కూల్లో చదువు. ప్రాథమిక విద్య గట్టెక్కగలిగా మంటే అది హాస్టల్ పుణ్యమే. అక్క డిగ్రీకి వచ్చాక పెళ్ళిచేశారు. అక్క చదువు కుందని కాణీ కట్నం లేకుండా పెళ్ళి చేసుకున్నారు. అక్క పెళ్ళి అలా ఖర్చు లేకుండా అయిపోయింది. లేకుంటే అమ్మకు అది పెనుభారయ్యేది. అక్క పెళ్ళి చేసుకుని వెళ్ళిపోగానే నేను హాస్టల్ నుంచి ఇంటికి వచ్చాను. అప్పుడు టెన్త్ క్లాస్‌లో ఉన్నాను. అప్పటికే నాన్న పట్టించుకోకపోవడం వల్ల హాస్పిటల్ మూత పడింది. అప్పుడే ఊర్లోకి ఎంబీబీఎస్ డాక్టర్ వచ్చారు. అమ్మ ఆయన హాస్పిటల్‌లో నర్సుగా చేరింది. దానితో ఆర్థిక పరిస్థితి కాస్త కుదుటపడింది. నేను టెన్త్ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను. ఇంటర్ ఎంపీసీలో జాయిన్ అయ్యాను. సెకండియర్‌లో ఉండగా అక్క డెలివరీకి ఇంటికి వచ్చింది. అమ్మ ఉద్యోగంలో ఉండడంలో అక్కను చూసే బాధ్యత నాపై పడింది. దానితో ఇంటర్‌లో మాథ్స్ పోయింది. తర్వాత ఇన్‌స్టంట్‌లో గట్టెక్కాను.

## రాజధానిలో ఉద్యోగం

ఇంటర్ పూర్తయ్యింది. నాకు ఇంకా చదవాలనుంది కానీ ఇంటి పరిస్థితి సహకరించేలా లేదు. టెన్త్ అయిపోయాక, పాలిటెక్నిక్ ఎంట్రన్స్ రాశా, సీటు వచ్చింది. అమ్మను అడిగా జాయిన్ అవుతానని. అమ్మ ఏం చేయలేకపోయింది ఏడవడం తప్ప. అదీ మా కుటుంబ పరిస్థితి. ఆ సంఘటన జ్ఞాపకం వచ్చి డిగ్రీలో చేరతానని అమ్మను అడగలేకపోయా. ఇంతలో హైదరాబాద్‌లో సెటిలైన మా మేనమామ ఇక్కడ ఉద్యోగం ఉంది, చేయమని సలహా ఇచ్చారు. డిగ్రీ కరెస్పాండెన్స్ కోర్సయినా చేయవచ్చు, 'అమ్మకు ఆసరా ఉంటుందని హైదరాబాద్ వచ్చి ఎన్జీవో సంస్థ 'సాక్షి'లో చేరాను. డాక్యుమెంటేషన్ అసిస్టెంట్‌గా ఉద్యోగం.

## విస్తృత సమాజంలోకి...

విమెన్స్ హాస్టల్‌లో ఉండి ఆఫీసుకు వెళ్ళేదాన్ని. ఊర్లోంచి వచ్చి నగరంలో వాలేసరికి కొన్ని రోజులు అంతా గందరగోళం. బస్సులో వస్తే ఒక్కోసారి ఆఫీసు కూడా గుర్తు పట్టగలిగేదాన్ని కాదు. డబ్బులు పోతే పోయాయని ఆటోలో ఆఫీసుకు వెళ్ళేదాన్ని. రెండు, మూడు నెలలకు అలవాటైపోయింది. రోజూ ఇంగ్లీషు, తెలుగు దినపత్రికలు అన్నీ చదవడం... 23 జిల్లా ఎడిషన్లు ముందేసుకుని ఎస్సీ, ఎస్టీలు ముఖ్యంగా దళిత మహిళలపై జరిగే అక్రమాలను, అత్యాచారాలను, నేరాల గురించి వార్తలు, వ్యాసాలు గుర్తించి ఫైల్ చేయడం. నోట్లు, రిపోర్ట్స్ తయారుచేయడం. అవసరమైతే అత్యాచారాలు, హత్యలు జరిగిన ప్రదేశాలకు వెళ్ళడం, బాధితులను, గ్రామస్తులను, సంబంధిత అధికారులను, పోలీసు అధి కారులను సంప్రదించడం ... సంఘటనపై నివేదిక తయారుచేయడం ... ఇదీ నా పని. ఒక్కసారిగా విశాల ప్రపంచంలో పడ్డట్టు అనిపించింది. దళిత మహిళల సమస్యలు చూస్తోంటే నా సమస్యలు చాలా చిన్నవిగా కనిపించేవి. ఒక్కోసారి ఆ సంఘటనలు మనసును కలచివేసేవి. అప్పటిదాకా నేనున్నది చిన్న ప్రపంచం. పైగా నేను సెన్సిటివ్. సంఘటన స్థలానికి వెళ్ళినప్పుడు అక్కడే ఏడ్చేసేదాన్ని. చాలామంది పోలీసు అధికారులు 'ఇంకా చిన్న పిల్లవు... ఈ హ్యూమన్ రైట్స్ గొడవలు నీకెందుకు ... హాయిగా చదువు కోరాదా' అనేవారు. హాయిగా చదువు కునే అవకాశం ఉంటే ఉద్యోగాలు చేయడం ఎందుకు? 'సాక్షి'లో ఏడేళ్ళపాటు ఉద్యోగం చేశాను. అక్కడ నేను చూసిన అనేకానేక సమస్యలు సమాజం అసలు స్వరూపమేమిటో తెలిసేలా చేశాయి. ఎన్నో అన్యాయాలు, ఎన్నో అక్రమాలు, ఎంతో అజ్ఞానం ... లేకుంటే కూతురుకు బాణామతి చేశారని మనుషులు తోటి వారిని చంపుతారా? ఇంకా విజ్ఞానం చేరని ప్రదేశాలు, మనుషులు కోకొల్లలు. ప్రతిచోటా మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతూనే ఉంది.

> ***"ఆదివారం కాంటాక్ట్ క్లాసులు వింటే చాలు, సగం సబ్జెక్ట్ వచ్చేస్తుంది. అంత బావుంటాయి క్లాసులు. ఆ తర్వాత విద్యార్థులంతా కలిసి చర్చించే వాళ్ళం. దానితో ఎంఏ పాసవడం చాలా తేలిక అయింది."***

## 'నిఘా'లో వ్యాసాలు...

దళితుల పౌర, రాజకీయ, సామాజిక, ఆర్థిక సాంస్కృతిక, మానవ హక్కుల ఉల్లంఘన రోజూ జరుగుతూనే ఉంది. అణచివేత, వేర్పాటు, విద్యావకాశాలు నిరాకరించడం, గౌరవంగా బతికే హక్కును నిరాకరించడం, ఇలాంటి సంఘటనలు లెక్కలేనన్ని. భూమి, నీరు, వేతనాలు, ఇతర జీవన వనరులు అడిగిన సందర్భాలలో దళితులపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయి. వీటిపై 'సాక్షి' సంస్థ పత్రిక నిఘాలో నేను ఆర్టికల్స్ రాసేదాన్ని.

## అంబేద్కర్ వర్సిటీ... డిగ్రీ, పీజీ

సాక్షిలో ఉద్యోగం చేస్తూనే అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ చేశాను. ఉద్యోగం, చదువు కాస్త కష్టమే అనిపించింది కానీ, చదువుపై ఉన్న ఆసక్తి ఆ ఇబ్బందిని జయించగలిగింది. పైగా చదువులో నేను అంత డల్ కాదు. దానితో పాటు నేను చేసే ఉద్యోగం కూడా అధ్యయనానికి సంబంధించిందే కావడంతో డిగ్రీ చదవడం సులభం అయింది. డిగ్రీలో సోషియాలజీ తీసుకున్నాను. అందుకే ఎంఏలో కూడా సోషియాలజీ చేశాను. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. ఆదివారం కాంటాక్ట్ క్లాసులు వింటే చాలు, సగం సబ్జెక్ట్ వచ్చేస్తుంది. అంత బావుంటాయి క్లాసులు. ఆ తర్వాత విద్యార్థులంతా కలిసి చర్చించే వాళ్ళం. దానితో ఎంఏ పాసవడం చాలా తేలిక అయింది. దానికితోడు మా బ్యాచ్ అంతా చాలా తెలివైనవారు. అందరూ తర్వాత బాగా సెటిలయ్యారు. సోషియాలజీలో

నేను డొమెస్టిక్ వయొలెన్స్‌పై ప్రాజెక్టు చేశాను. అరవై ఆరు శాతం మార్కులతో పీజీ పూర్తిచేశాను. ఇంటర్‌లోనే చదువు ఆగిపోతుందనుకున్న నేను పీజీ చేయడం, ఎంఫిల్‌లో కూడా చేరడం ఆశ్చర్యం, ఆనందం అనిపిస్తోంది. దానికి ప్రధాన కారణం అంబేద్కర్ ఓపెన్ వర్సిటీయే అని వేరుగా చెప్పక్కర్లేదు.

## మిస్సయిన ఉస్మానియా ఎంఫిల్...

మదురై కామరాజ్ యూనివర్సిటీ నుంచి ఎంఫిల్ చేస్తున్నాను. నిజానికి ఉస్మానియా యూనివర్సిటీలో కూడా ఎంఫిల్ సీటు వచ్చింది. కౌన్సిలింగ్ రోజున జాయిన్ కూడా అయ్యాను. ఇన్‌కమ్ సర్టిఫికెట్ లేకుంటే తెస్తానని రాసిచ్చి బయటికి వచ్చాను. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఫిల్ ... చాలా గొప్పగా అనిపించింది. ఇరవై అడుగులు వేసి గేటుదాకా వెళ్ళాను. మైకులో ఎనౌన్స్‌మెంట్. నేను నాన్‌లోకల్ కనుక సీటు కాన్సిల్ అయిందని ... చాలా బాధేసింది. అలా ఉస్మానియాలో ఎంఫిల్ చేసే అవకాశం పోయింది. నా కన్నా తక్కువ మార్కులొచ్చిన తెలంగాణ అమ్మాయికి సీటు ఇచ్చారు.

## ఆర్థిక ఇబ్బందుల వల్లే...

ఆర్థిక ఇబ్బందుల వల్లే నేను ఉన్నత విద్యకు చేరువ కాలేకపోయా. పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ రాశా. సీటు వచ్చింది. ఎంసెట్ రాశా. సీటు వచ్చింది. టీటీసీ రాశా సీటు వచ్చింది ... అన్ని సందర్భాలలో ఆర్థిక ఇబ్బందులతోనే ఆ కోర్సుల్లో చేరలేకపోయా. సాయం చేయడానికి కూడా ఎవ్వరూ లేకపోయారు. టీటీసీ కాల్‌లెటర్ వచ్చినప్పుడు సాక్షిలో పనిచేస్తున్నా. కాల్‌లెటర్ చూసిన అప్పటి డైరెక్టర్ ... 'దేశానికి పంతులమ్మలు కరువా? దళితుల హక్కుల గురించి మాట్లాడేవారు, పోరాటం చేసేవారు కావాలి. నువ్వు ఈ ఫీల్డ్‌లోనే ఉంటే సమాజానికి ఏమైనా చేయొచ్చు' అన్నారు. నాకది ఇన్‌స్పిరేషన్‌గా అనిపించింది. వెంటనే టీటీసీ కాల్‌లెటర్ చించివేశాను. సాక్షిలోనే ఉండిపోయా. ఏడు సంవత్సరాల తర్వాత కొన్ని కారణాలతో బయటికి రావాల్సి వచ్చింది.

> ఆలోచనలేని అభ్యసనం నిరుపయోగం, అభ్యసనం లేని ఆలోచన ప్రమాదకరం.
>
> **– ఎమర్సన్**

## ఇందిర ప్రభలో...

రూరల్ డెవలప్‌మెంట్ వారి నోటిఫికేషన్ చూసి అప్లయి చేశా. ఎపీఆర్ఎల్‌పీ ప్రాజెక్టులో అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఉద్యోగం వచ్చింది. నిజానికి జెండర్ సబ్జెక్టుపై మహబూబ్‌నగర్‌లో పనిచేయాలన్నారు. కాని నేను హైదరాబాద్ నుంచి షిఫ్ట్ అయ్యే అవకాశం లేక, హైదరాబాద్‌లోనే చేస్తానని ఇంటర్వ్యూలో రిక్వెస్ట్ చేశా. కాంప్రహెన్సివ్ లాండ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఇందిర ప్రభ)లో ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్‌గా పనిచేయమన్నారు.

## ఎంతో కష్టపడితేనే ...

మేము ఎదుర్కొన్న పరిస్థితే మా తమ్ముడు ఎదుర్కోకూడదని, అక్కా నేను కలిసి వాడిని చదివించాం. ఇప్పుడు మా ఆర్థిక పరిస్థితి ఫర్వాలేదు కనుక వాడి చదువుకు అంతగా ఇబ్బంది కాలేదు. సీఫెల్ ద్వారా బీఈడీ చేశాడు. ఇప్పుడొక

ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. అక్క అంగన్‌వాడీలో టీచర్‌గా పనిచేస్తోంది. ఏమైనా పేద, దళిత కుటుంబంలోంచి వచ్చిన వారు ఎంతో కష్టపడితేనే కానీ చదువుకోవడం, బాగా స్థిరపడడం సాధ్యం కాదు. గెలుచుకున్న ప్రతి అక్షరం వెనుక అంతులేని శ్రమ ఉంటుంది.

**అక్షరాస్యతే ముఖ్యం...**

ఏ వ్యక్తి జీవితంలోనైనా, మొత్తం సమాజంలోనైనా విద్యే విలువైన సాధనం. ఆధునిక సమాజంలో వ్యవహారాలన్నీ లిఖిత మాధ్యమంలోనే జరుగుతున్నప్పుడు అక్షరాస్యతే కీలకం అవుతుంది. వ్యక్తి తన ప్రయోజనాలను, హక్కులను కాపాడుకోవడానికి అక్షరాస్యత, విద్య ఆయుధాలు అవుతాయి. ఉపాధి పొందాలన్నా, జీవితంలో స్థిరపడాలన్నా ... చివరికి బస్సు ఎక్కాలన్నా అక్షరాలు తెలిసి ఉండాలి. సామాజిక మార్పునకు కూడా విద్య కీలకం. పల్లెల్లో పాతుకుపోయిన అనేక అసమానతలకు, మూఢ నమ్మకాలకు, దోపిడీకీ, హింసకు, అజ్ఞానమే మూలమని నేను అక్కడ తిరిగినప్పుడు గ్రహించాను. నిజానికి అంతర్జాతీయ ఒప్పందాలు, రాజ్యాంగ నియమాలు, రాజ్యాంగ సవరణలు ఎన్ని ఉన్నా ఇప్పటికీ విద్యాహక్కు సంపూర్ణంగా అమలవుతున్న దాఖలాలు కనిపించవు. గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ పాఠశాలలు ఇంకా పెరగాలి. అవి లేకపోవడంవల్ల దళితులు, ముఖ్యంగా బాలికలు ఎక్కువగా నష్టపోతున్నారు. మగపిల్లలైతే పక్క ఊరికైనా పంపిస్తారు కానీ, ఆడపిల్లలు ఇంట్లో కూర్చోవాల్సిందే.

* * *

ప్రవర్తన అద్దం లాంటిది.
మనిషి ప్రతిబింబం
అందులో కనిపిస్తుంది.
– గోథే




విశ్వవిద్యాలయ విద్యార్థి, ప్రముఖ చదరంగ క్రీడాకారుడు మాస్టర్ హరిక్రిష్ణను అభినందిస్తున్న వైస్‌ఛాన్స్‌లర్ ఆచార్య డి. రామచంద్రం (2005)



దత్తాత్రేయ

# అడవి బాట నుంచి
# అక్షర మార్గంలోకి...

# దత్తాత్రేయ

పీడిత ప్రజల విముక్తికి సాయుధ పోరాటమే ఏకైక మార్గమని నమ్మి, నక్సలైట్‌గా మారిన దత్తాత్రేయ తనకు చదువే ముక్తిమార్గం చూపిందంటున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన దత్తాత్రేయ పెన్ను పట్టాల్సిన వయస్సులో గన్ను పట్టి చదువుకు స్వస్తి చెప్పి, విద్యార్థి రాజకీయాల నుంచి దళ సభ్యుడిగా అడవికి చేరాడు. దళంలోని కార్యకలాపాలు, స్టడీ క్యాంపులు ఆయనకు అధ్యయనంపై ఆసక్తిని పెంచాయి. 'అసలైన చదువు అక్కడ మొదలైంది' అని చెపుతున్న దత్తాత్రేయ నక్సలైట్ దళ నాయకుడిగా సమాజం పట్ల, జీవితం పట్ల లోతైన అవగాహన పెంచుకోగలిగాడు. పోరాటమార్గం వదిలి సరెండరై కొంతకాలం అగమ్యగోచరంగా తిరిగిన అతనికి చదువే సరైన మార్గమని అనిపించింది. అంతే ప్రతిక్షణాన్ని చదువుకోసమే వెచ్చించి ఎప్పుడో వదిలేసిన ఇంటర్‌ని ముప్పయేళ్ళ వయసులో పూర్తిచేసి, డా. బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో డిగ్రీ కోర్సులో చేరాడు. ఇప్పుడతని చేతిలో బి.ఎ., ఎల్.ఎల్.బితో పాటు రెండు పీజీ డిగ్రీలూ ఉన్నాయి. మహబూబ్‌నగర్‌లో న్యాయవాదిగా స్థిరపడ్డ అతనికి చదువు వృత్తినీ, ఉపాధినేకాక సమాజంలో గౌరవాన్నీ, గుర్తింపునీ ఇచ్చింది. అయితే చదువు బతుకు తెరువుకోసం మాత్రమే కాదనీ, జ్ఞానంకోసం ప్రతి ఒక్కరూ చదవాలనీ వాదించే ఈ న్యాయవాది జీవితపు ఉద్యమ – విద్యావికాస క్రమం ఇదీ ...

## చదువంటే భయం...

**చ**దువులో నేను డల్ స్టూడెంట్‌నే. ఎనిమిదవ తరగతి వరకు పాలమూరులో చదివా. తొమ్మిది, పది మక్తల్‌లో పూర్తయ్యాయి. చదువుకన్నా జనరల్ యాక్టివిటీస్ అంటే బాగా ఇంట్రస్ట్. చదువులో కూడా రాణించే వాణ్ణేమో కానీ, సరైన గైడెన్స్ లేదు. చదువంటేనే భయం. ఇంగ్లీషు అక్షరం ముక్క రాకపోయేది. పైగా ఇంటర్‌లో ఎంపీసీ తీసుకున్నా. అప్పట్లో రాడికల్ విద్యార్థి సంఘం రాజకీయ వేదిక 'చైతన్య స్టూడెంట్ ఫోరం' యాక్టివ్‌గా ఉండేది. జనరల్ యాక్టివిటీస్‌లో చురుగ్గా ఉండే నాకు వారి పనులు ఆకర్షణీయంగా అనిపించేవి. చదువుకన్నా అదే ఎక్కువ ఇంట్రస్ట్‌గా కనిపించేది. చదువు వదిలేసి అదే తిరుగుడు. ఇంటర్ ఫెయిలయ్యా. పాసయి ఉంటే జీవితం ఎలా ఉండేదో. ఫెయిలయ్యే సరికి ఇక ఫోరం పనులే ఎక్కువయ్యాయి. మహబూబ్‌నగర్‌లో ఐటీఐ చేశాను. అక్కడా ఆర్గనైజేషన్ మొదలయ్యింది. సహజంగానే నాకు అటు ధ్యాస మరలింది. ఇంటర్ మళ్ళీ రాయగా ఒక సబ్జెక్ట్ మిగిలింది. అలా మిగిలిన సబ్జెక్ట్ ముప్పై ఏళ్ళ వయస్సులో గానీ పూర్తి కాలేదు.

## దళంలోకి ...

చైతన్య స్టూడెంట్ ఫోరంలో పని చేయడం క్రమంగా నక్సల్స్ మూవ్‌మెంట్‌కు దగ్గర చేసింది. అలా 1989 నాటికి ఫుల్ టైమర్ అయిపోయాను. చదువుకు పూర్తిగా స్వస్తి చెప్పాను. దళ కమాండర్‌గా పనిచేశాను. బయట ఉన్నంత కాలం చదువంటే ఎంత భయపడే వాణ్ణో దళంలోకి వెళ్ళాక చదువు అంత దగ్గరయింది. దళాలలో క్లాసెస్ ఉంటాయి. చాలా ఆసక్తికరంగా ఉంటాయి. వాటిద్వారా క్రమంగా చదువుపై భయంపోయి ఆసక్తి పెరిగింది. సాహిత్యం బాగా చదివేవాణ్ణి. శ్రీశ్రీ, తాపీ ధర్మారావు, పార్టీకి సంబంధించిన సాహిత్యం. గెరిల్లా పోరాటం, ఎత్తుగడలు, పార్టీ నిర్మాణం ... తెగ చదివే వాడిని. పుస్తకాలు ఆర్గనైజ్ చేసే పని, లిస్టు తయారుచేయడం నేనే చేసేవాడిని. మొత్తానికి ఏ చదువుకు దూరమై ఉద్యమాల్లోకి వచ్చానో అదే చదువుకు నేను దగ్గరయ్యాను. దళంలో స్టడీ క్యాంపులు, వర్క్‌షాపులు నిర్వహించేవారు. సమాజంపై అవగాహన పెరగడానికి అవి బాగా ఉపయోగపడ్డాయి. ఆర్థిక, సామాజిక విషయాలు బాగా బోధపడ్డాయి. నిజం చెప్పాలంటే అసలైన చదువు అడవుల్లో మొదలయింది. కాకపోతే అది ఉద్యోగాలకు పనికి వచ్చేది కాదు. సర్టిఫికెట్లు ఉండవు.

దళంలో కొంతకాలం పనిచేశాక ఆరోగ్య, మానసిక స్థితుల్లో కొంత తేడా వచ్చింది. ఇక అక్కడ నేను ఉండలేననుకున్నాను. పార్టీకి ఈ విషయం చెప్పాను. కొంతకాలం 'టెక్నికల్' వ్యవహారాల్లో ఉంచారు. 'నా మానసిక స్థితి సహకరించడం లేదు. నేను బయటికి వెళ్తానన్నాను'. అలా బయట పడ్డాను. మూవ్‌మెంట్ వదలి కర్నాటక, మహరాష్ట్రలలో మూడు నెలల పాటు బైరాగిలా తిరిగాను. ఎక్కడ ఉన్నానో, ఏమి తిన్నానో నాకే తెలియదు. గమ్యంలేని బాటసారి అంటారే అలా తిరిగాను. కన్నడ రాదు. అయినా అక్కడ వారితో కలిసి ఉన్నాను. నన్ను వారెలా నమ్మారో, నాకెలా తిండి పెట్టారో ఇప్పటికీ ఆశ్చర్యమే. అందుకే అనిపిస్తోంది మనిషి మనుషుల్లో కలవడం తేలిక. మూవ్‌మెంట్‌లో ఉన్నప్పుడు జనంలోనే ఉన్న నాకు, జనంలో కలవడం కష్టం కాలేదు. అలా తిరిగి తిరిగి సరెండర్ అయ్యాను. అప్పటికే చాలా వీక్ అయిపోయి జైలుకు వెళ్ళాను. జైల్లో రకరకాల ఆలోచనలు ... బయటికైతే వచ్చాం ఇప్పుడేం చేయడం అని. ఇప్పటిదాకా సమాజం కోసం పనిచేశాం. ఇక ముందు సాధారణ జీవనంలో కూడా సొసైటీకి ఉపయోగపడే పనే చేయాలి అనుకున్నాను. అప్పటిదాకా రాజకీయాల్లో ఉన్న నేను కామన్ మాన్‌గా నా బతుకు తెరువు చూసుకోవాలి. శారీరకంగా వీక్ అయ్యాను కనుక తట్ట పని చేయలేను. అలా ఆలోచనలు చదువు వైపు మరలాయి.

> "చదువుకోవాలి, దాని ద్వారా ఉద్యోగం దొరకడం అన్న అభిప్రాయానికి నేను వ్యతిరేకిని. పనిచేసేవాడికి ఈ కాలంలో కావాల్సినంత పని. చదువుకు తగిన పని దొరకాలి అనుకుంటే లాభం లేదు. బద్ధకం వదిలేస్తే ఏ పని అయినా దొరుకుతుంది. అందరూ చదువుతున్నారు. అది జ్ఞానం కోసం. పని బతుకు తెరువు కోసం. ఆ రెండింటికి సంబంధం లేదు."

## అంబేద్కర్ యూనివర్సిటీ వైపు...

ఐటీఐ అయిపోయిన వాళ్ళు అంబేద్కర్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్ష రాయనక్కర్లేదని తెలిసింది. డైరెక్టుగా డిగ్రీ చేరొచ్చునని తెలిసి బిఏ చేద్దామనుకున్నాను. నేను జైలులో ఉన్నా. చదువు, ఊరు వదలి చాలాకాలం అయింది. సర్టిఫికెట్స్ లేవు. మా తమ్ముడే తిరిగి, తిరిగి అన్ని సర్టిఫికెట్స్ సంపాదించాడు. అంబేద్కర్ యూనివర్సిటీకి అప్లయ్ చేశాను. అడవుల్లో చదువు వాల్యూ తెలిసింది. సరెండర్ అయ్యాక ఇంటర్‌లో మిగిలిన సబ్జెక్టు కూడా పూర్తి చేశాను. నాకు 'లా' చేయాలనుండేది. ఇంటర్‌తో అమీర్‌పేటలో పడాల రామిరెడ్డి కాలేజీలో ఐదేళ్ళ 'లా' సీటు వచ్చింది. ఫస్టియర్ రెగ్యులర్‌గా కాలేజీకి పోయా. అది పాసైతేనే సెకండియర్ చేద్దామనుకున్నా, లేకుంటే వదిలేద్దామన్న ఆలోచన. అన్నీ పాసయ్యా. ఉత్సాహం వచ్చింది. ఇబ్బంది లేకుండా ఐదేళ్ళ 'లా' పూర్తయ్యింది. అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ చేస్తూనే ఎల్ఎల్‌బీ చేశాను. మహబూబ్‌నగర్‌లో డిగ్రీ క్లాసులు. సోమవారం నుంచి శనివారం దాకా ఎల్ఎల్‌బీ క్లాసులు, ఆదివారం మహబూబ్‌నగర్ వెళ్ళి అక్కడ అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ క్లాసులకు అటెండ్ అయ్యేవాణ్ణి. పూర్తిగా చదువు మీద పడిపోయా. వేరే ధ్యాసలేదు.

## బతుకు తెరువు

చదువైతే బాగానే సాగుతోంది. కానీ పూట గడవడం ఎలా. నాన్న సాయం చేస్తున్నాడు. నడుస్తోంది. కానీ, నా పని నేను చేయాలి కదా. జనంలో తిరిగిన నేను చేయగలిగే పని మార్కెటింగ్. అందుకే దాన్ని ఎంచుకున్నాను. డోర్ టు డోర్ మార్కెటింగ్ మొదలు పెట్టాను. గ్యాస్ సిలిండర్ పైపులు అమ్మేవాణ్ణి. మధ్యాహ్నం వరకు ఎల్ఎల్‌బీ క్లాసులు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మార్కెటింగ్. సిస్టమాటిక్‌గా జీవించడం దళంలో బాగా అలవాటయింది. నిజానికి 'నిరుద్యోగం' సమస్యపై నావి భిన్నాభిప్రాయాలు. చదువుకోవాలి, దాని ద్వారా ఉద్యోగం దొరకడం అన్న అభిప్రాయానికి నేను వ్యతిరేకిని. పనిచేసేవాడికి ఈ కాలంలో కావాల్సినంత పని. చదువుకు తగిన పని దొరకాలి అనుకుంటే లాభం లేదు. బద్ధకం వదిలేస్తే ఏ పని అయినా దొరుకుతుంది. అందరూ చదువుతున్నారు. అది జ్ఞానం కోసం. పని బతుకు తెరువు కోసం. ఆ రెండింటికి సంబంధం లేదు. ఎంఏ చదివి లెక్చరర్ కావాలా... హోటల్లో అయినా పని చేయవచ్చు. శుభ్రత గురించి ఎంఏ చదివిన వాడికి బాగా తెలుస్తుంది. ఇంకా బాగా పని చేస్తాడు. ఇలా ఉంటాయి నా ఆలోచనలు. అందుకు ఏ పనైనా చేసేవాడిని. ఆటో కూడా కొన్నాను మ్యారేజ్ అవగానే.

## పెద్ద వయసు, చదువు...

నన్ను బాగా ఇబ్బంది పెట్టింది ఇంగ్లీషు సబ్జెక్ట్. ఐటీఐ అయిపోయాక

డిప్లొమా అవకాశం వస్తే ఇంగ్లీషు భయంతోనే జాయిన్ కాలేదు. తర్వాత కూడా ఆ భయం వెంటాడుతూనే ఉన్నది. అందుకే రామకృష్ణ మఠంలో ఇంగ్లీషు కోర్సులో చేరాను. ఇంగ్లీషు కోచింగ్‌కు మంచి వాతావరణం. ఫీజులు తక్కువ. చాలా ఇంట్రెస్ట్‌గా చెబుతారు అక్కడ. జూనియర్, సీనియర్ కోర్సులు పూర్తి చేశాను. తమ్ముడి క్లాస్‌మేట్ వాసుదేవరావు ఇంగ్లీషులో బాగా సాయం చేశారు. అతని వద్ద కొంత ఇంగ్లీషు నేర్చుకున్నాను. పెరిగాక చదువుకోవడం కష్టమే. సినిమాల్లో చూపించినట్టే ఉంటుంది. వయస్సును చూసి అందరూ సార్ అనుకునేవారు. ఎల్‌ఎల్‌బీ చేసేటప్పుడు అందరూ 'అంకుల్' అని పిలిచేవారు. నా ఇంటర్ పూర్తయ్యిందే ముప్పయి ఏళ్ళకు. వెనుక బెంచ్‌లో కూర్చునేవాణ్ణి. సరెండర్ అయి వచ్చాక చదువుకుంటాననంటే చాలా మంది డిస్కరేజ్ చేశారు. ఈ వయస్సులో చదువేందని. ఏదైనా బిజినెస్ చేయవచ్చు కదా అని సలహా ఇచ్చారు. కానీ, చదువు వాల్యూ దేనికి రాదు. ఇప్పుడిలా ఉన్నానంటే చదువే కారణం.

## పరిశోధన చేయాలని...

సమాజంపై ఉన్న ఆసక్తి, అవగాహన, ప్రొఫెసర్ల సూచనతో ఎంఏ సోషియాలజీ చేశాను. డిగ్రీలో చేరేటప్పటికి సబ్జెక్టులపై పెద్దగా అవగాహన లేదు. డిగ్రీ పూర్తి చేయాలన్న ఆలోచనే. అది అంబేద్కర్ యూనివర్సిటీ నాకు అందించింది. ఉస్మానియా డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో ఎంఏ సోషియాలజీ చేశాను. సోషియాలజీ చేస్తే ఏదైనా ఎన్జీవోలో పని చేయవచ్చని అనిపించింది. సోషియాలజీ పూర్తయింది కానీ ఎక్కువ శాతం మార్కులు రాలేదు. పీహెచ్‌డీ చేయడానికి ఆ మార్కులు సరిపోవు. ఎలాగైనా పీహెచ్‌డీ చేయాలని నా కోరిక. అందుకే ఈ అంబేద్కర్ యూనివర్సిటీ నుంచి ఎంఏ హిస్టరీ చేస్తున్నాను. దాంతో బాగా మార్కులు సంపాదించి పీహెచ్‌డీ చేసి డాక్టర్ దత్తాత్రేయ అనిపించు కోవాలి. కార్మికులపై, గిరిజనులపై నాకు బాగా అవగాహన ఉంది. వారి పైనా పీహెచ్‌డీ చేయాలనుంది. దళంలో డిప్యూటీ దళ కమాండర్‌గా ఉన్నప్పుడు ఐదారేళ్ళు వారి మధ్య పని చేశాను. వలస కార్మికుల జీవన స్థితిగతులు అధ్యయనం చేశాను. వలస పోతుంటే ఊరిలో ఏవ్వని వారుండరు. ఊరంతా గగ్గోలు. విషాదకరమైన సీను అది. మనిషి మళ్ళీ కనిపిస్తాడో లేదోనన్న బాధ. వలసపోయిన వారి పిల్లల పరిస్థితి మరీ దుర్భరం. సోషియాలజీలో నేను చదువుకున్న వలస వేరు. ప్రాక్టికల్‌గా చూసిన వలస వేరు. సమాజంలోని అమానవీయ కోణం ఇది.

## ఆలస్యమైనా అందరితోపాటు...

మహబూబ్‌నగర్‌లో 'లా' ప్రాక్టీసు చేస్తున్నాను. తాండూరు అంబేద్కర్ యూనివర్సిటీ స్టడీసెంటర్‌లో డిగ్రీ స్టూడెంట్స్‌కు సోషియాలజీ క్లాసులు చెబుతుంటాను. అకడమిక్ నాలెడ్జ్ పోకుండా ఉండాలని, నాకు అక్షరజ్ఞానం ఇచ్చిన అంబేద్కర్ యూనివర్సిటీతో అనుబంధం ఉండాలని కష్టమైనా వారి క్లాసులు వదలడం లేదు.

గతంలో నాపై 21 కేసులుండేవి. ఎల్‌ఎల్‌బీ చేస్తూనే కేసులకు హాజరయ్యేవాణ్ణి. కొన్ని కేసుల విత్‌డ్రాకు రెఫర్ చేశారు. దానికోసం సెక్రటేరియట్ చుట్టూ తిరిగేవాణ్ణి. బహుశా నాలాగా ఎవరు తిరిగి ఉండరు. చదువు, పని మధ్య ఖాళీ దొరికినప్పుడల్లా సెక్రటేరియట్‌లో హాజరయ్యేవాణ్ణి. అక్కడ ఉద్యోగులే ఆశ్చర్య పోయేవారు. 'లా' అయిపోయేలోపు కేసులన్నీ పోవాలని నా తాపత్రయం. కేసులు విత్‌డ్రా అయ్యాయి. ఇప్పుడు ప్రాక్టీస్ సజావుగా సాగిపోతోంది. ఇప్పటికీ పేపర్లలో ఐఏఎస్ టాపర్ల వార్తలు చూస్తే చాలా ఇన్స్పిరేషన్ వస్తుంది. వారి గురించి బాగా చదువుతాను. ప్రాథమిక దశలోనే నాకు చదువుపై ఆసక్తి ఉండి ఉంటే బావుండనిపిస్తుంది. మధ్యలో చదువుకు చాలా గ్యాప్ వచ్చినా, చదువుకోవాల్సిన కాలంలో దళంలో తిరిగినా, వయసు మీద పడ్డాక చదువులో పడినా ... మళ్ళీ డిగ్రీలు సంపాదించి చిన్నప్పటి క్లాస్‌మేట్స్‌తో సమానంగా ఉన్నానని గర్వంగా అనిపిస్తుంది. నేను ఇండిపెండెంట్‌గా 'లా' ప్రాక్టీసు చేస్తోంటే వారింకా సీనియర్ల దగ్గరే ఉన్నారు. ఆలస్యంగా మొదలు పెట్టినా క్లాస్‌మేట్స్‌లో చాలామంది కంటే నేను ఎక్కువ చదవగలిగాను. అంబేద్కర్ యూనివర్సిటీ అందరికీ అందుబాటులోకి వచ్చాక నాలాంటి వారి చదువు సులభం అయింది. 'షెల్టర్' పేరుతో ఎన్జీవో ఒకటి ప్రారంభించాను. దేవదాసీలు, వలసపై పనిచేయాలని ఆలోచన ఉన్నది. చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్‌కు జిల్లా కన్వీనర్‌గా కూడా పని చేస్తున్నాను.

* * *



శ్రీలక్ష్మి

# మనోవ్యాధికి విద్యే వైద్యం...

# శ్రీలక్ష్మి

మానసికంగా, శారీరకంగా అనేకానేక ఆరోగ్య సమస్యల్తో చిక్కి శల్యమైపోయిన ఆమెకి విద్యే వైద్యమయ్యింది. చదువు మీద మనసునీ, మమకారాన్నీ చంపుకోలేక నిరాశా, నిస్పృహల్లో పడిపోయిన ఆమెను చదువే మళ్ళీ మనిషిని చేసింది. నల్లగొండ జిల్లాకు చెందిన శ్రీలక్ష్మికి వివాహంతో చిన్నతనంలోనే సరస్వతీ కటాక్షం లేకుండా పోయింది. ఆమె మధనపడింది. జబ్బుల పాలయ్యింది. చివరికి మానసికంగా కృంగిపోయి ఆసుపత్రి పాలయ్యింది. అప్పుడే అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆమెకు ఆలంబన అయ్యింది. చదువు ఆమె మనోవ్యాధిని మాయం చేసింది. డిప్రెషన్‌ను దూరం చేసింది. ఆమెలో అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ ధైర్యాన్ని నింపింది. ఆ ఆసరాతో లేచి నిలబడిన ఆమె మడమ తిప్పలేదు. పీజీ చేసింది. జీవితంతో పోరాడీ, పోరాడీ... ఇవాళ గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదల అభ్యున్నతికి ఒక ప్రోగ్రాం ఆఫీసర్‌గా పాతిక గ్రామాల్ని పర్యవేక్షిస్తోంది. చిమ్మచీకట్లను ఛేదించుకుని వెలుగులోకి దూసుకు వచ్చిన శ్రీలక్ష్మి తన జీవితాన్ని ఫీనిక్స్ పక్షితో పోల్చుకుంటోంది. ఉనికిని కోల్పోయి, ఉసూరుమన్న తన బతుకులో జీవం పోసి, జవసత్వాలు నింపిన విశ్వవిద్యాలయానికి వినమ్రంగా కృతజ్ఞతలు తెలుపుతోంది. తనలాంటి వారికోసం తపిస్తోన్న ఆమె గుండె చప్పుడిది.

### టెన్త్ ఫస్ట్ క్లాస్...

ఫీనిక్స్ పక్షిలాంటిది నా జీవితం. ఒకనాడు డిప్రెషన్‌లో పడిపోయిన నేను ఇప్పుడో బాధ్యతాయుతమైన ఉద్యోగం చేయగలుగుతున్నాను. మాది నల్లగొండ జిల్లా మునుగోడు. నాన్న ఉద్యోగరీత్యా మిర్యాలగూడలో ఉండేవాళ్ళం. ఫస్ట్ నుంచి టెన్త్ దాకా మిర్యాలగూడ గవర్నమెంట్ స్కూల్లో చదివాను. టెన్త్ తర్వాత మళ్ళీ మునుగోడు వచ్చాం. చిన్నప్పుడు చదువంటే ఆసక్తి ఉండేది. అందరం కలిసి బాగా చదివేవాళ్ళం. టెన్త్ ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాను. మునుగోడు వచ్చాక ఇంటర్ ఫస్టియర్‌లో జాయినయ్యాను కూడా.

### చిన్నప్పుడే పెళ్ళి ...

గ్రామీణ ప్రాంతాల్లో చిన్న వయస్సులోనే పెళ్ళిళ్ళు చేసేవారు. నాకూ అంతే. ఇంటర్‌లో చేరాను. పెళ్ళి చేసేశారు. మేనరికం. సంసారంలో పడిపోయాను. చదువు మూలన పడింది. వివాహం విద్య నాశనం అంటారు కదా. పెళ్ళయ్యే సరికి చాలా చిన్నదాన్ని. ఏమీ తెలిసేది కాదు. చదువు, సంసారం ఏదీ అమ్మాయిల చేతిలో ఉండవు కదా. ఇంకా చదువుకోవడానికి అత్తగారింట్లో అనుమతి లేదు. అమ్మాయి చదువుకుని చేసేదేముంది? అన్న ప్రశ్న వినిపించేది. అలా దాదాపు పన్నెండేళ్ళు చదువు అటకెక్కింది. పిల్లలు, సంసారం అంతే. ఇక మధ్యలో ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. మానసిక, శారీరక ఇబ్బందులు, డిప్రెషన్. ఎర్రగడ్డ ఆసుపత్రిలో చేర్పించారు. ఇంజక్షన్లు, షాకులు, ట్రీట్‌మెంట్లు ... ఇలా ఉన్న నా జీవితం అంబేద్కర్ యూనివర్సిటీలో చేరడంతో అద్భుతంగా మారిపోయింది. దాని వెనుక మా వారి ప్రోత్సాహం, అమ్మ సాయం ప్రముఖంగా చెప్పుకోవాలి.

### ఆరోగ్య సమస్యలు ... డిగ్రీ ...

ఆరోగ్య సమస్యల నుంచి కాస్త ఊరట ఉంటుందని, సహజంగా నాకు చదువుపై ఉన్న ఆసక్తితో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ఎంట్రన్స్ పరీక్ష

రాశా. 1996 సంగతి అది. ఎంట్రెన్స్ పరీక్ష పాసయ్యాను కానీ ఆరోగ్య, కుటుంబ కారణాలవల్ల చదువు సాగలేదు. 1999లో ఫస్టియర్ పరీక్షలు రాశా. సికింద్రా బాద్ రైల్వే కాలేజీలో క్లాసులకు అటెండ్ అయ్యేదాన్ని. రెండేళ్ళలో ఒక్క సబ్జెక్టు ఫెయిలవకుండా డిగ్రీ పూర్తి చేయగలిగాను. ఈ డిగ్రీ నాకు ఉత్సాహాన్ని, కొత్త జీవితాన్ని, విశ్వాసాన్ని ఇచ్చింది. మానసిక, ఆరోగ్య సమస్యల నుంచి దూరం చేసింది. పరీక్షలప్పుడు అమ్మ చేసిన సాయం, మా వారి ప్రోత్సాహం నన్ను డిగ్రీకి చేర్చాయి. అసలా డిగ్రీలో చేరకపోయినా, సక్సెస్ కాకపోయినా నేనేం అయ్యేదాన్నో. ఒక్కోసారి ఆశ్చర్యమూ, భయమూ వేస్తుంది. ఫస్టియర్ క్లాసులకు ఎక్కువగా వెళ్ళడం కూడా కుదరలేదు. ఇంట్లోనే చదివేదాన్ని. ఫైనలియర్ కొచ్చేసరికి అంతా కుదుటపడి క్లాసులకు రెగ్యులర్‌గా వెళ్ళేదాన్ని. పరీక్షలప్పుడు పిల్లలు కూడా బాగా ఎంకరేజ్ చేసేవారు. ఈ డిగ్రీ నా మొత్తం వ్యక్తిత్వాన్నే మార్చేసింది.

"మొదట నా చదువు పట్ల అత్తగారింట్లో అయిష్టం కనిపించేది. ఆ తర్వాత డిగ్రీ పూర్తయి ఎంఏలో చేరాక అత్తగారు కూడా ఎంకరేజ్ చేయడంతో తిరుగులేకుండా అయిపోయింది. ఇప్పుడు నన్ను చూసి అమ్మ గర్వ పడుతుంది. అంత మార్పు వచ్చింది నాలో. ఆరేడేళ్ళ క్రితం నన్ను చూసినవారు ఇప్పుడు నన్ను చూస్తే ఆశ్చర్యపోతారు. దానికి అంబేద్కర్ యూనివర్సిటీ వారికే కృతజ్ఞతలు చెప్పాలి."

## మార్చేసిన సోషియాలజీ...

డిగ్రీ పూర్తయిన ఉత్సాహంతో అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలోనే ఎంఏ (సోషియాలజీ) చేశాను. నా జీవితంలో సోషియాలజీలో పీజీ చేయడం ఒక మహత్తర ఘట్టంగా చెప్పొచ్చు. నా ఆలోచనలను, అభిప్రాయాలను, జీవితాన్ని మార్చేసింది సోషియాలజీ సబ్జెక్ట్. పరిపక్వతనిచ్చింది. అందులో ఉండే అనేక విషయాలు జీవితంపై నా దృక్పథాన్ని మార్చేశాయి. సమాజంపై అవగాహనను పెంచాయి. పాజిటివ్ ఆలోచనలు నింపాయి. నేను ఓపెన్‌వర్సిటీకి రుణపడి ఉన్నాను. నేనిప్పుడు నలుగురిలో నిలబడి ఉన్నానంటే ఆ చదువే కారణం.

## గోండుల మధ్య...

దాదాపు పన్నెండేళ్ళు చదువు లేకుండా కుటుంబ బాధ్యతలో, డిప్రెషన్‌లో ఉన్నాను. ఎంఏ సోషియాలజీ చేసేటప్పుడు గ్రామాల్లోకి వెళ్ళి ఫ్లోరిన్‌పై పరిశోధనలు చేశాను. వారి వద్ద ఉండి వారి సమస్యలు, జీవన స్థితిగతులు గమనించాను. కాగజ్‌నగర్ చుట్టుపక్కల అడవుల్లో గిరిజనులు ఉంటారు. వారి జీవనం దుర్భరంగా ఉంటుంది. చుట్టూ కొండలు, మధ్యలో 15 ఇళ్ళు... పోలీసులు, నక్సల్స్ నీడలు ... రోడ్లు ఉండవు. ఆరుగురం కలిసి వారి గ్రామాలకు వెళ్ళాం. దాదాపు నాలుగు రోజులు అక్కడే ఉన్నాం. జొన్న అన్నం, గటక తింటూ గడిపాం. మంచి అనుభవం అది. వారి సంప్రదాయ నృత్యాలు, ఆటపాట... మెమొరబుల్ డేస్ అవి. అప్పుడే నక్సల్స్, సర్కారు మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఆ కారణంగా వెనక్కు వచ్చాం. లేకుంటే మరికొన్ని రోజులు ఉండేవాళ్ళం. ఆ జీవితాన్ని నేను చూడగలిగానంటే చదువు వల్లే కదా. లేకుంటే ఇంట్లో ఉండాల్సిందే. ఇంట్లో కూడా ఎంకరేజ్ చేయడం నాకు కలిసి వచ్చింది.

అలాగే నార్కెట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో ఫ్లోరిన్ గ్రామాల్లో తిరిగాం. అక్కడి వారిలో నిరాశా, నిస్పృహలే కనిపించాయి. 'అందరూ వస్తుంటారు. సర్వేలు చేస్తుంటారు. మా కష్టాలు తీరవు. మా జీవితాలు బాగుపడవు...' అని అక్కడి వారు బాధపడేవారు. మేం వెళ్ళి వచ్చాక అప్పటి గవర్నర్ వెళ్ళి వచ్చారు. దాదాపు 110 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయి. చాలా ఆనందం అనిపించింది. టెన్త్ అయ్యాక కుటుంబ జీవితంలో పడిన నేను, పిల్లలు పుట్టాక స్టూడెంట్ లైఫ్ ఎంజాయ్ చేశాను. అందరూ నాతో బాగా ఉండేవారు. పెళ్ళయింది, పెద్ద పిల్లలున్నారంటే ఆశ్చర్యపడేవారు. అంత యాక్టివ్‌గా ఉండేదాన్ని. లీడర్‌గా గైడ్ చేసేదాన్ని. మొదట నా చదువు పట్ల అత్తగారింట్లో అయిష్టం కనిపించేది. ఆ తర్వాత డిగ్రీ పూర్తయి ఎంఏలో చేరాక అత్తగారు కూడా ఎంకరేజ్ చేయడంతో తిరుగులేకుండా అయిపోయింది. ఇప్పుడు నన్ను చూసి అమ్మ గర్వ పడుతుంది. అంత మార్పు వచ్చింది నాలో. ఆరేడేళ్ళ క్రితం నన్ను చూసినవారు ఇప్పుడు నన్ను చూస్తే ఆశ్చర్యపోతారు. దానికి అంబేద్కర్ యూనివర్సిటీ వారికే కృతజ్ఞతలు చెప్పాలి. స్టూడెంట్స్, లెక్చరర్లు, ప్రొఫెసర్లు బాగా ఎంకరేజ్ చేశారు.

### ఉస్మానియాలో ఎల్ఎల్బీ...

పీజీ పూర్తయ్యాక ఖాళీగా ఉండదలచుకోలేదు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్బీలో చేరాను. పొద్దున్నే లేచి వంట, పిల్లలను స్కూలుకు, మా వారిని ఆఫీసుకు పంపడం, నేను కాలేజీకి వెళ్ళడం. ఒక్క రోజు కూడా ఇబ్బంది అనిపించలేదు. అంత ఎంజాయ్ చేశాను. ఎల్ఎల్బీ పూర్తవగానే ఉద్యోగం వచ్చింది.

### బెస్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్...

ఉపాధి హామీ పథకంలో ప్రోగ్రామ్ ఆఫీసర్గా ఉద్యోగం వచ్చింది. నల్లగొండ జిల్లా చౌటుప్పల్ మండలంలో 25 గ్రామాలు పర్యవేక్షించాలి. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు... వీరందరి సహకారంతో పని బాగా చేయగలిగాం. మొదట పెద్దగా రెస్పాన్స్ రాలేదు. అక్కడ ఉండి వారితో కలిసి మెలిసి తిరిగి వ్యక్తిగతంగా హామీలు ఇచ్చి వారిని 'పని' వైపు మరల్చగలిగాను. ఉపాధి హామీ పథకం విజయవంతం అయింది. 'బెస్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్'గా అవార్డు కూడా వచ్చింది. అన్ని గ్రామాల్లో తిరిగినా 'మహిళ'గా నాకెప్పుడూ ఇబ్బంది అనిపించలేదు. నిజానికి స్త్రీలే ఇలాంటి పనులు బాగాచేస్తారేమో. నేను ఇంటి నుంచి బయటపడగానే ఆ గ్రామాలు, అక్కడి వాళ్ళే నా కుటుంబం అనిపిస్తుంది. ఆ గ్రామాల వారంతా నాతో కష్టసుఖాలు, సాధక బాధకాలు పంచుకునే వాళ్ళు. నేను ఒక్కరోజు ఉద్యోగానికి వెళ్ళక పోయినా అందరూ అడిగేవారు ... ఎందుకు రాలేదమ్మా అని. గ్రామీణుల్లో ఉండే ఆదరణ, అభిమానాన్ని మనం దేని తోనూ కొలవలేం. వాళ్ళతో పనిచేస్తుంటే వాళ్ళ మనిషిలాగే భావిస్తారు. మనకూ అలాగే అనిపిస్తుంది. అదీ అక్కడిగొప్పతనం.


### చదువు ముఖ్యం...

చదువు ఎలా మనిషిని మార్చుతుందో నా జీవితమే ఉదాహరణ. నేనందరికీ ఇలా చెబుతుంటాను. అంబేద్కర్ యూనివర్సిటీ నాలాగా ఎంతో మంది జీవితాలను మార్చి ఉంటుంది. మా ఫీల్డ్ అసిస్టెంట్లను ఎంతో మందిని అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీలో చేర్పించాను. ఎవరికైనా చదువుపై ఆసక్తి ఉందంటే వారికి ఆర్థిక సాయానికి కూడా వెనుకాడను నేను. ఎన్జీవో ఏర్పాటుచేసి పేద పిల్లలకు, చదువుపై ఆసక్తి ఉన్న వారిని ఎంకరేజ్ చేయాలని ఉంది. అలాగే ఎయిడ్స్పై కూడా పని చేయాలనిపిస్తోంది. ఎంఫిల్ చేసే ప్రయత్నంలో ఉన్నాను.

* * *

నిన్నటి కంటే నేడు నీ వివేకం పెంచుకోకపోతే నీ జీవితంలో మరొక రోజు వ్యర్థమైందని తెలుసుకో.

– రస్కిన్



రాజన్న

# జైలు జీవితంలో ఓనమాలు...

# రాజన్న

చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన రాజన్న చదువు ఆరవ తరగతితోనే ఆగిపోయింది. చుట్టూ అంధకారం. ఒంటరి ప్రయాణం. ఆ ప్రయాణంలో పెద్ద అపశ్రుతి... హత్య కేసులో చిక్కుకున్నాడు. సమాజంపై, వ్యవస్థపై ఆగ్రహం, అసహ్యం. ఉరిశిక్ష పడింది. అది యావజ్జీవ కారాగార శిక్షగా మారింది. అంధకారమైన జీవితం చదువును దూరం చేసి హత్యాకేసు ద్వారా కారాగారానికి చేరిస్తే, కారాగార వాసం చదువుల ఒడిలోకి చేర్చింది. జైలుశిక్ష పడడం వల్లే చదవగలిగా నంటారాయన. పదేళ్ళ జైలు జీవితంలో ఆయన నేర్చుకున్న అనేక జీవితానుభవాలతో పాటు హిందీ, సంస్కృతం, అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ కూడా ఉన్నాయి. అంబేద్కర్ యూనివర్సిటీతో తన జీవితమే మారిపోయిందంటున్నారు. జైలు శిక్ష తగ్గి విడుదల కావడానికీ, సమాజంలో గౌరవం పొందడానికీ, వివాహం అయి జీవితంలో స్థిరపడడానికీ, ఉద్యోగం రావడానికీ అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీయే కారణమని కృతజ్ఞతలు చెబుతున్నారు. ఒకసారి రాజన్న జీవితంలోకి వెళ్దాం ...

## నాన్నకు దూరం...

అప్పుడే చీకటి పడుతోంది. అమ్మా నాన్న గొడవ పడుతున్నారు. వాళ్ళెందుకు ఘర్షణ పడుతున్నారో తెలియని వయస్సు. సీరియస్ విషయమేనని వాళ్ళ మొహాల్లో కోపం చెబుతోంది. గొడవ తారస్థాయికి చేరింది. నాన్న అమ్మను, నన్ను బయటికి గెంటేశాడు. అప్పటికే బాగా చీకటయ్యింది. అమ్మ నన్ను తీసుకుని వాళ్ళ అమ్మ వాళ్ళింటికి ... అంటే మా అమ్మమ్మ ఊరు బయల్దేరింది. మేము మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉండేవాళ్ళం. మా అమ్మది మహారాష్ట్ర, నాన్నది ఆదిలాబాద్ కాప్రి గ్రామం. ఇంకా జ్ఞాపకమే. బాగా వర్షం పడుతోంది. అమ్మకు ఆరోగ్యం కూడా బాగా లేదు. చేతిలో చిల్లిగవ్వ లేదు. 'పెన్‌గంగ' అన్న వాగు దాటితే కానీ అమ్మమ్మ ఊరు చేరలేం. 'రూక' అంటారు పడవ లాంటిది. రూక నడిపేవాణ్ణి బతిమిలాడి అమ్మ నన్ను తీసుకుని అమ్మమ్మ ఇంటికి చేరింది. కష్టాలకు అది మొదలు.

## అమ్మ ఇక లేదు...

మహారాష్ట్ర 'కాయర్' అన్న గ్రామం మా అమ్మమ్మ ఊరు. అక్కడే ఉండిపోయాం. అమ్మ అక్కడే కూలినాలి చేసింది. అసలే ఆరోగ్యం బాగాలేదు. పైగా ఇంటికష్టాలు. నేను నాల్గవ తరగతిలో ఉండగానే అమ్మపోయింది. ఇక పూర్తిగా ఒంటరైపోయాను. చిన్నమ్మ, అమ్మమ్మ వాళ్ళ దగ్గర ఉన్నాను. పన్నెండేళ్ళ వయసు. మరాఠీ మీడియంలో చదివేవాణ్ణి. అమ్మ పోయాక అడిగే వాళ్ళేలేరు. చదువు అంతంత మాత్రమే. నేను స్నేహితులతో తిరగడం, రైల్వే పనులు, కూలి పనులు చేయడం. తర్వాత చదువు ఆగిపోయింది. సిక్స్త్ క్లాస్ దాకా చదివాను.

## హత్య కేసు, ఉరిశిక్ష...

ఆ తర్వాత పదిహేనేళ్ళకు మా పెద్దమ్మ దగ్గరికి వచ్చాను. ఆదిలాబాద్‌లో ఉంటుందామె. ఆమెకు పిల్లల్లేరు. వాళ్ళూ డబ్బున్న వాళ్ళు కాదు కానీ నా దగ్గర ఉందువుగానీ, అని పెద్దమ్మ నన్ను తీసుకొచ్చింది. పెద్దమ్మ దగ్గరే ఉండేవాణ్ణి. కూలినాలి చేసుకుని గడిపేవాణ్ణి. ఇక చదువు అన్న ధ్యాసే లేదు. అక్కడే నా జీవితం మారిపోయింది. హత్య కేసులో ఇరుక్కుపోయాను. 'పొరక దొర' అని దుర్మార్గుడుండే వాడు. 'మాభూమి' సినిమాలాగా ఉండేది పరిస్థితి. ఘర్షణ పడ్డాం. ఎలా చనిపోయాడో నాకు తెలియదు. అంతా కలలా జరిగింది. వెళ్ళి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాను. కోర్టులో కేసు నడిచింది. విచారణ అంతా అబద్ధాలతో నడిచింది. నాకు న్యాయవ్యవస్థపై నమ్మకం పోయింది. జడ్జిపై చెప్పు

విసిరాను. అప్పటికి నాకు కేసులో సీరియస్‌నెస్ తెలియదు. నా ప్రవర్తన చూసి నాకు ఉరిశిక్ష వేశారు. ఆత్మరక్షణ కోసం క్షణికావేశంలో చేసిన పని ఉరిశిక్ష దాకా వెళ్ళింది. జడ్జిమెంట్‌లో కూడా ప్రమాదకరమైన వ్యక్తి అని రాశారు.

## జైలు జీవితం...

నాలో చాలా ఘర్షణ. కేసు జరిగినన్ని రోజులు చాలా మంది వ్యక్తులు కలిశారు. లాయర్లు, పోలీసులు. చదువుకోకపోయినా వ్యవస్థ ఎలా ఉంటుందో తెల్సింది. వ్యవస్థపైనే అసహ్యం కలిగింది. సమాజమంతా అన్యాయం అనిపించింది. క్షమాభిక్షకు దరఖాస్తు కూడా చేసుకోలేదు. బతికి ఏమి చేయడం ... ఈ సమాజంలో అనుకునేవాణ్ణి. జోసెఫ్ అని జైలర్ ఉండేవారు. రోజూ ఉదయం, సాయంత్రం వచ్చి "క్షమాభిక్షకు అప్పీల్ చేసుకో, చచ్చి ఏం సాధిస్తావు. నీ కోసం నేను ప్రార్థనలు చేస్తున్నాను" అని చెప్పేవాడు. నేను వినకపోయేవాణ్ణి. నాకు బతకాలని లేదనేవాణ్ణి. రాత్రి పన్నెండు గంటలకు కూడా వచ్చేవాడు. చివరికి ఒప్పించి క్షమాభిక్షకు అప్పీల్ చేయించాడు. యావజ్జీవ కారాగారశిక్షకు మార్చారు. చంచల్‌గూడ జైల్లో పెట్టారు. నాకు నక్సల్స్‌తో సంబంధం అంటగట్టారు. కొద్ది రోజులు జైల్లో నక్సల్స్ బ్యారెక్‌లో ఉంచారు. ఆ తర్వాత నేను చాలా సార్లు జైలు అధికారులను రిక్వెస్ట్ చేశాను. నక్సల్స్‌తో సంబంధం లేదని లెటర్ రాశాను. దానితో మామూలు బ్యారక్‌లోకి మార్చారు.

**"అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వారు జైల్లో చదువు చెప్పడం మొదలుపెట్టారు. జైలు అధికారులు చెప్పేవారు, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉద్యోగులు కూడా వచ్చి చెప్పేవాళ్ళు. ఫ్రీగా చదువు చెబుతామనే వాళ్ళు ... అట్లా చదువులోకి ఎంటరయ్యాను. అప్పటికి ఒక బ్యాచ్ అయిపోయింది. ముగ్గురం కల్సి రెండు బ్యాచ్‌లలో ఎంట్రన్స్ రాశాము. ముగ్గురం పాసయ్యాం... డిగ్రీలో చేరాం. జైల్లో 'దక్షిణ సమాచార్' అని పత్రిక వస్తుండేది."**

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వారు జైల్లో చదువు చెప్పడం మొదలు పెట్టారు. జైలు అధికారులు చెప్పేవారు, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉద్యోగులు కూడా వచ్చి చెప్పేవాళ్ళు. ఫ్రీగా చదువు చెబుతామనే వాళ్ళు ... అట్లా చదువులోకి ఎంటరయ్యాను. అప్పటికి ఒక బ్యాచ్ అయిపోయింది. ముగ్గురం కల్సి రెండు బ్యాచ్‌లలో ఎంట్రన్స్ రాశాము. ముగ్గురం పాసయ్యాం... డిగ్రీలో చేరాం. జైల్లో 'దక్షిణ సమాచార్' అని పత్రిక వస్తుండేది. దానికి లేఖలు, చిన్న చిన్న వ్యాసాలు రాయడం చేస్తూండేవాణ్ణి. మరాఠీ మీడియంలో చదివాను కనుక హిందీ చాలా తేలిగ్గా వచ్చింది. హిందీలో ఆ పత్రికకు వ్యాసాలు రాసేవాణ్ణి.

## జైలు స్టడీ సెంటర్

జైలు స్టడీ సెంటర్‌గా మారిపోయింది. పేపర్లుండేవి ... ఉదయం సాయంత్రం రెండు గంటలపాటు చదువుకొనడానికి పర్మిషన్ ఇచ్చేవారు. పని అయిపోయాక సాయంత్రం ఆరు గంటల తర్వాత సెల్‌లో చదువుకునేవాళ్ళం. అప్పుడు రేడియోలో అంబేద్కర్ యూనివర్సిటీ క్లాసులు ప్రసారం అయ్యేవి. జైలు అధికారులు మాకు ఒక రేడియో ఇచ్చేవాళ్ళు. అందరం ఒక రూమ్‌లో కూర్చుని వినేవాళ్ళం. ప్రతి ఆదివారం క్లాసులు. దానివల్ల ఎప్పుడో ఆరో తరగతిలో మానేసిన చదువు మళ్ళీ ఇప్పుడు మొదలుపెట్టినా కష్టం కాలేదు. ఒక్క సంవత్సరం కూడా పరీక్షలు ఫెయిల్ కాకుండా డిగ్రీ పూర్తి చేయగలిగాం. చాలా ఆనందం అనిపించింది.

## జైలు నుంచి విడుదల...

జైలుకు దక్షిణ సమాచార్ పత్రిక వస్తుండేది. నేను అది చదివి వాళ్ళకు లెటర్ రాశా ... "మీ పేపర్ చదవాలనుంది అని" ఆ లేఖ కూడా పేపర్లో ప్రచురించారు. తర్వాత రెగ్యులర్‌గా పేపర్ పంపేవారు. ఆ తర్వాత నేను తరచుగా లేఖలు, ఆర్టికల్స్ రాయడం ... ఆ పత్రిక ఎడిటర్‌తో లేఖలద్వారా పరిచయం అయింది. ఆ తర్వాత నా డిగ్రీ పూర్తి కావడం, క్షమాభిక్ష పిటిషన్ పెట్టుకోవడం ... అది ఓకే కావడంతో విడుదలయ్యాను. దాదాపు పదేళ్ళ తర్వాత బయటి ప్రపంచంలోకి అడుగుపెట్టాను. అప్పటికి నేను అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ డిగ్రీ, హిందీ ప్రచార్ సభ వారి 'విద్వాన్', భారతీయ విద్యాభవన్ వారి 'సంస్కృత కోవిద' పాసయ్యాను.

నిజానికి నేను జైలు కెళ్ళడం వల్లే చదువుకోగలిగాను అనిపిస్తుంది. బయట ఉంటే కూలీనాలీ పనిలోనే జీవితం గడచిపోయేది. జైలు... అదొక ప్రపంచం. అందులో ఉండేవాళ్ళు ఏమైనా కావచ్చు. మేధావులు కావచ్చు. నేరస్తులు కావచ్చు. అన్నింటికీ ఆస్కారం ఉంటుంది. ఏ 'లైన్'లో వెళితే అది దొరుకుతుంది. అదృష్టవశాత్తు నాకు చదువు 'మార్గం' దొరికింది. అక్కడ ఎంత చదువుకోగలిగితే అన్ని అవకాశాలు ఉంటాయి. డాక్టరేట్ కూడా చేయవచ్చు. అది కూడా ఉచితంగా. అన్ని హంగులూ, ప్రోత్సాహం ఉంటాయి అక్కడ. అదొక విద్యాలయమే. భారతీయ విద్యాభవన్ వాళ్ళు సంస్కృతం కోర్సులు, హిందీ ప్రచార సభ వాళ్ళు హిందీ కోర్సులు ... అలాగే అన్ని యూనివర్సిటీలు దూరవిద్యను అందిస్తాయి. వాటిని మనం మన విజ్ఞతతో అందుకోగలగాలి. చాలా మంది ఖైదీల్లో చదువులు మనకెందుకనే నిరాశ కనిపిస్తుంది.

## ఉద్యోగ జీవితం...

విడుదలయ్యాక 'దక్షిణ సమాచార్' ఎడిటర్ గారిని కలిశాను. ఆయన వల్లే నేను విడుదలయ్యాను. ఆయన చెప్పిన మాటే వినేవాణ్ణి. ఆ పేపర్లో పని ఇచ్చారు. ఆ పేపర్లో అంబేద్కర్ యూనివర్సిటీకి సంబంధించిన వివరాల 'కాలమ్' ఉండేది. అవి నేనే సేకరించేవాడిని. అలా అంబేద్కర్ యూనివర్సిటీతో అనుబంధం పెరిగింది. అలా అంబేద్కర్ యూనివర్సిటీలో అటెండర్గా చేరాను. అప్పుడు రోజువారి వేతనం పదహారు రూపాయలు. అప్పటి వైస్ చాన్సెలర్ ఆర్వీయార్ చంద్రశేఖర్ గారు డిగ్రీ చేశావు కదా టైప్ నేర్చుకో ప్రమోషన్ వస్తుంది అన్నారు. ఇన్స్టిట్యూట్కు వెళ్ళి టైప్ నేర్చుకున్నాను. జూనియర్ అసిస్టెంట్గా టెంపరరీగా ఉద్యోగం ఇచ్చారు. అప్పటి నుంచి జూనియర్ అసిస్టెంట్గా పని చేస్తున్నాను. పర్మినెంట్ కావాల్సి ఉంది.

## పెళ్ళి, పిల్లలు...

అటెండర్గా పని చేస్తున్నప్పుడు మహారాష్ట్రకు వెళ్ళాను. పెద్దమ్మ ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రకు వెళ్ళింది. ఆమె దగ్గరికి వెళ్ళినప్పుడు అందరు పెళ్ళి చేసుకొమ్మన్నారు. ఉద్యోగమైతే ఉందిగానీ చేతిలో డబ్బుల్లేవు. స్నేహితులందరూ కల్సి తలా కొంత డబ్బు లేసుకుని పెళ్ళిచేశారు. బొమ్మల పెళ్ళిలాగా జరిగింది. అసలు మొదట పిల్లను కూడా ఇవ్వలేదు. హత్య కేసు, జైలుశిక్ష... ఇదంతా చూసి భయపడ్డారు. ఎలాగోలా పెళ్ళయ్యింది. ఇప్పుడు ఇద్దరు పిల్లలు. పెద్దమ్మాయి ఇంటర్ చదువుతోంది. చిన్నవాడు సెవన్త్. చదువు ఎంత అవసరమో నాకు తెల్సు కనుక వారికి చెబుతున్నాను. చదివిస్తున్నాను.

## రెండు ఉద్యోగాలు...

కుటుంబం గడవడం, పిల్లల చదువు ఆర్థికంగా భారమైంది. అంబేద్కర్ యూనివర్సిటీలో టెంపరరీ ఉద్యోగం డబ్బులు సరిపోకపోవడం వల్ల హిందీ మిలాప్లో ట్రాన్స్లేటర్గా చేరాను. అంబేద్కర్ యూనివర్సిటీ ఉద్యోగం మాకు అన్నం పెడుతోంటే, హిందీ మిలాప్ ఉద్యోగం పిల్లల చదువుల అవసరాలు తీరుస్తోంది. అలా రెండు ఉద్యోగాలతో జీవితం నెడుతున్నాను. ఉస్మానియాలో ఎంఏ (హిందీ)లో పాసవడంతో హిందీ మిలాప్లో ట్రాన్స్లేటర్గా, సబ్ ఎడిటర్గా పనిచేయడం సులభం అవుతోంది.

## చదువిచ్చిన జీవితం...

కష్టపడి చదువుకున్న చదువులో చాలా రుచి ఉంటుంది. చదువువల్లే నేను మారాను. అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీనే విడుదలకు సాయపడింది. ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ చేయగలిగాను. విడుదలయ్యేటప్పటికీ డిగ్రీ చేతిలో ఉండడం ఆత్మవిశ్వాసం పెంచింది. లేకుంటే ఎక్కడ ఉండేవాళ్ళమో. అసలు డిగ్రీ చేయకపోతే క్షమాభిక్షకు అప్పీల్ చేసుకునే అర్హత కూడా ఉండేదికాదు. వాళ్ళెప్పుడు విడుదల చేస్తే అప్పుడు పోవాలి. ఊర్లోకి వెళ్ళి కూలినాలి చేసుకోవాల్సి వచ్చేది. హత్యకేసు ముద్రతో బతకడం కష్టమయ్యేది. ఇప్పుడు డిగ్రీవల్ల సమాజంలో గుర్తింపు వచ్చింది. విడుదల అయ్యాక ఏదో ఒక స్థాయిలో స్థిరపడడానికి అంబేద్కర్ యూనివర్సిటీ సాయపడింది. డిగ్రీ చేసిన నాకు బ్యాంకులు లోన్ ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నాయి. ఇదంతా చదువువల్లే సాధ్యం అయింది. ఇప్పుడు నేను రెండు ఉద్యోగాలు చేస్తోంది చదువువల్లే. బయట ప్రపంచంలో ఉన్నప్పుడు చదువుకోలేకపోయినా నేను జైల్లో చదువుకోగలిగి ఇలా స్థిరపడగలిగాను.

* * *



శిష్ఠా సవిత

# రచ్చ గెలిచిన దూరవిద్య

# శిష్టా సవిత

## సరిహద్దులు చెరిపేసిన సాధారణ మహిళ

ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీలకు విలువుంటుందా? ఈ డిగ్రీని విదేశాల్లో గుర్తిస్తారా? ఇది మిగతా యూనివర్సిటీల డిగ్రీలకు సమానమవుతుందా? ఇలాంటి అనేకానేక ప్రశ్నలకు ఒకే ఒక్క సమాధానం శిష్టా సవిత. ఇలాంటి ప్రశ్నలుండగానే ఏరికోరి అంబేద్కర్ యూనివర్సిటీలో బిఎస్సీ, ఎమ్మెస్సీతో పాటు పలు ఇతర కోర్సుల్నీ పూర్తిచేసిన సవిత అమెరికాలోని ప్రతిష్ఠాత్మకమైన సౌత్ ఫ్లోరిడా యూనివర్సిటీలో పైచదువులు చదివి కాలిఫోర్నియాలో స్థిరపడ్డారు. హైదరాబాద్‌లో పనిచేస్తూ చదువుకుని ఒక్కో మెట్టూ ఎక్కుతూ వస్తోన్న తను ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీతో ఎవరికీ అందనంత ఎత్తుకు ఎదిగారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ పూర్తి చేసుకున్న తరువాత అమెరికాలో పైచదువులకు అప్లయి చేసుకున్న ఆమెను అక్కడి విశ్వవిద్యాలయాలు కళ్ళకు అద్దుకున్నాయి. ఫీజులు మినహాయించడమే కాక, స్కాలర్‌షిప్‌లూ ఆఫర్ చేశాయి. విశ్వవ్యాప్తంగా పేరున్న విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన తన మిగతా క్లాస్‌మేట్స్‌తో తాను పోటీపడి నిలబడడం వెనుక ఈ విశ్వవిద్యాలయం వేసిన పునాదే కారణం అంటారామె. ప్రపంచంలో ఎక్కడైనా నెగ్గగలిగే ప్రమాణాలు అంబేద్కర్ విశ్వవిద్యాలయం కరికులంలో పుష్కలంగా ఉన్నాయని చెపుతున్న సవిత ఈ విశ్వవిద్యాలయ కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన వేలాది మందిలో ఒకరు. అమెరికన్ విశ్వవిద్యాలయాల్లో ఎదురైన సవాళ్ళన్నిటినీ చిరునవ్వుతో ఎదుర్కొని నిలదొక్కుకోవడానికి తనకు అంబేద్కర్ విశ్వవిద్యాలయ బోధన ఆలంబనయ్యిందంటున్న శిష్టా సవిత అనుభవాలివి ...

**దూ**రవిద్య చదువును దగ్గరికి చేర్చి దేశాల సరిహద్దులను ఎలా చెరిపి వేస్తుందో. 'సవితా సిస్టా' జీవితం చెబుతోంది. డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అంటే. వయోజనులకు, పెళ్ళయి విద్యకు దూరమైన వారికి, ఏ ప్రమోషన్ల కోసమో డిగ్రీలు చేసే వారికి, వికలాంగులకు ... పనికి వస్తుందన్న అపోహను పద్దెనిమిదేళ్ళ సవిత తునాతునకలు చేశారు. పట్టుదల, శ్రమతో అవకాశాలు అందిపుచ్చుకోవడానికి, విజయ తీరాలను చేరడానికి వయస్సుతో, పరిస్థితులతో నిమిత్తం లేదని సవిత నిరూపించారు.

మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన సవిత ఆలోచనా దృక్పథం వేరు. లక్ష్యం వేరు. తనతో చదువుకున్న వారంతా కాలేజీలో, యూనివర్సిటీలో చేరుతోంటే ఆమె మాత్రం తన లక్ష్యానికి, దూరవిద్య సాధనంగా ఎంచుకున్నారు. 'చదివే ప్రతి మనిషి తన కాళ్ళపై తాను నిలబడాలి' అన్న ధోరణి ఆమె విద్యా జీవితమంతా ప్రతిఫలిస్తుంది. తనకు తాను సంపాదిస్తూ చదువుకోవడమే ఆమె పద్ధతి. 'పనిచేస్తూ, నా ఉద్యోగ, వ్యక్తిగత బాధ్యతలు నిర్వహిస్తూనే, చదువుకోవాలనుకున్నా ... పని భవిష్యత్‌కు అడ్డురాకూడదని, విద్యతో ప్రగతికి దారివేయాలని అనుకున్నాను. దానికి పునాది వేయగలిగే యూనివర్సిటీ కోసం ప్రయత్నం చేశాను' అంటారామె. ఈ అన్వేషణ క్రమంలో ఆమెకు అంబేద్కర్ యూనివర్సిటీ విద్యాశ్రయం ఇచ్చింది. దూరవిద్య ద్వారా చదువుకుందామని నిర్ణయించుకున్న తర్వాత సైన్స్ డిగ్రీ చేయాలంటే దూరవిద్య ద్వారా దానికి సంబంధించిన ల్యాబ్, మౌలిక సదుపాయాలు చాలా ఉండాలి. అంబేద్కర్ యూనివర్సిటీలో ఈ సదు పాయాలున్నాయని గ్రహించిన సవిత అక్కడే డిగ్రీ

చేయాలని నిర్ణయించుకున్నారు. 1990 సంవత్సరంలో బీఎస్సీలో చేరేనాటికి ఆమెకు 18 సంవత్స రాలు. అప్పటికి దూరవిద్య పాపులర్ కాలేదు. పైగా అనేక అపోహలతో చిన్న చూపు ఉండేది. ఓపెన్ యూనివర్సిటీ క్వాలిటీపై, దానికున్న విలువపై విద్యార్థు లలో అనేక అనుమానాలు ఉండేవి. ఈ డిగ్రీలకు సరైన గుర్తింపు ఉండదన్న భయాలు ఉండేవి. ఇంటికి వచ్చిపోయే బంధువులు, స్నేహితులు ... అందరికీ తాను చేస్తున్న దూరవిద్య పట్ల చిన్నచూపు ఉండడం సవిత గమనించింది. ఆ డిగ్రీల సాయంతోనే అమెరికాలో స్థిరపడి వారి అనుమానాలను, భయాలను పటాపంచలు చేశారు. అంబేద్కర్ యూనివర్సిటీ వేసిన పునాది, అందించిన విద్య, పెంచిన ఆత్మవిశ్వాసంతో తాను అంతర్జాతీయ స్థాయి పోటీలో నెగ్గానని సవిత సగర్వంగా చెబుతారు.

అంబేద్కర్ యూనివర్సిటీలో చేరేనాటికి సవిత సాధారణ విద్యార్థిని. ఈ యూనివర్సిటీతో ఉన్న పదేళ్ళ అనుబంధంతో అనేక కోర్సులు పూర్తిచేయ గలిగింది. బీఎస్సీ, డిగ్రీ, అప్లయిడ్స్ మాథ్స్‌లో ఎంఎస్సీ, ఫుడ్‌న్యూట్రిషన్‌లో సర్టిఫికెట్ కోర్సు, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్‌లో పీజీ డిప్లొమా ... ఇలా ఆమె బయోడేటా, వివిధ పట్టాలు, కోర్సులతో కళకళ లాడింది. సాధారణ స్థాయి విద్యార్థినిగా అడుగు పెట్టిన ఆమె డిస్టింక్షన్స్‌లో కోర్సులు పూర్తి చేయ గలిగింది. విద్యపై ఆసక్తి డిగ్రీలో 'కామన్‌వెల్త్ ఆఫ్ లెర్నింగ్' గుర్తింపు తెచ్చిపెట్టింది.

> **"అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ కోర్సులో ఎవరి అవసరాలకు, సమర్థతకు అనుగుణంగా వారు సైన్స్, ఆర్ట్స్, కామర్స్ ఏమైనా ఎంచుకునే అవకాశం, సిలబస్‌లో, సమయంలో ఉండే సౌలభ్యం, ఆదివారం క్లాసెస్‌లో కోచింగ్ పద్ధతి. ఇవన్నీ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయి ఇక్కడ డిగ్రీలు పొందిన వారు రెగ్యులర్ విద్యార్థులకు ఏమాత్రం తీసిపోరు."**

'రెగ్యులర్ డిగ్రీలు, చదువుల కన్నా దూరవిద్య భిన్నమైనది. మనకు మనం ఎదగాలన్న ఆకాంక్ష, పట్టుదల ఉండాలి. అదే మనల్ని విజయతీరాలకు చేరుస్తుంది' అంటారు సవిత. ఉద్యోగ, కుటుంబ బాధ్యతలకు... చదువుకు మధ్య సమతుల్యాన్ని సాధించాలి. పనికి చదువు, చదువుకు పని అడ్డు రాకూడ దంటారు. తన విజయ రహస్యం ఇదే. ముఖ్యంగా అంబేద్కర్ యూనివర్సిటీ సిలబస్, చేసిన వేర్వేరు కోర్సులు నాకు అండగా నిలిచాయి. అనేక సవాళ్ళను ఎదుర్కొనేలా చేశాయి' అంటారామె. పగలు ఉద్యోగం చేస్తూనే అనేక డిగ్రీలు తన ఖాతాలో వేసుకోవడం ఎంతో ఉపయోగపడిందంటారు ఆమె.

అంబేద్కర్ యూనివర్సిటీలో డిగ్రీలు, పట్టాలు సాధిస్తూనే 1991-1999 వరకు ఆమె ప్రసాద్ లాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేశారు. అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్‌గా చేరిన ఆమె క్రమంగా ఎగ్జిక్యూటివ్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, ఎగ్జి క్యూటివ్ అసిస్టెంట్‌గా ఎదిగారు. ఒకవైపు చదువులో, మరొకవైపు కెరీర్‌లో కూడా ప్రగతిని సాధించారు. ఈ ఉద్యోగమే కాకుండా టెన్త్‌క్లాస్ పిల్లలకు మాథ్స్ ట్యూషన్స్ కూడా చెప్పేవారామె. అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ కోర్సులో ఎవరి అవసరాలకు, సమర్థతకు అనుగుణంగా వారు సైన్స్, ఆర్ట్స్, కామర్స్ ఏమైనా ఎంచుకునే అవకాశం, సిలబస్‌లో, సమయంలో ఉండే సౌలభ్యం, ఆదివారం క్లాసెస్‌లో కోచింగ్ పద్ధతి. ఇవన్నీ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని, ఇక్కడ డిగ్రీలు పొందిన వారు రెగ్యులర్ విద్యార్థులకు ఏమాత్రం తీసిపోరని సవిత అంటున్నారు. మల్టీమీడియా బోధన, ల్యాబ్‌ట్రైనింగ్, కౌన్సెలింగ్... ఇవన్నీ అంబే ద్కర్ యూనివర్సిటీ విద్యకు వన్నె తెస్తున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వీటన్నింటి సహ కారంతో తాను విద్యపై పట్టును... ఆత్మవిశ్వాసాన్ని పొందానంటున్నారు.

అంబేద్కర్ యూనివర్సిటీతో పదేళ్ళ అను బంధం తర్వాత ఆమె అమెరికాలో చదవాలని నిశ్చయించుకున్నారు. అమెరికాలోని రెండు యూని వర్సిటీలు ఆమె దరఖాస్తును అంగీకరించాయి. ఎంఏ, మాథమెటిక్స్ (స్టాటిస్టిక్స్ స్పెషలైజేషన్)లో యూనివర్సిటీ ఆఫ్ సౌత్ ఫ్లోరిడాలో ఆమె జాయిన్ అయ్యారు. దానికి ఫీజు మినహాయింపే కాదు, ఆర్థిక సహకారం కూడా లభించింది. ఇవన్నీ కూడా తాను సంపాదించిన డిగ్రీలు, అవార్డుల ఆధారంగానే లభించాయంటా రామె. అంబేద్కర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ల సిఫారసు లేఖలు కూడా సాయపడ్డాయని చెబుతున్న సవిత ఎంఏ,

మాథమెటిక్స్ 92 శాతం మార్కులతో పూర్తి చేసింది.

అంతర్జాతీయంగా సుప్రసిద్ధమైన అనేక యూనివర్సిటీల నుంచి వచ్చిన విద్యార్థులతో పోటీపడి తాను ఇన్ని కోర్సులు సంపాదించడానికి అంబేద్కర్ యూనివర్సిటీ కారణమని కృతజ్ఞతలు చెబుతారామె.

యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా ఆమె ప్రతిభను గుర్తించింది. అర్బన్ స్కాలర్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్‌లో బెస్ట్ టీచర్ అవార్డు పొందారామె. ఈ ప్రోగ్రామ్‌లో ఆమె విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్, రీడింగ్, రైటింగ్ స్కిల్స్ ... బోధించింది.

సరిహద్దులను చెరిపేసి ఎదిగిన సవిత పెళ్ళి చేసుకుని కాలిఫోర్నియాలో సెటిలయ్యారు. కుటుంబ బాధ్యతలతో పాటు సాంటక్లారా సిటీ లైబ్రరీకి డాటాబేస్ అడ్మినిస్ట్రేటర్‌గా సాయం చేస్తున్నారు. స్టాటిస్టిక్స్‌లో ఉన్న జ్ఞానంతో టీచింగ్ కెరీర్‌ను ఎన్నుకునే ప్రయత్నంలో ఉన్నారు.

* * *

జీవితంలో సర్వస్వం
కోల్పోయినా ఒకటి మాత్రం
మిగిలి ఉంటుంది. అదే
భవిష్యత్తు.

– క్రిస్టన్ బోవే



మహ్మద్ యాసిన్

# బతుకు మార్చిన బీజాక్షరాలు

# మహ్మద్ యాసిన్

తల్లి ఆరోగ్యం, ఆర్థిక కారణాల వల్ల దూరమైన విద్యను అంబేద్కర్ ఓపెన్‌వర్సిటీనే దగ్గర చేసింది. ఎంతో ఆసక్తి ఉన్న చదువు ఆగిపోవడం, సంసార బాధ్యతలు ... ఇక ఎడ్యుకేషన్‌పై ఆశలు వదులుకున్నానని, ఇలాంటి దశలో ఈ విశ్వవిద్యాలయం తన ఆశలకు జీవం పోసిందని యాసిన్ అంబేద్కర్ ఓపెన్‌వర్సిటీకి కృతజ్ఞతలు చెబుతున్నారు. ఈ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పాసవడం తన జీవితాన్ని మలుపు తిప్పిందంటున్నారాయన. డిగ్రీ పూర్తవడం, ఆ తర్వాత బీఈడీ, వెంటనే డీఎస్సీలో సెలక్ట్ కావడం జీవితంలో స్థిరపడేలా చేసిందని, దానికి డిగ్రీలో పడిన 'అక్షర పునాదులే' కారణమని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్మీడియెట్‌తో చదువు ఆగిపోయినా, జూనియర్ లెక్చరర్ దాకా ఎదిగానంటే అంబేద్కర్ ఓపెన్‌వర్సిటీ చలవేనని, అందరూ ఈ 'బాట' పట్టాలని సూచిస్తున్నారు రంగారెడ్డి జిల్లాకు చెందిన యాసిన్.

## ఇంటర్‌లో పెళ్ళి ...

చిన్నప్పుడు చదువుల్లో బాగానే ఉండే వాడిని. క్లాస్ ఫస్ట్ నేనే. టెన్త్ వరకు చదువు బాగానే సాగింది. ఇంటర్‌లో జాయినయ్యాను. కానీ, దురదృష్టవశాత్తు చదువు సాగలేదు. మా అమ్మకు ఆరోగ్యం బాగా లేకుండేది. ఆమె టీబీ పేషెంట్. ఆమె మరణిస్తుందేమోనన్న అనుమానంతో నాకు ఇంటర్ సెకండియర్‌లోనే పెళ్ళి చేశారు. 'వివాహం విద్యా నాశనం... అన్నట్టుగా పెళ్ళి, చదువుకు కళ్ళెం వేసింది. పెళ్ళితో పాటే వచ్చిన బాధ్యతలు ఇంటర్ పూర్తి చేయనివ్వలేదు. పరీక్షలైతే రాశాను కానీ 'ఫిజిక్స్'లో ఫెయిలయ్యాను. ఆ తర్వాత ఫిజిక్స్ పూర్తిచేసినా ఆర్థిక పరిస్థితి డిగ్రీలో చేరడానికి అనుకూలంగా లేకపోయింది. ఆ తర్వాత పిల్లలు పుట్టడం ... వారి ఆలనా పాలనా చూడాల్సి రావడంతో చదువుకు పూర్తిగా దూరమయ్యాను.

## అంబేద్కర్ యూనివర్సిటీ... డిగ్రీ

కుటుంబ పోషణ కోసం ప్రైవేటు డాక్టర్ దగ్గర పనిచేసేవాడిని. చదువుపై చాలా ఇంట్రెస్ట్. కానీ కుదరలేదు. చదువుకోవాలన్న ఆసక్తి మాత్రం మనసులో ఉండేది. 1983లో అంబేద్కర్ యూనివర్సిటీ నోటిఫికేషన్ పడింది.

మహబూబ్‌నగర్‌లో అదే ఫస్ట్ బ్యాచ్. అక్కడ చేరాను. డాక్టర్ దగ్గర పనిచేస్తే ఇరవై, ముప్పయి రూపాయలిచ్చే వారు. అది ఫీజులకు ఉపయోగపడేది. మొత్తానికి డిగ్రీలో చేరడం చదువుపై మళ్ళీ ఆసక్తిని పెంచింది. చదువుకోవాలన్న కోరికను తీర్చింది. ఆ తర్వాత ఆర్ఎంపి డాక్టర్‌గా నేనే మెడికల్ ప్రాక్టీస్ పెట్టాను. ముజాహిల్‌పూర్‌లో ప్రాక్టీస్ బాగానే నడిచింది. అలా ప్రాక్టీస్ చేస్తూనే చదువుకున్నాను. చదవడం కొంచెం కష్టంగానే ఉండేది. ఇంటి బాధ్యతలు, ప్రాక్టీసు... చదువుకు సమయం దొరికేది కాదు. ప్రాక్టీసు అయిపోయి ఇంటికి వెళ్ళి పిల్లలు పడుకున్నాక రాత్రి తొమ్మిదింటి నుంచి పన్నెండు గంటలదాకా చదివేవాడిని. ఆదివారం అంబేద్కర్ ఓపెన్‌వర్సిటీ క్లాసులకు మాత్రం తప్పకుండా హాజరయ్యేవాడిని. బాగా ఉపయోగపడతాయవి. పరీక్షలు వచ్చాయంటే రాత్రి రెండు గంటలదాకా చదివేవాడిని. 1987లో డిగ్రీ పూర్తి చేయగలిగాను.

## జీవితాన్ని మలుపు తిప్పిన డిగ్రీ...

డిగ్రీ అవగానే 1988లో బీఈడీ ఎంట్రన్స్ రాశాను. సీటు వచ్చింది. డిగ్రీ పూర్తిచేయడం జీవితాన్ని మార్చేసిందని చెప్పాలి. తర్వాత బీఈడీ చేయడం, ఆ తర్వాత డీఎస్సీ రాయడం టీచర్ ఉద్యోగం చకచకా జరిగిపోయాయి. భార్యా

పిల్లలతో సహా హైదరాబాద్ వచ్చి రూము తీసుకుని బీఈడీ చదివాను. చాలా కష్టంగా ఉండేది. కానీ మెడికల్ ప్రాక్టీసుతో వచ్చిన డబ్బులను వాడుకుని బీఈడీ గట్టెక్కాను.

ఆ వెంటనే డీఎస్సీ రావడం జీవితం సెటిలయ్యేలా చేసింది. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్‌గా కూడా సెలక్టయ్యాను. కొన్ని అవకతవకలు కారణంగా స్కూల్ అసిస్టెంట్‌గా తీసుకోకపోతే ట్రిబ్యునల్ కెళ్ళి గెలిచాను. స్కూల్ అసిస్టెంట్‌గా రంగా రెడ్డి జిల్లా యాలాల్ హైస్కూల్‌లో చేరాను. అలా ఉద్యోగం చేస్తూనే ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పొలిటికల్ సైన్స్‌లో పీజీ రాశాను. అది 1991కి పూర్తయ్యింది. 2001 సంవత్సరంలో జూనియర్ లెక్చరర్‌గా రంగారెడ్డి జిల్లా పెద్ద ఏముల్‌లో ప్రమోషన్ ఇస్తూ పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పుడు తాండూరులో జూనియర్ కాలేజీలో పనిచేస్తు న్నాను. ఒక్కసారి వెనక్కు తిరిగి చూసుకుంటే అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ నా జీవితాన్ని ఎంతగా మార్చేసిందో అనిపిస్తోంది. ఆ డిగ్రీ చేయకపోతే లైఫ్‌లో ఈ సెటిల్‌మెంట్ లేదు. ఈ ఉద్యోగం లేదు. చిన్నాచితకా పనులు, మెడికల్ ప్రాక్టీస్ ... బతకడానికి ఏదో ఒకటి చేయాల్సి వచ్చేది.

> "ఒక్కసారి వెనక్కు తిరిగి చూసుకుంటే అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ నా జీవితాన్ని ఎంతగా మార్చేసిందో అనిపిస్తోంది. ఆ డిగ్రీ చేయకపోతే లైఫ్‌లో ఈ సెటిల్‌మెంట్ లేదు. ఈ ఉద్యోగం లేదు. చిన్నాచితకా పనులు, మెడికల్ ప్రాక్టీస్ ... బతకడానికి ఏదో ఒకటి చేయాల్సి వచ్చేది."

## వివాహం ... విద్యనాశనం కాదు

ఇక ఎడ్యుకేషన్ అయిపోయింది. అనుకున్న సమయంలో ఓపెన్ యూనివర్సిటీ మా దగ్గరగా స్టడీ సెంటర్ పెట్టడం నా అదృష్టం. నేను కష్టపడి పాసవడం చాలా మంది మెచ్చుకుంటుంటారు. పైగా నాకు చదువు అంటే ఎంతో ఇంట్రస్ట్. చదువుపై ఆసక్తి వుండీ, ఆర్థికంగా చదివే అవకాశం లేని వారికి 'అంబేద్కర్ ఓపెన్‌వర్సిటీ' వరం లాంటిదే అని చెబుతాను నేను. నాకు పరిచయం ఉన్న వాళ్ళందరికీ చెబుతుంటాను ... ప్రతి ఒక్కరం చదవాలి, కష్టపడాలి అని. మా స్టూడెంట్స్‌కు నా చదువు గురించి చెబుతుంటాను. నిజానికి నేను ఇలా చదివి సెటిలవడం వెనుక మా ఆవిడ ప్రోత్సాహం ఉంది. ఆమె చదువుకోకపోయినా నేను చదవడానికి ఆమె బాగా ఎంకరేజ్ చేసేది. పరీక్షలప్పుడైతే ఆమె చాలా అండగా ఉండేది. నాకు శ్రమ లేకుండా చూసుకునేది. ఇప్పటికీ మా పిల్లలను ఆమె బాగా ప్రోత్సహిస్తుంది. మా తమ్ముడికి కూడా బాగా చదవాలని చెప్పి నేనే బీఎస్సీ దాకా చదివించాను.

## జీవితాన్ని మార్చే చదువు...

చదివితే జీవితం మారిపోతోందన్న విషయం అందరికీ తెలియాలి. ఈ విషయం తెలిస్తే అందరూ చదువుతారు. కష్టం ఉంటుంది ఫలితం కూడా ఉంటుంది. నేను చదవడం వల్లే బాగా సెటిలవడమే కాదు ... మా పిల్లలను కూడా చదివించగలుగుతున్నాను. ముగ్గురు ఆడపిల్లలు నాకు. వారు పెద్ద చదువులు చదువుతున్నారు. నాకు అక్షర జ్ఞానం లేకపోతే వారింత చదువులు చదివే వారు కాదని పిస్తోంది. నేనూ చిన్న స్థాయిలోనే ఉండేవాణ్ణి. వారికి ఆర్థికంగా, నైతికంగా అండగా ఉండేవాణ్ణి కాదు. నా చదువే వారి చదువులకు దారిచూపింది. ఆడ పిల్లలు బాగా చదివి వారి కాళ్ళపై వారు నిలబడాలని నా కోరిక. నా జీవితం గురించి... ఎలా కష్టపడి స్థిరపడ్డానో వారికి చెబుతుంటాను.

## సిలబస్ బావుంది

గ్రామీణ ప్రాంతాలలో రెగ్యులర్‌గా కాలేజీలకు వెళ్ళి చదివే ఆర్థిక స్థోమత లేదు. వారమంతా కష్టపడి ఆదివారం చదువుకునే అవకాశం ఉంటే ఎంతో మంచిది. ఇంట్లో కూర్చుని చదివి ఉద్యోగాలు సంపాదించవచ్చు. ఎన్ని స్టడీ సెంటర్లుంటే అంత మంచిది. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సిలబస్ కూడా ఎంతో బావుంటుంది. ఏ పోటీ పరీక్షలకైనా ప్రిపేర్ కావచ్చు. నేను ఈ డిగ్రీ నుంచే బీఈడీ, డీఎస్సీ సాధించగలిగాను.

* * *

చివరగా ..

# నేను సైతం ...!!

హైదరాబాదు ట్రాఫిక్ మహాసముద్రాన్ని రెండు గంటలపాటు ఈది అలసిపోయి ఇల్లు చేరిన నేను, నా నాలుగు నెలల కొడుకు ఆటలతో సేదదీరుతున్నప్పుడు మోగింది నా పర్సనల్ నెంబర్ సెల్‌ఫోను. ఈ రాత్రిపూట ఎవరా నాకు ఫోన్ చేసింది అని ఎత్తిన తర్వాత అవతలి వ్యక్తి చెప్పింది విని ఆనందంతో నోటమాట కరువైంది. సివిల్ సర్వీసు మరొక్కసారి సాధించినంత ఆనందం అది. కొన్ని వేల మందికి విద్యాదాహం తీర్చిన విశ్వవిద్యాలయం నిన్ను గుర్తుంచుకుని పలుకరించినప్పుడు కలిగే పరవశం అది. సివిల్ సర్వీసు పరీక్షలలో మన విశ్వవిద్యాలయం తరపున పోటీపడి నెగ్గి, నూరుశాతం ఫలితాన్ని అందించావన్న డా. ఘంటా చక్రపాణి గారి అభినందన నా విజయాన్ని నాకు కొత్తగా పరిచయం చేసింది. విశ్వవిద్యాలయం అందించిన చదువుతో తమ జీవితాలనే గెలిచిన 25 మంది విజేతలతో ఒక పుస్తక ప్రచురణకు పూనుకొన్నామని దానికి మలిమాట మీరే రాయాలని ఆయన అడగగానే, అది నాకు లభించిన ఒక అత్యుత్తమ గౌరవంగా భావించి ఆనందంగా అంగీకరించాను. ధైర్యంగా ఓ.కే అన్నానుగాని, మొదలుపెట్టాక గాని తెలియలేదు అది ఎంతటి పవిత్ర కార్యమో. అన్ని దానాల్లోకెల్లా మేటియైన విద్యాదానాన్ని అందుకుని అత్యున్నత శిఖరాల వైపు వడివడిగా అడుగులు వేస్తున్న విజేతల విజయగాథలు చదువుతూ క్యాలెండరులో తేదీలు మారిన విషయం కూడా గుర్తించ లేకపోయాను.



ఈ ప్రపంచంలో ఉన్నది ఏదీ మహాభారతంలో లేకుండా లేదు అన్నట్లు ఈ సమాజంలోని ఏ వర్గమూ మన విశ్వవిద్యాలయ ఆసరాను పొందకుండా లేదు. దళిత మహిళలు, జైలు ఖైదీలు, అధికారులు, రాజకీయ నాయకులు ... ఇలా ఒకరేమిటి మొత్తం సమాజమే ఈ విశ్వవిద్యాలయం ద్వారా లబ్ధిపొందిందని చెప్పడానికి మీ ముందున్న ఈ చిన్ని పుస్తకమే సాక్ష్యాధారం. ఈ విశ్వవిద్యాలయ విద్యాకుసుమాలతో లబ్ధిపొందిన విజేతలలో నా మిత్రుడు, ప్రస్తుతం డిప్యూటీ తహశీల్దారు అయిన నరేందర్‌ను కూడా చూడడం ఒక మంచి అనుభూతిని కలిగించింది. "సహజ సామర్థ్యం సహజమైన మొక్క వంటిది. చదువుతో దాన్ని పెంచిపోషించాలి" అంటారు ఫ్రాన్సిస్ బేకన్. అటువంటి పోషణ లభించింది కాబట్టే ఈ మిత్రుడు పాలకాడి నుండి పాలకుడిగా ఎదగగలిగాడు.

## విద్యాలయంతో అనుబంధం

మా నాన్న ఎస్.వి.ప్రతాపరెడ్డి గారు ఖమ్మం జిల్లాలో పోలీసు డిపార్టుమెంట్‌లో సి.ఐ హోదాలో ఉండేవారు. సైన్స్ సబ్జెక్టులు చదివి ఐ.పి.ఎస్ అయిన వాళ్ల ఎస్.పిని ఆదర్శంగా తీసుకుని నన్ను కూడా సైన్స్ గ్రూపులో చేర్పించారు. ఫస్టు క్లాసు మార్కులతో డిగ్రీ పాసయ్యాను గాని సైన్స్

సబ్జెక్టులలో పి.జి సీటు మాత్రం సాధించలేకపోయాను. మొదటి నుండి అభిమానం ఉన్న ఆర్ట్స్ సబ్జెక్టులలో పిజి చేయడానికి సైన్స్ డిగ్రీ పనికిరాదని తెలిసి నిరుత్సాహంలో ఉన్న నాకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నోటిఫికేషన్ ఎడారిలో ఒయాసిస్‌లా కనిపించింది. హైదరాబాదులో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతూ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఎం.ఎ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పూర్తి చేశాను. ఏమాత్రం పూర్వ పరిచయం లేని విద్యార్థికైనా సబ్జెక్టును సులభంగా అర్థమయ్యేలా తీర్చిదిద్దిన స్టడీ మెటీరియల్ చదివిన తర్వాత కోచింగ్ సెంటర్ల వెంటపడటం కన్నా ఉత్తమ మార్గం దొరికినట్లుగా అనిపించింది. ఓపెన్ యూనివర్సిటీ స్థాయి సివిల్స్‌కు సరిపోదు అన్న మాటలను పట్టించుకోకుండా ప్రిలిమినరీకి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌ను ఆప్షనల్‌గా ఎంచుకుని తొలి ప్రయత్నంలోనే మెయిన్స్ పరీక్షకు ఉత్తీర్ణుడయ్యాను. అదే సమయంలో ఏపిపిఎస్‌సి నుండి జూనియర్ లెక్చరర్ పోస్టులకు నోటిఫికేషన్ వెలువడింది. అప్లయ్ చేద్దామని తీరాచూస్తే మార్కుల షీటు మాత్రమే తీసుకుని ప్రొవిజినల్ పట్టా తీసుకోలేదని గుర్తుకు వచ్చింది. చివరి తేదీ దగ్గరలోనే ఉన్నప్పటికీ స్టడీ సెంటరు, యూనివర్సిటీ స్టాఫ్ సహకారంతో ప్రొవిజినల్ పట్టా అందుకుని అప్లయ్ చేసి ఇంటర్వ్యూకు ఎంపికయ్యాను. ఇంటర్వ్యూ సమయంలో డిగ్రీ, పిజి వేరువేరు సబ్జెక్టులు ఉన్నాయని ఒక గంటపాటు నన్ను పక్కకు తప్పించారు. చివరికి నోటిఫికేషన్‌లో పిజిని మాత్రమే పేర్కొన్నారు కాబట్టి నాకు అర్హత ఉన్నట్లే అని ఇంటర్వ్యూ గదిలోకి పంపించారు. ఐ.పి.ఎస్‌గా వివిధ హోదాలలో పనిచేసిన అప్పారావుగారు ఏపిపిఎస్‌సి బోర్డు ఛైర్మన్‌గా ఉన్నారు. సెకండ్ క్లాసు మార్కులతో ఓపెన్ యూనివర్సిటీ నుండి పాసయ్యావు నువ్వు ఏం చెయ్యగలవు అని ఆయన అడిగిన ప్రశ్నకు జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జెఎన్‌యు, ఢిల్లీ) నుండి ఎం.ఫిల్ చేసిన వారితో సమానంగా ఇంటర్వ్యూకు రాగలిగాను అదే నేను చెయ్యగలను అనడానికి నిదర్శనం అని చెప్పాను. ఆయనకు నా సమాధానం నచ్చలేదో, నా మార్కులు నచ్చలేదో గాని 50 మార్కులకు గాను ఇంటర్వ్యూలో ఏడున్నర మార్కులు ఇచ్చి పంపించారు. కాని రిజల్టులో చూస్తే వరంగల్ జోన్‌లోనే రెండవ స్థానంలో నిలిచి ఖమ్మం జిల్లా కారేపల్లిలో 2002 ఫిబ్రవరి సివిక్స్ లెక్చరర్‌గా జాయిన్ అయ్యాను. మార్చిలో ఇంటర్ పరీక్ష పేపర్లు దిద్దడానికి వరంగల్లు వెళ్లినప్పుడు ఓపెన్ యూనివర్సిటీ నుండి లెక్చరర్ పోస్టుకు ఎంపికయ్యారా అని కొందరు ఆశ్చర్యపోతే, సరైన పునాదులు లేకుండా వచ్చి వీళ్లు పిల్లలకు ఏం పాఠాలు చెబుతారు అని మరికొందరు నొసలు విరిచారు. వారికి సమాధానం పరీక్షలలో ఫలితాల ద్వారానే చూపాలనుకున్నాను. అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ స్థాయి పుస్తకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి మంచి నోట్సు ప్రిపేర్ చేసుకున్నాను. పాతిక సంవత్సరాల కారేపల్లి గవర్నమెంట్ కాలేజీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సివిక్స్‌లో 100 శాతం ఫలితాలను, 60 శాతం మార్కులను క్లాసు సగటుగాను, 90 మార్కులకు పైగా అనేక మంది విద్యార్థులకు వచ్చేలా చేసి విమర్శలకు తగిన సమాధానం ఇచ్చాను.

## సివిల్ సర్వీసు ప్రయాణం

లెక్చరర్‌గా పనిచేయడం నా జీవితంలో గొప్ప మలుపు. కాళ్లకు చెప్పులు లేకపోవడం వల్ల కలుగుతున్న మంటను నీడలోకి పరిగెత్తడం ద్వారా, చిరిగిన బట్టలను అతుకుల మరకల చాటున, కాలే కడుపులను మంచినీటి మాటున దాచుకుంటున్న నా విద్యార్థులను చూసినప్పుడల్లా నా లక్ష్యం ఇదికాదు అని మనస్సు ఎత్తిపొడిచేది. విద్యార్థులకు న్యాయం చేస్తూనే నా లక్ష్యాన్ని సాధించుకోవాలని నేను చేసిన ప్రయత్నానికి కుటుంబ సభ్యుల నుండి, కాలేజీ స్టాఫు నుండి, విద్యార్థుల నుండి మద్దతు లభించింది. కోచింగ్‌కు వెళ్లే సమయం లేకపోవడంతో ఆప్షనల్స్‌పై పట్టుకొరకు అంబేద్కర్ విశ్వవిద్యాలయ పుస్తకాలే తోడయ్యాయి. అవి అందించిన ఆత్మవిశ్వాసమే 2005 సివిల్ సర్వీసు పరీక్షలలో నెగ్గి ఐ.ఆర్.ఎస్ (కస్టమ్స్)కు ఎంపిక కావడానికి తోడ్పడింది. తెలుగు మీడియంలో పరీక్ష రాసే సివిల్ సర్వీసు అభ్యర్థులందరికీ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మెటీరియల్ అందించే సేవ వెలకట్టలేనిది. అందుకే నేను ఇప్పటికీ నాది ఏ యూనివర్సిటీ అంటే అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అని సగర్వంగా చెబుతాను.

సివిల్ సర్వీసులకు ఎంపికైనా విద్యార్థుల గురించిన ఆలోచనలు నాలో మెదలుతూనే ఉన్నాయి. ప్రతి సంవత్సరం వేల రూపాయల బుక్స్ ఉచితంగా అందించినా నాకు సంతృప్తి కలగడం లేదు. కార్పొరేటు సంస్థలు తమకు సోషల్ రెస్పాన్సిబిలిటీ ఉన్నదని భావించి అనేక కార్యక్రమాలు చేబడుతున్నప్పుడు, సివిల్ సర్వెంట్లకు మాత్రం సోషల్ రెస్పాన్సిబిలిటీ లేదా అని నా కనిపించింది. ఆ ఆలోచనలో నుండి ఆవిర్భవించిందే ఐటిసిఎస్ఎ (ఇండియన్ తెలుగు సివిల్ సర్వెంట్స్ అసోసియేషన్). అన్ని రకాల సివిల్ సర్వీసులకు ఎంపికై దేశంలో ఏ మారుమూల ప్రాంతంలో పని చేస్తున్నప్పటికీ ఈ అసోసియేషన్‌లో మెంబరు కావచ్చు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులలో భవిష్యత్ పట్ల ఆశలు రేకెత్తించడం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడం కొరకు వారిని సివిల్స్ విజేతలతో ప్రత్యక్షంగా కలపడం, ఆర్థిక పరమైన కారణాల వలన చదువు ఆగిపోయిన వారికి ఆర్థికసాయం అందించడం, రోజు వారీగా కాలేజీకి వెళ్లలేని వారికి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వంటి ప్రత్యామ్నాయ విద్యావకాశాలను పరిచయం చేయడం మొదలైనవి దీని లక్ష్యాలు. అసోసియేషన్ ద్వారా కానీయండి, నా వ్యక్తిగత ప్రయత్నం వల్ల కానీయండి అనేక మంది విద్యార్థులను, మిత్రులను అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో వివిధ కోర్సులు విజయవంతంగా పూర్తి చేసేలా చేయగలిగాను.

**ఉపసంహారం**

ఒక వైఫల్యం నుండి తేరుకొని మరొక వైఫల్యాన్ని ఎదుర్కోవడానికి సిద్ధపడే సమర్థతనే విజయం అంటారు విన్‌స్టన్ చర్చిల్. అటువంటి విజయానికి కావాల్సింది మానసిక ఆరోగ్యం. విజ్ఞానం ఒక్కటే మానసిక ఆరోగ్యానికి మూలం. అదొక్కటే మనిషిని మానసికంగా బలవంతుడిని, నిజాయితీపరుడిని, బుద్ధిమంతుడిని చేయగలదు. మనిషి ఎన్నడూ తనకున్న విజ్ఞానంతో తృప్తి పడకూడదు. తనకున్న సంపదతో తృప్తిపడాలి. అలా తమకున్న విజ్ఞానంతో సంతృప్తి పడని జీవిత విజేతల గాథల సమాహారమే మీ ముందున్న ఈ పుస్తకం. మనలో పాత ఆలోచనలు పోవాలంటే మనం నైతిక, మేధోస్థాయిల్లో విద్యావంతులం కావాలి అంటారు సర్వేపల్లి రాధాకృష్ణన్. అటువంటి పాత ఆలోచనలను ఈ సమాజంలో నుండి తరిమివేసి నిశ్శబ్ద మార్పుకు కారణమవుతున్న అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ కృషిని వెలుగులోకి తీసుకురావడానికి చేస్తున్న ఈ ప్రయత్నం అత్యంత అభినందనీయం. పుస్తకాలు గంటలో చదివి అవతల పడేసేవి, జీవితాంతం పదిలపరచుకునేవి అని రెండు రకాలు. ఈ పుస్తకం నిస్సందేహంగా రెండవ రకానికి చెందినది. కాని ఈ పుస్తకాన్ని దాచుకోకండి, పదిమందికీ పంచండి. శరీరానికి వ్యాయామం ఎంత అవసరమో మెదడుకు పఠనమూ అంతే అవసరం అని, జీవితాంతం నిరంతరాయంగా పఠనం కొనసాగాలని ప్రతి ఒక్కరికీ తెలియజేయండి, మన విశ్వవిద్యాలయ వెలుగులను వారికి కూడా ప్రసరించనివ్వండి.

దేశంలోని 112 విశ్వవిద్యాలయాల విద్యార్థులకు దక్కని అరుదైన ఈ గౌరవానికి నాకు అవకాశమిచ్చిన డా. బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయానికి సదా సేవలందించడానికి సిద్ధంగా ఉంటానని తెలుపుతూ...

మీ మిత్రుడు

**సాధు నర్సింహారెడ్డి,** ఐఆర్ఎస్

అసిస్టెంట్ కమిషనర్, హైదరాబాద్ కస్టమ్స్

Ghanta Chakrapani

# memusaitam...

## Success Stories of Dr.BR.Ambedkar Open University Learners

సమసమాజ స్థాపనకు విద్యే సరైన ఆయుధమన్న బాబాసాహెబ్ తాత్విక సూత్రాన్ని స్ఫూర్తిగా చేసుకుని డా. బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం సమాజంలోని అన్ని వర్గాలకూ మెరుగైన విద్య, శిక్షణ అందించాలనే లక్ష్యంతో కొనసాగుతోంది. ఈ దిశలో విశ్వవిద్యాలయం ఇప్పటికే 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. అణగారిన వర్గాల వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, విజ్ఞానాన్ని విద్యద్వారా అందుబాటులోకి తేవాలన్న ప్రయత్నంలో లక్షలాది మంది జీవితాల్లో కొత్త వెలుగు ప్రసాదించిన డా॥ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక నిశ్శబ్ద విప్లవానికి వేదికగా నిలిచిపోయింది. ఈ విశ్వవిద్యాలయంలో చదువుకుని సాధికారత సాధించిన మా విద్యార్థులను మీ అందరికీ పరిచయం చేయాలన్న లక్ష్యంతో ఈ పుస్తకాన్ని ప్రచురిస్తున్నాం. ఇది విశ్వవిద్యాలయం గడచిన 25 సంవత్సరాల కృషికి అద్దం పడుతుందని ఆశిస్తున్నాం.

– సెంటర్ ఫర్ సోషల్ ఎంపవర్‌మెంట్

సామాన్యంగా విశ్వవిద్యాలయాల గొప్పతనాన్ని అంచనా వేసేటప్పుడు ఆ విశ్వవిద్యాలయంలో చదివిన వారికి ఎన్ని ఉన్నత పదవులు లభించాయి. ఎంత మంది విదేశీ సంస్థల్లో పనిచేస్తున్నారు, ఎంత వేతనాలు పొందుతున్నారన్న విషయాలను చెబుతూ ఉంటారు, అలాకాకుండా ఎంత మంది బీదవారు ఉన్నత విద్యను పొందారనో, ఎంతమంది కూలి వృత్తిని చేసుకుంటున్నవారు, జైళ్ళలో మగ్గేవారు, హోటళ్ళలో పనిచేసేవారు, గృహాలకు అంకితమైన వారు ఉన్నత విద్య ద్వారా తమ జీవితాలను మార్చుకున్నారనే విషయాలను ప్రమాణంగా తీసుకున్నట్లయితే అంబేద్కర్ విశ్వవిద్యాలయం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉండే విశ్వవిద్యాలయంగా పరిగణించవచ్చని ఈ సంపుటిలోని విద్యార్థుల జీవితానుభవం నుంచి అంచనా వేయడం తప్పు కాదేమో. ఇది అంచనా వేసే వారి విలువలకు సంబంధించిన విషయం కూడా.

– ఆచార్య వి.ఎస్. ప్రసాద్

'మేము సైతం...' పై చదువుల ప్రభుత్వ గణాంకాల పట్టిక కాదు. కుహనా రాజకీయవాదుల ప్రచారార్భటి కాదు. పచ్చ కామెర్ల కథనాల రాశీ సైతం కాదు. సామాజిక విశ్లేషకులను తట్టి లేపే పుస్తకం ఇది. అతి సామాన్యుల వాస్తవ విజయగాథలు ఎట్లా ఉంటాయో గాఢంగా ఆలోచింపచేసే సంకలనం ఇది. కష్టనిష్ఠూరాల కోర్చి, సామాజిక సాధికారికతను సాధించిన కొంతమంది స్త్రీ పురుషుల గుండెల కదలికల సమాహారం ఇది. మంచి భవిష్యత్తుకోసం కలలు కంటూ, ఆ కలలను గుండె దిటవుతో సాకారం చేసుకున్న అక్షర యోధుల హృదయ చాలనం ఇది. ఉన్నత విద్యావకాశాల కోసం, మేలైన వృత్తులకోసం, మంచి బతుకుకోసం, మరింత మంచి సమాజం కోసం తపించే లక్షలాది బాధాసర్పద్రష్టులందరూ తాము సైతం 'మేము సైతం...'గా మారడానికి ప్రేరణ ఇచ్చే పుస్తకం ఇది.

– ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి

center for social empowerment
Dr.B.R.Ambedkar Open University
Hyderabad, A.P. India

ISBN 978.81.908563.0.0